డిసెంబరు 2012 వెల: ₹ 20

తెలుగు వెలుగు

గీతమ్ విశ్వవిద్యాలయం

(Estd. u/s 3 of the UGC Act, 1956)

విశాఖపట్నం * హైదరాబాద్ * బెంగళూరు

భారత ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖచే 'ఎ' కేటగిరి విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందినది
మరియు జాతీయ విద్యా ప్రమాణాల పర్యవేక్షణా సంస్థ నాక్ చే 'ఎ' గ్రేడ్ విశ్వవిద్యాలయంగా ప్రకటితం అయినది.

ఉన్నత విద్యలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను నెలకొల్పుతూ విశాఖ కీర్తిని ప్రపంచ వ్యాప్తం చేస్తున్న గీతం విశ్వవిద్యాలయం
విశాఖ, హైదరాబాద్ ల తరువాత కర్ణాటక ప్రభుత్వ ఆహ్వానం మేరకు 2012 సంవత్సరం నుంచి
ప్రపంచంలోని అత్యుత్తమ నగరాలలో ఒకటిగా ప్రకటితం అయిన బెంగళూరు కు సమీపంలో నాగదేనహళ్లీ వద్ద అన్ని ప్రభుత్వ అనుమతులతో సరికొత్త క్యాంపస్‌ను ప్రారంభించింది.
అత్యున్నత ప్రతిభా సంపన్నులైన 800 మంది ఫ్యాకల్టీ సభ్యుల పర్యవేక్షణలో
ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, ఫార్మసీ, సైన్స్, అంతర్జాతీయ వాణిజ్యం, మేనేజ్‌మెంట్, న్యాయ విద్యా కోర్సులను నిర్వహిస్తోంది.
ఉన్నత ప్రమాణాలు గల మానవ వనరులను దేశానికి అందించటం లక్ష్యంగా కృషి చేస్తోంది.

మరింత సమాచారం కోసం
www.gitam.edu

Lowest Wastage
Guarantee
Biggest Savings
లక్షలాది రూపాయలను ఆదా చేయండి.
చరిత్రలోనే తొలిసారిగా
బంగారు అభరణాలు ఉత్పత్తి ధరకే !
మరెక్కడా ఈ ధరకు బంగారాన్ని కొనవచ్చని మీరు ఊహించనూ లేరు !
తరుగు 0% నుండి 7% వరకే మజూరీ లేదు.
కొన్ని ప్రత్యేక నగలకు మాత్రం తరుగు 8 & 9%.
Lalitha
చెన్నై • మదురై • తిరుచ్చి
100% BIS 916 హాల్‌మార్క్ బంగారం
Antique
ఆభరణాల బరువు - 160gm
మా తరుగు 6% - రూ. 490992
ఇతరులు 16% తరుగు - రూ. 537312
ఆదా రూ. 46320/-
Antique
ఆభరణాల బరువు - 84.250gm
మా తరుగు 6% - రూ. 258538
ఇతరులు 16% తరుగు - రూ. 282928
ఆదా రూ. 24390/-
Kerala
ఆభరణాల బరువు - 80gm
మా తరుగు 7% - రూ. 247812
ఇతరులు 12% తరుగు - రూ. 259392
ఆదా రూ. 11580/-
Kolkatta
ఆభరణాల బరువు - 78gm
మా తరుగు 7% - రూ. 241617
ఇతరులు 14% తరుగు - రూ. 257423
ఆదా రూ. 15807/-
Kolkatta
ఆభరణాల బరువు - 95.65gm
మా తరుగు 7% - రూ. 296290
ఇతరులు 16% తరుగు - రూ. 321212
ఆదా రూ. 24922/-
Kolkatta
ఆభరణాల బరువు - 224.5gm
మా తరుగు 7% - రూ. 695422
ఇతరులు 14% తరుగు - రూ. 740917
ఆదా రూ. 45495/-
Mumbai
ఆభరణాల బరువు - 48gm
మా తరుగు 6% - రూ. 147298
ఇతరులు 14% తరుగు - రూ. 158414
ఆదా రూ. 11117/-
Mumbai
ఆభరణాల బరువు - 96gm
మా తరుగు 6% - రూ. 294595
ఇతరులు 14% తరుగు - రూ. 316823
ఆదా రూ. 22234/-
Daily use Bangles. 3% తరుగు
ఆదా రూ. 5790/-
ఆభరణాల బరువు 40gm
Mumbai Bangles. 5% తరుగు
ఆదా రూ. 4053/-
ఆభరణాల బరువు 20gm
Mumbai Bangles. 5% తరుగు
ఆదా రూ. 2779/-
ఆభరణాల బరువు 16gm
Mumbai Fancy Bangles. 6% తరుగు
ఆదా రూ. 3474/-
ఆభరణాల బరువు 20gm
Kolkatta Bangles. 7% తరుగు
ఆదా రూ. 27966/-
ఆభరణాల బరువు 138gm
Kerala Bangles. 7% తరుగు
ఆదా రూ. 5790/-
ఆభరణాల బరువు 40gm
ప్రదర్శనలో వేలాది డిజైన్లు. ఈ గణాంకాలన్నీ బంగారం ధర గ్రాముకు రూ. 2895/- ఆధారంగానే.
మా తరుగుతో మార్కెట్ తరుగును పోల్చి చూసుకుని ఈ ఆభరణాల ద్వారా చేసే పొదుపును తనిఖీ చేసుకోవచ్చు.
లలితా జ్యువెలరీ మార్ట్ ప్రై. లిమిటెడ్
123, ఉస్మాన్ రోడ్, పనగల్ పార్క్, టి.నగర్, చెన్నై-17. ఫోన్: 044 28141155 / 77 / 88 | వేలెట్ కార్ పార్కింగ్ ఉంది
180-182, సౌత్ మాసి స్ట్రీట్, మదురై - 01. ఫోన్ 2330222 / 444 / 555 | www.lalithajewellery.net
Block-5, Chathiram Bus Stand. St.Joseph's college compound, Opp.Big water tank, Trichy-02. Ph: 0431-2706555 / 3666

మనందరం కిష్కింధవాసులం 14
- కర్లపాలెం హనుమంతరావు

అక్కడ తవ్వితే... అన్నీ మన జానపదాలే! 16

అక్షర శిల్పులు 24

వాక్యము దేవుడైయుండెను 36
- గోగుమళ్ల కవిత

తేట తెలుగుకు నారు పోసిన నార్ల 44
- డా॥ ఎర్నేని వెంకటేశ్వరరావు

ఇంగ్లీషు తల్లికి మల్లెపూదండ 48
- రావి కొండలరావు

క అంటే కంప్యూటర్ 60
- రాటాల వెంకట సుబ్బన్న

బుల్లి కవితల్లో పడమటి గాలి 62
- డా॥ జి.వి.పూర్ణచందు

అంకెలతో కుస్తీ..సాహిత్యంతో దోస్తీ.. 72

నిత్యమై... నిఖిలమై... 76
- డా॥ మన్నవ భాస్కర నాయుడు

ఎందుకోసం తెలుగు సభలు... ఎవరికోసం 84
- డా॥ సామల రమేష్‌బాబు

పెద్దల మాట

భవిష్యత్తుపై ఏదీ భరోసా? 29
- డా॥ మన్నం గోపీచంద్

తెలుగు మాట్లాడటమే ఆత్మగౌరవం 35
- దాశరథి రంగాచార్య

గొప్పకోసం పరాయితిప్పలొద్దు 35
- వెల్చేరు నారాయణరావు

తెలుగూ! నలుదిక్కులలో వెలుగొందవే! 55
- చుక్కా రామయ్య

కళ్లు కావాలా? కళ్లజోడు కావాలా? 98
- తుర్లపాటి కుటుంబరావు

కథలు

మందుగొడ్డిమి 10
- బత్తుల ప్రసాద్

అహంతు రావణో నామః 30
- కె. కృష్ణమోహన్

ముంగిస కథ 56
- బలివాడ కాంతారావు

అడకత్తెర్లో పోకచెక్క 68
- చెన్నూరి సుదర్శన్

బతుకాట 80
- సాయి బ్రహ్మానందం గొర్తి

20

అమ్మ ఎంతో అమ్మ భాషా అంతే!

40

అమెరికా తెలుగువాడి గుండె చప్పుడు తానా

50

బాలోత్సవం

తెలుగు వెలుగు

సంపాదకుడు: **రామోజీరావు**

సంపుటి : 1, సంచిక : 4

డిసెంబరు 2012

పుటలు : 100, **వెల :** రూ. 20

ముఖచిత్రం : చారి పి.ఎస్

పత్రాలంకరణ : రవిశంకర్

సహకారం : రామోజీ విజ్ఞానకేంద్రం

ప్రకటనల కోసం : +91 80081 51599, +91 90001 80608

వివరాలకు : సంపాదకుడు, తెలుగు వెలుగు, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, రంగారెడ్డి - 501 512.

ఫోను: +91 8415 246 999

మొబైల్: +91 800 800 1656

ఫ్యాక్సు: +91 8415 305 018

పత్రికపై కాపీరైట్ హక్కులు రామోజీ ఫౌండేషన్‌వి. ఈ పత్రికలోని భాగాలను కానీ, పత్రికను కానీ అనుమతి లేకుండా అంతర్జాలంలో పెట్టడం కానీ మరో చోట ప్రచురించడం కానీ చట్ట వ్యతిరేకం.

Telugu Velugu

Owned, Printed, published and Edited by Ramoji Rao on behalf of Ramoji Foundation, Ramoji Film City, Hayathnagar Mandal, Ranga Reddy District, Andhra Pradesh. Printed at Eenadu Press, D.No.7-134/1&2, Moosapet Village, Balanagar Mandal, Kukatpally, Rangareddy District -500 072.

RNI No: APTEL/2012/45352

విన్నపం: తెలుగు భాషాభివృద్ధి, పరిరక్షణ, మేధోమథనం 'తెలుగు వెలుగు' ముఖ్య ఆశయాలు. మన భాషకు పుష్టి చేకూర్చే రచనలకు పత్రికలో అగ్రతాంబూలం లభిస్తుంది. ఈ రచనల్లో వెల్లడయ్యేవి రచయితల అభిప్రాయాలు మాత్రమేనని మనవి. ఇవన్నీ పత్రిక యాజమాన్యం, సంపాదకవర్గ అభిప్రాయాలు కానక్కర్లేదు. భిన్న భావజాలాలకు నిష్పక్షపాత వేదికగా ఈ పత్రిక నిలుస్తుంది.

నవ్విపోదురు గాక...!

దేనికైనా సమయం, సందర్భం ఉండాలన్నది పెద్దల మాట. అత్తగారు కొత్త చీర కట్టిన రోజే పండుగ అంటే అభాసుపాలు కావడం తప్ప ప్రయోజనం ఏముంటుంది! ప్రపంచ తెలుగు మహాసభల పేరుతో ప్రభుత్వం చేస్తున్న హడావిడీ అలానే ఉంది. ఏం సాధించామని హఠాత్తుగా ఈ వేడుకలు తలపెట్టారన్నది తెలుగువారికే కాదు మెడ మీద తల ఉన్న వారెవరికీ అర్థం కాని విషయం.

మాతృభాషలో చెబితేనే పిల్లలకు చదువు చక్కగా ఒంటబడుతుందన్నది జాతిపిత మహాత్మాగాంధీతో సహా మేధావులంతా ఏనాడో చెప్పిన మాట. ఇదే విషయం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలు, ప్రయోగాల్లో స్పష్టం అవుతూనే ఉంది. మన దేశంలోనూ చాలా రాష్ట్రాలు విద్యావ్యవస్థలో మాతృభాషలకు అగ్రాసనాన్ని వేస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలు ప్రాథమిక స్థాయి నుంచి సాంకేతిక పట్టభద్ర విద్య వరకూ దేన్నైనా మాతృభాషలోనే చదువుకునే వెసులుబాటునూ కల్పిస్తున్నాయి. అంత చేయలేని చోట కనీసం సముచిత ప్రాధాన్యాన్నైనా ఇచ్చుకుంటున్నాయి. తొలి భాషా ప్రయుక్తమైన మన రాష్ట్రంలో విద్యారంగంలో తెలుగు దయనీయత గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. చివరికి ప్రభుత్వ బళ్లలోనూ గెంటివేతకు గురవుతోంది కదా తెలుగుతల్లి! పోన్లే... భాషాభిమానుల పుణ్యమా అని కొన ఊపిరితో అయినా తెలుగింకా బతికున్నందుకు సంబరాలు చేసుకుందామా?

మా తాతలు నేతులు తాగారని కేంద్రంతో పోరాడి, ఊరూ వాడా ఏకం చేసి ప్రాచీనభాష హోదా తెచ్చుకున్నాం. బాగానే ఉంది. ఆ తరువాత ఇన్నేళ్లలో ఏం జరిగింది? భాషాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల్నీ సద్వినియోగం చేసుకోలేని దుస్థితి. పోన్లే... జనం సొమ్ము దుబారా కాకుండా మిగిల్చారని సంతోషిద్దామా? ఎటు తిరిగీ ప్రాచీనమే కాబట్టి భాషను, జాతి ఆత్మగౌరవాన్ని, సంస్కృతీ సంప్రదాయాలను శిలాశాసనాల్లోనూ, పురావస్తు ప్రదర్శనశాలల్లోనూ కప్పెడుతున్నందుకు సంబరాలు చేసుకుందామా?

ప్రజల కోసం ఎన్నికైన ప్రభుత్వాలు వాటి వ్యవహారాలను మాత్రం సామాన్యులకు అర్థం కాని భాషలోనే నిర్వహిస్తున్నాయి. పాలనా వ్యవహారాలన్నీ స్థానిక భాషల్లోనే జరగాలని పండిత నెహ్రూ ఘంటాపథంగా చెప్పారు. ఆ మాటల్ని చెవికెక్కించుకున్న వారెవరు? మన రాష్ట్రంలో అధికార వ్యవహారాల్లో తెలుగు అమలు సొగసేమిటో ప్రతి ఒక్కరికీ తెలిసిందే. తెలుగులో అయితే దస్త్రాల్లోనూ వాటి ముందూ వెనుకా మతలబులు ప్రజలకు అర్థం అవుతాయన్నది ఏలికల గుబులు కావచ్చు. ఏమైతేనేం... తెలుగుతల్లికి గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి రాష్ట్ర సచివాలయం దాకా ఎక్కడా ప్రవేశం లేక బిక్కుబిక్కుమంటోంది! ఎప్పుడైనా కంటితుడుపుగా ఏదైనా చేసినా అదీ ప్రహసనప్రాయమే! ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో అభ్యర్థులకు తెలుగు పరీక్షలు ఎలా పెడతారో చెప్పుకోవడం సిగ్గుచేటుకాక మరేమిటి? వారి పనికి, జనానికీ సంబంధం లేని పాండితీ అంశాల్నిచ్చి పరీక్షించబూనడం దేనికి నిదర్శనం? వారితో పురాణాలు రాయిస్తారా? ప్రాచీన గ్రంథపరిష్కరణలు చేయిస్తారా? మొత్తమ్మీద రాష్ట్రం ఏర్పాటయ్యాక పాలనా భాష విషయంలో వెలువడ్డ ప్రభుత్వ ఉత్తర్వుల్ని తినీ తినీ చెదలు ఏనుగులయ్యాయి! ఆ సంతోషంతో సంబరాలు చేసుకుందామా?

భాషకు ఏదైనా చేయాలన్న జ్ఞానోదయం నిజంగా కలిగితే అది కార్యక్రమాల్లోనూ, చర్యల్లోనూ ప్రతిఫలిస్తుంది. ఇప్పటికే బోలెడన్ని సంఘాల నివేదికలు, భాషాభిమానుల వినతులు సచివాలయంలో మగ్గిపోతున్నాయి. వాటిని బూజు దులిపి అందులోని సిఫార్సులనోసారి సమీక్షించడం, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న బాటను పరిశీలించడం ఏ పాటి పనులు? మన రాష్ట్రంలో భాష కోసం కృషి చేస్తున్న సంస్థలు, సంఘాలు, మేధావుల సలహాలు, సూచనలను స్వీకరించి కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయడం, దాని అమలుకు గడువు నిర్దేశించుకోవడం, కొన్నైనా విధాన నిర్ణయాలను వెలువరించడం వంటివి చేస్తే ఈ ఆర్భాటాలకు అర్థం ఉండేది.

నిర్మాణాత్మక చర్యలు చేపట్టాల్సిన బాధ్యతను గాలికొదిలి తెలుగు మహాసభల్లో ఉర్దూ ముషాయిరాలు పెట్టి వాటిలో తెలుగు సమస్యల్ని చర్చిస్తారా? ఇప్పటి వరకూ జరిగిందల్లా అధికారం, నిధులు లేని భాషా సంఘానికి అధ్యక్షుణ్ని, సభ్యులను నియమించి చేతులు దులుపుకోవడం, ఉత్సవాల నిర్వహణకు పాతిక కోట్లు విదిలించడం, కొన్ని పత్రికా విలేకరుల సమావేశాలు పెట్టడం! ఈ మాత్రం దానికే భాష అభివృద్ధి చెందిపోయిందనా? ఏం సాధించామని చేసుకుందామీ వేడుకలు!!

రామోజీరావు

వినదగు నెవ్వరు చెప్పిన

'ఱ' తొలగించొద్దు

షేక్ బడేసాహెబ్ వ్యాసం బాగుంది. కానీ- 'ఱ'ని తొలగించాలనటం సమంజసం కాదు. ఈ వర్ణం శాసనభాష నుంచీ తెలుగులో ఉంది. పైగా 'ర-ఱ'ల ప్రయోగంలో అర్థభేదం ఉంది. (వేరు-వేఱు; అరుగు-అఱుగు; దూరు- దూఱు వంటివి) ప్రాచీన కావ్య భాషను అర్థం చేసుకోవటానికి, కవుల ప్రయోగాలకీ 'ఱ' అవసరం. ద్విత్వంలో 'ఱ' మరీ అవసరం. పద్యనిర్మాణంలో కూడా దీనికి ప్రాధాన్యం ఉంది. ఉన్నవాటిని తీయొద్దు. ఇన్ని అక్షరాలుండబట్టే ఏ పరభాషా పదాన్నైనా తెలుగులో రాయగలుగుతున్నాం.

- డా॥ ద్వా.నా.శాస్త్రి, హైదరాబాద్

నిండుదనంగా ఉంది

'తెలుగు వెలుగు' పత్రిక చాలా నిండుదనంతో వస్తోంది. ఈ పత్రిక తెలుగుతల్లికి కంఠాభరణంగా భాసిల్లుతుందని ఆశిస్తున్నాను. ఈ సంచికలు తెలుగు వారి గుండెల్లో స్థానం సంపాదించుకుంటాయి.

-మౌనశ్రీ మల్లిక్, సినీ గీతరచయిత

సాటిలేని మేటి పత్రిక

'ముద్రా రాక్షసాలు లేని' ముద్దొచ్చే తెలుగు వెలుగు నాకెంతో నచ్చింది. రచయితలతో పాటు పాఠకులకూ తగిన విలువ ఇస్తున్నారని 'వినదగునెవ్వరు చెప్పిన' తెలియజేస్తోంది.

-కాముని సుధాకర్, సిద్దిపేట

ఆబాలగోపాలాన్నీ ఆనందింపజేస్తుంది

మనందరిలో భాషా వెలుగులు నింపుతున్న 'తెలుగు వెలుగు'కు నీరాజనం. వర్ణమాలలోని అక్షరాలు కాలక్రమేణా తెరమరుగవుతున్న పరిస్థితుల్లో మన జగతిని మేల్కొలిపేందుకు, మన భాషా సౌందర్యాన్ని, సాహిత్యాన్ని, మాధుర్యాన్ని అందించేందుకు మీరు చేస్తున్న ప్రయత్నం తెలుగు జాతికి గర్వకారణం.

-మంత్రిరాజు శివరామయ్య, నరసరావుపేట, గుంటూరు

చక్కనైన పత్రిక

కనదగు నెవ్వరు భువిలో
కనిపించెడి తెలుగు వెలుగు కనిపించినచో
చనువగ చదువుచు మదిలో
అనయముమీప్రతినికొనుదురాంధ్రులునవనిన్

- గంగరాజు మోహనరావు, తిరునింద్రవూరు, తమిళనాడు

అధికార భాషాసంఘం కృషి చేయాలి

మాట్లాడే భాష ద్వారానే జాతికి ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభిస్తాయి. మన మనోభావాలకి ప్రాణం పోసే మాతృభాషను కాపాడటం మనందరి బాధ్యత. తెలుగు అధికార భాషైనా ప్రభుత్వం కార్యక్రమాలన్నీ ఆంగ్లంలోనే సాగుతున్నాయి. ప్రభుత్వాలు తెలుగుకు ప్రాధాన్యం ఇస్తూ చట్టాలైతే చేశాయి గానీ, అమలు పరచలేదు. అధికార భాషాసంఘం మాతృభాష వ్యాప్తికి ఎంతో కృషి చేస్తుందని ఆశిస్తున్నాం.

-గోదూరు అశోక్, కరీంనగర్

చదువుకు దూరమవుతున్నారు

పొరుగు రాష్ట్రాల్లో ఉన్న తెలుగు వారికి ఆంధ్రరాష్ట్ర సర్కారు నుంచి ఎటువంటి సహాయం అందడం లేదు. తమిళ, ఒడిశా ప్రభుత్వాలు తమ భాషకు ఎంతో ప్రాధాన్యమిస్తున్నాయి. దీంతో తెలుగు బిడ్డలు చదువుకు దూరం కావడమే కాకుండా, మాట్లాడటానికి కూడా భయపడాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

-కె.వి.రమణ, జయపురం, ఒడిశా

ప్రతి పాఠశాలలో ఉండాలి

తెలుగు భాషాభిమానులందరూ చదవాల్సిన పత్రిక ఇది. ప్రతి పాఠశాల్లోనూ, గ్రంథాలయంలోనూ తప్పక ఉండాలి. శ్రేయోభిలాషులకు పుస్తకప్రసాదంగా పంపిణీ చేయవచ్చు. **-ఐ.ఎల్.నరసింహారావు, నెల్లూరు**

సరైన ప్రచారం కల్పించండి

తెలుగు వెలుగు పత్రికలో అన్ని అంశాలూ బాగున్నాయి. పత్రిక గురించి ఎక్కువ ప్రచారం చేయండి. చాలా పుస్తక కేంద్రాలకు వెళ్లినా లభించడం కష్టమవుతోంది. పాఠకులందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

- ఎన్.నాగభూషణం, వెలటూర్

బాసకు వన్నె

తెలుగు వెలుగు తలపుతీసె- కలిమి బలిమి
చెలిమి బాసకు వన్నెలై చెలువు నింప
దీనినిటు తీర్చి దిద్దెపో తెలుగుతల్లి
గోడునాలించెనేమొ ఈనాడు జేడు!!

- మంకు శ్రీను, కొప్పర్రు

ఇది నిరంతరం వెలిగే తెలుగు

ఆనందం ఆంగ్లంతో పంచుకోవచ్చు. బాధను

కవితలకు ఆహ్వానం

మచిలీపట్నం 'సాహితీ మిత్రులు' ఆధ్వర్యంలో కవితల పోటీ జరుగుతోంది. మద్య వ్యతిరేకత అంశంపై ముప్పై పాదాలకు మించకుండా వచన కవిత, అవినీతి వ్యతిరేకతపై ఒక్కొక్కరు పది మినీ కవితలూ (జనవరి పదో తేదీలోగా) పంపవచ్చు. విజేతలకు బహుమతులు ఉంటాయి. వివరాలకు: 92475 81825

యువరచయితలకు పురస్కారాలు

కవిత్వం, నవల, కథ, ప్రక్రియల్లో యువ రచయితల సృజనలను ఆహ్వానిస్తున్నట్లు కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు అలపర్తి పిచ్చయ్య తెలిపారు. ఎంపికైన రచనలకు పురస్కారాలు ఉంటాయి. రచనలు ఈ నెల 20లోపు పంపాలి. వివరాలకు: 9177013845

రజతోత్సవ పురస్కారానికి ఆహ్వానం

ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు రజతోత్సవ పురస్కారం-2012కు కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు వ్యవస్థాపకులు డా॥ రాధేయ తెలిపారు. ఈ పురస్కారానికి 2012లో ప్రచురించిన కవితా సంపుటాలను మాత్రమే (జనవరి 31లోగా) పంపాలి. ఎంపికైన సంపుటికి నగదు పురస్కారం ఉంటుంది. వివరాలకు: 99851 71411.

జాతీయస్థాయి కవితల పోటీ

జాతీయస్థాయి కవితల పోటీ నిర్వహిస్తున్నట్లు నెల్లూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ తెలిపారు. 30 వరుసలకు మించకుండా ఏ సామాజిక అంశంపైనైనా ఈ నెల పదో తేదీలోగా కవితలు పంపించవచ్చు. వివరాలకు: 90107 71622.

పంచుకోవాలంటే అమ్మ కావాలి. అమ్మ భాష కావాలి. అమ్మ కడుపులో ఉండి నేర్చుకున్న భాష, తల్లి పాలతో పాటు నరనరాలకు వంటబట్టించుకున్న భాష మన నుంచి దూరం కాలేదు. ప్రపంచీకరణ నేపథ్యంలో పరభాషను తప్పక పెదాలపై ఆడించాల్సిన అగత్యం రావచ్చు. కానీ ఆ పదాలు డబ్బా పాలు. అమ్మ పాల రుచి వాటిలా వస్తుంది.

-హోతా శ్రీరామచంద్రమూర్తి, అమలాపురం

బాధ కలిగింది

తెలుగు వెలుగు మూడో సంచిక చాలా బాగుంది. తానంతట తానుగా నడుంబిగించి తెలుగు భాషకు రామోజీరావు చేస్తున్న కృషి వెలకట్టలేనిది. ఈ పత్రికలో అన్ని మాండలీకాల్నీ పరిచయం చేస్తున్నారు. 'తెలుగులో చదివితే నేరమా!' కథనాన్ని చదివినప్పుడు ఎంతో బాధ కలిగింది.

- ఎం.అజయ్, గుంటూరు

ప్రాచీనానికి ప్రాధాన్యత ఇవ్వాలి

తెలుగు భాష గుబాళింపు అందరికీ చేరేలా చేస్తున్న ప్రయత్నం అభినందనీయం. ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్న రచయితలకు కృతజ్ఞతలు. ప్రాచీన కవుల రచనలూ ప్రచురిస్తే బాగుంటుంది.

-కనుపర్తి లక్ష్మీవీరరాజు, తిరుమలాపురం

కథలకు ఆహ్వానం

తెలుగు సమాజం మీద టీవీ ప్రభావాన్ని ప్రతిఫలించే కథలను ఆహ్వానిస్తున్నట్లు సంకలనకర్తలు ఎ.కె.ప్రభాకర్, నాగసూరి వేణుగోపాల్ తెలిపారు. ప్రాంతీయ భాషల్లో ఇరవైనాలుగు గంటల టీవీ ప్రసారాలు అందుబాటులోకి వచ్చాక తెలుగు సమాజంలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఆ ప్రసారాలు మన ఆలోచనా సరళిని, జీవన విలువల్ని, వేషభాషల్ని, ఆహారవిహారాల్ని కళాభిరుచుల్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. 1999 నుంచి ఇప్పటివరకూ ప్రచురితమైన కథల్ని సేకరించి సంకలనం చేయనున్నారు. వివరాలకు: 96766 76928

అన్నీ అద్భుతం

మతాబులు, తారాజువ్వలు, కాకరపూవొత్తులు, భూచక్రాలు, వెన్నముద్దలు అన్నీ ఒకేసారి పేల్చితే దీపావళి 'తెలుగు వెలుగు'లయ్యాయి. పత్రికలో ఏ అంశం ముందు, ఏది తరువాత చదవాలో అర్థం కాక తబ్బిబ్బయ్యాను. తరువాత సంచికలను ఇంకా పై స్థాయిలో తీసుకొస్తారని ఆశిస్తున్నాం.

- ఆయి కమలమ్మ, వనస్థలిపురం

చైతన్యం తీసుకురావాలి

'తెలుగు వెలుగు' చదివాక నా కలత కొద్దిగా తీరింది. తెలుగును సర్వోన్నతంగా తీర్చిదిద్దాలంటే యువతలో తప్పనిసరిగా చైతన్యం తీసుకురావాలి.

- పి.భరత్, భీమవరం, నెల్లూరు

పదేపదే చదవాలి

తెలుగు పద్యాలు మళ్లీ మళ్లీ చదవాలనిపిస్తోంది. పద్యాలు ఎప్పుడూ సజీవంగా ఉంటాయనే వాస్తవానికి 'పద్యం పాతబడునా' వ్యాసం అద్దం పట్టింది.

-గుండాపంతుల కామేశ్వరరావు, హైదరాబాద్

పసిపాప నవ్వులా ఉంది

తెలుగు వెలుగు సంచిక దీపావళి శోభలు సంతరించుకుని పసిపాప వదనంలా, స్వచ్ఛమైన నవ్వులా ఉంది. కథలు,వ్యాసాలు వైవిధ్యంగా, సవివరంగా ఉన్నాయి. వార్తా మాధ్యమాల్లో కూడా తెలుగు వెలుగు ప్రసరించాలని ఆశిస్తున్నాం.

- పులుగర్త వెంకటకృష్ణారావు, హైదరాబాద్

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

(Established in 2006 under A.P. State Legislature Act 28)

రాజమండ్రి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సాంప్రదాయక కోర్సులతో పాటు అధునాతన శాస్త్ర సాంకేతిక కోర్సులను అందిస్తోంది. ప్రస్తుతం విశ్వవిద్యాలయం తన కార్యక్రమాల్ని స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీలోని ప్రత్యేక భవనాల్లో నిర్వహిస్తోంది.

త్వరలో రాజానగరం సమీపంలో తన 95 ఎకరాల విశాల ప్రాంగణంలోకి విశ్వవిద్యాలయం మారబోతోంది. విద్యార్థినీ విద్యార్థుల వసతి భవనాల నిర్మాణం ప్రారంభమైంది. అనేకమంది పరిపాలనా దక్షుల పర్యవేక్షణలో విద్యాసేవలను తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 220 కళాశాలలకు అందిస్తుంది. అత్యున్నత ప్రతిభావంతులైన అధ్యాపకుల మార్గదర్శకత్వంలో ఉన్నత ప్రమాణాలు గల విద్యార్థులను అందించడమే లక్ష్యంగా కృషిచేస్తోంది.

విశ్వవిద్యాలయం ప్రస్తుతం అందిస్తోన్న కోర్సులు

ఆర్ట్స్ అండ్ కామర్స్ కోర్సులు:
ఎం.ఏ: ఇంగ్లీషు, తెలుగు, సైకాలజీ, ఎకనామిక్స్, సోషల్ వర్క్, యం.బి.ఎ.

సైన్స్ & టెక్నాలజీ కోర్సులు:
ఎం.ఎస్సి: కెమిస్ట్రి, మాథమెటిక్స్, జువాలజీ, జియాలజీ (పెట్రోలియం ఎక్స్‌ప్లొరేషన్), ఎం.సి.ఎ.

రాబోయే విద్యాసంవత్సరంలో ప్రారంభమయ్యే కోర్సులు

ఎం.ఏ: హిస్టరీ, ఫిలాసఫి, పాలిటిక్స్, బైబ్లికల్ స్టడీస్, వేదిక్ స్టడీస్
ఎం.ఎస్సి: బోటని, జియోఫిజిక్స్, ఫిజిక్స్

అదనపు సమాచారం కోసం : www.nannayauniversity.info

ఆచార్య డి.ఎస్.వి.వి.డి.ప్రసాద్
రిజిస్ట్రార్
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం
రాజమండ్రి - 533 105, ఆంధ్రప్రదేశ్.

ఫోన్: 0883 - 2472616, ఫ్యాక్స్: 0883 - 2472670

పేరు తెచ్చే పండుగ



తెలుగింటి మేలి వేడుకలలో బారసాల ఒకటి. నట్టింట బోసి నవ్వుల పంట పండించే పసిపాపల శతవసంతాల జీవన గమనాన్ని సుఖప్రదంగా, శుభప్రదంగా సాగాలంటూ ఆశీర్వదిస్తూ బాలలకు చేసే నామకరణోత్సవమే బారసాల. అయితే జనబాహుళ్యంలో బారసాలగా ప్రచారంలో ఉన్న ఈ వేడుక అసలైతే 'బాలసారె'. మరి 'బారసాల'గా ఎలా అయింది? అని అంటే కారణాలేవైనా కావచ్చు గాని అదంతే అంటున్నారు భాషా పరిశీలకులు. ఇంతకీ బాలసారె అంటే? బాల అనే శబ్దానికి శబ్ద రత్నాకరంలో ఆడుది(స్త్రీ), నారికేళం (కొబ్బరికాయ), పసుపు, మల్లెపూవుల రకాలలో ఓ రకం, ఐదేళ్ల ఏనుగు పిల్ల, 16 ఏళ్ల లోపు వయస్సున్న పిల్లలాంటి అర్థాలున్నాయి. 'గ్రహణ ధారణ పటుః బాలః' అన్నారు. అర్థం చేసుకోవడంలోనూ, ధారణ పట్ట టంలోనూ శక్తి ఉన్నవాడు అన్నది భావం. ఇలా ఇన్ని రకాల అర్థాలతో ఉన్న బాలకు సారె జత చేరింది. సారె అంటే నిఘంటు అర్థాలు చాలానే ఉన్నాయి. కూతురిని పుట్టింటికి పంపించేటప్పుడు ఇచ్చే వస్తువు అని, కుమ్మరి చక్రమని, మాటిమాటికి అని, గోరువంక అనేలాంటి అర్థాలున్నాయి. శ్రీకాకుళం మాండలికంలో గర్భాదానం అనే అర్థం ఉంది. ఇలా ఎన్నెన్నో సందర్భాలలో ఎన్నెన్నో అర్థాలతో ఈ సారె కనిపిస్తుంది. చీర సారెలు, సారె తేవడం ఇలాంటి పద ప్రయోగాలున్నాయి. అయితే సారెల్లో బాలసారె ఒక్కటే కాక అడ్డసారె, బిడ్డసారె లాంటివి కూడా ఉన్నాయి. ఇవన్నీ సంస్కృతంలో చెప్పిన షోడశ సంస్కారాల వరుసలో అక్కడక్కడ కనిపిస్తాయి.

పుట్టింటి వేడుక

తెలుగింటి వేడుకల్లో బారసాల పుట్టింటివారు జరిపే వేడుక. అమ్మాయి ప్రసవించాక ఆమె పుట్టింటివారు 11 లేదా 13వ రోజున చేస్తారు. గ్రహ, నక్షత్ర, దేవతలకు పూజ, జప, హోమాలు, దానాలు చేసి నామకరణం చేస్తారు. 10వ రోజున కూడా పురిటిమైల ఉన్నప్పటికీ ఆ రోజున కూడా బారసాల చేయవచ్చని ధర్మసింధువు పేర్కొంటోంది. పేరు పెట్టడం అనేది నాలుగు పద్ధతులుగా ఉంటుంది. దేవతానామం, మాసనామం, నక్షత్ర నామం, వ్యవహారిక నామం అనేవి ఆ పద్ధతులు. దేవతాభక్తుడు అని తెలిపేది దేవతానామం. చైత్రాది మాసాలలో జన్మించిన వ్యక్తికి వైకుంఠాది నామాలు పెట్టడం మాసనామం. ఏ నక్షత్రంలో జన్మించాడో తెలియజేసేది నక్షత్రనామం. మరికొందరు జన్మించిన నక్షత్రానుసారం జ్యోతిశ్శాస్త్రాన్ని అనుసరించి ఏర్పడే అక్షరంతో ఆరంభించే పేరు పెడుతుంటారు. దీన్నే జన్మనామం అంటారు. వ్యవహారనామం అంటే కొంతమంది నక్షత్రానికి ఏర్పడే అక్షరాన్ని ఆధారంగా చేసుకుని పేరు పెడుతుంటారు. మరికొందరు వారి పెద్దల పేర్లు పెడుతుంటారు. పేర్లు ఎలా పెట్టినా మగపిల్లలకైతే సరి సంఖ్యలో, ఆడపిల్లలకైతే బేసి సంఖ్యలో అక్షరాలు ఉండేలాగా పేరు పెట్టడం అనే సంప్రదాయం ఉంది.

నమ్మకాలు

పేరు పెట్టడం వెనుక కొన్ని నమ్మకాలు కూడా ఉన్నాయి. పేరులోని అక్షరాల సంఖ్యను బట్టి జీవిత పరిస్థితులు ఉంటాయంటుంటారు. రెండక్షరాల పేరు కీర్తినిస్తుందని, నాలుగు అక్షరాల పేరు బ్రహ్మవర్చస్సు ఉంటుందని, పేరుకు చివర ల(ల్) కారం గాని, రేఫ(ర్) గాని ఉండకూడదు. బారసాల సమయంలో నామకరణం కోసం చేసే సంకల్పంలో ఆయుష్యాభివృద్ధి, వ్యవహారసిద్ధి, బీజ, గర్భదోష నివారణ అనే ప్రయోజనాలున్నాయన్నది జన విశ్వాసం.

అర్థం ఉండాలి

ఎంతో ఆనందంగా జరుపుకునే బారసాల వేడుక శిశువు నూరేళ్ల జీవన ప్రస్థానానికి సంబంధించింది. పేరు అర్థవంతంగా ఉంటే శిశువు జీవితం సార్థకం అవుతుందని పెద్దలు అంటారు. అయితే కొంతమంది ఆధునిక భావావేశంలో అర్థానికి తావివ్వకుండా, కొన్ని సందర్భాలలో విపరీత, వ్యతిరేక అర్థాలు వచ్చే పేర్లను కూడా పెట్టడం కనిపిస్తుంది. ఎవరి ఇష్టం వారిదనుకోండి! పూర్వపు రోజుల్లో శిశువు పుట్టగానే ఋషులు, పండితులు శిశువు భవిష్యత్తును తెలిపేలాగా పేర్లను పెట్టినట్లు కనిపిస్తుంది. ధృతరాష్ట్రుడు, యుధిష్ఠిరుడు లాంటి పేర్లు అలాంటివే. పెద్దవాళ్లు మాత్రం చక్కటి అర్థాలు ఇచ్చేవి, కల్యాణదాయకంగా ఉండే పేర్లనే పెట్టమంటారు.



డా॥ యల్లాప్రగడ మల్లికార్జునరావు,
హిందూ కళాశాల తెలుగు శాఖాధిపతి, గుంటూరు
80085 73108

జనవరిలో వచ్చే సంక్రాంతి పండుగకు సరిగ్గా నెలరోజుల ముందు ధనుర్మాసం ప్రారంభం అవుతుంది. తెలుగు వారి ఇళ్లలో, గుళ్లలో ధనుర్మాసం ప్రారంభమైన రోజు నుంచే పండగ వాతావరణం నెలకొంటుంది. ఏ గుడికి వెళ్లినా 'తిరుప్పావై' పాశురాలు వినిపిస్తుంటాయి. శ్రీమహావిష్ణువుకు ఈ మాసం చాలా ప్రీతిపాత్రం. దీనివెనక ఒక కథ ఉంది. ఈ కథ చెప్పాలంటే ఆళ్వారుల చరిత్రను, విష్ణుచిత్తుని కుమార్తె గోదాదేవి చరిత్రను కూడా చెప్పాల్సి ఉంటుంది. శ్రీవైష్ణవ ధర్మంలో లోకప్రసిద్ధులైన పన్నెండు మంది ఆళ్వారులు ఉన్నారు. వీరిలో శ్రీవిల్లిపుత్తూరు నివాసి అయిన భట్టనాథుడు ఒకరు. విష్ణుచిత్తునిగా పేరుపడిన భట్టనాథునికి తప్ప మిగిలిన ఆళ్వారులు ఎవరికీ సంతానం లేదు.

విష్ణుచిత్తుని కుమార్తె పేరు ఆండాళ్‌దేవి. ఈమె తర్వాతి కాలంలో గోదాదేవిగా ప్రసిద్ధురాలు అయింది. గోదాదేవిలో చిన్నతనం నుంచి భగవంతునిపై భక్తి ఎక్కువగా ఉండేది. శ్రీకృష్ణుని కథలు విననిదే తిండి తినేది కాదు, నిద్రపోయేది కాదు. తనను గోకులానికి తీసుకువెళ్లమని తండ్రితో పోరాడేది. దాంతో ఏం చేయాలో తోచక విష్ణుచిత్తుడు గోదాదేవిని తీసుకుని శ్రీకృష్ణుడు వేంచేసిన దివ్యదేశాలన్నీ తిరిగాడు. అయినా ఆమె తనివి తీరలేదు. గోపికలు శ్రీకృష్ణునితో ఆటలు ఆడినట్లుగా, పాటలు పాడినట్లుగా తానూ ఆడాలని, పాడాలని ఆశపడేది. శ్రీకృష్ణుని విగ్రహానికి అలంకరించుటకు విష్ణుచిత్తుడు అల్లిపెట్టిన పూలమాలలను ధరించి, తన అందం స్వామికి తగునా? అని పక్కనే ఉన్న నూతిలో తన

ఇది ధనుర్మాసం!

ప్రతిబింబం చూసుకొనేది ఆ తర్వాత ఆ పూలమాలలను తీసి బుట్టలో యథాతథంగా పెట్టేది. ఒకరోజు ఆమె ఇలా పూలమాలలను అలంకరించుకోవడం చూసిన విష్ణుచిత్తుడు ఆమెను మందలించి, ఆ మాలను దేవాలయానికి పంపించకుండా పక్కన ఉంచాడు. అయితే ఆ రాత్రే విష్ణుచిత్తుని కలలో వటపత్రశాయి దర్శనం ఇచ్చి 'మామగారూ' అని సంబోధించడమే కాకుండా, గోదాదేవి ధరించిన మాలలే తనకు ఎంతో ఇష్టమని చెప్పాడు.

ఆ మరుసటి రోజు నుంచి గోదాదేవి ధరించిన మాలలను దేవాలయానికి పంపించేవాడు. అప్పటినుంచి ఆమెను 'శూడికొత్తు నాచ్చియార్' అని 'ఆముక్తమాల్యదా' అని లోకమంతా స్తుతిస్తుంది. గోపికలు అందరూ ద్వాపరయుగంలో కాత్యాయనీ వ్రతం చేసిన విధం విన్న గోదాదేవి వటపత్రశాయినే శ్రీకృష్ణునిగా భావించి 30 రోజులు వ్రతం ఆచరించింది. రోజుకు ఒక పాశురం పాడుతూ, 30 రోజులు 30 పాశురాలను పాడుతూ స్వామికి కైంకర్యం చేసింది. ఈ 30 పాశురాలనే 'తిరుప్పావై' అని పిలుస్తారు. పాండ్యరాజు అయిన వల్లభ దేవుడు గోదా ఆర్తిని తీర్చడానికి శ్రీరంగని అర్చామూర్తితో వివాహానికి ఏర్పాట్లు చేయించాడు. వివాహం అనంతరం గర్భాలయంలో చేరిన గోదాదేవి శ్రీరంగని పాదాల చెంత తలవాల్చి ఆయనలో లీనమైంది. అప్పటి నుంచి 'తిరుప్పావై' పాశురాలను ధనుర్మాసంలో పఠిస్తే, వింటే సకల పాపాలు తొలగి, విష్ణు సాన్నిధ్యం దొరుకుతుందన్న నమ్మకం ప్రజల్లో పాదుకుంది.

– వేదార్థం మధుసూదన శర్మ
తెలుగు పండితులు, మహబూబ్‌నగర్.
99595 48374

THE ANDHRA PRADESH MINERAL DEVELOPMENT CORPORATION LIMITED
(A State Government Undertaking)
Rear Block, 3rd Floor, HMWSSB Premises, Khairatabad, Hyderabad -500 004.
Ph: 040-23393814,23323153 Fax :040-23393152
E-mail : apmdcltd@ yahoo.com; Website: www.apmdc.ap.gov.in

Barytes deposit at Mangampet (Village), Kadapa Dist, is the largest single deposit in the world with an estimated reserve of about 74 million tonnes. Mangampet deposit is the flag ship of the APMDC Ltd. Barytes is used in drilling for oil and gas besides in Barium chemical industry. The Corporation facilitates exports nearly 10 lakh tonnes of Barytes to several countries apart from meeting the domestic requirement of nearly 3 lakh tonnes, annually. ONGC & Coal India are the main domestic consumers. Also establishing Beneficiation plant under Joint Venture for upgradation of low grade Barytes





Fullerene a very valuable strategic mineral occurs in the black shales within the over burden in Barytes mine at Mangampet, Kadapa dist. The cost of the mineral is 10 times that of the gold and is used in Nano Technology and atomic energy applications and the Corporation is contemplating to setup R&D laboratory for extraction techniques.

Black Galaxy Granite, a unique variety in the world, is available around Cheemakurthy village, Prakasham Dist. The granite is being produced for meeting the international and indigenous demands and is being used mainly for decorative purposes through Joint Venture.

మందుగోడ్తిమి

సాయంత్రం ఐదు కావచ్చాంది. సావాసగాళ్ళను కల్సుకోడానికి సగిలేటి దావబడ్తి. నేను గోల్కొండోళ్ళ పిల్లోడు కాదర్‌బాష, రెడ్డి శెర్లోల్ల పిల్లోడు ఉస్మాన్, డాక్టర్ ధర్మరాజు కొడుకు సంజు నలుగురం సావాసగాళ్ళం. పదో తరగతి అయిపోయి ఇంటర్‌లో శేరి మూడు నెల్లు అయితాంది. అప్పుడప్పుడే గడ్డాలు మీసాలు వచ్చాండయి. ఎప్పుడప్పుడు మొగోళ్ళ మనిపిచ్చుకోవాల్నా అని అనిపిచ్చాంది. పదో తరగతి దాంకా నిక్కర్లు ఏసుకోని తిరిగి ఇప్పుడు సల్లాడాల్లోకి మార్తిమి. అడ్డపంచ కడ్తాండం. అడ్డ పంచె అనేదానికంటే లుంగీలు కడ్తాండాం. అయితే లుంగీ సైజు పెద్దదయినా మడిసికడ్తాం టిమి. మొగోళ్ళమయితాండం గాబట్టి తలకాయ ఒకటికి నాలుగు సార్లు దువ్వకోడం, అప్పడప్పుడే వచ్చాన్న మీసాలు నల్లగా కనపడాలని మసి పూసుకోడం, ఆడపిల్లోళ్ళను జూచ్చే ఎట్టనో అయిపోడం, సిగ్గుపడ్డం, అప్పుడప్పుడే అమ్మానాయనల్ను ఎదిరియ్యడం. ఓయమ్మ ఒక్కటికాదులే శానా ఇకారాలు పడ్తాంటిమి.

మాది అందరిదీ ఒకే ఊరు. ఉస్మాన్‌లది తొట్టీది. నాది బంగలా కాంపౌండు. సంజు వాళ్ళది శివాలయం కాడ. మా కలసపాడులో అప్పటికి కాలేజీలేదు. పదవ తరగతి వరకే ఉండేది. కాలేజీ చదవాలంటే మాకు పదిమైళ్ళ దూరంలో ఉండే పోరుమామిళ్ళకు పోవాల. రోజూ ఇరవై ముప్పయి మందిమి తెల్లార్జామున ఐదుగంటలకల్లా గమిన్లోకి పోతే ఆడ నుండి కరెప్పాకు బస్సు బయలుదేర్తది. కాలేజీ అయిపోయినంక మద్దాన్నెం పోరుమామిళ్ళ దోర్నాల బస్సులో ఊరికి రాడం. ఈ రెండూ ప్రవేట్ బస్సులే. ఆర్టీసీ బస్సుల్లో అయితే టికెట్ ఎంతయితే అంతియ్యాల. ప్రవేట్ బస్సుల్లో స్టూడెంట్లకు సగం టిక్కెట్టే తీసుకుంటారు. ఒక రోజైతే ఎట్టనో కొట్టపోతది. ఇది అట్టకాకుండా రోజూ కాలేజీకి పోవాల. అందుకని ఒక్కరవ్వ ఉన్నోళ్ళ పిల్లోళ్ళయినా ప్రవేట్ బస్సుల్లోనే వచ్చాండిరి.

బస్సులో కాలేజీకి పోయే ఆడపిల్లోళ్ళు మొగదాల సీట్లళ్ళో కూకంటరు. వాళ్ళకు కనపడాలని తెల్లారు జామునే లేసి, సలికాలమైనా, వానా కాలమైనా సల్లనీళ్ళు పోసుకోని (ఉడుకునీళ్ళు అంటే కాగేదానికి లేటయితదని) ఇస్తిరి గుడ్డలు ఏసుకోని మొకానికి పౌడరు రుద్ది దువ్విన తల కాయే మళ్ళా దువ్వకోని ఒక నోటు పుస్తకం శేత పట్టుకోని బస్సెక్కినంక ఆడపిల్లోళ్ల కండ్లపడాలని మొగదాల సీట్ల కాడ నిలబడు కోడం లేకుంటే బస్సు వాకిలి కాడ కడ్డీపట్టుకుని స్పీడుగా పోతాన్నె బస్సుకు యాలబడి 'అబ్బ ఈడు బో 'మొగోడురా'- అనిపిచ్చుకోవాలని నానా కతలు పడతాంటిమి.

కాలేజీ నుంచి వచ్చినంక ఇంత తిని కాసేపు సదువుకోడం, సాయంత్రం అయితానే సోగ్గా తయారయి బస్టాండుకో లేకుండే బిడ్జి కాడికో నడ్సుకుంటా పోడం. ఇది మా తోటి వాళ్ళు చేసే పని. మేము మాత్రం బస్టాండుకు పోతే కర్చు అయితది. ఆడ టీ తాగాల లేకుంటే ఏదైనా తినాల. అట్ట తినలేదనుకో మమ్మల్ని సూసినోళ్లు ఈళ్ళ కాడ ఏమిలేదు. లేనోళ్ళు అనుకుంటరని... ఎందుకులే కర్చు అనుకోని సగిలేట్లోకి పోయి ఇసికలో కూచ్చోని కాసేపు కబడ్డీ ఆడ్డం, కుశాల పడ్డం, దొమ్మరిగింతలు కొట్టడం, సెల్లాటం ఆడు



కోవడం అయిపోయినంక ఎవురి దావన వాళ్ళం మాట్లాడకుంటా ఇంటి దావపట్టడం తిని పండుకుని మళ్ళా తెల్లవారు జామున మామూలుగా కాలేజీకి పోవడం.... ఆ రోజు మేము ఎప్పుడూ కల్సుకుండే సగిలేట్లోకి పోయాక సంజు, ఉస్మాన్లు ఇద్దరే కూకోనుండారు.

కాదర్‌బాష కనపడక పాయ. వాళ్ళిద్దరూ ఏందో మాట్లాడుకుంటాండారు. దగ్గరకు పొయ్ "కాదర్‌బాష ఏడిరా" అనడిగితి.

ఉస్మాన్ నవ్వుతా "వాడు ఇంటికాడనే ఉండాడు. కాసేపయినంక వచ్చుడంట" అని చెప్పినాడు.

"ఇంటికాడ ఏంజేచ్చాండడు" అని అడిగితి

"వాళ్ళ పెద్దన్న కాసీంసాబ్ మిల్టరీ నుండి వచ్చినాడు. ఈడు వాళ్ళన్నముందు మునంగ సదువుతాన్నట్టు యాక్టింగ్ శేచ్చా ఇంటికాన్నే కూచ్చోనుండాడు.

నేను పిల్సడానికి పోతే నన్ను జూసి బయం బయంగా 'నువ్వు పోరా నేను మళ్ళా వచ్చా" అని సైగజేసినాడు అని చెప్పె ఉస్మాన్.

మేము అట్ల మాట్లాడుకుంటాంటేనే కాదర్ బాష వచ్చినాడు. వాడు మమ్మల్ని చూసి "మాయన్న మిల్టరి నుండి వచ్చినాడు. మాయన్న ముందు సదువుకుంటాన్నెట్టు యాక్టింగ్ జేచ్చా ఉంటే నా కొడుకు నన్ను పిల్సడానికి వచ్చినాడు. ఆన్నే తందామనుకున్న నా కొడుకును" అన్నెడు.

"మీ యన్న వచ్చిండని నాకు కలేమన్నా వచ్చిందా ముందు చెప్పాలోయ్ మా యన్న వచ్చుడు నువ్వు ఇంటి కాడికి రాగాకు అనీ" అనె రాగం దీచ్చా ఉస్మాన్.

"కొడకా దొరుకుతవులే అప్పుడు నీ సంగతి చెప్త" అని కాదర్‌బాష సొక్కా ఇప్పి కసరత్తు చేయడం తిరుక్కుండె.

"సంజు మీ యన్న మిల్టరిలో ఏంపని శేచ్చడు" అని అడిగ.

మా యన్న మిల్టరీలో తపాలాలో పని శేచ్చడు అని శెప్పినాడు కాదర్‌బాష. మా నాయన గూడా మిల్టరిలో డాక్టర్‌గా పని చేసినాడు అని శెప్పినాడు సంజు. అట్ల మాకు తెలిసిన మిల్టరి వాళ్ళ గురించి మాట్లాడుకుంటా ఉంటే.

కాసేపయినంక కాదర్ బాష కసరత్తు శెయ్యడం ఆపి మా దెగ్గరకు వచ్చి ఏందో శెప్పడానికి తిరుక్కుని అందర్ని దగ్గరికి పిల్సినాడు.

"ఒరేయ్ ఇట్రాండ్రా" అన్నెడు.

ఏందో వీడు రహస్యం చెపుతాడు అనుకోని దగ్గరికి పోతిమి.

"ఏమిలేదు రేపు మందుకొడ్డామా" అన్నెడు.

"మాయన్న మిల్టరీ నుండి తెచ్చినాడు నేను తీసుకుని వచ్చ" అని చెప్పినాడు కాదర్ బాష

"మీయన్న నీకు మందు తాగమని ఇచ్చాడా" అనడిగాడు ఉస్మాన్ అమాయకంగా.

"తాగురా అని ఇచ్చుడురా ముండ నా కొడకా అడిగి తెచ్చననుకున్నెవా? మా ఇంట్లో ఎవురు లేకుండా చూసి తెచ్చే సరిపాయ" అనె కాదర్‌బాష.

యాడతాగితే బాగుంటది అని అడుగుతాంటే "రేపు మీ నాయన ఊరికి పోతాడని శెప్పినావు గదురా మీ ఇంట్లో తాగుదాము" అన్నాడు సంజు. సరే మా ఇంట్లో తాగుదామని అంటి. "సరే ఇంగేమి నేను మందు తెచ్చ, మీ ఇంట్లో తాగుదాము. మందులోకి ఆమ్లెట్లు ఏసుకునేదానికి కోడి గుడ్లు ఇద్దరూ శెరి రెండు తీసుకోని రాండి" అని ఉస్మాన్‌కు, సంజుకు చెప్పినాడు కాదర్‌బాష. మందు గురించి మాట్లాడుకుంటా ఇంటి దావ బడ్తిమి. నాకు మందు వాసన తెలుసు. మందనే దానికంటే సారాయి వాసన తెలుసు. మా ఇంటెనక తుమ్మ శెట్లల్లో సారాయి కాచ్చాంటే ఆడికి పోతాంటి. ఆడికి పోతే సారాయి కాచే అయప్ప మాతో బీడీ కట్ట అగ్గిపెట్టె తెప్పిచ్చుకోని పాకు బెల్లం పెట్టేవాడు. దాని కోసం పోతే ఒక్కోసారి ఆవిరి కుండమీద చిప్పతో నీళ్ళు పోయిచ్చేవాడు.. అట్ల సారాయి వాసన బాగా తెల్సు. సారాయి దించే రోజు ఒక్కోసారి సారాయి తాగి కింద పడి దొర్లుతా ఉంటడు. అట్టాట్టప్పుడు నేను ఆయన్ను అడక్కుండా పాకు బెల్లం తెచ్చుకుంటోని.

నాకు సారాయి అన్నా సారాయి తాగే టోళ్ళు అన్నా బో బయ్యం. ఎందుకంటే మా బావ ఎప్పుడన్నా మా ఊరికి వచ్చినా సారాయి తాగుతాన్నెడు. ఒకసారి మా బావ వచ్చినప్పుడు నన్ను ఎంటబెట్టుకోని సారాయి అంగడికి తీసుకోని పోయినాడు. సారాయి అమ్మే ఆయన బుర్రమీసాలు ఏసుకోని ఎప్పుడూ శానాకోపంగా ఉన్నెడు. మాట గూడా శానాగరుగ్గా మాట్లాడే వాడు. ఎవరితో మాట్లాడినా కొట్లాడినట్టే ఉండేది. సారాయి కొట్టు సుట్టూ ఇండ్లు. సంసారాలు చేసేటోళ్ళు ఉండేవాళ్ళు కాదు. సారాయి అంగడి పక్కనే మురిక్కాలవ. దాని పక్కనే శింతశెట్టు ఉంటది. శెట్టుకింద ఒకామె శిన్న అంగడి పెట్టుకోనుంటది. ఎప్పుడు ఏసింటరో తెలియదు. మిరపకాయబజ్జీలు, వడలు. వాటి మీద ఈగలు వాలతాంటయి. ఆమె కాన్నె శిన్న శిన్న ఊరగాయ ప్యాకెట్‌లు ఉంటయి. తాగినోడు తమాష ఎరగడు అని అన్నెట్లు కొందరు అయే కొనక్క తింటాంటరు. మా బావ ఎంటంబడి పోయినప్పుడు ఆ సారాయి అంగడిని సూశినా... ఎప్పుడు సారాయి తాగి వాళ్ళను సూసినా మతికి వచ్చాంటది. నేను మా బావ ఎంబడి పోయనిపుడు ఒకాయన అప్పటికే తాగి పడిపోయినాడు. ముక్కుల్లోనుండి శీమిడి కార్తాంది. మనిషి సచ్చినోని మాదిరి పడుండాడు. ఎవురి దావన వాళ్ళు వచ్చి తాగి పోతాండరు గాని ఆ మనిషిని ఎవ్వరూ పట్టిచ్చుకోడం లేదు. ఇంగోకాయన గోడకు ఆనుకోని కూకోని లెయ్యలేక కూచ్చోనుండడు.

వాళ్ళ కొడుకు శానా శిన్న పిల్లోడు 'నాయనా ఇంటికి పోదాంరా నాయనా' అని శెయ్యిపట్టుకోని గుంజుతాండడు. తాగినోనికి ఏమి తెలియడం లేదు. ఆ పిల్లోన్ని సూచ్చే నాకు బాద ఏసింది.

కొట్టం కాడికి పోతానే మా బావ నువ్వు

బయటనే ఉండు అని లోపలకి పోయినాడు. ఎంతనో లెక్క ఎంచి ఇచ్చినాడు. ఆ మనిషి టీ తాగేంత గాజు గ్లాసులో నీళ్ళమాదిరి తెల్లగా ఉండే సారాయి పోసిచ్చినాడు. మా బావ దాన్ని బద్రంగా శేతపట్టుకోని శిన్న గూడు ఉంటే దాని కాడికి వచ్చి నిలబడి నాలుక సప్పరిచ్చి గబక్కి మూతికి తగిలిచ్చినాడు. మూతంతా బిగబట్టి ఊపిరి బిగబట్టి గ్లాసులో ఉండే మొత్తం శానా కష్టపడి తాగి ఆకర్న నోట్లోనుండి పుతుక్కున ఊసి గూట్లో ఉండే ఉప్పుతొక్కు తునక ఒకటి తీసి నోట్లో ఏసుకోని ఇట్ల తిరిగినాడు. అప్పటి దాంకా పిల్లిలా ఉండే మా బావ పులిమాదిరి అయినాడు. కండ్లు ఎర్రగా అయినాయి. దవడ మీద శిన్న ఎంక పైకి ఎగుర్తాండాది. మూతి తుడ్సుకుంటా బయటికి వచ్చి శెట్టుకింద ఉండే ముసాలామె అంగడి కాడికి పోయి సిజర్ సిగిరెట్టు డబ్బా ఒకటి తీసుకోని దాంట్లో నుండి ఓ సిగిరెట్టు తీసుకుని దాన్ని ఒకపక్క అగ్గిపెట్టెకేసి కొట్టి నోట్లో పెట్టుకుని ఎలిగిచ్చినాడు.

శేతిలో శిల్లర ఉంటే నాకు ఇచ్చినాడు. నన్ను ఏమన్నా తీసుకురా అని చెపుతాడేమోనని మా బావ తిట్టు జూసి "ఏంటికి" అని అడిగితి. మా బావ ఏమన్నా కొనుక్కో అని శెప్పినాడు. నేను లెక్క తీసుకోని జేబిలో ఏసుకున్నాను. సిగిరెట్టు తాగినంక మా బావ మల్లా సారాయి కొట్టంలోకి పోయినాడు. మళ్ళా ఇంత పోసిచ్చుకోని ఇంతకు ముందు మాదిరిగానే మూతి బిగబట్టి తాగి ఉప్పుతొక్కు నోట్ల ఏసుకోని బయటికి వచ్చినాడు. దావంబడి మెల్లగా పాటలు పాడుకుంటా వచ్చినాడు. ఇంటికాడికి శేరుకోగానే నేను మా బావ ఇచ్చిన లెక్కతో కొనుక్కోడానికి ఊర్లోకి ఉరికితి.

కోంటోల్ల బజారుకు పోయి పోస్టు సుబ్బరాయుడి బజ్జీల అంగడి కాడికి పోయి. పోస్టే సుబ్బరాయుడు మిరపకాయ బజ్జీలు, వడలు ఏచ్చాంటడు. అయితే వంకాయ బజ్జీలు మాత్రం శానా తక్కువ ఏచ్చడు. ఎందుకంటే దానికి శానా పని ఉంటది. వంకాయకు బొక్కపెట్టి లోపల జిలకర, ఇంగువ, శింతపండు ఇంగా ఏందో మసాల ఉప్పు వేసి దంచి వంకాయ లోపల దూర్చి దాన్ని పిండిలో ముంచి నూనెలో ఏచ్చడు. ఏం మసాల ఏచ్చడో గాని నాకు ఆ వంకాయ బజ్జీ అంటే బో ఇది. రెండు వంకాయ బజ్జీలు రెండు మెరపకాయ బజ్జీలు కొనుక్కోని తింటా ఇంటికి వచ్చి.

మాయక్క మాబావకు అన్నం పెడతా ఉంది. మాయమ్మ మా నాయన మిగిలిన పిల్లోల్లం అందరం బయట కూచ్చోనుండం. ఏమయిందో ఏమో ఇంట్లో గిన్నె కింద పన్నెట్లు ఇనిపిచ్చినాది. ఉరుకుతా ఇంట్లోకి పోయి సూచ్చే మా బావ తింటాన్న బువ్వ గిన్నెను ఇసిరి కొట్టినాడు. బువ్వ అంతా శెల్లాశెదురు అయిపడింది. బువ్వలో ఏసిన శియ్యలు కూరాకులో తునకలు ఆడాడ పన్నెయి. మా యక్క బయపడ్తా కింద బన్నె అన్నం కూరాకు ఊడుచ్చాంది. మా బావ శెంబు ఎత్తి గటగటా నీళ్ళుతాగి శెయ్యి కడుక్కోని తువ్వాలకు తుడ్సుకుని పైకి లేసి మంచం మీద పండుకున్నెడు. నాకు బో బయమేసింది. తాగక ముందు ఏమి ఎరగనట్లు ఉండే మనిషి తాగినంక ఎందుకట్ల జేచ్చడో నాకు అంతుశిక్కక పాయ. అప్పటినుండి తాగినోళ్ళంటే బోబయం.

మా పక్క ఊర్లో బాపన పల్లెలో ఉండే ఒకాయన మా ఇండ్లమిందనుండే మా ఊర్లోకి పోతడు. మళ్ళా రాత్రి పదిగంటలకు ఫుల్‌గా తాగి దావన పోతా ఎవురుతోనో ఒకర్తో కొట్లాట పెట్టుకుంటాన్నెడు. శానా మంది తాగి కొట్టుకునే టోళ్ళను చూసిన.

పెండ్లిళ్ళలో అయితే బువ్వల కాడ కూడా కూరాకు తక్కువేసినారని కొట్టుకుంటాంటే సారాయి తాగి కొట్టుకుంటాండరులే అని శెప్పుకుంటాండిరి. నాకు తెల్సిన కాడికి మా ఊర్లో ఏ గలాటా జరిగినా తాగి కొట్టుకున్నోళ్లే. అందుకే సారాయి తాగడం అంటే నాకు బయం పుట్టుకున్నెది.

అయితే ఇప్పుడు నా సావాసగాళ్ళు తాగుదామంటే సై తాగుదాం అని అంటిగాని లోలోపల బయంగానే ఉంది. నేను తాగను అని అంటే వాళ్ళు నన్ను శేతగాని నాయాల్ని చూసినట్టు సూచ్చరు. మేమిద్దరమే అయితే తాగనని శెప్పచ్చు. కాదర్‌బాషతో పాటు ఉస్మాన్ తాగుతాండడు. మాకంటే ఒక్కరవ్వ ఎక్కువ మార్కులు వచ్చే సంజు గూడా తాగుతాండడు. మనం తాగితే తప్పులేదు. అనుకుంటి మాటల్లో కాదర్‌బాష, సంజు ఇద్దరూ సారాయి వేరు మిల్టరి మందు వేరు అని చెప్పినారు.

మళ్లారోజు రానే వచ్చింది. మా ఇంట్లో ఎవురూ లేరు. కాదర్‌బాష, ఉస్మాన్ వచ్చిన కాసేపటికి సంజు వచ్చినాడు. కాదర్‌బాష ఒక గుడ్డ సంచిలో రెండు టానిక్ సీసాలు పెట్టుకోని వచ్చినాడు. మా అందరికీ మందు ఎప్పుడెప్పుడు తాగుదామా అని ఉంది. అస్సలు మిల్టరీ మందు ఎట్లుంటదో ఎప్పుడెప్పుడు సూజ్జామా అనిపిచ్చాంది. సాప పరిసి దాని మీద శెంబుతో నీళ్ళు పెట్టిన. కాదర్ బాష నాలుగు స్టీలు గ్లాసులు కడిగినాడు. కోడిగుడ్లు ఉర్లగడ్డ కూర జేసి ఒక గిన్నెలో పెట్టి సాపమీద పెడితి. సంజు సిగిరెట్లు తెచ్చినాడు. ఆ సిగరెట్‌లు సూచ్చే కొనక్కచ్చినట్టులేవు. వాళ్ళనాయన సిగిరెట్టు ప్యాకెట్‌లో నుండి ఎత్తుకచ్చినట్లు ఉండయి. అగ్గిపెట్టే అడిగితే ఇచ్చినాను. అందరం గుండ్రంగా కూచ్చున్నాము. కాదర్‌బాష సంచిలో నుండి సీసాలు తీసినాడు.

అయి జూసి "ఏంది టానిక్ సీసాలు తెచ్చినవే అన్నాడు" సంజు

"బాటల్‌లో నుండి దీంట్లోకి వంచుకోని వచ్చినాను"

అని ఒక సీసాలో ఉండే మందు అందరిగ్లాసుల్లో ఒక్కొక్కరవ్వ పోసినాడు కాదర్‌బాష. ఎవునికి వాడు మందు బాగా అలవాటు అన్నెట్టు శేచ్చాండం. మందు పోసిన గ్లాసుల్లో సంజు నీళ్ళు పోసినాడు. అందరం గ్లాసులు ఎత్తుకున్నాము. ఎవురు మందు తాగుతారో అని అనుకుంటా ఉంటే సంజు గ్లాసును కాదర్‌బాష గ్లాసుకు ఆనిచ్చి చీర్స్ అన్నెడు. మళ్ళా నా గ్లాసుకు ఉస్మాన్ గ్లాసుకు ఆనిచ్చి మళ్ళా చీర్స్ అన్నెడు. మేము గూడా అదే మాట అంటిమి. చీర్స్ కొట్టినంక తాగినంకనే గ్లాసు కింద పెట్టాల అని చెప్పినాడు కాదర్ బాష. ఎవురికి వాడు సిగ్గుపడతానే ఒక గుటిక మింగినాము.

ఒగురొగురుగా
ఒక్కరవ్వ శేదుగా
అనిపిచ్చింది.



అందరం గ్లాసులు దించి కోడిగుడ్డ ఉర్లగడ్డ కూరాకు ఉన్నె గిన్నెలో శెయిపెట్టి. తలా ఒక్క రవ్వ కూరాకు తీసుకోని నాక్కున్నాము. అట్ట కాదర్‌బాష, సంజులు ముందు ఏది జేచ్చే అది మేము శెయ్యడం తిరుక్కుంటుమి. అట్ల జేచ్చనే ఒక గ్లాసు తాగినాము. మళ్ళా కాదర్‌బాష అన్ని గ్లాసుల్లో మందు పోసినాడు. సంజు నీళ్ళు పోసినాడు. సంజు సిగిరెట్టు తీసి నోట్లో పెట్టుకుని మా అందరికీ తలా ఒకటి ఇచ్చినాడు. కాదర్‌బాష అగ్గిపెట్టె ఎలిగిచ్చి సంజు సిగిరెట్టుకు కూడా అంటిచ్చినాడు. ఉస్మాన్ వాళ్ళకాన్నుండి అగ్గిపెట్టే తీసుకోని వానికి నాకు అంటించినాడు. నలుగురం సిగిరెట్టు పొగ గుమ్ములు గుమ్ములు లాగుతుండము ఇడుచ్చాండము. సంజు ముక్కులో నుండి పొగఇడ్సి 'సూచ్చివా నా పనితనం అన్నెట్టు సూచి నాడు'. ఉస్మాన్ ముక్కులోనుండి ఇడ్సబోయి ఊపిరాడక దగ్గడం తిరుక్కున్నెడు.

అదిజూసి కాదర్‌బాష 'శేతగాని నా కొడుకువు శాతగానెప్పుడు సిగిరెట్ ఎందుకు తాగుతవురా' అన్నెడు.

వాడు దగ్గిన దగ్గుకు కండ్లలో నీళ్ళు కారినయి. సంజు సన్నగ హిందీ పాట ఎత్తుకున్నెడు. కాదర్‌బాష వాని జూసి 'ఈనికి ఎక్కిందిరా' అన్నెడు. దాంతో సంజు ఇంగ్లీషులో మాట్లాడ్డం తిరుకున్నెడు. నేను ఉస్మాన్ గూడ ఏదో ఒకటి శెయాలి కాబట్టి మంచి నీళ్ళు తాడానికి లేసినపుడు ఒక్కరవ్వ తూగినట్టు జేచ్చి. ఉస్మాన్‌గూడా గోడకు జరిగి కూచ్చోని కండ్లు ఎట్టనో పెట్టినాడు. కాసేపుటికి అందరం బువ్వ తిని కాసేపు సగిలేటికి పొయి ఏట్లో ఇసికలో పండుకోని శిన్న నిద్దర తీసి యాడోళ్ళము ఆడ ఎల్లబారితిమి.

మళ్ళా రోజు అందరం కాలేజీకి పోతిమి. కాలేజీనుండి వచ్చినంక అందరం రోజు మాదిరి సగిలేట్లేకి పోయినాము. నేను సంజు, ఉస్మాన్‌లు వచ్చేప్పటికి కాదర్‌బాష రాలేదు. మేము ముగ్గురం మాట్లాడుకుంటా ఉంటే కాసేపటికి కాదర్‌బాష వచ్చినాడు. మమ్మల్ని జూసి పగలబడి నవ్వుతాండడు. నవ్వుతా మునిగాళ్ళమీద కూచ్చుంటాడు. మళ్ళా పైకిలేచ్చాడు. మళ్ళా కూచ్చుంటాడు. నవ్వుతాడు. వాడెందుకు నవ్వుంతాండో అర్థం గాలేదు.

వాడు నవ్వినంత సేపు నవ్వి "నా కొడకల్లారా మాదిఫలరసానికే అంత ఎక్కింది కదురా నిజంగా రమ్ముతాగింటే ఏమి చేసి ఉండేవాళ్ళో" అని అసలు విషయం చెప్పినాడు.

"మాయన్న ఓల్డ్‌మంక్ రమ్ముతో పాటు మాయక్కకు మాదిఫల రసం సీసా తెచ్చినాడు. అన్నీ ఓ గూట్లో పెట్టినారు. మాదీ ఫలరసం సీసా-మందు సీసా రెండు ఒకే రకంగా ఉన్నెయి. నేను శీకట్లో మందు అనుకోని మాది ఫల రసం ఒంచుకోని వచ్చి అది తాగి మనం..." అని మళ్ళా నవ్వడం తిరుక్కుండె. ఒకరి మొకాలు ఒకడు జూసుకుంటా ఆరోజు మందు ఎక్కక పోయినా ఎవురెవురు ఎట్టెట్ట జేసింది శెప్పుకోని ఇరగబడి నవ్వుకుంటిమి. సది వినోళ్ళు కూడా నవ్వుకుంటారని ఈ కథ రాచ్చి.

బత్తుల ప్రసాద్,
పాత్రికేయులు, హైదరాబాద్,
99854 79977



కిట్టయ్య అలక

మట్టి ముట్టొద్దంటు
గట్టిగ తిడితే..
పొన్నసెట్టు కింద
సిన్ని కిట్టయ్య
అమ్మమీద అలిగి
బొమ్మల్లె కూసుంటె

సిలకొకటి సూసింది
పండట్టుకొచ్చింది
కిట్టయ్య ఎదురూగ
కొరికి ఇసిరేసింది

పండు సూసిన సామి
ముక్కొకటి కొరికి....
పరమాన్నమనుకొంటూ
పరుగెత్తె ..ఉరికీ....

సంతసాన సామి
అమ్మ సెంతకు సేరి
తీయగ ఉందనీ
అమ్మకి తినిపిస్తే...

పండునొదలీ... అమ్మ
బుగ్గకొరికిందీ
అలకమాని తండ్రి
సిలకల్లె నవ్వంటు...

సిన్ని కిట్టా... నువ్వు
వెన్నల్లె నవ్వాలి..
వెయ్యేళ్లు నవ్వాలి..
పువ్వోలె నవ్వాలి
పున్నమిల నవ్వాలి
కలకలా నవ్వాలి
కడలిలా నవ్వాలి
ముత్తాలు రాలగా..
మురిపాన నవ్వాలి
నవ్వాలి... నవ్వాలి

కిట్టయ్య నవ్వాలి
కిట్టయ్య నవ్వులో
కట్టాలు మరచి
జనమంత నవ్వాలి
జగమంతా నవ్వాలి

-జి.వి.ఎస్.నాగేశ్వరరావు
ఉపాధ్యాయుడు, కొమ్మాది, 94918 04709

మనందరం కిష్కింధవాసులం

అన్నీ అవలక్షణాలేనా అని బాధపడాల్సిన పని లేదు. వనవాసంలో శ్రీరాములవారికి ఆతిథ్యమిచ్చిన శబరి మహాతల్లి తెలుగుతల్లే. నమోదు అయుండదు కానీ అంతకు ముందు ఎంత మంది ఆకలి తీర్చిందో ఆ అమ్మ. తెలుగు మహిళకు భోజనం పెట్టడమంటే మహాసరదా. పేరుకే కాశీలో ఉంది కాని అసలు అన్నపూర్ణమ్మ మసలుతుండేది తెలుగు గడ్డ మీదే కదూ! డొక్కా సీతమ్మలు మంగళగిరి బాలాంబలు అడుగడుగుకీ తిరుగాడే పూర్ణగర్భ కదూ తెలుగునేల!

ఉద్యమమైనా సరే ఉప్పు సత్యాగ్రహమైనా సరే సొంత ముద్రంటూ లేనిదే ముందుకు కదలడు తెలుగు వాడు. బౌద్ధాన్ని సంస్కరించి మరీ ప్రచారం చేసిన నాగార్జునుడు మన తెలుగువాడే. ఆయన శిష్యులమే కదా మనం! మనకు కొత్తొక వింత పాతొక రోత. శైవం వచ్చిందని అంతదాకా ఆదరించిన జైనాన్ని నామరూపాలు లేకుండా చేసుకున్నాం. వైదికం మోజులో పడి శైవాన్ని సరిహద్దులకు తరిమికొట్టాం. అటు ఆర్య సంస్కృతులు ఇటు ద్రవిడ నాగరికత రెండూ కావాలి మనకు. అందరూ కావాలనుకునే తత్వం తెలుగు వాడిది. తను ఎవ్వరికీ అక్కరలేకపోయినా పట్టించుకోడు. భారతంలో తెలుగు ఊసు అట్టే ఉండదు కదా... అయినా వింటే భారతమే వినాలి అంటాడు... మరి!

సాహసాలకు మాత్రం ఏం తక్కువ! తైలంగ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. సుమిత్రా జావా ద్వీపాల్లో వలస రాజ్యదీపాలు వెలిగించాడు. సయాడోనిసిచయాల్లాంటి సుదూర ప్రాంతాల్లో నిబద్ధతతో బౌద్ధధర్మ ప్రచారం చేశాడు. ఈజిప్టు రాణికి చీనాంబరాలు కట్టబెట్టిన ఘనత మనది. అజంతా అమరావతి సాంచి క్షేత్రాల్లో అసమాన శిల్పకళా వైభవాన్ని సృజించిన కళాతపస్వులం మనం. ధాన్యకటక విశ్వవిద్యాలయం ద్వారా ప్రపంచానికి జ్ఞానభిక్ష పెట్టిన గురువులం. మానవ నాగరికత మణికిరీటంలో

ఋగ్వేదంలో ఆంధ్రులున్నారు. రామాయణంలో సీత కోసం ఆంధ్రదేశంలో వెదకడం ఉంది. పోతన భాగవతం ప్రకారం బలి కుమారుల్లో ఆఖరివాడు ఆంధ్రుడే. భారతంలో యుధిష్ఠిర చక్రవర్తి పట్టాభిషేకోత్సవానికి హాజరైన వాళ్ళలో ఆంధ్రరాజు ఉన్నాడు. పురాణమో, పుక్కిటిపురాణమో... ఒక లెక్క ప్రకారం ఆంధ్రులంతా విశ్వామిత్ర సంతతి. విశ్వామిత్రుడు విశిష్టమైన వ్యక్తి. గురువును మించి ఎదగాలన్నది ఆయన పంతం. ఎన్నో ఉద్యమాలకు స్ఫూర్తి, సృష్టికి ప్రతి సృష్టి చేసిన అపరబ్రహ్మ. త్రిశంకులోక సృష్టికర్త, గాయత్రి మంత్ర ఆవిష్కర్త. వంకాయ, టెంకాయ, గోంగూర వంటి విడ్డూరాలన్నీ ఆయన సృష్టే. అందుకేనేమో అవన్నీ తెలుగువాడికి పరమప్రీతి. దీక్ష... కక్ష... మనందరికీ విశ్వామిత్రుడు నుంచీ వారసత్వంగా సంక్రమించిన లక్షణాలేమో!

రామాయణంలోని కిష్కింధ ఆంధ్రదేశ అంతర్భాగమేనంటారు. ఆ లెక్కన మనమందరం కిష్కింధ వాసులం. అన్నదమ్ముల మత్సరం వాలిసుగ్రీవుల నుంచి అబ్బిన జబ్బేమో! వాయుపుత్రుడి లక్షణాలు మనకు కాస్త ఎక్కువే. స్వామి భక్తి మనకు విపరీతం. స్వామి కార్యం తరువాతే మనకు ఏ కార్యమైనా. ఆరంభశూరత్వం అత్యుత్సాహం ఆంధ్రుల లక్షణాలు. చూసి రమ్మంటే కాల్చివస్తాం. కొమ్మ తెమ్మంటే కొండనే పెకిలించుకొస్తాం. ఆ రావడంలో కూడా ఆలస్యమే. కోటిలింగాలు తెమ్మని రాముడాజ్ఞాపిస్తే ఆంజనేయుడేం చేశాడు? ఒకటి తక్కువ తెచ్చాడు. ఆర్భాటంగా మొదలు పెట్టి అసంపూర్ణంగా ముగించడం మనకు అప్పటి నుంచే అలవాటేమో! మన శక్తియుక్తులను పనిగట్టుకొని మరొకడు పొగిడితేగాని తెలుసుకోలేనంత బోళాతనం మనది. సముద్రాలు లంఘించగలిగుండీ ఏ స్వామి పాదాల చెంతో... మనకు ఆనాదిగా వస్తున్న బలహీనతేనన్న మాట.

> లోకమంతా ఒకే పొలం మడిచెక్కగా మారిపోయిన ఈ రోజుల్లో 'మా తెలుగు' అని మడికట్టుకుని ఒక మూల కూర్చోమని ఎవరూ చెప్పరు గానీ.. నలుగురితో కలిసి నడుస్తున్నా మన అడుగు ప్రత్యేకంగా ఉండాలంటే.. 'మనతనం' ఏమిటో తెలిసి ఉండాలి. మన తెలుగుతనం ఘనత ఏమిటో తెలుసుకోవాలి.

నిరంతర వెలుగులు విరజిమ్మే కోహినూరు వజ్రాలం మన తెలుగువాళ్ళం.

మేధస్సులో మాత్రం తక్కువా! క్షీణదశలో దక్షిణాది గోదావరి నుంచే మహాతత్వవేత్త శంకర భగవత్పాదులు ప్రభవించింది. స్వధర్మ పునరుత్థానం కోసం జన్మమెత్తిన విద్యారణ్యుడూ తెలుగు పురుషుడే! అతని సోదరుడు సాయణుడు వేదాలకు భాష్యం రాశాడు. మల్లినాథుడు ఉత్తరాది కావ్యాలకు వ్యాఖ్యానాలు చేశాడు. జగన్నాథ పండితరాయలు హస్తిన ఎర్రకోట యవనసుందరి అంకపీఠం మీద తెలుగు విఖ్యాతిని ప్రతిష్ఠించాడు. రాధాకృష్ణ పండితుడు దేశాంతరాలలో తెలుగుకేతనాన్ని ఎగురవేశాడు. అంతర్జాతీయంగా కీర్తిప్రతిష్ఠలు సాధించిన కోడి రామ్మూర్తి, సి.కె.నాయుడు, ఎల్లాప్రగడ సుబ్బారావు మన తెలుగు వాళ్లేనంటే తెల్లబోతాం మనం. గొప్పవాళ్లలో ఎపుడూ తెలుగువాళ్లుండరనీ తెలుగు వాళ్లెపుడూ గొప్పవాళ్లు కాలేరని మనకెందుకో ఒక గట్టి నమ్మకం. బొంబాయి చేరితేగాని కాశీనాథుని నాగేశ్వరావు పంతులు గారికి కాసుల దర్శనం కాలేదు. తమిళదేశం చేరదీస్తే కానీ మంగళంపల్లి గానగాంధర్వుడని మనం ఒప్పుకోలేదు. తెలుగువాడు రావాలంటే పైకన్నా పోవాలి, దేశం దాటి పైకన్నా పోయి రావాలి. ఎందుకిలా!

మనకు సృజన శక్తి మరీ ఎక్కువయినందుకా! మహామాత కాళీదేవత ప్రత్యక్షమైతే సాగిల పడి మొక్కాల్సింది పోయి.... ఆమె అంగసౌష్టవం చూసి ఫక్కుమని నవ్వాట్ట తెనాలి రామలింగడు. కట్టుకథే కావచ్చేమోగానీ... తెలుగువాడి తీరుకిది అద్దంపట్టే వ్యాఖ్యే కదా!

వేలెడంత వాడు కూడా జానెడంతవాణ్ణి చూసి మూరెడంతలేడని ఆక్షేపించడం తెలుగు వాడికే తగుతుందేమో!

పోతరాజు కృష్ణుణ్ణి తెలుగుదేవుడు చేసేశాడు. రామదాసు అయోధ్యావాసి శ్రీరామచంద్రుణ్ణి సతీసోదరసమేతంగా భద్రగిరికి కట్టేశాడు. కృష్ణరాయలు పాండిత్య ప్రకర్షతో శ్రీరంగధాముణ్ణి తెలుగు పెళ్ళికొడుకును చేసేశాడు. పాపయ్యశాస్త్రి భక్తి ప్రపత్తులకి బద్ధుడైనట్లు బుద్ధుడు తెలుగు చిరునామా స్వీకరించాడు. ఆంధ్రదేశపు మట్టి అది మాకు కనకంబు అనిపించిన చోటునే ఇప్పుడు మనం వట్టి మట్టికుప్పగా మారుస్తున్నాం. అదీ విడ్డూరం.

గుర్రం+అశ్వం=గుశ్వం అన్నట్లుంది మన తెలుగు భాషా విజ్ఞానం. పాకశాస్త్రంలో తెలంగిటి పోపు ఘుమఘుమల దారే వేరు. తెలుగు వారి తాళింపులో కనిపించేటన్ని దినుసులు మరెక్కడా కనిపించవు. తెలుగు అక్షర మాలా ఒక పోపులపెట్టె లాటిదే. సాతాళించగల చేవ ఉండాలేగాని తెలుగు వంటకలాగా తెలుగు రచన భూమండలం మొత్తం గాలించినా దొరకని తీపి మిఠాయి.

గంగనీరు తెచ్చి గోదావరి, కృష్ణ, పెన్న, తుంగభద్రలలో కలవడమే తెలుగుదనం. తాగే నీటిని మంచినీరంటాడు తెలుగువాడు. తెలుగు భాషనూ మంచి నీరులాగా మేధోదాహార్తిని సంతృప్తి పరిచే సత్తా ఉంది.

శబ్దానికి అక్షరరూపంలో సంపూర్ణన్యాయం చేయగల శక్తి తెలుగులాగా చాలా తక్కువ భాషలకుందని ఆధునిక భాషాశాస్త్రవేత్తలు కూడా ఆమోదిస్తున్న సత్యం. కంప్యూటర్ వేగాన్ని అందిపుచ్చుకోగల 'బైట్' సామర్థ్యం తెలుగు లిపికి ఎక్కువని విజ్ఞాన శాస్త్రవేత్తలు నిగ్గుతేల్చిన నిజం. ఏ పలుకునైనా మంచినీళ్లప్రాయంగా తనతో కలుపుకోగల సర్దుబాటు గుణం తెలుగు అక్షరాల సొంతం. ద్రవిడ సంస్కారి చిన్నయసూరి చేత చక్కని వచన రచన చేయించింది ఈ తెలుగే. తెలుగు మాటలోని తేటదనానికి ముగ్ధుడయ్యే బ్రౌన్‌దొర నిఘంటువు నిర్మాణానికి పూనుకొన్నాడు. జిజ్ఞాస ఉండాలేగానీ ఆంధ్రప్రజ్ఞను ఇలా చెప్పుకుంటూ పోతే అదో పెద్ద గ్రంథమవుతుంది.

పరాయితనాన్ని భుజాల మీద మోయడం మొదటినుంచీ తెలుగువాడు చూపిస్తున్న అవసరానికి మించిన ఔదార్యం, తెలుగు వాడి నోటిలో తెలుగు పదాలు ఎందుకో చాలినన్ని పట్టవు. మొదట్లో సంస్కృతం, మధ్యలో హిందూస్తానీ, ఇప్పుడు ఆంగ్లం! వట్టి తెలుగు మాత్రమే తెలిసి ఉండటం వాజమ్మతనానికి నిదర్శనం మనవాడికి. గొప్పోళ్లు చాలామందికి తెలుగురాదు కనక... తెలుగు రాకపోవడమొక్కటే గొప్పతనమనుకునే తెలివితక్కువ తనం మనది. విద్యంటే ఆంగ్లమేనా! పాండిత్యమంటే సంస్కృతమేనా! పోనీ... ఆ భాషలు వంటబట్టాలన్నా ప్రాథమిక దశలో మాతృభాష తప్పనిసరి. 'చావగొట్టినా తల్లిభాష రానివాడికి వచ్చినా పరాయిభాష లొంగదు' అని శాస్త్రవేత్తలే నిర్ధరిస్తున్నారు గదా!

భోజన హోటల్లో వాటరు, చట్నీ అంటేనే గాని వడ్డించేవాడు వినడా! న్యాయస్థానాల్లో కొట్లాటలకి పనికొచ్చే ప్రజలభాష ఫిర్యాదులు రాయడానికి ఎందుకు పనికిరాదో! ఇవాళ వస్తున్న రోగాలే కాదు. ఆ రోగాలు, మందుమాకుల పేర్లు కూడా ఎందుకో జనానికి అర్థం కాని లాటిన్‌లో! రైలు, రోడ్డు, పోస్టు, సైకిలు, సెల్ ఫోన్, టీవీలాంటి పదాలనంటే... సరే.. పుస్తకం, కలం, ప్రేక్షకుడు, సంతోషం లాంటి చక్కటి తెలుగు పదాలు మనకున్నా... భేషజం కోసమో.. మరో అతిశయం కోసమో పరాయి భాషా పదాలను అరువు సొమ్ముల్లా వాడేసుకోవడం ఎబ్బెట్టుగా ఉండదూ!

తెలుగు గడ్డమీద తెలుగుబిడ్డ మెడలో 'తెలుగు మాట్లాడను' అని పలకలు వేలాడదీయడం... తెలుగులో బాధ చెప్పుకున్న పాపానికి పసిబిడ్డ అరచేతిలో 'వాతలు' వేయడం.. ముందుతరాలకు మనం తెలిసో.. తెలియకో చేస్తున్న అన్యాయం అవునా.. కాదా! ప్రజాస్వామ్యం గదా మనది. పాలితుడి పలుకుమీద ఎందుకింత చులకన? జంతువుల్లో కలిసిపోకుండా.. పుట్టుకతోనే నాలుక మీదకు ప్రవేశించి ముఖతః పైకొచ్చి మన మానవజన్మను సార్థకం చేసిన తల్లి భాష మీదింత యావగింపు తగునా?... తగదు.

అదేంటి?

అ. దిబదిబా బాదేవి రెండు;
ఆ. దిబ్బెక్కి చూసేవి రెండు;
ఇ. ఆలకించేవి రెండు;
ఈ. అందిపుచ్చుకునేవి రెండు.

అ. (కాళ్లు) ఆ. (కళ్లు) ఇ. (చెవులు) ఈ. (చేతులు)

గబగబా నడిస్తే దిబదిబా చప్పుడు కావడం సహజం. దిబ్బ అంటే ఎత్తైన ప్రదేశం. శరీరంలో ఎత్తైన ప్రదేశం తల కాబట్టి, దిబ్బెక్కి 'చూసేవి' అంటే కళ్లు. ఇక ఆలకించేవి, అందిపుచ్చుకునేవి సరే! మానవదేహం ఎంతో మార్మికమైంది. అందుకనే దానిపై ఎన్నో పొడుపు కథలు ఉన్నాయి. ఉదా॥ కిటకిట తలుపులు, కిటారు తలుపులు (కనురెప్పలు), గూట్లో పిల్ల/గుంజితే రాదు (నాలుక), నల్లని చేలో తెల్లని దారి (పాపిటి), రెండు ఇళ్లకు ఒకే దూలం (ముక్కు)

కర్లపాలెం హనుమంతరావు
హైదరాబాద్. 94403 61381

అక్కడ తవ్వితే...

అన్నీ మన జానపదాలే!

కోలారు అన్న పేరు వినగానే అందరికీ స్ఫురణకు వచ్చేవి అక్కడి బంగారు గనులే! కానీ ఆ ప్రాంతం తెలుగు జానపద గేయాలకూ తరగని గని. కాలగమనంలో అంతరించి పోతున్న అక్కడి తేటతెలుగు జానపద గేయాల్లో కొన్నైనా తెలుగు జాతికి అందించేందుకు అవిరళ కృషి చేస్తున్నారు డాక్టర్ నారాయణ స్వామి. వృత్తి రీత్యా బెంగళూరు ప్రభుత్వ కళాశాలలో కన్నడ ఉపన్యాసకుడైన నారాయణస్వామికి ప్రవృత్తి తెలుగు జానపద గేయాల లోతుపాతుల్ని స్పృశించటం. 'ఒక జానపద గాయకుడు కన్నుమూశాడంటే అతనిలోని జ్ఞాపకాల వృక్షం అంతరించి పోయినట్లే. అంటే పాట పుట్టిన సందర్భం ఆ కాలం నాటి పరిస్థితులకు అద్దం పడుతుంది. కళాకారుడు పాడే పాట శాశ్వతంగా ఆగిందంటే ఒక కాలపు సామాజిక, ఆర్థిక, మత, సంప్రదాయాల చరిత్ర అస్తమించినట్లే' అని తెలుగు వెలుగుకు ఇచ్చిన ముఖాముఖిలో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కోలారు ప్రాంతంలో ఉన్న అద్భుత తెలుగు జానపద గేయాల్ని పదిలపరచేందుకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలూ వెనుకంజ వేశాయి. ఆ పరిస్థితుల్లో తన మిత్రుడు రాజకుమార్ అందించిన రూ.35లక్షల సాయంతో 300 గంటల పాటు గాయకుల పాటల్ని నారాయణ స్వామి నమోదుచేశారు. వాటి నుంచి ఐదు వందల పాటల్ని ఎంపిక చేశారు. మళ్లీ వాటి నుంచి పన్నెండు పాటల్ని తెలుగువారికి సీడీ రూపంలో అందిస్తున్నారు. ఆ సంపదను కన్నడిగులకూ చేరువ చేసేందుకు పాటల్ని తనే అనువదించారు. రెండు భాషల్లోని పాటల్నీ జాతీయ స్థాయి గాయకులతో పాడించారు. ఆంధ్రప్రదేశ్‌కు పరాయి గడ్డలోని తెలుగుదనం విశిష్టతను, కన్నడిగులకు సొంత గడ్డలోని సోదర భాష గొప్పదనాన్ని చాటేందుకు ప్రముఖ కళాకారుల్ని ఎంచుకున్నారు. నారాయణస్వామి ఏడేళ్ల శ్రమ ఫలితం 'కోలార్ దేశీ గోల్డ్ సాంగ్స్'. ఆయనతో జరిపిన ముఖాముఖి ముఖ్యాంశాలివి.

తెలుగు జానపద గేయాలపై మీకు ఎలా ఆసక్తి కలిగింది?

నా మాతృభాష కన్నడం. ఇంట్లో కన్నడంలోనే మాట్లాడతాం. బయట మాత్రం అన్ని వ్యవహారాలూ తెలుగులోనే. మాస్తి గ్రామానికి చేరువలోని కుత్తూరు మాది. చిన్నపుడు మా ఊళ్లో సాంస్కృతిక కార్యకలాపాల్ని ఎక్కువగా నిర్వహించేవారు. గీతాలాపన, జాతర్లలో కేళికలు, కోలాటాలు జరిగేవి. వాటితో బాటు నేనూ పెరిగాను. చిన్నపుడు కోలాటాన్ని కూడా నేర్చుకున్నా. 1991లో కళాశాలలో ఉపన్యాసకుడిగా వృత్తి జీవనాన్ని ప్రారంభించాను. అధ్యాపకుడైనాక... చిన్నపుడు విన్న జానపద గేయాలు, వాటి భావాల్లో చాలా విలక్షణమైన సంగతులు, సంఘటనలు ఉన్నాయని గుర్తించాను. అవన్నీ వెలుగులోకి రావాలని, వాటిపై జాతీయ స్థాయిలో చర్చలు జరగాలని భావించాను.

కోలారు జిల్లా విశిష్టమైందన్నారు... ఎలా?

కోలారు జిల్లా తెలుగు, కన్నడ సాంస్కృతిక భాషా సమన్వయానికి వేదిక. కొన్ని వేల సంవత్సరాలుగా ఇది చెక్కు చెదరలేదు. పైగా నానాటికీ పటిష్టమవుతూనే ఉంది. కన్నడిగులూ తెలుగును చాలా చక్కగా మాట్లాడతారు. పరిపాలనపరంగా, రాజకీయంగా ఆంధ్రప్రదేశ్‌తో తమ ఉనికిని గుర్తించుకునేందుకు ఇక్కడ వారు ఇష్టపడక పోవటం ప్రత్యేకత. అందరికీ కర్ణాటకపైనే మక్కువ ఎక్కువ. నవంబరులో ప్రతి ఏటా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని తెలుగు భాషలో నిర్వహిస్తారు. తాము కర్ణాటక భూభాగంలోనే

సీడీలోని జానపద గేయం గాయని, గాయకులు

1. న్యాస్తుడా నెలబాలుడా - అనురాధ భట్
2. గుత్తి బళ్లారి దేశం - ఉషా ఊతుప్
3. రాలేదు రాగ దేవుడు - కవితా కృష్ణమూర్తి
4. ఎండకాసే బండ మీద - నందిత, బాలసుబ్రహ్మణ్యం
5. ఓ ఎర్రపిల్ల నీ మొగడు - మనో
6. పుట్ట పుట్టింది గానీ - హేమంత్
7. ఆవని కొండ మీద - శంకర్ మహదేవన్, కునాల్ గంజావాలా
8. ఓరోరి జీతగాడా - విజయ్ ఏసుదాసు
9. ధరణి మీద ఒక నిమ్మ చెట్టు - మాల్గుడి శుభ
10. చింత కొమ్మలూగినాయి - శంకర మహదేవన్, సంగీతా కులకర్ణి
11. ఏమి ఏమమ్మ గంగాభవాని - హరిహరన్
12. కంది కాసే కంది పూసే - చిత్ర

ఉంటామనే విషయాన్ని సగర్వంగా పునరుద్ఘాటిస్తారు. అందుకే ఇది చాలా చిత్రమైన ప్రదేశం. త్రిభాషా సంగమ ప్రదేశమనీ అనవచ్చు. కోలారు జిల్లా దక్షిణ, తూర్పు ప్రాంతాల్లో కన్నడ, తెలుగు, తమిళాల్లో; ఉత్తర, పడమటి ప్రాంతాల్లో తెలుగులో, కన్నడంలో మాట్లాడతారు. అయితే అన్ని చోట్లా తెలుగుదే ఆధిపత్యం. ఇప్పటికీ సామాన్యుల భావ వ్యక్తీకరణకు తెలుగు భాషే ఏకైక సాధనం. తెలుగు సాహిత్యం, ముఖ్యంగా జానపద సాహిత్యం చాలా ఎక్కువ. అదంతా తెలుగులోనే ఉంటుంది.

ఈ బృహత్ కార్యానికి విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వాల సహకారం లభించక పోవటానికి గల కారణం ఏమిటి?

జానపద గేయాల్ని భావితరాలకు అందించేలా పదిలపరచేందుకు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ పాలకులు ముందుకు రాకపోవటం పెను విషాదం. భౌగోళికంగా, పరిపాలన రీత్యా కోలారు జిల్లా కర్ణాటకలో ఉన్నందున జానపద గేయాల్ని అక్షరబద్ధం చేసి, దాని సొగసులు, ప్రత్యేకతల్ని భావి తరాలకు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ముందుకు రాలేదు. ఇక్కడి విశ్వవిద్యాలయం, విద్వాంసులు, కన్నడ పండితులకు తెలుగు భాష రానందున వారూ పట్టించుకోలేదు. ఒక జానపద గాయకుడు మరణిస్తే అతడిలో నిక్షిప్తమైన సాహిత్యం, సంస్కృతి, జ్ఞాపకాల వృక్షం కూడా అంతరించిపోతుంది. దాన్ని కాపాడుకోలేక పోతున్నామనేది ఆందోళన కలిగిస్తోంది. మిత్రుడు రాజకుమార్ సాయంతో ఈ ప్రాజెక్టు చేశాం. రూ.ఐదు లక్షల ఖర్చవుతాయని రంగంలోకి దిగితే చివరికి రూ.35 లక్షలుగా తేలింది. ఆయనకు తెలుగంటే చాలా ఇష్టం. భాషకు సేవ చేయాలనే సత్సంకల్పం, పూర్తి సేవాభిలాషతో ఇంత పెద్దమొత్తాన్ని సాయం చేశారు.

జానపద సాహిత్యం పదిలంగా ఉందా?

నాకు తెలిసినంత వరకూ తొంభై శాతం జానపద సాహిత్యం అంతరించి పోయింది. మేము నమోదు చేసింది కూడా మిగిలి ఉన్న సాహిత్య సంపదలో ఒక శాతం కంటే చాలా చాలా తక్కువ. శ్రీనివాసపురం మండలంలో కొన్ని గ్రామాలకు చెందిన వారి పాటల్ని మాత్రమే రికార్డు చేశాం. కోలారులోనూ, ఒకప్పుడు ఈ జిల్లాలో అంతర్భాగంగా ఉండి ప్రస్తుతం చిక్కబళ్లాపుర జిల్లాలో ఉన్న గాయకుల పాటల్ని అక్షరబద్ధం చేయాల్సి ఉంది. చేయాల్సింది కొండంత. చేసింది పిసరు కంటే చాలా చాలా తక్కువ. కేవలం చింత చెట్ల పైనే వేలాది పాటలున్నాయి. కోలారు జిల్లా చింత చెట్లకు నిలయం. దానికి ఆనుకుని ఉండే చిత్తూరు జిల్లాకూ అవి విస్తరించాయి. అద్భుతంగా పాడే, కళా ప్రదర్శనల్చిచ్చే కళాకారులు నా కళ్ల ముందే చాలా మంది కాలం చేశారు.

వాటి ఉదాహరణలు చెబుతారా?

కోణిగ కళాకారుడు హనుమంతు మూడేళ్ల కిందట మృతి చెందాడు. అతనితో ఆ కళ అంతరించి పోయింది. కోణిగ కళ అంటే చేతివేళ్ల మధ్య ఉంచుకున్న కొయ్య ముక్కల్ని ఒకదానికొకటి తాడించి శబ్దం చేస్తూ ఒక కర్ర చుట్టూ తిరుగుతూ పాట పాడే విచిత్ర కళ. వందలాది పాటలు అతనితోనే అంతరించి పోయాయి.

ఇప్పటి వరకూ ఈ సాహిత్యాన్ని ఎవ్వరూ అక్షరబద్ధం చేయలేదా?

ఒక్కరు డాక్టరేట్ చేశారు. కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయం రెండు, మూడు చిరుపొత్తాల్ని ప్రచురించింది. మొత్తం కోలారు జిల్లా జానపద సాహిత్యాన్ని ఎవ్వరూ, వివరణాత్మకంగా, సమగ్ర అధ్యయనం, అక్షరబద్ధం చేయలేదు. ఇది తెలుగు సంస్కృతికి పెద్ద లోటు. సరిహద్దు ప్రదేశంలోని ఇలాంటి విలక్షణ, విచిత్ర సాహిత్య సంగతుల్ని నిక్షిప్తం చేసుకున్న కళాకారులు కన్ను మూస్తే భవిష్యత్తులో తిరిగి పొందజాలం.

భారత సంస్కృతిని ఈ జానపదాలు కొత్త కోణంలో ఆవిష్కరిస్తాయన్నారు. ఎలా?

నేను చిన్నపుడు విన్న బీరప్ప అనే కళాకారుడి గేయ భావం అభిజ్ఞాన శాకుంతలాన్ని తలపిస్తుంది. శాకుంతలాన్ని కర్మ సిద్ధాంతంగా (ప్రీడిటర్మనేషన్ థియరీ) భావిస్తారు. బీరప్ప గేయం ఇతివృత్తం దీనికి పూర్తి విభిన్నం. అందులోనూ ఒక అమ్మాయి కొత్తగా పెళ్లి చేసుకుని అత్తవారింటికి వస్తుంది. బావి నుంచి నీళ్లు తీసుకెళ్లేటపుడు వేలి ఉంగరం జారి లోపలికి పడిపోతుంది. ఈ ఉంగరానికి విశేష లక్షణం ఉంది. నీళ్లల్లో నిమిషం ఉంటే కరిగిపోతుంది. ఆ అమ్మాయి తన గోడును చంద్రుడితో చెప్పుకున్నట్లు పాట సాగుతుంది. న్యాస్తుడా నెల బాలుడా...అంటూ. అత్తవారింటికి వచ్చి ఆరు దినాలైంది. ఇప్పుడు నా ఉంగరం బావిలో పడిపోయింది. నిమిషం ఉంటే కరిగి పోతుంది. చేపలు మాగన్నుగా ఉన్నాయి. అందువల్ల ఉంగరాన్ని అవి మింగలేక పోయాయి. బంగారం నాణ్యతను ఇరవై నాలుగు వన్నెలు(క్యారట్లు)గా గుర్తిస్తారు కదా. దాని ప్రకారం ఉంగరంలోని నాలుగు వన్నెలు నాగ లోకానికి, ఏడు వన్నెలు ఏటి పాలయ్యాయంటూ పోయిన ఉంగరం తిరిగి దొరకదని తన గోడును చందమామకు వినిపిస్తుంది. ఇది అభిజ్ఞాన శాకుంతలానికి విభిన్న కోణాన్ని ఆవిష్కరిస్తుంది. కర్మ సిద్ధాంతానికి తావు లేదంటోంది. ఇది గ్రామీణుల లౌకిక దృక్పథం. వారు నిరక్షరాస్యులు, ఏ విధమైన రాజ్యాధికారం లేని సామాన్యులు, అణగారిన వర్గాలకు చెందిన వారు కావటంతో వారి వాదనలకు సమాజంలో తావు, విలువ లేకుండా పోయాయి. భారత దేశపు సాంస్కృతిక అంతరాత్మను జానపద గేయాలు ఆవిష్కరిస్తాయి. అందుకే వీటిని అతి ముఖ్యమైన వనరులుగా భావిస్తాను.

జానపద గేయాల సమీకరణ, శుద్ధ ప్రతుల తయారీ గురించి చెప్పండి?

శ్రీనివాసపురం మండలంలోని కొన్ని గ్రామాలకు చెందిన నూరు మంది జానపద కళాకారులతో శిబిరాన్ని ఏర్పాటు చేశాం. మూడు వందల గంటల పాటు పాడిన పాటల్ని రికార్డు చేశాం. కొన్ని పాటలు పునరావృతమయ్యాయి. వాటిని తొలగిస్తే గట్టిగా ఐదు వందల పాటలు దొరికాయి. వాటిలో పన్నెండు పాటల్ని ఎంపిక చేశాం. విలక్షణం, మంచివి, కోలారు జిల్లా విశిష్టతను చాటి చెబుతాయనిపించే పాటల్ని ఎంపిక చేసి కన్నడలోకి అనువదించాను.

జానపద గాయకులతో కాకుండా సినీ గాయకులతో పాడించారు?

ఈ పాటలకు ఆంధ్ర, కర్ణాటక మారుమూలల్లో కూడా ఆదరణ లభించాలనేది మా ఆశయం. ఈ పాటల బాధ్యతను సినీ సంగీత దర్శకుడు హంసలేఖకు అప్పగించాం. ఆయన మాతృభాష తెలుగు. దేశీయ సంగీతంపై పరిశోధన చేస్తున్నారు. ఆ పాటల్లో ఉన్న జీవం, విలువ, విలక్షణ రూపం ఆయనకు బాగా తెలుసు. తెలుగు జానపద గాయకులు పాడిన పాటల్ని నేను కన్నడంలోకి అనువదించాను. గాయనీ, గాయకులు రెండు భాషల్లోనూ పాడారు.

పాటల విశిష్టతలేమిటి?

చిత్తూరు జిల్లా మాదిరే కోలారు జిల్లా జీవనం అంతా చెరువులపై ఆధారపడింది. మొత్తం దేశంలోకెల్లా అత్యధికంగా 4,800 చెరువులుండేవి. చెరువులతో జీవనాన్ని అనుసంధానం చేసే పాట కూడా ఉంది. ఆవని కొండపై ఆరు చినుకులు దిగితే కోలారు చెరువు కూత పెడుతుంది. చింతామణి చెరువు తనకు నీళ్లు రాలేదని చింతిస్తుంది. ముళబాగిలు చెరువు ముసగొడుతా ఉంటుంది. రాళ్లగుట్ట చెరువు రమ్మంటుంది. ఇలా చెరువులు మాట్లాడుకోవడం ఇతివృత్తంగా గీతం సాగుతుంది. ఒక విధంగా అది చెరువుల ఆత్మ ఘోష. నీళ్లు రాలేదనే

మా అమ్మ భాష తెలుగు. పుట్టింది పెరిగింది బెంగళూరులోనే. ఇంజనీరింగ్ పట్టభద్రుణ్ని అయినా స్థిరాస్తి వ్యాపారంలో స్థిరపడ్డాను. నా భార్య పుట్టిల్లు కోలారు జిల్లా. అక్కడికి వెళ్లి వచ్చేటపుడు ఒకసారి నారాయణ స్వామితో పరిచయమైంది. అద్భుతమైన తెలుగు జానపద సాహిత్యం కాలగర్భంలో కలిసి పోతోందని చెప్పారు. దాన్ని పదిలం చేసి భావి తరాలకు అందించేందుకు విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యా సంస్థలు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదని వివరించారు. ఆ పాటలు ఆయా కాలాల ఆచార, వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడుతాయి. నాటి చరిత్రకు దాఖలాలు. అటువంటి అపురూప సంపద కళ్ల ముందే కనుమరుగై పోతోంటే తీరని వ్యథకు గురయ్యాను. మొదటి నుంచి నాకు జానపద గేయాలంటే తీరని ఇష్టం. దేశం మనకేమి చేసిందనే దానికంటే మనం దేశానికి ఏమి చేశామన్నది ముఖ్యమని గట్టిగా భావించా. ఆర్థిక సాయాన్ని అమ్మభాషకు ఉడుతా భక్తిగా అందించా. అంతే. ఇదేదో ఘనకార్యంగా భావించటం లేదు. కోలారు జిల్లా తెలుగు జానపద గేయాల సీడీని ఆంధ్రప్రదేశ్‌లో విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. మా కృషిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తెలుగు విశ్వవిద్యాలయం, లేక మాకు దగ్గరగానే ఉన్న ద్రవిడ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాలూ మరింత ముందుకు తీసుకెళితే మా చిరు ప్రయత్నం ఫలించినట్లే

– రాజకుమార్

'జెంతియె'లం!

తెలుగు, తెనుగు, ఆంధ్రం... మన అమ్మభాష పేరేమిటంటే సాధారణంగా ఇవే చెబుతాం. కానీ... మన పలుకుకు మరో మూడు నామధేయాలూ ఉన్నాయి . అవి... వడగు, వడుగు, జెంతూ. ప్రాచీన తమిళ ప్రజలు తెలుగును 'వడగు, వడుగు'గా పిలిచేవారు. తెలుగు వారిని 'వడగర్' (ఉత్తర దేశస్థులని అర్థం). తమిళ భాషలోని అతిప్రాచీనమైన సంగ సాహిత్యంలోనూ ఈ పదాలను వాడారు. క్రీ.శ.15వ శతాబ్దంలో మన గడ్డపైకి వచ్చిన పోర్చుగీసు వారు మన భాషకు పెట్టుకున్న పేరు... 'జెంతూ'. అప్పట్లో వారు తమ గ్రంథాల్లో తెలుగు వారిని 'జెంతియె'లుగా పేర్కొన్నారు.

గోడును, నీళ్ల నిండిన చెరువుల సంతోషాన్ని వ్యక్తీకరిస్తుంది. ఈ ఊహే అద్భుతంగా ఉంది. వాన చినుకులు రాలటమే తరువాయి చెరువులు మాట్లాడుకోవటానికి ఉద్యుక్తమవుతాయనేదే విచిత్రమైన సంగతి.

మరో రెండు పాటల్లో దారి తప్పిన భర్తలకు భార్యలు బుద్ధి చెప్పటం. కంది కాసే కంది పూసే కందవారం చెరువు నిండే. నంది కొండ ముగిలు మేసెరా... అంటూ సాగే పాట. బాధ్యతారహితమైన భర్తను ఆక్షేపిస్తూ, హితవు పలికే పాట ఇది. మరో పాట చింతకొమ్మలొంగినాయి, చినుకులు పడినాయి, పోవద్దు మామా కోడి పందానికి, అనేది జూదరి భర్తకు సుద్దులు చెప్పే గీతం. చింత చెట్టు కొమ్మలు వంగటాన్ని అపశకునంగా భావిస్తారు. అన్ని నగలూ పోయాయి. పిల్లల్ని వెట్టి చాకిరీకి పంపారు. ఇంకేమి మిగిలిందని మళ్లీ పోతారని అడ్డుపడుతుంది. అయినా భర్త మాట వినడు, కుదువ పెట్టిన నగలన్నింటినీ విడిపించుకుని వచ్చేందుకు వెళ్లాలి అంటూ జూదానికి పోతాడు. ఇది యుగళగీతం.

ఈ గేయాలు ఏ కాలానికి చెందినవి?

జానపద గేయాలు ఏ కాలానికి చెందినవో గుర్తించటం కష్టం. చాలా పాతది అని మాత్రం చెప్పగలం. క్రీస్తుపూర్వం నుంచి ఇక్కడ తెలుగు, కన్నడాల్లో మాట్లాడేవారున్నారు. వారి మధ్య సంబంధాల కొనసాగింపునకు భాషలు ఏనాడూ సమస్య కాలేదు.

భవిష్యత్తు ప్రణాళిక ఏమిటి?

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వారికి దీన్ని పరిచయం చేసేందుకు ప్రయత్నిస్తాను. రసజ్ఞులకు కొంత రుచి చూపిస్తే ఆ తర్వాత విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వాలు, సాహితీ సంస్థలు, ఇతరులు దాన్ని అందిపుచ్చుకుని సమగ్ర అధ్యయనానికి సన్నద్ధం కాగలరని ఆశ. చాలా పెద్ద ప్రాజెక్టుగా కొనసాగాల్సిన నా ఆకాంక్ష. నా ఒక్కడి వల్లే అది సాధ్యం కాదు. చాలా మంది పని చేయాలి. కారణం, కళాకారుల్ని గుర్తించటమే కష్టతరమవుతోంది. అద్భుతంగా నేటికీ పాటలు పాడే వారికి తాము కళాకారులమనే స్పృహ కూడా లేదు. ఏవో నాలుగు పదాల్ని పాడుకునే తాము కళాకారులమెలా అవుతామనే సందేహం వారిని పీడిస్తూ ఉంటుంది. కళాకారుల గుర్తింపు పెద్ద సమస్య. గుర్తించిన తర్వాత పాడించాలి. అనకే వాటి విలువ తెలుస్తుంది. దీనికి బృహత్ ప్రణాళిక అవసరం. ఎవరైనా దీన్ని చేస్తామని ముందుకు వస్తే నాకున్న అనుభవంతో మార్గదర్శకాల్ని రూపొందిస్తాను. చాలా ఆసక్తి కూడా ఉంది. ఖర్చుతో కూడుకున్నది. ఎక్కువ వ్యవధి తీసుకునేవి. నేను ఎంపిక చేసిన ఐదు వందల పాటల్లో ఇంకా మూడు వందల పాటల్లో మాండలికాల్ని అర్థం చేసుకుని రాయాలి. ఆ అవగాహన కలిగిన వారు ఈ పని చేయాలి. ఐదు వందల పాటల్ని పుస్తకంగా ముద్రించాల్సి ఉంది. వీటిపై పరిశోధనలు సాగాలనేది మా కల. ఇప్పుడు మొదలు పెడితే మూడు, నాలుగేళ్లలో ముగుస్తుంది. ఏది ఏమైనప్పటికీ ఈ పని జరగాలి.

కె.ఆదినారాయణమూర్తి
స్టాఫ్ రిపోర్టర్, ఈనాడు,
బెంగళూరు.
09972513029

చూపులూ పక్షులూ

ఇదేమిటో వింతగా వుంది నాకు.
విసిరేసిన నా చూపులు
వెంటనే తిరిగొస్తున్నాయి.
గూళ్లలో నుంచి ఎగిరిపోయిన
పక్షులు
ఎక్కడెక్కడో విహరిస్తూ
మధ్యమధ్య కొమ్మలపైన
కాసేపు విశ్రమిస్తూ
ఎప్పుడో కానీ తమ గూళ్లకు
తిరిగిరావు.
నా చూపులూ అంతే
మబ్బులను పలకరించుకుంటూ
మెరుపులతో చేతులు కలిపి
ఎగురుకుంటూ
కురిసే వానలో తడుస్తూ
సరికొత్త అనుభూతిని సంతరించుకుంటూ
కళ్లు పిలిచినప్పుడు గానీ అవి
తిరిగిరావు.
ఇప్పుడలా కాదు
అవి ముందుకు వెళ్లకుండా
వెనువెంటనే తిరిగొస్తున్నాయేమిటి?
తమను కన్న
కళ్ల తల్లుల పట్ల వున్న
మాతృత్వబంధం
చూపులను వెనుకకు లాక్కొస్తున్నదేమో
మరి పక్షులకు ఈ సూత్రం వర్తించదా?
అంతగా కాదు.
పక్షులది స్వచ్ఛంద విహారం.
చూపులది నిర్దిష్ట సంచారం.
లక్ష్యరహిత దృక్ ప్రసారాన్ని
నేత్రాలు అంగీకరించవు.
అందుకే చూపు అనుకుంటుంది.
సందర్భ నియతి
సమయ పరిమితి.

డా॥ సి.నారాయణరెడ్డి
హైదరాబాద్. 040-24753724

అమ్మ ఎంతో

అమ్మభాషా అంతే!

దసరాబుల్లోడిగా తెలుగు వారి గుండెల్లో దశాబ్దాలుగా గూడుకట్టుకున్న మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు. బాల్యంలో బడికి దూరమైనా స్వయంకృషితో నాలుగు భాషల్లో పట్టు సంపాదించారాయన. అదొక్కటే కాదు... ఏ విషయం మీదనైనా గంటలకొద్దీ మాట్లాడగల జ్ఞానం, సామర్థ్యం ఆయన సొంతం. నేను చదువుకున్నదంతా సమాజం నుంచే... స్నేహితులు, సహచరుల నుంచే అనే ఆ పద్మవిభూషణుడు తాను నిత్యవిద్యార్థినంటారు. అమ్మభాష గురించి, అమ్మ గురించి తెలుగుదనం గురించి 'తెలుగు వెలుగు'తో ఆయన పంచుకున్న మనోభావాలను చదవండి....

ఎవరికైనా తొలి ఆసక్తి, ప్రాధాన్యం అమ్మ. తరువాత సొంత ఊరు. వ్యక్తి పరిధి పెరిగే కొద్దీ ఇదీ విస్తృతం అవుతుంది. సొంత జిల్లా, సొంత రాష్ట్రం, సొంత దేశం... ఇలా పెరుగుతుంది. అదే ప్రాధాన్యం అమ్మ నేర్పిన భాషకు కూడా ఇవ్వాలి. బడికి వెళ్లకముందే తెలుగు నేర్చుకుంటాం కదా! అదెలా వస్తుంది? బొడ్డుతాడు ద్వారా అమ్మ అందించే జీవంలోనే అదీ ఇమిడి ఉంటుంది. గర్భంలో ఉన్న పిల్లలకు గ్రహణశక్తి పెద్దవాళ్ల కన్నా చాలా ఎక్కువగా ఉంటుంది. అభిమన్యుడి కథ అదే కదా! అదే శాస్త్రీయంగానూ రుజువయ్యింది. అందుకే అంటాను అమ్మకిచ్చిన ప్రాధాన్యం అమ్మ భాషకు కూడా ఇవ్వాలని.

నేను భాషాద్రోహాన్ని సహించను. అమ్మను, గర్భంలో ఉండగానే అమ్మ నేర్పిన భాషను మర్చిపోవడం దారుణం. అది మాతృహత్యాపాతకంతో సమానం. నేను మా పిల్లలకు అదే చెప్పాను. ఇంట్లో ఇంగ్లిషు మాట్లాడితే దవడ పగిలిపోతుందని ఒక సారి హెచ్చరించాను. తరువాత వాళ్లెప్పుడూ ఇంట్లో ఇంగ్లిషు మాట్లాడలేదు. ఇక మనవ సంతానాన్ని నేను ఆదేశించలేను, చెబుతుంటానంతే. కానీ వాళ్లకు బళ్లో ఇంగ్లిషు తప్ప మరేమీ ఉండదు కదా!

నాకు ఇంగ్లిషు మీద కానీ మరొక భాష మీద కానీ ద్వేషమేమీ లేదు. పైగా చిన్నప్పటి నుంచి నాకెందుకో ఇంగ్లిషు నేర్చుకోవాలని చాలా కోరిక. మా ఇంట్లో చదువుకున్న వాళ్లెవ్వరూ లేరు. నా చదువూ నాలుగో తరగతితో ఆగిపోయింది. అయినా సమాజం అనే బళ్లో ఎంతో నేర్చుకున్నాను. ఇంగ్లిషే కాదు కొత్త విషయాలు నేర్చుకోవడమంటే నాకు చాలా ఆసక్తి, పట్టుదల. అదే నన్నీ స్థాయిలో నిలబెట్టింది. నేర్చుకోవడం ఆపితే ఆ రోజుతో మనిషి ఎదుగుదల ఆగిపోతుంది. నేర్చుకోవడం ఆపేసిన రోజున మనిషి చనిపోయినట్టే.

నాటకాలే నుడి నేర్పాయి

నేను సరిగ్గా చదువుకుంటానో లేదోనన్న అనుమానంతో మా అమ్మ నన్ను నాటకాల్లో చేర్పించింది. అది నాకు బతుకుతెరువుగా నిలుస్తుందని ఆవిడ ఆశపడింది. అదే నిజమయ్యింది కూడా. మా అన్నయ్య రామబ్రహ్మం నన్ను తండ్రిలా సాకారు. ఆయన సైకిల్ మీద కూర్చోబెట్టుకుని నన్ను రోజూ గుడివాడ తీసుకువెళ్లేవారు. అక్కడ ఎందరో మహానుభావుల శిష్యరికంలో పద్యాలు, సుదీర్ఘ సంభాషణలు పలకడం నేర్చుకున్నాను. నాటకాల్లో సంభాషణలు సాధన చెయ్యడం మంచి భాషా కసరత్తు కదా. అదే నా భాషకు తొలి పునాది. మంచి భాష మాట్లాడే వారి మధ్య ఉంటే మనకూ మంచి మాటలు వస్తాయి. నా భాష, వాచకం, ఉచ్చరణ నాటకాల వల్లే అభివృద్ధి చెందాయి. అక్కడే వి.మధుసూదనరావు, కోడూరి అచ్చయ్య గార్ల కంట్లో పడ్డాను. మధుసూదనరావు గారు నా వ్యక్తిత్వాన్ని, అచ్చయ్య గారు నటనను తీర్చిదిద్దారు.

తరువాత సినిమాల కోసం మద్రాసు చేరాను. అక్కడ మా పెద్దబ్బాయి, అమ్మాయిలను నా పలుకుబడి అంతా ఉపయోగించి చర్చిపార్కు బళ్లో చేర్పించాను. ఒక రోజు వాళ్లు ఏం చదువుతున్నారు, ఎలా చదువుతున్నారో తెలుసుకుందామని పిలిచి మాట్లాడా. అప్పుడే నేను నిర్ఘాంతపోయే విషయం తెలిసింది. వాళ్లకు బళ్లో తెలుగు లేదు! దాంతో ఆలోచనలో పడ్డాను. పిల్లలు బాగా చదువుకుంటారు సరే, రేపొద్దున వాళ్ల ఇంగ్లిషులో ఉత్తరాలు రాస్తారు. నేను, నా భార్య వాటిని ఎవరితో చదివించుకోం? పైగా వాళ్లకు తెలుగు రాకపోతే మన సంస్కృతి, సంప్రదాయాలు తెలిసేదెలా? అప్పుడే మన రాష్ట్రానికి వచ్చేయాలని గట్టిగా

నిర్ణయించుకున్నాను. నా శ్రీమతికి అది ఇష్టం లేదు. ఇక్కడ ఎంతో శ్రమపడి ఇల్లు కొనుక్కున్నాం. స్నేహితులు, సినిమాలు ఇక్కడే. వీటన్నింటినీ వదిలి వెళ్లడం ఎలా అన్నది ఆవిడ సంకోచం. అప్పుడు భాషే అక్కరకు వచ్చింది. రోజులు మారాయి చిత్రంలో కొసరాజు రాసిన పాట ఉంది... 'ఇల్లుకట్టేదొకడు... ఇంటనుండేదొకడు / చెట్లు నాటేదొకడు... పళ్లు మెక్కేదొకడు/ పాటంతా ఒకడిది... ఫలితమింకొకడిది...' అనుకుంటా. పాడి వినిపించా. అప్పుడు సమాధానపడింది.

నడిచే విశ్వవిద్యాలయాలతో సావాసం

ఒక సారి నన్ను అమెరికాలోని మిచిగన్ స్టేట్ యూనివర్శిటీ వాళ్లు ముఖ్యలతిథిగా పిలిచారు. నాటకం, సినిమా, టెలివిజన్ రంగాల శిక్షణలో ఆ విశ్వవిద్యాలయం చాలా పేరుపొందింది. అంతకు ముందోసారి అమెరికా వెళ్తూ తమిళం తెలిసిన కుక్స్ అనే అమెరికన్‌ను తోడు తీసుకెళ్లాను. దాన్ని శివాజీ గణేశన్ తప్పు పట్టాడు. నువ్వు మంచి అవకాశాన్ని కోల్పోయావురా. ఇంగ్లిషు రాదని తెలిసే పిలిచారు వాళ్లు. దాన్నేమీ నువ్వు నామోషీగా అనుకోనక్కర్లేదు. మన చరిత్రంతా వాళ్లకు తెలుసు. అయినా పిలవడం మనకొక డిగ్రీ లాంటిది. నీ రంగంలో నువ్వు ప్రముఖుడివి. అంతే. కానీ ఇంగ్లిషు నేర్చుకోవడానికి ఇదో మంచి అవకాశం అని చెప్పాడు. ఈసారి 60 రోజుల పర్యటన. మొదటి 15 రోజులు పొడి పొడి ఆంగ్ల మాటలతో గడిపేశాను. కానీ శివాజీ మాటలు మనసులో మెదుల్తూనే ఉన్నాయి. అందుకే ఎవరు ఎలా మాట్లాడుతున్నారన్నది నిశితంగా గమనిస్తూ ఉన్నా. చివరికి ఆ రోజు రానే వచ్చింది. 11 వేల మంది విద్యార్థులున్నారు అప్పుడు. వాళ్లను ఉద్దేశించి మాట్లాడాలి. ధైర్యం చేసి మాట్లాడేశా. అంతే అప్పటి నుంచి ఇంగ్లిషు మీద బెరుకుపోయింది. తర్వాత బాగా సాధన చేశాననుకోండి.

మనమేదో గొప్పవాళ్లం అనుకుంటూ ఉంటాం. కానీ ఎంత చిన్నవాణ్నో విదేశాలకు వెళ్లొచ్చాక తెలిసింది. నేను సంపాదించుకున్న భాష, జ్ఞానం ఇవన్నీ నాటకాలు, సినిమాలు ఇచ్చినవే. లేకపోతే నాలో ఏముంది? దాదాపు 35 మంది అద్భుతమైన రచయితలతో పని చేశాను. వాళ్లు రాసింది చదివి, అర్థాలు తెలుసుకుని నటించాను. అలా నేర్చుకున్నాను. నా అదృష్టం ఏంటంటే మొదటి నుంచి నేను అటువంటి వారి మధ్యలో ఉండగలగడం. గుడివాడలో మధుసూదన రావుగారు కానీ, అచ్చయ్య గారు కానీ. మద్రాసులో బలిజేపల్లి లక్ష్మీకాంతకవి, గోవిందరాజు, గిడుగు సీతాపతి, వేదాంతం రాఘవాచార్య, ఘంటసాల బలరామయ్య, గూడవల్లి, దైతా గోపాలం, పారేపల్లి సుబ్బారావు, ఓగిరాల రామచంద్రరావు... వీళ్ళతోనే నా సావాసం, 24 గంటల సాహచర్యం. వాళ్ల చర్చల్లో తెలిసే విషయాలు ఏ విశ్వవిద్యాలయాల్లో నేర్పగలరు? భాషా పరిజ్ఞానం, భావ పరిజ్ఞానం ఉన్నవారి మధ్య నేను పెరిగాను. ఎదిగాను. చెప్పాను కదా నాకు విషయ పరిజ్ఞానం మీద ఆసక్తి అని. ప్రపంచంలో వైద్యులు చేసే శస్త్రచికిత్సలన్నీ చూశా. ఎందుకంటే తెలుసుకోవడం కోసం. ఏమీ తెలియని నాబోటి వాడికి తెలుసుకోవడానికి

ఇవన్నీ కారణభూతాలు. ఇదంతా విద్యార్థి దశే అనుకుంటాను.

నా జ్ఞానమంతా వినికిడిదే. పత్రికలవీ చదువుతాను. కానీ నిజానికి చదవడం నాకు ఆసక్తి కలిగించదు. చూసి తెలుసుకుంటాను. ఎవరైనా కొత్త విషయాలు చెబుతుంటే చాలా ఉత్సాహంగా, ఆసక్తిగా వింటాను. అప్పుడు ఎంత ఏకాగ్రత చూపుతానంటే ఒకసారి వింటే మర్చిపోను. 50ల్లో చేసిన చిత్రాల్లోని సంభాషణలు కూడా చాలా భాగం నాకు గుర్తే. పైగా అప్పటి రచయితలు ఎంతో ప్రభావవంతంగా రాసే వాళ్లు. చిన్న చిన్న పదాల్లో ఎంతో లోతైన అర్థంతో ఉండేవి. అందువల్లే అవి గాఢంగా నాలో ఇంకిపోయాయి. వాటికి సంబంధించి జరిగే సుదీర్ఘ చర్చల్లో పాల్గొనడం వల్లా ఎన్నో విషయాలు తెలిసేవి.

ఫొటోలు: వసంత్ ఘంటసాల

సినిమాలంటే చులకన వద్దు...

సినిమాలు భాషాభివృద్ధికి ఉపయోగపడతాయి. వాటిలో నేర్చుకున్న వారికి నేర్చుకున్నంత. అందుకు నేనే ఉదాహరణ. ఇప్పుడు బూతులు వస్తున్నాయంటారు. నిజమే. ఒకప్పుడూ ఉండేవి... కానీ గుంభనంగా, సున్నితంగా. భాషా పండితులకు తప్ప ప్రేక్షకులకు అందులో బూతేముందన్నది అర్థం అయ్యేది కాదు. కాకపోతే ఇప్పుడు పచ్చిగా ఉంటున్నాయి. కొన్ని సందర్భాల్లో గీతాల్లోనూ సంభాషణల్లోనూ అసభ్యత ఉన్నప్పుడు నేను నటించడానికి నిరాకరించే వాడిని. వాటిని మార్పించేవాడిని. నవరసాల్లో శృంగారమనేది ఒక అద్భుత ప్రక్రియ. మిగిలిన రసాలు అడపాదడపా. అలా అని హద్దులు చెరిపేసుకోలేం కదా! సమాజంపై ప్రభావం చూపించే వ్యక్తులు పనుల్లో, పలుకుల్లో జాగ్రత్తగా ఉండాలన్నది నా సిద్ధాంతం.

నాకు బాగా నచ్చిన రచయితలంటే సముద్రాల రాఘవాచార్యులు, ఆత్రేయ. సముద్రాల భాష అద్భుతంగా ఉండేది. అలా అలా చాలా అలవోకగా జారిపోతాయి పదాలు. మనం పెద్దగా నటించాల్సిన అవసరం లేదు. వాటినలా చెబితే చాలు ప్రేక్షకులకు ఎక్కేస్తుంది. భావ ప్రధానం అంటే ఆత్రేయే! నటించడానికి ఎంతో అవకాశం ఉండేలా రాస్తారాయన. చాలా భావగర్భితంగా ఉంటాయి ఆయన పదాలు, సంభాషణలు. నా చిత్రాల్లో భాష ప్రాధాన్యం గురించి చెప్పాలంటే 'విప్రనారాయణ' గురించే చెప్పాలి. ప్రతి పదమూ అద్భుతమే. అంత చక్కటి భాష లేకుంటే ఆ చిత్రం అంత ప్రజాదరణ పొందేది కాదేమో అనిపిస్తుంది. నా దర్శకుల్లో భాష విషయంలో వేదాంతం రాఘవయ్య, సి.ఎస్.రావు చాలా పట్టింపుతో ఉండేవాళ్లు. చిన్న చిన్న పదాల విషయంలోనూ ఎంతో శ్రద్ధగా, జాగ్రత్తగా ఉండేవారు. సంఘర్షణ ఉన్నప్పుడే పట్టు ఉంటుంది. అదున్నప్పుడే గుర్తు కూడా ఉంటుంది. కథానాయికల్లో భానుమతి, సావిత్రి, జమునలకు తెలుగుపై మంచి పట్టు ఉండేది.

ప్రభుత్వమే నడుం కట్టాలి!

మనది అద్భుతమైన భాష. ఏదైనా ఉపయోగించుకోవడంలో ఉంటుంది. 'అంతా మీ దయ' ఉన్నదంటే... దాన్ని ఎన్ని అర్థాల్లో, ఎన్ని రకాలుగా వాడవచ్చో చూడండి! ఇది చాలా చాలా చిన్న ఉదాహరణ.

చెప్పానుగా నేను పెద్దగా చదవను. అయినా అన్నీ తెలుసుకుంటూ ఉంటాను. ఇప్పటి రచనల్లో కొత్తదనం ఉండటం లేదని నాకనిపిస్తోంది. అందుకే చిరస్థాయిగా నిలిచిపోయేవి రావడం లేదు. యువతను ఆకట్టుకోలేకపోవడానికీ అదే కారణం కావచ్చన్నది నా భావన.

భాషాభివృద్ధి కోసం ప్రభుత్వమే నడుంకట్టాలి. ప్రభుత్వ స్థాయిలో జరిగితేనే ప్రభావవంతంగా ఉంటుంది. వాటి ఫలితాలూ తొందరగా కనిపిస్తాయి. విద్యా వ్యవస్థలో ప్రమాణాలు దిగజారిపోయాయి. భవిష్యత్తు తరాలపై ఇది ప్రభావం చూపుతోంది. తెలుగు నేర్చుకోమంటే వేరే భాషల్ని వదిలెయ్యమనో, ద్వేషించమనో కాదు. మనది విశ్వభాష కాదు కాబట్టి తప్పనిసరిగా ఇంగ్లిషు నేర్చుకోవాలి. అదే కాదు ఇంకా కొన్ని భాషలూ నేర్చుకున్నా మంచిదే. ఎందుకంటే జ్ఞానం కోసం. అసలు అమ్మభాషను సరిగ్గా నేర్చుకోవాలనే పట్టుదల లేకపోతే మిగతా విషయాలు ఏం నేర్చుకుంటాం? ఎంత జ్ఞానం సంపాదించినా అమ్మను మర్చిపోం కదా! ఎందుకంటే మనం బుద్ధి జీవులం కాబట్టి.

ఇంద్రియాణి పరాణ్య అహుర్
ఇంద్రియేభ్యః పరం మనః
మనసస్తు పరః బుద్ధిర్
యో బుద్ధేః పరతస్తుః సహః

చలనం లేని ప్రకృతి కంటే చలనం ఉన్న ఇంద్రియాలు గొప్పవి. ఇంద్రియాల కంటే మనసు గొప్పది. దానికంటే మంచిచెడ్డలు తెలిసిన బుద్ధి గొప్పది. అలాంటి బుద్ధి ఉంది కాబట్టే ప్రాణికోటిలో విశిష్టంగా ఉన్నాం. అలాంటి మనం అమ్మను, అమ్మ భాషను మరచిపోకూడదు.

- తెలుగు వెలుగు బృందం

ఆహ్వానం

ఏదైనా శుభకార్యానికి ఇలాంటి సృజనాత్మక ఆహ్వానాన్ని మీరూ రూపొందిస్తే... దాన్ని మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. ఎంపికైన ఆహ్వానానికి చక్కని బహుమతి ఉంటుంది. తెలుగు సమానార్థకాలు లేకపోతే తప్ప అందులో ఆంగ్ల పదాలు ఉండకూడదు, తాజా ఆహ్వానం అయి ఉండాలన్నవి నిబంధనలు.

అవధుల్లేని ఆనందాలు...!

ప్రత్యూష

వెంకట్

ఎట్టకేలకు నూతన ప్రయాణానికి తోడు దొరికింది...

ఉపయోగించినవి	:	3 గిన్నెల ప్రేమ, 2 గరిటెల అనురాగం, కొద్దిగా క్షమాపణలు, 2 చెంచాల అభిమానం, చిన్ని ఆశ, చారెడు ఆనందం, పరిమితిలేని స్నేహం.
తయారీ పద్ధతి	:	ప్రేమ, అనురాగం బాగా కలపి, క్షమాపణలను రంగరించి, అభిమానాన్ని చల్లి, అంతులేని స్నేహంతో ఆనందపు ఆశల్ని అలంకరించాలి.

మా ఈ వివాహ వేడుకలను తీపి గుర్తులుగా మారుద్దాం రండి ...!

వధువు : కోటి సూర్య ప్రత్యూష

వరుడు : లక్ష్మివెంకటేశ్వరరావు

మీ రాకతో ఈ ఆనందం పెరగాలి.

ప్రదీప్ 8790771888

శ్రీమతి / శ్రీ

....

....

....

వివాహ సమయం : 27-10-2012 శనివారం రాత్రి 10.31*

వివాహ వేదిక : శ్రీ లక్ష్మీనారాయణ ఆర్యవైశ్య కళ్యాణమండపం, బ్రాహ్మణ వీధి, విజయవాడ-1.


కనులు నాలుగు రెండయినాయి, రెండు మనసులు ఒకటయినాయి.
రెండు మనసులు ఒకటిగా చేసే వివాహ సప్తపది...

కన్యాదానం	:	దానం కాదిది, అపురూపంగా పెంచుకున్న తన ప్రియ రంజనిని మంత్ర పూర్వకంగా అల్లుడికి ఇచ్చే కన్యాదాత కానుక
సుముహూర్తం	:	చుక్కలు పాడే శుభమంత్రం, దిక్కులు నిండే దివ్యమంత్రం
మాంగల్యధారణ	:	సత్వ, రజ, తమో గుణ సంకేతంగా "నాతిచరామి" అంటూ వరుడి వేసే మూడుముళ్ల బంధం
సప్తపది	:	"నింగి సాక్షి, నేల సాక్షి, నిను వలచిన నా మనసే సాక్షి" అంటూ ఏడు జన్మల అనుబంధానికి గుర్తుగా ఏడు అడుగులు నడిచే అగ్నిసాక్షి
తలంబ్రాలు	:	ప్రేమ, అభిమానంతో సహజీవనం సాగిద్దాం, బాధ్యతలకు తల వంచుదాం అంటూ వధూవరులు చేసుకునే ప్రణయ వేడుకలు
అరుంధతి	:	నక్షత్ర సమూహమున అరుంధతిలా, నారి లోకంలో ధృవతారలా వెలగాలని వధువుకు వరుని సూచన
అప్పగింతలు	:	వధువును ప్రేమగా చూసుకునే బాధ్యత వరుడిదే కాదు, "మీ కుటుంబ బాధ్యత" అంటున్న కన్యాదాతల కనుల చెమరింతలు

ప్రేమఅర్చన

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

శ్లో॥ జానక్యాః కమలామలాంజలిపుటేయాః పద్మరాగాయితాః ।
న్యస్తారాఘవమస్త కేచవిలసత్కుంద ప్రసూనాయితాః ।
స్రస్తాశ్యామలకాయకాంతికలితా యా ఇంద్రనీలాయితాః ।
ముక్తాస్తాశ్శుభదా భవంతు భవతాం శ్రీరామ వైవాహికాః

మా కనిష్ఠ పుత్రుడు
చి॥ ప్రేమ్ కుమార్ కు
చి॥ల॥సౌ॥ అర్చన ని
(విశాఖపట్నం వాస్తవ్యులు శ్రీమతి లక్ష్మి & శ్రీ సత్యం హరి గారు (పార్లమెంట్ సభ్యులు) ల కనిష్ఠ పుత్రిక)
ఇచ్చి వివాహము జరుపుటకు పెద్దలు నిశ్చయించినారు. కావున తాముల్లరు సకుటుంబ,
బంధు మిత్ర పరివార సమేతముగా విచ్చేసి వధూవరులనాశీర్వదించి మమ్మానందింపజేయ ప్రార్థన.

సుముహూర్తం : స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ నందన నామ సంవత్సర ఆశ్వీయుజ బహుళ తదియ గురువారం అనగా తేది 1-11-2012 రాత్రి 10గం. 10 ని.లకు రోహిణి నక్షత్రయుక్త మిథున లగ్నమందు

కళ్యాణవేదిక : ఎ.ఎస్. రాజా గ్రౌండ్స్, ఎమ్.వి.పి. కాలనీ, విశాఖపట్నం

విందు : తేది 1-11-2012 గురువారం రాత్రి గం॥ 7.30ల నుండి కళ్యాణవేదిక వద్ద.

శ్రీ సద్గురు శివానందమూర్తి గారి దివ్యాశీస్సులతో

బంధు మిత్రుల అభినందనలతో...

అక్షర శిల్పులు

'అకారం' ఆకారం దాల్చింది. 'వకారం' వన్నెలు చిలికింది. 'నకారం' నగిషీలద్దుకుంది. ఒంపుసొంపుల తెలుగక్షరాలన్నీ వర్ణశోభితాలయ్యాయి. దేశ విదేశాల కళాభిమానుల హృదయాలను దోచుకున్నాయి.

అక్షరాల్లో వర్ణించలేని ప్రతిభ... అక్షరాలనే అందమైన చిత్తరువులుగా మార్చేసే ప్రజ్ఞ... అది ఆ కళాకారుల సొంతం. మనవైన అక్షరాలను మనదైన చేనేత కళతో శోభింపజేస్తోంది ఒకరైతే, తెలుగు వర్ణమాలతో వర్ణచిత్రాలకు రూపమిచ్చేది మరొకరు. వారే పద్మశ్రీ గజం గోవర్ధన, జొన్నలగడ్డ నిరంజన్, ఎస్.శ్రీరాములు. 'దస్తకరి హత్ సమితి' ఆధ్వర్యంలో ఇటీవల దేశ రాజధానిలో జరిగిన 'అక్షర' కళాకృతుల ప్రదర్శనలో వీరు ప్రదర్శించిన హస్తకళా రూపాలన్నీ తెలుగు లిపి అందచందాలను లోకానికి చాటాయి.

భారతీయ భాషల ప్రాముఖ్యతను, వాటి లిపుల సొగసును కళారూపాల్లో ప్రపంచానికి చూపాలన్న ఉద్దేశంతో ఈ ప్రదర్శన నిర్వహించారు. ఆయా భాషల అక్షరాలనే డిజైన్లుగా ఉపయోగిస్తూ రూపొందించిన అద్భుతమైన కళాఖండాలను అక్కడ ప్రదర్శించారు. పదహారు రాష్ట్రాల నుంచి వచ్చిన 58 మంది కళాకారులు ఇందులో పాల్గొన్నారు. వీరి సృజనల్లోనూ అందరి దృష్టినీ ఆకర్షించింది మన రాష్ట్రవాసుల పనితనమే. మన తెలుగక్షరాల సౌందర్యమే.

'గుండ్రని మన తెలుగు అక్షరాలతో ఎలాంటి ఆకృతినైనా అందంగా మలచవచ్చు. గీతలతో ఉండే ఆంగ్లం, దేవనాగరి లిపులకు ఆ సౌలభ్యం లేదు. అక్షర వృక్షం పొందిన ప్రశంసలకు మూలం మన అక్షరాల వయ్యారమే'

– నిరంజన్

భాషకు నీరాజనం

రా-మ-చి-లు-క... ఈ అక్షరాలన్నింటినీ కలిపి 'రామచిలుక'కు ప్రాణం పోశారు. 'పూల రంగులెన్నో' చెప్పడమే కాదు ఆ అక్షరాలతోనే పూలను, వాటి రంగులనూ చూపించారు. శ్రీకాళహస్తికి చెందిన జొన్నలగడ్డ నిరంజన్ హస్తనైపుణ్యానికివి చిన్న ఉదాహరణలే. కలంకారీ వస్త్రాల రూపకల్పనలో నిరంజన్ కుటుంబానిది తరతరాల అనుభవం. వస్త్రాలపై రామాయణ, మహాభారత ఘట్టాలను అందంగా చిత్రిస్తూ, వాటి మధ్యలో... అడుగున ముఖ్యాంశాలను లిఖించే విధానం నుంచి స్ఫూర్తి పొందారాయన. మొత్తంగా తెలుగు అక్షరాలతోనే చిత్రాన్ని రూపొందించాలనుకున్నారు. కలంకారీ వస్త్రంపై 'అక్షర వృక్షా'నికి ప్రాణప్రతిష్ఠ చేశారు. ఈ వృక్ష శాఖలు, ఆకులు, పూలు, పండ్లు అన్నింటినీ అక్షరాలతోనే మలిచారు. 'కూకూమనే వసంతకాల కోకిల', 'నిండు ముత్తైదువ ముఖానికి నింపుకున్న పసుపు లాగా' తదితర చిన్న చిన్న మాటలు, వాక్యాలతో మంచి ఆకృతులను సాధించారు. పర్యావరణాన్ని కాపాడమనే సందేశాన్ని ఉంచారు. 'అక్షర' ప్రదర్శనలో ఈ కళాఖండాన్ని చూసిన బెల్జియం ప్రదర్శనశాల ప్రతినిధులు... ఇదే చిత్రాన్ని పెద్ద పరిమాణంలో వేసి ఇస్తే తమ ప్రదర్శనశాలలో దాన్ని శాశ్వతంగా ఉంచుతామని చెప్పారు. ఇతర భాషల లిపులను ఉపయోగించి

ఆయా రాష్ట్రాల కళాకారులు రూపొందించిన సృజనలన్నింటినీ పరిశీలించి వారు దీన్ని ఎంపిక చేసుకున్నారు. ఇదీ మన తెలుగు సొగసు.

దారాల వయ్యారాలు!

స్మిత్ కళాశాల (మసాచుసెట్స్, అమెరికా సంయుక్త రాష్ట్రాలు) స్నాతకోత్సవ సంబరాలు. నాలుగు వందల మంది విద్యార్థులకు పట్టాలు, జ్ఞాపికలతో పాటు 24X 72 అంగుళాల ఓ వస్త్రం కూడా అందజేస్తున్నారు. ఆ వస్త్రంపై చూస్తే... 'అ', 'ద', 'స', 'డ', 'గ'... అన్నీ తెలుగు అక్షరాలే. ఆశ్చర్యంగా ఉందా! త్వరలో జరగబోయే ఘట్టమే ఇది. మన అక్షరాలున్న వస్త్రాలను అమెరికా విద్యార్థులకు బహుమతిగా ఇవ్వడమేంటని అనుకుంటున్నారా... అదంతా గజం గోవర్ధన 'చేతి' చలువ.

రాష్ట్ర చేనేత కళకు ప్రపంచ ఖ్యాతి తెచ్చిన ఘనత గోవర్ధనది. 'పద్మశ్రీ' బిరుదును సాధించిన నైపుణ్యం ఆయనది. 'అక్షర' ప్రదర్శన కోసం ప్రత్యేకంగా సిల్కు స్టోల్‌ను రూపొందించారు గోవర్ధన. దానిలోని దారాలతోనే తెలుగు అక్షరాలకు రూపమిచ్చారు. అంగుళానికి 85 దారాలు చొప్పున ఉండే వస్త్రంలో అంతర్భాగంగానే 102 అక్షరాలను సృష్టించారు. (వస్త్రంపై రంగులతో ముద్రించకుండా) 'టై మరియు డై' విధానంలో దీన్ని రూపొందించారు. ఈ వస్త్రాన్ని ఏ కోణంలో, ఎటువైపు నుంచి చూసినా అక్షరాలన్నీ స్పష్టంగా కనపడతాయి. అదీ ఒక కళాకృతిలాగా దర్శనమిస్తాయి. ఈ ప్రత్యేకతతో పాటు, మన అక్షరాల ఆకృతికి ముగ్ధులైన స్మిత్ కళాశాల ప్రతినిధులు... ఈ స్టోల్స్‌ను తీసుకున్నారు. అలాగే కర్ణాటకకు చెందిన ఓ ప్రముఖ వ్యాపార సంస్థ కూడా వాటిని తయారు చేసివ్వమని అడిగింది.

అనంతపురం జిల్లా నిమ్మలకుంటకు చెందిన ఎస్. శ్రీరాములుది మరో శైలి. ఆయన తోలుపై రామాయణంలోని ముఖ్య ఘట్టాలను చిత్రించారు. పక్కనే తెలుగులో వ్యాఖ్యానం రాశారు.

నాలుగేళ్ల కిందటే అక్కడక్కడ తెలుగు అక్షరాలతో ఉన్న చీరలను రూపొందించా. అయితే... పూర్తి స్థాయిలో అక్షరాలు మాత్రమే ఉన్న వస్త్రాన్ని తయారు చేయడం ఇదే ప్రథమం. భవిష్యత్తులో ఇదే పద్ధతిలో తెలుగులో భగవద్గీత శ్లోకాలు, వాటి తాత్పర్యాలు ఉండే వస్త్రాలను రూపొందించాలనుకుంటున్నా. దేవనాగరి లిపిలో ఈ పొడవైన దుస్తులను తయారు చేస్తే అందంగా ఉండవు. అడ్డగీతలే కనిపిస్తాయి. పాతకాలంలో మన తెలుగునూ కలిపిరాతలో రాసేవారు. దాన్ని ఉపయోగించుకుంటే అందమైన డిజైన్లను ఎన్నో చేయవచ్చు.

- గజం గోవర్ధన

ముచ్చటేస్తోంది

తెలుగు లిపిలోని గుండ్రని అక్షరాలను చూసినప్పుడల్లా ఓ అందమైన చిత్రాన్ని చూసిన అనుభవం కలుగుతుంది. తెలుగు కళాకారుల 'అక్షర' ప్రతిభ చూసి సందర్శకులు ఆకర్షితులయ్యారు. వైవిధ్యభరితమైన మన దేశ భాషల లిపులకు కళల్లో ప్రత్యేక స్థానమివ్వాలనే ఉద్దేశంతోనే ఈ ప్రదర్శన నిర్వహించాం.

– జయాజైట్లీ, రాజకీయవేత్త, 'అక్షర' నిర్వాహకురాలు

సహకారం:
సురేష్ చెల్లుబోయిన, ఈనాడు, న్యూఢిల్లీ

తెలుగు హాస్యానికి ఒరవడి దిద్దిన హాస్యబ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావు తెలుగు భాషపై చేసిన ప్రసంగం సంక్షిప్త రూపం ఇది. ఉపోద్ఘాతం కూడా ఆయన మాటల్లోనే...

మన తెలుగు

(6.8.1938 తారీఖున తెలుగుదేశంలో ప్రసిద్ధి చెందిన రాజమండ్రి గౌతమీ గ్రంథాలయపు 40వ వార్షికోత్సవ సందర్భంలో ఆంధ్రవిశ్వకళాపరిషత్తు ఆధ్వర్య ప్రతినిధిగా రెండవసారి ఉంటూ దేశదేశాంతరాల్లో ప్రఖ్యాతులైన శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి గారి అధ్యక్షతన జరిగిన సభలో ఈ ప్రసంగం చాలావరకు అయింది. ప్రసంగం 'మన తెలుగు' యొక్క స్థితి గతుల గురించి. 'మన' అనే మాట మన భాషలోనే ఉందిట. మన మతంలాగే మన భాష కూడా చాలా సమష్టి కుటుంబం. చెప్పేదాంట్లో తెలుగుభాష యొక్క విశేషాలు గనక మీకు స్ఫురణకొస్తే అవి 'మన' తెలుగులోనివే అన్నీ, లోపాలు గాని కనపడితే అవి 'నా' తెలుగువన్నీ అనుకోండి. ఇది నా హృదయంలో ఉండటం చేత మీ సెలవు ప్రకారం పైకి చెప్పుకుంటూన్న బాధే కాని ఉపదేశం అని మాత్రం మీరు ఎంచకండి. ఉపదేశం చెయ్యడానికి నాకు అర్హత లేదు. అసలు దేశంలో బలం ఉంటేగాని ఉపదేశంలో బలం ఉండదు.)

భాష అంటే సంస్కారం పొందిన ధ్వని. భాషలు ధ్వనులు. భాషల గురించి చెలరేగే వాదప్రతివాదం కోలాహలం. ఒక దేశాన్నించి మరో దేశానికి మానవులు ఏ వర్తకం నెపం మీదో ప్రయాణాలు మాననంతకాలం భాషలకి సంపర్కం మానదు. సరిహద్దుల్లో బహుభాషా సంపర్కం తప్పదు. సంపర్కం ఉండటంతోబాటే సంబంధం, సాంగత్యం, సాంకర్యం, సంఘటన మొదలైన వాటిల్లో ఏదైనా ఏర్పడవచ్చు. కొత్త మనుషుల్ని మన నెత్తినెక్కించుకోవడానికి మనం ఒప్పుకుని వాళ్ళ భాష మన నెత్తి మీదిది కాదనుకోవడం అజ్ఞానం.

ఇపుడు నూటికి నూరు మంది పైచిలుకు మాట్లాడే తెలుగు కలగాపులగమే. ఈ పులగంలో సంస్కృతం, పార్శీ, ఇంగ్లీషు మాత్రం జోరుగా పడ్డాయి. తెలుగు యొక్క మెత్తదనం వల్ల ఇన్నిన్ని భాషల పదాలూ బాణాల్లాగా హృదయంలో నాటేలాగ తెలుగులో గుచ్చుకుపోయి ఉన్నాయి. తెలుగు శరీరంలో వాటిని నిలిచి ఉండనిస్తే అవి సెలలు వేసి ప్రాణం తీసేస్తాయని కొందరు, లేక వాటిని పైకి లాగి పారేస్తే వెంటనే ప్రాణం పోతుందని కొందరూ! అప్పట్లో సంస్కృతానికున్న మన్నన బట్టీ, సంస్కృతాన్ని పరిపూర్ణంగా తెలుగులిపిలో రాయడానికుండే వీలును బట్టీ, తెలుగు వాళ్ళకి ఇహపర సాధనాలైన శాస్త్రాలు సంస్కృతంలో ఉండబట్టీ, ఎన్నో సంస్కృత పదాలు ఆ పళంగానే తెలుగైపోయాయి. తెలుగులోంచి వాటిని ఇప్పుడు తీసెయ్యడం ఎలా? తురక రాజ్యకాలంలో వేషం, అలంకారం, ఆభరణాలు, కచేరీలు, కౌలుఖత్తులు లాంటి వాటికి సంబంధించిన పదాలు వందలాదిగా తెలుగై పోయాయి. వాటిని ఇప్పుడు చెడనాడు కోవడం ఎలా? అట్లానే కుంపిణీ రాజ్యం జోరబడ్డ లగాయితు ఇంగ్లీషువాళ్ళు ఏదో జీవితావసరం అనిపించే నూతన సౌకర్యం -- స్టీమరు, రోడ్డు, పోస్టు, టెలిగ్రాఫు, ఎలెక్ట్రీ (అనే చాలామంది తెలుగువాళ్ళు అనగ్రలు) నీళ్ళపైపు, కాఫీ హోటలు, మిల్లులు, సైకిలు, మోటారు, ఎయిరోప్లేను, గ్రామొఫోను, సినిమా, టాకీ, రేడియో (ఇకముందు టెలివిజన్, యీధర్‌ప్లేన్) లాంటివి తెచ్చి తెలుగువాళ్ళల్లో పారేస్తుండటం, ఒక్కొక్క పట్టు ఓ పాతికేసి ఇంగ్లీషు మాటలు మన కళ్ళ ముందు తెలుగై పోతుండటం ఎరుగుదుం. వీటిని ఇప్పుడు అప్రయత్నంగా బడిలో కెళ్ళి ఇంగ్లిషు చదివి ఉండని తెలుగువాళ్ళంతా కూడా వాడతారు. తెలుగు సంభాషణలోకి ఆ రీతిగా ఎక్కి బైటాయించిన ఇంగ్లీషు మాటల్ని ఇప్పుడెలా తీసెయ్యడం? మచ్చ మాయడం అంటే మాటలా! ఏ కర్మం వల్లో ఒకే మహాప్రవాహంలో మనుష్యులు పడ్డప్పుడు, వాలుకేసి ముఖం పెట్టిన వాళ్ళనీ, ఎదర కేసి ముఖం పెట్టి గుంజుకునే వాళ్ళనీ ఉభయుల్నీ కూడా ఆ ప్రవాహం వాలుకేసే ఈడ్చుకుపోయి గిరవాటెడుతుంది. ఎటొచ్చీ వాలుకేసి తిరిగిన వాళ్ళు కాస్త సజావుగా వెళతారు. ఎదర కేసి తిరిగిన వాళ్ళు వెల్లకిలా పడతారు.

ఆ మీదట ఒకటి జరిగింది. కేవలం తెలుగు కాకుండా మరొక భాష గాని, విషయం గాని బాగా తెలిసి ఉంటే తప్ప ఉద్యోగం డబ్బూ లేని ఒక తెలుగువాణ్ణి ఆంధ్రేతరులూ, ఆంధ్రులు కూడా ఒక పండిత మాత్రుణ్ణిగానైనా లెక్కకట్టడం మానేశారు. కాలక్రమాన 'విద్య' అన్నా, 'చదువు' అన్నా 'పాండిత్యం' అన్నా ఆదిని సంస్కృతంలోనే అనిన్నీ, పదపడి ఇప్పట్లో ఇంగ్లీషులోనే అనిన్నీ అనుకునేటంత వ్యామోహం తెలుగువాళ్ళల్లో ప్రబలింది. పురాతన విజ్ఞానం ధరించినదవడం చేత సంస్కృతానికి జ్ఞానులు మొదటి వోటు ఇచ్చారు. పిదప వచ్చిన రాజకీయ పరివర్తనం వల్ల పార్శీకి మోజు ఉండేది. 'దేశ భాషల తీరు లేమియు గావు, పారశీకోక్తులు ప్రణుతికెక్కు' అని తిమ్మకవి దుఃఖించాడు. దరిమిలా ఇంగ్లీషు వెలిసింది. మొదట్లో గుమాస్తా గిరీ విషయంలో అవసరమై, నేటి వరకూ అది అల్లానే ఉండగా, అక్కణ్ణించి, లోకంతో వ్యవహరించే విషయంలో, నవీన విజ్ఞానాభివృద్ధి గమనించే విషయంలో, నవ్య ప్రపంచ రాజకీయ పరిస్థితి గుర్తెరిగే విషయంలో, వేదశాస్త్రాల్లో ఏముందో చెప్పిన



దొరల పుస్తకాలు చదువుకోవడం విషయంలో, నూతన శాస్త్ర పరిశోధనల వల్ల తేలిన సారాంశాల ప్రయోగం వల్ల మానవుల ఐహిక సౌఖ్యాభివృద్ధికి తోడ్పడే అపూర్వ సాధనోపాయాలు అవగాహన చేసుకుని లాభం తియ్యడం విషయంలో, ఇంగ్లిషు ప్రాణావసరం అయిపోయిందని చాలామంది ఒప్పుకుంటారు. అందుకని, దేశావసరమైన పూర్వపు సంగతులు యావత్తూ సంస్కృతంలో ఉండటం వల్ల అవి నేర్చుకోవడానికి తెలుగు అక్కర్లేనట్టే, నేటి ప్రపంచం తెలుసుకోవటానికి తెలుగు అక్కర్లేదు.

విచారణ చేస్తే సంస్కృతం దేవలోకభాష. ఇంగ్లిషు భూలోక భాష, ఉర్దూ యోధలోకభాష. ఉర్దూ అంటే యోధులు విడిచే స్థలం అని అర్థం. యుద్ధానికి పురికొల్పే సమయంలో వివిధ భాషల యోధులకీ ఉర్దూ భాషలోనే హెచ్చరికోపన్యాసం ఇస్తూంటారని చెబుతారు. మరి తెలుగో! ఇది ప్రస్తుతం గొప్ప తెలుగు వాళ్ళ పట్ల పనికిమాలిందిలాగ ఉన్న భాష. మహా అంటే దీన్ని గానభాష అనచ్చు. అందుకనే అరవలు తెలుగు కీర్తన్లూ జావళీలూ నేర్చి తెలుగువాళ్ళకి శ్రవణానందం చేసి సొమ్ము చేసుకుంటారు. వీటివల్ల వాళ్ళకొచ్చే ఆదాయం చూస్తే 'అరవలు తెలుగు పాటలు అర్థం చేసుకోలేరు' అని విచారించే వాళ్ళు అర్థం చూడకుండా పోతున్నారన్నమాట. ఈ మధ్య తెలుగువాళ్ళు అరవల్ని ఏదో అన్నారని అరవలంతా ఏకమయ్యారు. ఎందెందులో ఎవరెవరు ఏకమైనా అసలు మెచ్చతగ్గదే! ముందుముందు వాళ్ళు చేసే పాట కచేరీల్లో త్యాగయ్య కీర్తనలు పాడడం మానెయ్యదల్చు కున్నారని వదంతి. అది నిజమైతే, వాళ్ళు త్యజించేది త్యాగయ్యని గనక అందరూ సరిగ్గా (త్యాగయ్య - త్యాగయ్యర్ - త్యాగయ్యెర్స్ట్ సూత్ర ప్రకారం) త్యాగయ్యర్లు అయి ఊరుకుంటారు.

ఏతావాతా, తెలుగులో విద్య నేర్చినవాడికీ తక్కిన తెలుగువాడికీ మానసికంగా చాలా దూరం అయిపోయింది. కేవలం తెలుగువాడైన వాడికి ఉండే భావాలు అభిప్రాయాలు అసలైన భావాలూ అభిప్రాయాలే కావని విద్యాధికుడైన తెలుగువాడు అనుకునే కర్మం తెలుగుదేశానికి పట్టింది. అందుకని అభిప్రాయాలు గల తెలుగువాడూ అంటే మానసికంగా ఇంగ్లిషు భాషలోనో, సంస్కృత భాషలోనో, ఉర్దూ భాషలోనో -- తెలుగు తప్ప మరొక భాషలో -- ఆలోచన కానిచ్చుకునే తెలుగువాడు అని తెలుస్తోంది. కాబట్టి, తెలుగు విద్యాధికుడికి స్వంతానికి తెలుగు అవసరం లేదు. స్నేహితులు కలిసినప్పుడు గొప్ప తెలుగువాళ్ళు తెలుగులో మాట్లాడుకోరు. అదీ యిదీ ఏదీ కాని 'ఎంగిలీషు'లో ముచ్చటించుకుంటారు. కొందరు తీరా తెలుగైతే వీధెంట వెళ్ళేవాడూ "ఇదిట్రా! అబ్బాయి తెలివీ!" అని తమ సంగతి కనిపెట్టేస్తాడేమో అని. కొందరికి అలవాటు. కొందరికి నైసర్గికం. కొందరు తమ అన్యభాషా భావానికి తెలుగులో -- తమ తెలుగులో -- పదాలు అసలేలేక. కొందరు దేశవాళీ అవడం చేత. కొందరు తమరికి వచ్చినా మెచ్చేవాళ్ళు లేరనే దుగ్ధ కొద్దీ! బజారు చెయ్యడానికి గొప్ప తెలుగువాడు వెళ్ళనే వెళ్ళడు గనక తెలుగు అక్కర్లేదు. వెళ్ళినా ఓ యాభై మాటలు ఎక్కీతక్కీనూ! కాఫ్యాలయానికి వెళితే ఉప్మా సాంబార్ లాంటి అరవం, అరకప్పు అరప్లేటు లాంటి ఇంగ్లిషు చాలు, తెలుగు అక్కర్లేదు. కోర్టుల్లో కొంతవరకు సంభాషణ తెలుగుని జరుగుతుంది గాని, అది ఆంగ్లంలో పెడితే తప్ప తెలుగు ఫిర్యాదీ హృదయబాధ ఏమిటో న్యాయమూర్తిగారి తలకెక్కదు. సభల్లో, ఈ మధ్య ఒక్కరవ్వ మరీ తరుచుగా, ఉపన్యాసాలన్నీ తెలుగులోనే ఉండాలని మహ చెడ్డ పట్టుపడుతున్నారు. కాని ఆ పట్టబట్టే వాళ్ళల్లో కొందరు ఇంగ్లీషు మాట్లాడుతూ "తెలుగు ఓన్లీ టెలుగు, యూ మస్ట్! మస్ట్!" అని కేక వేసే తెలుగువాళ్ళు ఉంటూంటారు. ఇక బళ్ళల్లో తెలుగు! బడి అంటే ఇంగ్లిషు బడి. గుమస్తాల్ని తయారు చేసే నిమిత్తం ప్రభుత్వం వాళ్ళు తమ భాష నేర్పే బళ్ళు. అక్కడ పఠించే విషయాల్లో తెలుగు ఒక విషయం. వాళ్ళ ధర్మమా అని, ఆ విషయాల్లో ఏ రెండో భాషగానో తెలుగుని ఉంచారు గనగ గాని, లేకపోతే చాలామంది తెలుగువాళ్ళు తెలుగు అక్షరాలేనా చూడకుండా పెరిగి ఉండేవాళ్ళు.

తెలుగువాళ్ళల్లో ప్రతీవాడూ ఇంగ్లిషు చదవాలని గాని, చదివితే తమకి ఉద్ధరింపనిగాని, చదవకపోతే తమకి అరిష్టం అనిగాని, ఇంగ్లిషువాళ్ళు చెప్పా లేదు, ఏడవా లేదు. ఇంగ్లిషు సారస్వత చరిత్రలో ఇంగ్లిషు పండితులైన తెలుగువాళ్ళ పేర్లు ఎక్కుతాయని నమ్మడానికి



వీలు కనిపించదు. తెలుగు తండ్రులే కోరుకుని, తమ సంతానం పాలితులైన తెలుగువాళ్ళల్లో చిక్కడిపోకుండా పాలకులైన ఇంగ్లిషు వాళ్ళ వర్గంలో చేరితే లాభమూ గొప్పా కదా అని వాళ్ళకి ఇంగ్లిషు చెప్పించారు. కానీ చావగొట్టి ఏదీ చదివించలేం. చావగొట్టినా తల్లిభాష రానివాళ్ళకి వచ్చినా పరభాష రాదు. అందుకని, ఏమీ అక్కర్లేదు, మీద పెడితే సరి. తప్పకుండా వస్తుంది. రావడమే కాదు. ఇది మా భాషే మేం వదలం అంటారు.

తెలుగుకి ఏ స్థానం ఇచ్చి, తెలుగు యొక్క అపరిమితమైన వాడకం తెలుగువాళ్ళందరికీ తప్పనిసరి అయ్యే సందర్భాలు ఏవేవి కలిగిస్తే యుక్తమో మొదట చూసుకోవడం తెలుగువాళ్ళ ధర్మం. అప్పుడు తెలుగులోనే వివిధ సంస్థల నిమిత్తం వివిధ పరిభాషలు ఏర్పడాలి. తెలుగు మతగ్రంథాల్లోని పరిభాష, తెలుగు జ్యోతిషాది గ్రంథాల్లో పరిభాష, తెలుగు న్యాయస్థానాల్లో పరిభాష, తెలుగు రాజకీయంలో పరిభాష, తెలుగు పాఠశాలల్లోని పరిభాష... ఈ రీతిగా. అక్కణ్ణించి ఈ శాఖల్లో వాడుతుండే తెలుగూ, నిత్యకృత్యాలకి ఉపకరించే పామరుల తెలుగూ వ్యత్యాసంగా

ఉండడం, పారిభాషిక పదాల్లోంచి కొన్నొచ్చి సంభాషణలో పడడం, సంభాషణలోంచి కొన్ని పదాలు వెళ్ళి ప్రత్యేక స్పష్టార్థాల్తో పారిభాషిక పదాలుగా వెలవడం, ఇలా ఇచ్చిపుచ్చుకోవటాలు జరగడం, అది ఉభయతారకంగా పరిణమించడం, తెలుగుదేశం యొక్క జ్ఞానం క్రమంగా ఒక్కొక్క మెట్టే ఎక్కడం సంభవించవచ్చు.

అందుకని ముందు నా తెలుగుకి, నా భాషకి నేను నా హృదయంలో ఉచిత స్థానం ఇస్తాను. నేను తెలుగుని గౌరవిస్తాను, మన్నిస్తాను, ఆరాధించి సేవిస్తాను.

నిను సేవింపగ నాపద ల్పొడమనీ
నిత్యోత్సవం బబ్బనీ
జనవఖ్రిత్రుం డననీ మహాత్ముడననీ,
సంసారమోహంబుపై
కొననీ, జ్ఞానము గల్గనీ, గ్రహగతుల్
గుందింపనీ, మేలువ
చ్చిన రానీయవి నాకు భూషణములో
శ్రీకాళహస్తీశ్వరా!

అని ధూర్జటి దీక్ష తెచ్చుకుని "శ్రీయాంధ్రభాషేశ్వరీ" అనుకుంటాను. నేను తెలుగు వాడతాను, ఉపయోగిస్తాను, పలుకుతాను. ప్రాణహాని వగైరా తెచ్చే వ్యవహారాటంకం కలిగేటప్పుడు రెండో పక్షంగా ఇతర భాషలు -- వాట్లకి తలవంపులు రానీకుండా -- పడుతూంటాను గాని, దీన్ని సేవిస్తూ కూచుంటే **నాకు కిట్టుతుందా కిట్టదా అని బేరం చేస్తూ అఘోరించను.** గొప్పవాళ్ళయిన నా తెలుగు వాళ్ళెవరయినా నా తెలుగు వినిపించుకోకపోతే నేను బాధపడను. ఎప్పటికైనా తెలుగుకి అర్హత, అవసరం, గణ్యత, గౌరవం వస్తాయని విశ్వసిస్తాను. తెలుగులో ఆలోచించి, తెలుగు జనాన్ని జ్ఞాపకం ఉంచుకుని, తెలుగు హృదయం నుంచి అభిప్రాయం తెలుగులో చెపితే తెలుగుజనం ఆలకించి తీరతారు అనే ధైర్యంతో ఉంటాను. అప్పుడు వాళ్ళకి కూడా నాకు కలిగిన చిత్తవృత్తి లాంటిది కలిగితీరుతుందని విశ్వసిస్తాను. స్వతంత్ర రచన తెలుగులో లేదని చెప్పేవాళ్ళ అంతమాట అనవలసిన అర్హులు కారని తలుస్తాను. సంస్కృత విజ్ఞానసారాన్ని ఆంధ్రభారత స్రవంతి ద్వారా పూర్వమే మనకి అందచేసిన నన్నయ తిక్కనాదుల్ని జ్ఞప్తికి తెచ్చుకుంటాను. భగవంతుణ్ణి ప్రత్యక్షంగా చూసి మరీ మాట్లాడాడా అనిపించే పోతన్నని తల్చుకుంటాను. సంస్కృతవాణితో చెట్టాపట్టాలు పట్టించి తెలుగు తల్లిని యావత్తు తెలుగునాటా దిగ్విజయంగా ఊరేగించిన శ్రీనాథుణ్ణి స్మరిస్తాను. మూడు వరసజన్మల్లో ఒకే పాత్ర యొక్క అనుభవాలు రాయగలిగిన సూరన్నని, బ్రహ్మ సరస్వతుల పవిత్ర శృంగార చేష్టలు వర్ణించి ఎక్కడికి పూర్తయిన చేష్టలు నేర్చుకుంటాను. అందానికీ, అలంకారానికీ కూడా వాటిని తెచ్చుకుంటాను, నాకిష్టం అయితే. అయితేనేం? నా తెలుగు నా తల్లి భాష, నా తల్లి హృదయం, నా తల్లి మనస్సు, నా తల్లి. నా తల్లిని నేను మన్నించడం వల్ల నాకు లాభమా, నష్టమా అని తర్కించను. **నేను జంతువుల్లో జమ అయిపోకుండా ప్రప్రథమంలో నా జిహ్వలో ప్రవేశించి, నా ముఖతా పైకొచ్చి, తద్వారా నా జన్మ సార్థకపరిచిన ఏ తెలుగు భాష అయితే ఉందో, ఆ తెలుగు తల్లిని నేను -- ఈ జన్మ ఎలాగూ చాలదు పరభాషాదత్త అయింది గనక,-- ఎన్ని జన్మలెత్తి సేవిస్తే ఆవిడ ఋణం తీరుతుందో కదా అని ఆదుర్దా** అక్కడికి గుచ్చెత్తి బ్రహ్మ చేత చిలక్కి కధగా చెప్పించి సరస్వతి చేత కథకి అర్థం చెప్పించి కవిబ్రహ్మ సంకల్పించింది అక్షరాలా భూమి మీద జరుగుతుందని చూపించిన సూరన్నని, చలవ-వెన్నెల - అందం - సౌరభం - కోమలత - మధురత్వం అనేవి తెలుగు తల్లి లక్షణాలని ఇన్ని లక్షణాలూ గల మాటల్లో అనేసిన సూరన్నని, ముందుకి ఒక భాషలోనూ వెనక్కి మరో భాషలోనూ ఏకకాలమందే నడవగలిగిన సూరన్నని, నవ్యశాస్త్ర పరిజ్ఞాతలు ఇంతవరకు ఇంకా కనిపెట్టలేకుండా ఉన్న అద్భుతాలు వెనకే ఊహించేసిన సూరన్నని మరీ మరీ స్మరిస్తాను. అతి సులువుగా అపార ఐహికాముష్మిక జ్ఞానం ఆటవెలది ముఖతా పలికించిన వేమన్నని నెమరికి తెచ్చుకుంటాను. తెలుగు యొక్క గౌరవ ప్రతిష్ఠలు ఎక్కడ తగ్గిపోతాయో - అన్యభాషాహతం అయి తెలుగు తన సత్వాన్ని ఎక్కడ పోగొట్టుకుంటుందో - తెలుగులో కామధేనువు ల్లాంటి పదాలు ఎక్కడ వట్టిపోతాయో - ఏ చిన్న తెలుగుపదం ఎక్కడ ఉండడం వల్ల జీవిస్తుందో - ఏ పదాలు ఏ క్రమంలో సర్దుకుని కూర్చినవాణ్ణీ నేర్చినవాణ్ణీ కూడా ఉభయులూ అనుకోని భావం దగ్గరికి ఎగరదీసుకుపోగలవో- రకరకాల నవీన విజ్ఞానాన్ని తెలుగులో ఎలా పాకించడమో - తెలుగు జిహ్వ పెట్టిపుట్టడాన్ని ఏమేమిటి అనేసి సఫలం చేసుకోవాలో - అంటూ తెలుగు గురించి తెగ తాపత్రయపడిపోతూ, ఇహంలో మెప్పు మాట గాని డబ్బు మాట గాని, పరంలో మోక్షాశ గాని తెలుగు వల్ల ఉండవు అని అనుభవంలో తెలిసి కూడా, కాళ్ళట్టుకు ఈడ్చేస్తున్నా చూరట్టుకు వేలాడుతూ, తెలుగులోనే జీవిస్తూ, తెలుగే వాడుతూ, వారి చిత్తవృత్తులకి తెల్చుక్కీ తాదాత్మ్యం ఆరోపించుకుని తెలుగులోనే ఆలోచిస్తూ, వారి హృదయనాళాల మీది నొక్కులు తెలుగు వల్ల కలిగాయి అనుకుని, వారి పెదవులు తెలుగు అనడానికే దేవుడు చేశాడనుకుని, తెలుగు భాషా సంప్రదాయాన్ని ఇన్నాళ్ళ నుంచీ నిలబెట్టుకుంటూ వచ్చిన తెలుగు అధ్యాపకులందరికీ తెలుగు పండితులందరికీ తెలుగు రచయితలందరికీ - అంతకంటె ముందు ఇతరులై పుట్టినా సోదరులైన బ్రౌన్, గెలెటీ వంటి వాళ్ళకీ - నమస్కారం చేసి, ఒక్క క్షణం ఆగి, వెనక్కి చూసి, మరీ ప్రత్యేకంగా...

తెలుగదేల యన్న దేశంబు దెలుగేను
దెలుగు వల్లభుండ దెలుగొకండ
యెల్ల నృపులు గొలువ యెఱుగవే బాసాడి
దేశభాషలందు దెలుగు లెస్స!

అనే మృదువైన మాటలు గంభీరమైన భావంతో అనగలిగిన 'సాహితీ సమరాంగణ సార్వభౌము'డైన కృష్ణదేవరాయల్ని సవినయంగా తల్చుకుని, ఎంత చెడ్డా నేటివరకూ తెలుగుని యథాశక్తిగా నేర్చినా నేర్చకపోయినా పోషించు కొస్తూన్న తెలుగు రాజాల్ని మెచ్చుకుని...

తెలుగు దేశం స్వతంత్రం అయి దేశంలో ఉండే గొప్ప సంస్థల్లో తెలుగు విస్తరించి, తెలుగు వాళ్ళల్లో గొప్పవాళ్ళు తెలుగుని లేవనెత్తి, దాన్ని మొదట విధిగా హృదయంలోనూ, వీలైతే కంఠంలోనూ, అధమం శిరస్సు మీదా పెట్టుకున్నప్పుడే తెలుగు యొక్క ప్రతిభా, తెలుగు యొక్క వ్యక్తిత్వం తెలుగు యొక్క జీవం సిద్ధిస్తాయని ఆశిస్తాను.

- తెలుగు వెలుగు బృందం

అదేంటి

తెల్లని మడిలో నల్లని విత్తులు;
చేతితో దున్నడం, నోటితో చల్లడం.

లోకరీతికి వ్యతిరేకంగా ఊహించడాన్ని అపార్థకల్పన అంటారు. అలాంటి కల్పనతో కూడిందే ఈ పొడుపు కథ. సాధారణంగా మడి(సాగు భూమి) నల్లగానూ, విత్తనాలు తెల్లగానూ ఉంటాయి. కానీ ఇక్కడ తెల్లని మడి అంటే కాగితం అని అర్థం, నల్లని విత్తులు అక్షరాలు! రాయడాన్ని దున్నడంతోనూ, చదవడాన్ని విత్తులు చల్లడంతోనూ పోల్చారు. అక్షరసేద్యం అన్న మాటకు తరచూ వింటూ ఉంటాం. రాసిన అక్షరాలని వేరొకరికి పంపే సాధనాల పైనా ఓ పొడుపుకథ ఉంది : తోకలేని పిట్ట /తొంభై ఊళ్లు తిరిగింది (ఉత్తరం)

భవిష్యత్తుపై ఏదీ భరోసా?

"తెలుగును చదివినా.. చదవకపోయినా ఒక్కటే. ఇలాంటప్పుడు ఎవరైనా ఎందుకు చదువుతారు? ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సింది ఒక్కటే. భాషాభివృద్ధిని వ్యవస్థీకృతం చేయాలి. ఎవరెవరు వ్యక్తిగతంగా కృషి చేసినా.. దాని ఫలితం నామమాత్రమే. అదే ప్రభుత్వం దీనిపై చిత్తశుద్ధితో దృష్టిపెడితే ఫలితం అపారం."

డా॥ మన్నం గోపీచంద్
ప్రముఖ హృద్రోగ నిపుణులు,
స్టార్ హాస్పిటల్స్, హైదరాబాద్,

తెలుగు భాష పాఠశాలల్లోగానీ, కళాశాలల్లోగానీ ఎందువల్ల ఆదరణకు నోచుకోవడం లేదు? అన్న ప్రశ్న కంటే కూడా.. అసలు మన జనంలో ఎక్కువ మందికి తెలుగు భాష అంటే ఆసక్తి ఉందా? తెలుగును మాట్లాడగలిగేవాళ్లు, రాయగలిగేవాళ్లు, చదవగలిగేవాళ్లు ఎక్కువవుతున్నారా? తక్కువవుతున్నారా? అన్నది ఆలోచించాలి. ఒక్కసారి ఆ గణాంకాలను పరిశీలిస్తే అర్థమవుతుంది.. ఇంగ్లిష్ వైపు ఎంతగా ఆకర్షితులవుతున్నారనేది. మధ్యతరగతి, దిగువ తరగతి కుటుంబాలు తమ పిల్లల్ని ఆంగ్ల భాషలో చదివించడం వైపే మొగ్గుచూపుతున్నారు. ఎందుకంటే 'ఇంగ్లిష్ భాషలో చదువుకుంటే అవకాశాలు ఎక్కువుంటాయి.. విదేశాలకు పంపించొచ్చు.. మా వాళ్లు గొప్పవాళ్లవుతారు.. పిల్లల భవిష్యత్తు బాగుంటుంద'నేది తల్లిదండ్రుల ఆలోచన. అలా తల్లిదండ్రులు ఆలోచించడంలో తప్పులేదు. అలాంటి భావనను మన వ్యవస్థ కల్పించింది. ఇది ఒక్కరోజులో వచ్చింది కాదు. కొన్నేళ్లుగా వ్యాపిస్తూ వచ్చింది.

నేటి తరానికి సాహిత్యం మీద అవగాహన ఎంతుంది? పోతన, శ్రీనాథుడు వంటి కవుల రచనలు ఈనాటి తరానికి ఎంత మేరకు తెలుసు? శ్రీకృష్ణదేవరాయలు తెలుగు భాష గొప్పదనాన్ని కాపాడటానికి నడుం కట్టాడు కాబట్టే సాహిత్యం అంతగా గుబాళించింది. అష్టదిగ్గజాలు వెలుగొందారు. మృదుమధుర కావ్యాలు వెలువడ్డాయి. ఇప్పటికీ వాటి మాధుర్యం తగ్గలేదు. ఎప్పటికీ తగ్గదు కూడా. దానికి కారణమేంటని ఒక్కసారి ఆలోచిస్తే.. రాయలే. వ్యవస్థీకృతంగా సాహిత్యానికి స్థానం కల్పించారు కాబట్టే ఈనాటికీ ఆ కావ్యాలను స్మరించుకుంటున్నాం. మరి ఇప్పటి పరిస్థితికి అన్వయించుకుంటే.. నాటి కృష్ణదేవరాయలంటే నేటి ప్రభుత్వం. తెలుగు భాషాభివృద్ధి కోసం ప్రభుత్వం ఏం చేస్తోంది? తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు మంత్రిత్వ శాఖ ఉన్నా.. ఆ మంత్రికి భాషపై ఎంత అభిమానముంది? ఆ శాఖను చూసే ముఖ్య కార్యదర్శికి అసలు తెలుగు భాషపై పట్టుందా? దీనికి నిధులు ఎంత మేరకు సమకూరుస్తున్నారు? భాషాభివృద్ధి కోసం ఎలాంటి ప్రణాళికలు రూపొందిస్తున్నారు? అవి కిందిస్థాయి వరకూ అమలుపర్చడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు? తెలుగులో చదువుకున్నా మా పిల్లల భవిష్యత్తుకు ఢోకాలేదన్న నమ్మకం ఎక్కడుంది?

ఇక్కడో విషయం చెబుతాను.. మా అమ్మాయిని పదో తరగతి వరకూ తెలుగు భాషను చదువుకోమని ప్రోత్సహించా. తెలుగులో బాగా చదవగలదు. రాయగలదు. ఇంటర్‌లోకి వచ్చేసరికి సంస్కృతం తీసుకుంటానంది. ఎందుకమ్మా అంటే.. తెలుగులో మార్కులు ఎక్కువగా రావట! సంస్కృతంలో అయితే మార్కులు బాగా వేస్తారట.. పైగా సంస్కృతం పరీక్షను ఇంగ్లిష్‌లో కూడా రాయొచ్చట.. నాకు 90 శాతానికి పైగా మార్కులు రావాలంటే సంస్కృతం తప్పదని వాదించింది. నేనూ జవాబు చెప్పలేని పరిస్థితి. అయినా ఇదేం పద్ధతి? ఎందుకిలాంటి పరిస్థితి కల్పించాలి? తెలుగులో రాస్తే ఎక్కువ మార్కులెందుకు వేయరు? వేయాలి. ప్రోత్సహించాలి. సంస్కృతాన్ని ఇంగ్లిష్‌లో రాసే అవకాశమెందుకు ఇవ్వాలి? ఈ దౌర్భాగ్యం మన దగ్గరే. అదే తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో వారి మాతృభాషను నేర్చుకోకుండా.. అక్కడ చదువుకోవడం అసాధ్యం. మన రాష్ట్రానికి వచ్చేసరికి ఇక్కడ తెలుగు భాషను ఐచ్ఛికంగా మార్చారు. తెలుగును చదివినా.. చదవకపోయినా ఒక్కటే. ఇలాంటప్పుడు ఎవరైనా ఎందుకు చదువుతారు?

ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సింది ఒక్కటే. భాషాభివృద్ధిని వ్యవస్థీకృతం చేయాలి. ఎవరెవరు వ్యక్తిగతంగా కృషి చేసినా.. దాని ఫలితం నామమాత్రమే. అదే ప్రభుత్వం దీనిపై చిత్తశుద్ధితో దృష్టిపెడితే ఫలితం అపారం. అందుకని ప్రభుత్వమే భాష అమలు, అభివృద్ధిని వ్యవస్థీకృతంగా అమలు చేయాలి. తెలుగు సాహిత్యాన్ని పాఠ్యాంశాలుగా బోధించాలి. తెలుగులో చదివినా సరే.. పోటీ పరీక్షల్లో, ఉద్యోగ ఇంటర్వ్యూల్లో తమ పిల్లలు తట్టుకుని నెగ్గుకురాగలరనే ఆత్మవిశ్వాసాన్ని పెంచాలి. భవిష్యత్తుకు ఇబ్బంది లేదనే భరోసా ఇవ్వాలి. అది మళ్లీ రావాలంటే ఓ తరం పట్టొచ్చు. కానీ ఇప్పటి నుంచైనా మొదలుపెడితే వచ్చే తరం వరకైనా మార్పు రావొచ్చు. పాఠశాలలు, కళాశాలల్లో.. కనీసం ఇంటర్మీడియట్ వరకూ తెలుగును తప్పనిసరి చేయాలి. తెలుగు భాషపై పీహెచ్‌డీలు చేస్తున్నవారికి, సంస్కృతిని కళారూపంలో ప్రదర్శనలు ఇస్తున్నవారికి స్కాలర్‌షిప్‌లు ఇస్తూ ప్రోత్సహించాలి. ఇంటర్మీడియెట్ వరకూ తెలుగును కనీసం ద్వితీయ భాషగానైనా చదువుకున్నవారికి ఉన్నత చదువుల్లోగానీ.. ఉద్యోగావకాశాల్లోగానీ ప్రాధాన్యం ఇచ్చేలా ప్రభుత్వం బాధ్యత వహించాలి. ఇవన్నీ ఆలోచించకుండా బలవంతంగా అమలుచేద్దామని ప్రయత్నించినా ఆచరణలో సాధ్యం కాదు.

అహంతు రావణో నామః

రావణుడి అంతఃపురమది.

మండోదరి గాత్రం నుంచి సన్నగా ప్రారంభమైన పాట ఆ రాత్రిని మెల్లగా వెలిగింపజేస్తోంది. పాట స్థాయి తన వల్ల పెరిగినా తగ్గినా రావణుడు ఏమంటాడో అన్నట్లు వాయువు అక్కడ ఇబ్బంది పడుతోంది. ఆ ఇబ్బంది తాను చూడలేనన్నట్లు దీపమూ తల దించుకుని పాట వింటోంది.

శయ్యపై విలాసంగా రావణుడు బాహువులను అటు ఇటు చాచి కూర్చుని ఆ క్షణాలను ఆస్వాదిస్తున్నాడు.

పాట సాగుతూ ఉండగా, రావణుడు వీణను అందుకుని, మండోదరికి అందించాడు. ఆమె పాడుతూనే - వాయించమని అతనికి సైగ చేసింది. తలను చిన్నగా కాదన్నట్లు ఊపుతూ వీణను ఆమెకే అందించాడు. ఆమె నవ్వుతూ తీగను మీటుతూ పాటను కొనసాగించింది. ఆ నవ్వు పాడే పాటలో కలిసి - ఆపై మీటే వీణస్వరం రాగాన్ని దాటిపోయింది. గమనించిన రావణుడు చిన్నగా కదిలాడు.

అతడి కుడిచేయి మండోదరి చెక్కిలిని నిమిరింది. ఎడమ చేయి వీణను శ్రుతిలో పెట్టింది. మండోదరి పాటను ఆపేసింది. ఏమిటన్నట్లు వీణ తీగను మీటుతూనే కనుబొమ్మలతో ప్రశ్నించాడు రావణుడు.

"స్వామీ, మీ వీణ నాదం ముందు, ఎవరి పాట కూడా రాగానికి చేరువ కాలేదు. ఎందుకంటే ఆ రాగం కూడా మిమ్మల్ని ఎప్పుడో వరించింది." అంది మండోదరి.

గట్టిగా నవ్వాడు రావణుడు. "మండోదరీ, పొగడటం స్త్రీలకు నప్పదు - పొగిడించుకోవడం మాత్రమే నప్పుతుంది. అది వారికి అలవాటు కూడా- కదా..!" అన్నాడు.

"స్త్రీల ప్రకృతి మీకు బాగా తెలుసు. అందుకే పదునాలుగు లోకాల్లో అందమైన పడతులందరూ మీ మోహజాలంలో చిక్కొన్నారు."

ఆమె కళ్లలోకి చూశాడు రావణుడు. అవి తెల్లగా విశాలంగా మెరుస్తున్నాయి. "స్త్రీల ప్రకృతి నాకు తెలియదు. నా ప్రకృతి నాకు తెలుసు. నేను యుద్ధం చేయడానికి పుట్టాను. అది రాజ్యమైనా, స్త్రీ అయినా - జయించేంతవరకు నా మనస్సు తబ్బిబ్బయి, ఆ పై శరీరాన్ని ప్రేరేపిస్తుంది. నువ్వు నన్ను నన్నుగా ప్రేమించిన స్త్రీవి. నీకది తెలుసు. నాకు దగ్గరగా ఉండి గమనించినవారు నాలో సౌందర్య దాహపు కాంక్ష కూడా ఒక్కోసారి నన్నే మించిపోవడాన్ని దర్శించి ఉంటారు. అది స్త్రీలు అయితే - ఇంకా బాగా తెలుసుకోగలరు. చిన్నప్పుడు నా చెల్లెలు నన్ను గమనించింది. నువ్వు కూడా గమనించే ఉండి ఉంటావు."

మండోదరి మౌనంగా వింటూ ఉండగా రావణుడు ప్రశ్నించాడు, "కాంక్షను శమించేలా చేసేది స్త్రీ- కాదా దేవీ!?"

ఆమె చిరునవ్వు నవ్వి, "అందినప్పుడు శమించబడినది- అందనప్పుడు దహిస్తుంది కదా ప్రభూ!" అంది.

శయ్యపై నుంచి దిగ్గున లేచి నిలబడ్డాడు రావణుడు. అతడి పెదవులు చిన్నగా వంకర తిరిగాయి. వెడల్పుగా ఉన్న కనుబొమ్మలు నుదుటి వైశాల్యాన్ని మరింతగా ఆక్రమించాయి. రెండు అడుగులు శయ్య నుంచి పక్కకు వేసి నిలబడిన రావణుడు తన పది శిరసులను ఆమెకు ప్రదర్శించాడు.

"దేవీ లలితమైన నిన్ను చేరే లాలిత్యుడు కాడు ఈ దశగ్రీవుడు. ఎవరిని నేను? బ్రహ్మ మానస పుత్రులలో ఒకరైన పులస్త్యబ్రహ్మ మనుమడిని. గర్భంలోనే వేదాధ్యయనధనుడైన విశ్వావసు కుమారుడిని. తపము చేసి బ్రహ్మను మెప్పించాను. నా సామగాన స్తోత్రాలతో మహాదేవుడు శివుడిని ఒప్పించాను. స్థితికారుడన్న పేరొందిన విష్ణువు నా కంట పడలేదు- నాకునూ అతడితో విరోధం లేదు. అతడి విరోధం ఏదయినా ఉంటే- అది నా మాతామహులైన సుమాలి తదితర రాక్షసులకు సంబంధించినది. ఇంద్రాది దేవతలు, దిక్పాలకులు నా చేతిలో ఓడినారు. నా కంటబడకనే వరుణుడు, యముడు పారిపోయినారు."

రావణుడి కళ్లు ఎరుపెక్కాయి. మండోదరి అనునయంగా అతడి చేతులను అందుకుంది. "ప్రభూ! రససిద్ధులూ కామరూపులు కదా తమరు. అన్ని చూపుల వేడి నేను తాళలేను. ఆ శిరసులను ఉపసంహరించి నన్నిప్పుడు రక్షించండి" అంది.

రావణుని వదనంలో ప్రసన్న రేఖలు విచ్చుకున్నాయి. "అయిననూ దేవీ- మీ తండ్రి మయుడు ప్రాణంలేని వాటినే సంభ్రమయంగా నిర్మించే అద్భుత శిల్పి. మరి నిన్నో..! హా... అంతకంటే అద్భుతంగా నాకందించారు. నీ తల్లి హేమ సౌందర్యం నేనెరుగనుకాని, నువ్వు నీ తండ్రి ఊహా లోకంనుంచలా దిగివచ్చావని అనిపిస్తుంది."

మండోదరి వీణను అందిస్తూ, "మాటల్లోనూ మీరు దశకంఠులే!" అంది.

వీణ పక్కకు నెట్టి ఆమె భుజాలపై రెండు చేతులను దండలా వేసి పొదివి పట్టుకున్నాడు. "మండోదరీ! వీణకు తీగను మీటితేనే రాగం. మరి నువ్వో... వీణను మించిన అలివేణివి. ఏ చోట మీటితే ఏ రాగమో నాకే తెలియదు!" అన్నాడు.

నవ్వుతూ అతడి గుండెల్లో ఆమె మొహం ఆన్చింది.

దూరంగా సన్నని శబ్దం. తలుపు దగ్గర తెర కదిలింది.

"ఎవరక్కడ?" అన్నాడు రావణుడు తల వెనుకకు తిప్పి.

"ప్రభూ అంతరాయానికి క్షమించండి. దండకారణ్యం నుంచి అకంపనుల వారు తక్షణమే తమ దర్శనం కావాలంటున్నారు" అని భయకంపిత స్వరంతో పరిచారిక పలికింది.

"ఊ.. ఒక్కక్షణం వేచి ఉండమను వస్తున్నాను" అన్నాడు.

మండోదరి "ప్రభూ!" అంది తత్తరపడుతూ.

తల అడ్డంగా ఊపుతూ రావణుడు, "మండోదరీ!" అన్నాడు వారించినట్లుగా.

ఆమె నిస్సత్తువగా శయ్యపైకి జారింది. ఆమెను పొదివి పట్టుకుని పక్కన కూర్చున్నాడు రావణుడు. "కంగారు పడవద్దు దేవీ." అన్నాడు.

"లేదు ప్రభూ. శూర్పణఖ దుఃఖంతో మిమ్మల్ని ఆ రోజు నిందించిన విధం నాకు గుర్తొచ్చింది. రసాతలంలో కాలకేయులతో జరిగిన పోరులో ఆమె భర్త విద్యుజ్జిహ్వుడిని తమరు వధించారు. లంకకు తిరిగివచ్చిన తమ ఎదుట 'జ్యేష్ఠో పితృసమః' అనే వాక్యాన్ని తమరు పాటించలేదని ఆమె నిందించింది. నాకు ఎంతగానో బాధ అనిపించింది" అందామె.

"అవును దేవీ- యుద్ధక్షేత్రం వరుసలను గుర్తుచేయనిది అనేది అంతఃపురాంగనలకు తెలియదు. ఆ రోజు ఆమె శోకాన్ని నేను తగ్గించలేకపోయాను. ఇక్కడే ఉంటే ఆమె దుఃఖోపశమనం జరుగదని, పినతల్లి కుమారులు ఖరదూషణాదులతో పదునాలుగు వేల యోధులతో దండకారణ్యంలో నివసించమని పంపాను. ఎప్పటికప్పుడు నేను అక్కడి విషయాలు తెలుసుకుంటూనే ఉంటున్నాను. ఏమీ జరిగి ఉండదు. శూర్పణఖ రాలేదు. వచ్చింది అకంపనుడు. మాట్లాడి వస్తాను. నువ్వు విశ్రాంతి తీసుకో." అన్నాడు. ఆమె మౌనంగా తల ఊపింది.

***

రావణుడు వేగంగా తన ఆలోచన మందిరాన్ని చేరాడు. అక్కడ వేచి ఉన్న అకంపనుడు చేతులు జోడించి- "మహాప్రభూ! జనస్థానంలో జరిగిన యుద్ధంలో ఖరదూషణులు మరణించారు," అన్నాడు వణుకుతున్న స్వరంతో.

రావణుని నొసలు ముడిబడింది. యుద్ధం! దశకంఠుడి స్థావరంపై దాడి! "అకంపనా! ఎవరా యుద్ధానికి వచ్చింది? ఇంద్రుడా, కుబేరుడా, యముడా... ఎవరైతేమి? నేను మృత్యువుకే మృత్యువును. చెప్పు ఏమి జరిగింది. ఎవరి నాయకత్వంలో దాడి జరిపారు?" అని అడిగాడు.

"లేదు ప్రభూ. దేవతలు కారు. కోసల యువరాజు శ్రీరాముడు తన సోదరుడు లక్ష్మణుడి సమేతుడై దండకారణ్యంలో అడుగిడాడు. అతడొక్కడే మన పద్నాలుగువేల సైన్యాన్ని ఖరదూషణాదులతో సహా మట్టుబెట్టాడు."

రావణుడు ఆశ్చర్యంతో- "మానవుడా? రాముడా? ఒక్కడా ఆ పనికి తెగించింది..." అంటూ, పక్కనే ఉన్న శివవర ప్రసాదితమైన చంద్రహాసాన్ని అందుకున్నాడు.

"ఇప్పుడే నేను వెళ్లి వారిని వధిస్తాను." అని అడుగు వేశాడు. అకంపనుడు రావణుడిని

అడ్డుకుంటూ "మహాప్రభూ. నా మనవి ఒక్కటి ఆలకించండి." అని కోరాడు.

రావణుడు అకంపనుడి వైపు చూశాడు.

"రాముడి పుట్టుక మానవమైతే కావచ్చు. శక్తి మానవాతీతం. దివ్య అస్త్రాలతో ఆకాశాన్ని సైతం బద్దలు కొట్టగలడు. అతడి బలమది. నేను గమనించిన బలహీనత కూడా చెబుతాను. అతడి భార్య సీత. అతి సౌందర్యవతి. ఇంతవరకు అటువంటి సౌందర్యాన్ని నేను ఏ జాతి స్త్రీలోనూ చూడలేదు. ఆమె అతడికి ప్రాణం. ఆమె లేకున్న అతడు ప్రాణరహితుడు. ఆమెను నువ్వు అపహరిస్తే చాలు. ప్రతీకారం సంపూర్ణమవుతుంది."

అకంపనుడు చెప్పిన మాటల్లో- సౌందర్యం అనేదొక్కటే రావణుని మనసులో నాటుకుంది. "సరే, వెళ్లు" అన్నాడు అకంపనుడితో.

***

సౌందర్యం... సౌందర్యం... ఒక ఊహ కాదు... ఒక ప్రపంచం... ఆ ప్రపంచం ఒక స్త్రీలో ఉన్నప్పుడు?- జయించలేనిది కాదు.

ఇపుడేమవుతుంది? యుద్ధమా? ఇన్ని సంవత్సరాల తర్వాత! ఆలోచన ఉవ్వెత్తున ఎగసింది రావణుడి మదిలో. శివుడిని కోరిన వరమేమిటి? శేషజీవితం ప్రశాంతంగా గడవడం. ఆయనా సరేనన్నాడు. బ్రహ్మవర గర్వితుడన్నది శివ సాక్షాత్కారంతో తనకు తొలిగిపోయింది. తల్లి కోరిక మేరకు లంక స్వాధీనం చేసుకున్న తర్వాత, లోకాలను జయించిన తర్వాత, లంకా నగర పసిడివీధుల్లో ఇష్టలైన కాంతా జనంతో సమయం గడుపుతున్నప్పుడు- ఇప్పుడు మరోసారి జయించేందుకు ఒక ప్రపంచం మిగిలి ఉందన్న వార్త. కన్ను కునుకు తీయదే ఆ సౌందర్యం కనబడేంతవరకు.

ఆలోచనను దాటని రావణుడు వెంటనే రథాన్ని సిద్ధం చేసుకుని, ఒక్కడూ మారీచుడి వద్దకు బయలుదేరాడు.

***

రావణుడి రాక మారీచుడికి ఆశ్చర్యం కలిగించింది. లంకాధిపతి తన వద్దకు రావడమా? వార్త పంపితే తానే వెళ్లి దర్శించుకునేవాడు కదా. అదే మాట అన్నాడు.

"మారీచా! దండకారణ్యంలో ఖరుడు మరణించాడు. జయించింది రాముడట. అతడి భార్య అతిలోకసుందరి అని విన్నాను. ఆమెను నేను అపహరించదలచుకున్నాను. నువ్వు ఇంతకు ముందు రాముడిని నీ తల్లి తాటకి, సోదరుడు సుబాహులతో ఎదుర్కొన్నావు. ఆ బాణపు దాడి నుంచి తప్పించుకున్నావు. నువ్వు ఇందుకు సరైన వ్యక్తివి అని నాకనిపించింది. ఇది ఇతరులకు తెలియాల్సినది కాదు. కనుకనే నేనే స్వయంగా వచ్చాను." అన్నాడు రావణుడు.

మారీచుడు చేతులు జోడించి, "ప్రభూ... ఈ ఆలోచన తగనిది. రాముడి భార్యను అపహరించడం అనే సలహా మీకు ఇచ్చినవాడు రాక్షసజాతిని నాశనం చేసే ఆలోచనతోనే ఇచ్చి ఉంటాడు. నేను రాముడిని చూశాను. అతడు కారణం లేకుండా ఖరుడిని వధించి ఉండడు. అతడితో విరోధం తగదు. సీతకన్నా సౌందర్యవతులు ఎందరో మీ వద్ద ఉన్నారు. ఒక స్త్రీ కోసం, అందులో పరాంగన కోసం- మిమ్మల్ని తప్పుదారిన నడిపేందుకు సాహసించిన ఆ దుష్టుడెవరో తెలపండి." అని కోరాడు.

రావణుడు నిట్టూర్చాడు. "మారీచా. నాకు సీత కావాలి." అన్నాడు.

"ప్రభూ! నా మాట వినండి. లంకకు తిరిగి వెళ్లండి. మనకు ఇది తగనిది. ఈ విషయం మీరు ఎవరికి చెప్పినా- మీ కోరిక బలపరచేందుకు, మీ చుట్టూ ఉన్నవారందరూ ప్రయత్నిస్తారు. మిమ్మల్ని సమర్థిస్తే మీ అంతరంగులుగా వారిని మీరు గౌరవిస్తారని వారనుకుంటారు. కాని అది లంకకు క్షేమం కాదు. బ్రహ్మ వంశంలో పుట్టిన మీరు ఆ తేజస్సును అల్పవిషయాలకు ఆహుతి చేయకండి" అని వేడుకున్నాడు మారీచుడు. రావణుడిలో అంతర్మథనం మొదలైంది. "సరే తిరిగి వెళ్తాను." అంటూ రథాన్ని లంకవైపు మళ్లించాడు. సూర్యుడు చీకటి తొలగించుకు వస్తున్నాడు.

***

తన మందిరాన్ని చేరుకుని, ఉదయపు పూజ ముగించి, సభకు బయలుదేరాడు రావణుడు.

ప్రహస్తాది మంత్రులు ఒకపక్క, కుమారుడు ఇంద్రజిత్తు, సోదరుడు విభీషణుడు మరొకపక్క ఆసీనులు కాగా- విశాలమైన సింహాసనంపై రావణుడు అధిష్ఠించాడు.

అంతలో హఠాత్తుగా ఒక భయంకరమైన పొలికేక సభను స్తంభింపజేసింది. రక్తసిక్తమైన మోముతో, ధరించిన వస్త్రాలు అస్తవ్యస్తం కాగా, కేశములన్నీ రేగి, కంటి నీరు ధారాపాతంగా కారుతుండగా పరుగులెత్తుతూ శూర్పణఖ ఆ సభలో ప్రవేశించింది.

"మహా వీరులారా చూడండి! కామోపేతుడైన సోదరుడు కైపెక్కి లంకలో తూగుతుంటే, నాలాంటి సోదరికి పట్టిన గతి ఇది."

అలా ఆమెను చూసిన సభికులు దిగ్భ్రమ చెందారు.

రావణుడు చలించలేదు. శూర్పణఖ ఆవేశం, దుఃఖం అతడికి పరిచయమే.

"రావణా! నా పతిని వధించావు. ఎక్కడో దండకారణ్యంలో నన్ను ఉండమన్నావు. నన్ను పట్టించుకోలేదు. నన్నే కాదు- నిన్ను నమ్మినవారెవరూ నీకు లెక్కలోకి రారు. ఎవరు ఏమైనా నీకు పట్టదు. నీకు కావలసింది నీ అహం. మరేదీ లెక్కించవు. ఇలా చూడు- రావణ సోదరికి ఈ గతి పట్టవలసిందేనన్నది నీ కోరికే అయితే- అది తీరింది. ఆ తీర్చినవాడు రాముడు. అతడు దండకారణ్యంలో మన సోదరులు ఖరదూషణులను ససైన్యంగా వధించాడు. అదీ నీకు తెలియదు. అంత గొప్ప చారులున్నారు ఈ లంకలో" ఆమె అలా నిందిస్తుండగా-

రావణుడు అడ్డుకున్నాడు. "సోదరీ శూర్పణఖా! నింద మాను. ఎవరా రాముడు?

అదేంటి

గోడమీద బొమ్మ,
గొలుసుల బొమ్మ,
వచ్చిపోయేవారికి,
వడ్డించు బొమ్మ.

తేలు కుట్టిన దొంగ అని ఒక సామెత ఉంది మనకి. ఏ పరిస్థితిలో ఉన్నవాడికైనా తేలుకాటు భరింపశక్యం కాదని దీనర్థం. తేలుని దూరం నుంచి చూస్తే చక్కటి బొమ్మలా ఉంటుంది, దాని కొండేలు గొలుసుల్ని తలపిస్తాయి. కానీ పొరపాటున దాని జోలికి పోయామో, విలవిల్లాడాల్సిందే! చెప్పుల్లోనా, చేల మధ్యనా చప్పుడు లేకుండా ఉంటాయివి. చూసి తప్పుకునేలోపునే చప్పున కాటేస్తాయి. అందుకనే 'జొన్నచేలో చుప్పనాతి' అన్న పొడుపు కథ కూడా పుట్టింది.

ఏమి జరిగిందో వివరంగా చెప్పు" అన్నాడు.

జీరబోయిన గొంతుతో శూర్పణఖ ఇలా చెప్పింది. "రాముడు అయోధ్య రాజు దశరథుడి కుమారుడు. ఋషుల రక్షణకు దండకారణ్యం వచ్చాడు. మన సైన్యాన్ని, ఖరదూషణులను కర్కశంగా వధించాడు."

నీళ్లను చిమ్ముతున్న శూర్పణఖ కళ్లలోకి చూశాడు రావణుడు. ఏమి కోరుతుంది శూర్పణఖ?

"సోదరా... రాముడు అలా యుద్ధంలో చెలరేగి మనవారిని నాశనం చేస్తుండగా నేను ఏమి చేయగలనో ఆలోచించాను. రాముని భార్య సీత వంటి సౌందర్యవతి ఈ భూమిపై నేనింతవరకు చూచి ఉండలేదు. ఆమెను పొందినవాడు ఇంద్రుని మించినవాడే అయి ఉంటాడు. నీకన్నా అందుకు తగినవాడు లేడని, ఆమెను నీ కొరకు అపహరించే ప్రయత్నం చేస్తూండగా- రాముడి సోదరుడు నన్ను ఇలా విరూపిని చేశాడు. నువ్వు తక్షణమే రాముడిని వధించు. ఖరదూషణాదుల నాశనానికి ప్రతీకారం తీర్చు. సీతను బలవంతంగానైనా చేపట్టు."

శూర్పణఖను చూస్తున్నాడు రావణుడు. నిన్న రాత్రి అకంపనుడు కూడా ఇదే చెప్పాడు. తనకు ఒక్కడికే, అదీ అంతరంగ మందిరంలో చెప్పాడు. ఇప్పుడు ఈమె రాక్షస ప్రముఖులున్న ఈ సభా మధ్యంలో బహిరంగంగా చెబుతోంది. సీతాపహరణ యత్నం నుంచి తప్పుకున్న సంగతి మారీచునికి తప్ప ఇతరులకు తెలియదు. ఇప్పుడు తిరిగి యత్నించాలా?

"శూర్పణఖా- వెళ్లు. అంతఃపురంలోకి వెళ్లి విశ్రాంతి తీసుకో. విభీషణా! వైద్యులను పిలిపించు." అని ఆదేశించి, ప్రహస్తుడు తదితర మంత్రులను తన ఆంతరంగిక మందిరంలోకి రమ్మని సైగచేసి రావణుడు లోపలికి నడిచాడు.

***

ప్రహస్తా! నీ తెలివితేటలు గొప్పవి. నా సవతి సోదరుడు కుబేరునిపై పోరు చేసి... లంకను స్వాధీనం చేసుకోవడం వెనుక నీ ప్రేరణే నన్ను నడిపించింది. ఇన్నాళ్లు నాతోపాటు ప్రతీ విజయంలో పాలుపంచుకున్నావు. ఇప్పుడు ఈ మానవుడు పద్నాలుగు వేల యోధులను వధించాడు. ఒక్కడు. ఒకే ఒక్కడు. రాముడు. అయోధ్య రాజు దశరథుడి కుమారుడట. దశరథుని పూర్వీకుడు అనరణ్యుడు నా చేతిలో ఓడి చనిపోతూ, తన వంశంలో పుట్టనున్న మహావీరుడి గురించి చేసిన ప్రస్తావన గుర్తొస్తోంది. సరే, ఈ మానవ వీరుడు ఏమి చేయగలడో అదీ చూస్తాను. ఇప్పుడు దండకారణ్యానికి మనమే వెళ్లి అతడిపై యుద్ధం చేయాలా చెప్పు" అన్నాడు.

"అవసరం లేదు ప్రభూ! అతడు కేవలం మానవుడు. మరి మనమో? మాయాతంత్ర అస్త్రశస్త్రవేత్తలం. మీరు కోరుకునేది ఒక్క స్త్రీతో పూర్తవుతుందంటే- శూర్పణఖ అన్నట్లు, సీతను అపహరించడం ద్వారా ప్రతీకారం సమాప్తమవుతుంది. అందుకు యుద్ధం అవసరం రాదు. ఇన్ని యోజనాల సముద్రం దాటి లంకపై దాడి చేయడం మానవమాత్రుడెవరికీ అసాధ్యం. మీరు సరేనంటే మన సేనాధిపతుల్లో ఎవరైనా ఆమెను అపహరించుకుని వస్తారు. చిటికెలో అయ్యే పని." అన్నాడు ప్రహస్తుడు.

తల అడ్డంగా ఊపి రావణుడు- "లేదు నేనే వెళతాను. ఇది ఎవరికీ తెలియవలసిన అవసరం లేదు." అన్నాడు.

***

తిరిగి మారీచుడి వద్దకు రథం మళ్లించాడు రావణుడు. రావణుడిని చూసి మారీచుడు ఆందోళనగా ఎదురు వెళ్లాడు. "ప్రభూ ఏమి వెంటనే తిరిగి ఇలా వచ్చారు?"

"మారీచా తప్పదు. సీతను అపహరించాల్సిందే." అన్నాడు రావణుడు.

"ప్రభూ! మీరు ఎవరి మాటలనో అనుసరించడం తగదు. రాముడి గురించి మీకు తెలియదు. ఆ బాణపు వేగాన్ని చూశాను. ఆ కన్నుల సూర్యకాంతి చూశాను. నాలో తమస్సు అంతరించింది. పూర్తిగా తపోధనుడిగా మారి ఇక్కడ ఇలా జీవిస్తున్నాను. అతడితో విరోధం మీకు తగదని చెప్పినా మీరు వినడం లేదు."

"మారీచా... శత్రువును పొగిడేవాడు కూడా శత్రువే" అన్నాడు ఆగ్రహంతో రావణుడు.

"మీ క్షేమం కోరేవాడిని కనుకనే కఠోరమైనప్పటికీ సత్యాన్ని చెబుతున్నాను దేవా. అనుసరించే మార్గం బట్టి పొందే ఫలం ఉంటుంది. నువ్వు నీ సోదరుడిని రాజ్య బహిష్కృతుడిని చేశావు. రాముడు భరతుడికి పట్టం కట్టి భోగాన్ని త్యజించాడు. కామాతురుడివై పడతులను వేలాదిగా వివాహమాడినా సౌందర్య కాంక్ష తీరలేదు. రాముడు పరస్త్రీని కాంక్షించడు. నీ తండ్రి విశ్రవసుడి మాటను వినక చరించావు. రాముడు తండ్రి మాటకోసం అరణ్యవాసం చేస్తున్నాడు. దేవతల కార్యభగ్నంలో నువ్వు ఆనందాన్ని పొందుతున్నావు. రక్షించడంలో క్షత్రియ కర్తవ్యం పాటిస్తున్నాడు. నీ సోదరి భర్తను నువ్వు సంహరించావు. ఆమె చెప్పిన మాటను వినడంలో యుక్తాయుక్త విచక్షణ పాటించలేవా? బ్రహ్మవేత్తవు దేవా నువ్వు- ఒక సామాన్యుడి వలె ఏమి ఈ ఆవేశం?" అన్నాడు మారీచుడు.

రావణుడు అసహనంగా కదిలాడు. మారీచుడికి నా ఆలోచనలు ఎలా తెలుస్తాయి? అనుకున్నాడు. నిన్న రాత్రి అంతరంగ మందిరంలో అకంపనుడు చెప్పిన క్షణంలో- సౌందర్యం అన్నమాట తనను ప్రేరేపించింది నిజం. తర్వాత ఆలోచించి వెనక్కు తగ్గింది కూడా నిజమే. కానీ బహిరంగంగా నడి సభలో శూర్పణఖ వచ్చి జరిగిన పరాభవం రావణుడికి మొర పెట్టుకున్నాక, అది విన్న తర్వాత కూడా రావణుడు ప్రతీకారం ఏమీ చేయలేదు అని రాక్షసులు అనుకుంటే అది ఎంత ప్రమాదం. దాయాదుల సంగతి తనకు బాగా తెలుసు. శూర్పణఖకు జరిగిన అవమానానికి సరైన ప్రతీకారం రావణుడు చేయలేకపోయాడనేది వారు మూడు లోకాల్లోనూ ప్రచారం చేస్తారు. తనచేతిలో ఓడి ప్రతీకారం కోసం దారులు వెతుక్కుంటున్న ఇంద్రాది దేవతలు, కాలకేయాది దానవులు, గంధర్వులు, యక్షులు అందరూ ఏమీ చేయలేక ఈ మానవుడి పక్షం వహించేందుకు కుట్రలు పన్నుతారు. అంతకుముందే అతడిని నిస్సహాయుడిని చేస్తే ఆ ప్రమాదం జరగదని తాను అనుకుంటున్నాడు. అది వివరించి చెప్పేది కాదే, అని రావణుడు ఆలోచిస్తుండగా మారీచుడు ఇలా అన్నాడు.

"నేను నీకు చెప్పేవాడిని కాను. కాని రాముడి బాణపు వేటు తగిలి గాయపడిన తర్వాత లంకలో కొన్నాళ్లు ఉన్నాను. దశగ్రీవుడంటే కామజములైన దశవర్గం- వేట, జూదం, అకాలనిద్ర, పరనింద, స్త్రీవ్యామోహం, మద్యపానం, నృత్యగీత వాద్యాదులందు అమితాసక్తి, వ్యర్థంగా తిరగడం అని కొందరు అనగా విన్నాను. అలాగే కామజ అనంతరం క్రోధజ అష్టవ్యసనాలు వాటిని అనుసరిస్తాయి. చాడీలు చెప్పడం, దుస్సాహసం, ద్రోహచింత, అసహనం, ఇతరుల గుణాలపై దోషారోపణ, ధనం కోసం నీచంగా యత్నించడం, తిట్టడం, కఠిన మాటలు ఇవన్నీ క్రోధం నుంచి జనిస్తాయంటారు. నీ కాంక్షను అనుసరించి నువ్వు వర్తించావు. యథారాజా తథాప్రజా అని రాక్షసులు నిన్ను అనుసరించి హింసానందులై వర్తిస్తున్నారు. 'రాజా రాష్ట్రకృతం పాపమ్' అన్న విషయం నీకు తెలియనిది కాదు. ప్రజలు అనుసరించిన పాపఫలంలో సగం రాజు అనుభవించాల్సిందే."

"మారీచా- నువ్వు ఎవరితో ఏమి మాట్లాడుతున్నావు? నేను దశకంఠుడిని. నా

వారిని సంహరించిన ఆ రాముడికి సీత ప్రాణాలకన్నా ప్రియమైనదని తెలిసి అపహరించేందుకు ఇక్కడికి వచ్చాను. ఈ యత్నం నుంచి నన్ను మళ్లించేందుకు నువ్వు చెప్పే మాటలు నన్ను గౌరవించేవి కావు.

నువ్వు ఈ దండకారణ్యంలో రుషులనుకునేవారి అతి తెలివి మాటలను విని అదే తీరులో తిరిగి వల్లిస్తున్నావు. ఇంద్రియాలను జయించి చేసేది తపస్సు. నా బలం తపం. దానికి మెచ్చే బ్రహ్మాదులు ప్రత్యక్షమయ్యారు. అప్పుడు కామజములు, తత్ఫలిత క్రోధజములు నా వద్ద ఉన్నట్లా? లేనట్లా? దేహానికి సహజమైన కాంక్షకు మూలమైన ప్రాణాన్నే నేను దేవదేవుడి పాదాల వద్ద పెట్టాను. ఇవన్నీ నీకు తెలియనివా? జీవుల ప్రాణాలను యముడు అన్యాయంగా హరిస్తున్నాడని నారదుడు చెబితే, అతడి మీదకు నేను దండెత్తాను. యముడు నరకలోకం వదిలివెళ్లిపోయాడు. అటువంటిది నా సవతి సోదరులను చంపినవారి గురించి నా పాలనలో అందరికీ తెలిసినా నాకు తెలియనట్లు పట్టనట్లు ఉండాలా? రాజు ధర్మమేంటో నాకు కూడా తెలుసు. పౌరధర్మం నీకు తెలుసునా? ఉత్తమ సేవక ధర్మం నీకు తెలుసునా? మంచి కోరినవైనా- అగౌరవమైన ఆ మాటలను ఈ రావణుడు మెచ్చడు. నాకు ఇన్ని మాటలు చెప్పడానికి సాహించిన నీకు- ప్రభువు ఆదేశాలను పాటించాలన్న కనీస విషయం తెలియదా?" అన్నాడు ఆగ్రహావేశంతో రావణుడు.

మారీచుడు రావణుడిని చూశాడు. ఆ కళ్లలో ఊగిసలాట లేదు. ఎర్రని జీరల కాంక్ష. "నేను ఏమి చేయగలను?" అన్నాడు మారీచుడు.

"నా మాట వినడమే. రాముడిపై దాడికి సంబంధించి సప్త ఉపాయాల మంచీ చెడు ఆలోచించాను. సామదానభేదదండోపాయాలు ఇప్పుడు అవసరం లేదు. మిగిలినవి మాయ, ఉపేక్ష, ఇంద్రజాలాలు. ఉపేక్ష ఎప్పుడూ నేను పాటించకూడనిది. మాయ ఇంద్రజాలాదులతో రాముడిని గెలుస్తాను. సీతాపహరణం కోసం నువ్వు మాయలేడిగా రూపం దాల్చు" అన్నాడు రావణుడు.

సీతను అపహరించిన క్షణం తర్వాత మృత్యువు తప్ప శరణ్యమేదీ? ఎంత చెప్పినా వినని రావణుడు అకాల మృత్యువు అనే అగ్నికి నన్ను పరిచయం చేస్తున్నాడు. తద్వారా తానూ పరిచయం అవుతున్నాడు. లంకనూ ఆ కాలాగ్ని చేరి దహించకమానదేమో? చేయగలిగినదేమీ లేదు అనుకున్న మారీచుడు మౌనంగా అంగీకరిస్తున్నట్లు తల ఊపాడు.

కె. కృష్ణమోహన్
వాణిజ్య పన్నుల శాఖాధికారి,
గుంటూరు.
94403 21969

పూరింపబడని ఖాళీలు

అంతా సవ్యంగానే తోస్తుంది -
నందనవనంలా
లోకం
సర్వాంగ సుందరంగానే కనిపిస్తుంది -
సప్తవర్ణాల సింగడిలానే మెరుస్తుంది -
సంబంధ అనుబంధాలు
పొదరిల్లులా
పెనవేసుకుపోతుందనుకుంటాం -

కానీ
కంటికి కానరాని
పారదర్శక కుడ్యాలు
మనుషుల మధ్యన
నిలువెత్తుగా నిలుస్తాయి -
మౌనం
పెనుభూతమై
దూరాల దారాల్తో
మనుషుల మధ్యన తెరల్ని నేస్తుంది -
ఒంటరితనపు ఉదాసీనత
నీడలా
వెన్నంటే ఉంటుంది
వెంటాడుతూ ఉంటుంది
వాలేనీడల దూరాల్లో
తేడాలు తప్ప -

కలలు కనడం మానేసిన కళ్లు
చెక్కిలిపై కన్నీటి చుక్కల్ని
లెక్కపెడ్తాయి -

ఏదో తెలియని వెలితితో
మనసు
నిట్టూర్పు ముడుపుల్ని మూటకడ్తుంది
-
రసస్పందనలు కోల్పోయిన హృదయం
వొట్టి యంత్రమై శబ్దిస్తుంది...
స్తబ్ధతతో సీతాకోకచిలకల ఊరేగింపులు
కనిపించవ్
పక్షుల కిలకిల పదాలు వినిపించవ్
వసంతకాలం గుర్తింపే ఉండదు -

రంగు వెలిసిన గోడపై బల్లిలా
గడియారం
కాలాన్ని నమిలేస్తూంటూంది -

మరో రోజు
చిరిగిన కాగితమై
బుట్టదాఖలౌతుంది -

నడిరాతిరి గూర్ఖా ఒకడు
లారీతో నేలపై శబ్దంచేస్తూ
"అంతా సవ్య"మంటూ ముందుకెళ్తాడు.

- పిన్నంశెట్టి కిషన్
తూనికలు - కొలతల శాఖ అధికారి
సూర్యాపేట. 9700230310

తెలుగు మాట్లాడటమే ఆత్మగౌరవం!

దాశరథి రంగాచార్య
ప్రముఖ సాహితీవేత్త,
తెలంగాణ పోరాట యోధుడు

యాద్భాషయతే తద్భాష - మాట్లాడేదే భాష. తెలుగు మాట్లాడుతున్న భాషే కాదు. లిపి గల భాష. లిపి.. కలిగి ఉండడంలో విశేషమేముంది? అనిపించవచ్చు! కనీసం లిపికూడా లేని భాషలు ప్రపంచ వ్యాప్తంగా కొన్ని లక్షలుండొచ్చు! మన భాషకు సముద్రమంత సాహిత్యం ఉంది. అక్షరం లేని ప్రజాసాహిత్యం జానపద కళల రూపంలో మనమధ్యే ఉంది. ఇవన్నీ.. తెలుగు వారిగా మనకున్న పెద్ద ఆస్తులు. వారసత్వ సంపదలు. ఇతర భాషా ప్రభావం అన్నది.. ఏ భాషకైనా తప్పదు. పరాయిభాషల్ని తనలో ఇముడ్చుకుని మందాకినిలా ముందుకు సాగేదే జీవద్భాష! లిపి, వ్యాకరణం, వ్యావహారికం.. అన్నీ మారుతూ ఉండేవే. కాకపోతే ఆ మార్పు.. భాషలోని మౌలిక జీవలక్షణాలని మింగేయకూడదు. ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న సమస్య అదే! ఇంగ్లిషు మనపై ఇంతగా ఆధిక్యత సాధించడానికి కారణం.. స్వాతంత్ర్యానికి పూర్వమైతే రాజకీయం! ఇప్పుడేమో ఆ భాషకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రాబల్యం! ఆ భాషను అన్ని శాస్త్రాల్లోనూ ఉపయోగించగల సౌలభ్యం! ఆ ప్రాబల్యాన్ని సౌలభ్యాన్ని మనం కాదనలేం. కానీ.. వాటిని వినియోగించుకుంటూనే మన భాషను కాపాడుకోగలగాలి. వాటి స్థాయికి మన భాషను తీసుకు వెళ్లగలగాలి. ఇది మన ముందున్న సవాలు. పరభాషల నుంచి తెలుగుకి ఒడుదొడుకులు రావడం కొత్తకాదు. ఎంతో దూరం ఎందుకు... భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు తెలంగాణలో తెలుగు భాషా విద్య అన్నది నామమాత్రం. అన్నిచోట్లా ఆధిక్యం ఉర్దూదే! అసఫ్‌జాహీల చివరి పాలకుడు నూర్ ఉస్మాన్ అలీఖాన్ మరింతగా చెలరేగిపోయాడు. అత్యధిక ప్రజలు మాట్లాడుతున్న తెలుగు భాషని కాదని ఉర్దూని రుద్దాలని చూశాడు. ఇన్ని ప్రతికూలతలున్నా, మాలాంటివాళ్లం చాటుమాటుగానైనా నిష్ఠతో తెలుగు చదువుకున్నాం. ఎన్ని కట్టుబాట్లున్నా తెలుగు కట్టుబొట్టే ధరించాం! మేం లేకపోతే భాష చనిపోయేదని చెప్పలేం కానీ, మమ్మల్ని భాష ఓ ఉపకరణంగా వాడుకుంది. ప్రజలు తెలుగు భాష మాట్లాడటం ఆత్మగౌరవంగా భావించాలి. ప్రవాసాంధ్రుల్ని ఈ విషయంలో ఆదర్శంగా తీసుకోవాలి. ఇక్కడిలా అక్కడ బడుల్లో భాష బోధన లేకున్నా, బయట తెలుగు మాటలు కరవైనా పిల్లలకు తెలుగుదనం వారసత్వంగా అందించేందుకు వారు తపిస్తున్నారు. ఆ తపనలో ఏ కాస్త మనం అందుకోగలిగినా, మన తెలుగు వేయి కాంతులతో వెలుగులీనడం ఖాయం! చివరిగా నా మాట ఇది..

భాషపుట్టె నరుని భావాలు ప్రకటింప
భాషతోనె నరుడు భాస్కరుండు
భాషకూడా ఒక్క బంధంబుగా మారె
విశ్వజనులవాణి! వినర రంగ!

గొప్పకోసం 'పరాయి' తిప్పలొద్దు!

వెల్చేరు నారాయణరావు
ప్రముఖ భాషావేత్త,
అమెరికాలో తెలుగు ఆచార్యులు

యునెస్కో వాళ్లు చెప్పనివ్వండి, వాళ్ల బాబు చెప్పనివ్వండి, తెలుగు భాషకి వచ్చిన ప్రమాదం ఏమీ లేదు. తెలుగుభాష చచ్చిపోదు. ప్రభుత్వాలు వాడకపోవొచ్చు. విద్యాలయాలు తెలుగు పాఠాలు చెప్పకపోవచ్చు. అయినా తెలుగు ఎక్కడికీ పోదు. మహా అయితే చదువుకున్న వాళ్లకి తెలుగురాదు అంతే. చదువుకోని వాళ్లు బతికి ఉన్నంతకాలం తెలుగు బతికే ఉంటుంది. అయితే ఈ చదువుకున్నవాళ్లు ఏంగావాలి? వాళ్లకి తెలుగు రాకపోతే ఫర్వాలేదనుకుంటున్నారు కదా! వాళ్లకి ఇంగ్లిషు కూడా రాదని చెప్పండి. వాళ్లు మాట్లాడే, రాసే నాలుగు ముక్కల్నీ ఇంగ్లిషు అని వాళ్లు భ్రమపడుతున్నారు. వాళ్లకి ఇప్పటికీ బాగావొచ్చింది తెలుగే. ఆ సంగతి వాళ్లకి తెలిసిన రోజున, వాళ్లు సుబ్బరమైన ఇంగ్లిషు నేర్చుకుంటారు. సుబ్బరమైన తెలుగూ నేర్చుకుంటారు.

ఇంగ్లిషు మాట్లాడకపోతే అమ్మాయిలు అబ్బాయిల్ని ప్రేమించరు, కార్యాలయాల్లో ఉద్యోగస్తులు మీతో మాట్లాడరు- అనే పరిస్థితి ఉన్నంతకాలం ఇంగ్లిషు వ్యామోహం పోదు. వ్యామోహం వేరు, సామర్థ్యం వేరు. మనకి ఇంగ్లిషు సమర్థంగా నేర్చుకున్నవాళ్లు చాలామంది కావాలి. అంచేత ఇంగ్లిషు నేర్చుకోవద్దని చెప్పకండి. బాగా నేర్చుకోమని చెప్పండి. తెలుగు నేర్చుకోకపోతే ఏ తెలివి అందకుండా పోతుందో పిల్లలకి చెప్పండి. - అప్పుడు పరిగెత్తుకుని వొస్తారు తెలుగు నేర్చుకోవడానికి.

ఏ కొత్త ఆలోచనలు తెలుగులో జరిగాయో చెప్పండి. ఆ ఆలోచనలు తెలియకపోతే అభివృద్ధి కుంటుపడుతుందని వివరించండి. అప్పుడు వద్దన్నా తెలుగు నేర్చుకుంటారు.

ముందు తెలుగు వొస్తే ఇంగ్లిషు తేలికగా వొస్తుందని నచ్చజెప్పండి. అప్పుడు తెలుగు నేర్చుకోవడానికి ఉత్సాహం చూపిస్తారు పిల్లలు.

ఇంగ్లిషు మాటలు, వాక్యాలకి వాక్యాలు తెలుగు అక్షరాల్లో రాసే పత్రికలు తెలుగూ, ఇంగ్లిషూ కాని ఒక అవ్యక్త భాష రాస్తున్నారనే విషయం గ్రహిస్తున్నాయా?

భాషల కోసం ప్రభుత్వాలు చెయ్యగల పనులు కొన్నే ఉన్నాయి. డబ్బు ఇవ్వడం అందులో ఒక ముఖ్యమైన పని. కాని నిజంగా జరగవలసిన పని అంతా ప్రభుత్వం మీద ఆధారపడని స్వతంత్ర సంస్థలు చెయ్యాలి. తెలుగులో సమర్థులకి కొదవలేదు. కావలసిందంతా వాళ్లని గుర్తించి, ప్రోత్సహించే వాతావరణమే.

వాక్యము దేవుడైయుండెను

భాష వ్యక్తుల మధ్య వారధిగా నిలుస్తుంది. మెరుగైన జీవనాన్ని సారథై నడిపిస్తుంది. జీవిత నాణ్యతకు మూలమైన ఆధ్యాత్మిక భావాలను మనసుల్లో నాటడానికి కూడా భాష దోహదపడుతుంది. కాబట్టే, సరైన మార్గంలో నడిచేందుకు అవసరమైన కార్యాచరణను నిర్దేశించే క్రైస్తవ మత గ్రంథం తెలుగు భాష ద్వారానే భక్తులకు చేరువయింది. బైబిలు పఠనం లక్షల మంది క్రైస్తవుల నిత్యకృత్యంగా మారటానికి తెలుగు భాషే కారణం.

అమ్మ చేతి గోరుముద్దల్లా తేలికగా వంటబట్టే తేట తెలుగు పదాలే పరిశుద్ధ గ్రంథాన్ని క్రైస్తవులకు ఎంతో చేరువ చేశాయి. తెలుగు భాష ఆధ్యాత్మికంగా చైతన్యపరిచే మాధ్యమం కాబట్టే తెలుగు అనువాద క్రైస్తవ మత గ్రంథం 'బైబిలు', క్రైస్తవుల చేతుల్లో కరదీపికై వెలుగుతోంది. ఈ గ్రంథంలోని విషయాలను ప్రత్యేక సత్యాలుగానూ, దేవుని అభీష్టాన్ని తెలిపే దివ్యవాణి గానూ భక్తులు భావిస్తారు. ఈ భావనకు దగ్గరగా ఉండే ఒక వాక్యం బైబిల్ పవిత్ర గ్రంథంలోని యోహాను సువార్తలో ఉంది. 'ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడైయుండెను' అనటం ద్వారా వాక్యానికి దైవత్వాన్ని ఆపాదించి, భగవంతునితో ఆధ్యాత్మికంగా అనుబంధం ఏర్పరిచే వంతెనగా దాన్ని నిలిపే ప్రయత్నం జరిగింది. విషయ గ్రహణ శక్తితో, భావాలను సృజించి, వాటిని సూచనల ద్వారా తెలియపరిచే సాధనం భాష. అందుకే, ఆధ్యాత్మిక మాధ్యమాల్లో భాష వినియోగం పెద్దపీట వేసుకుంది.

మన భాషల ప్రగతికి మిషనరీల తోడ్పాటు

ముద్రిత పదం మానవ సృష్టి విచిత్రం. ముద్రణకు పూర్వం రాళ్లు, రాగి రేకులు, చర్మం, తాటి ఆకులు, చేతి కాగితం వంటి వాటిపై లిపి వ్యాపించిందనే విషయం మనందరికీ తెలిసిందే! ఇలాంటి గుదిగుచ్చిన రాతప్రతుల స్వరూపమే.. గ్రంథం. అయితే, ఈ దశను దాటుకుని భారతీయ భాషలు ప్రగతి సాధించటానికి ముద్రణ ఎంతో ఊతమిచ్చింది. ఇందుకు క్రైస్తవ మిషనరీల మత ప్రచార సంకల్పమే కారణం. 'సాధ్యమైనన్ని భారతీయ భాషల్లో బైబిలు అనువాదం చేయాలనే క్రైస్తవ మిషనరీల ధృఢ సంకల్పమే భారతీయ భాషాభివృద్ధికి దోహదపడింది.' అంటూ భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మిషనరీల ప్రయత్నాన్ని కొనియాడారు. ముద్రణలో నూతన శకానికి నాంది పలుకుతూ 19వ శతాబ్దం తొలి పాదంలో 42 భారతీయ భాషల్లో బైబిల్ పవిత్ర గ్రంథ అనువాదం జరిగింది.

ముద్రిత మాధ్యమ పరిణామ క్రమం ప్రారంభంలో క్రీ.శ.1455లో 'జొహాన్ గూటెన్ బర్గ్' మొట్టమొదటి బైబిల్‌ను ముద్రించారు. గూటెన్‌బర్గ్ చూపిన మార్గంలోనే 1746-47 మధ్యకాలంలో జర్మనీ దేశంలోని హాలే నగరంలో ముద్రల సహాయంతో తెలుగు భాషలో బైబిల్ ముద్రణ మొదలైంది. క్రైస్తవ మత ప్రచారానికి భాష అవరోధంగా నిలిచిన 17వ శతాబ్దంలో దక్షిణ భారతీయ భాషల్లో ఒకటైన తెలుగుపై పట్టు సాధించే ప్రయత్నం చేశారు మిషనరీలు. ఈ క్రమంలో 'బెంజమిన్ షుల్జ్' అనే మిషనరీ 'కాన్స్‌పెక్టస్ లిటరేచరీ తెలుగిసే' అనే తెలుగు వర్ణమాల పుస్తకాన్ని 1747లో జర్మనీలోని హాలే నగరంలో తొలుత అచ్చు వేయించాడు. ఈ పుస్తకంలో ఒక వరుస తెలుగు అక్షరాలు, రెండో వరుస అక్షరాలను పలికే విధానాన్ని రోమన్ లిపిలో అచ్చు వేయించారు. పెద్ద బాలశిక్షలోని వర్ణమాలను పోలిన అక్షరాలతో పుస్తకాన్ని అచ్చు వేయించి తన తర్వాత వచ్చే మిషనరీలకు మత


VIA
SIVE
ORDO SALVTIS
IN
LIBELLVS,
IN QVO
DEMONSTRATVR,
QVA RATIONE ET VIA HOMO PECCA-
TOR, SVAE SALVTIS CVPIDVS,
PER IESVM CHRISTVM
AD VITAM AETERNAM
PERVENIRE POSSIT.
EX LINGVA TAMVLICA IN
LINGVAM TELVGICAM
TRANSLATVS.
INTERPRETE
BENIAMINO SCHVLTZIO
MISSIONARIO EVANGELICO.

మోక్షానికి

షుల్జ్ ప్రచురించిన 'మోక్షానికి కొంచ్చుపోయే దోవ' పుస్తక ముఖ చిత్రం   చిత్రసేకరణ: జి.కృపాచారి

ప్రచారంలో భాషాపరమైన చిక్కులు లేకుండా చేశాడు షుల్జ్. ఈ పుస్తకం అట్టపైన తెలుగును ప్రత్యేకంగా 'వరగిస్' అని రాశారు. షుల్జ్ తెలుగును ఇలా సంబోధించటానికి ఒక కారణం ఉంది. ఆయన తమిళనాడులోని ట్రాంక్విబార్‌కు వెళ్లినప్పుడు ఉత్తరాన ఉన్న తెలుగు ప్రాంతాన్ని అక్కడివారు 'వడగర్' అనేవారు. వర్ణమాల పుస్తకంతోపాటు, క్రైస్తవ మత సంబంధమైన నాలుగు గ్రంథాలను మధ్యకు మడతపెడితే జేబులో పట్టేంత అనువుగా చిన్న పరిమాణంలో అచ్చు వేయించాడు బెంజమిన్ షుల్జ్. వీటిలో రెండు ఒకే ముఖచిత్రం కలిగిన జంట పుస్తకాలు, మిగతా రెండు విడివిడి పుస్తకాలుగా మొత్తం నాలుగు పుస్తకాలను అచ్చు వేయించాడు. అవి... 1.మోక్షానికి కొంచ్చుపోయే దోవ. 2.సత్యమైన వేదంలో వుండె 3.బుద్ధి కలిగిన... నూరు జ్ఞాన వచనాల 4.ఒక గురువు అఇదు బ్రాహ్మల యొక్క నడమన.

ఈ నాలుగు పుస్తకాలనే తెలుగులో అచ్చయిన తొలి ముద్రణలుగా పేర్కొనాలి. ఈ పుస్తకాల ముఖపత్రాలపై కనిపించే అక్షరాలను గమనిస్తే కొయ్య పలకలపై పెద్ద ఆకారాల్లో అక్షరాలు చెక్కి ముద్రించినట్టు అనిపిస్తుంది. నాలుగు పుస్తకాల అట్టలపై 'తమిళం' నుంచి అని ముద్రించి ఉంది కాబట్టి షుల్జ్‌కు తమిళం, తెలుగు రెండు భాషలతోనూ పరిచయం ఉన్నట్టు గ్రహించాలి. షుల్జ్ బాటలోనే జర్మనీ క్రైస్తవ మిషనరీ విలియం కేరీ కోల్‌కతాలోని శ్రీరాంపూర్‌లో భారతీయ భాషలన్నింటితో పాటు తెలుగు లిపిలో కదిలే అచ్చులు తయారు చేయించారు. ఇంగ్లాండు నుంచి ముద్రణ యంత్రాన్ని 1799లో ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఓడలో తెప్పించారు. 1818లో కొత్త నిబంధన గ్రంథ ప్రచురణ, ఆ తర్వాత 3 సంవత్సరాలకు పంచ కాండాలు (ఆదికాండము నుంచి ద్వితీయోపదేశ కాండము), వ్యాకరణాలు, వాచకాలు, నిఘంటువులు, చిన్న కథల ముద్రణ క్రమేపీ ఊపందుకుంది. దాంతో ముద్రిత గ్రంథాలకు మార్గం సుగమమయింది. ఇలా మత ప్రచారపరమైన మిషనరీల సంకల్ప ఫలితంగా ముద్రణకు నోచుకున్న తెలుగు భాష జ్ఞానప్రసారంలో నమ్మదగిన సాధనమైంది. తరతరాల మానవ సంస్కృతి విజయపరంపరకు ఆలవాలమైంది. నాటి నుంచి నేటి వరకూ అప్రతిహతంగా జనావళికి తోడ్పడుతూ వచ్చింది.

మాతృక హిబ్రూ భాష నుంచి తెలుగులోకి బైబిలు అనువాదం కాలానుగుణ భాషా పరిణామాలకనుగుణంగా జరుగుతూ వచ్చింది. ప్రస్తుతం వివిధ తెలుగు బైబిలు అనువాదాలు మనకు లభ్యమవుతున్నాయి. తొలినాళ్లలో హిబ్రూ భాషలో ఉన్న బైబిలును ఉన్నదున్నట్టుగా అనువదించారు. అయితే వ్యాకరణ సర్దుబాట్లు పొసగక భావ వ్యక్తీకరణ కొంత క్లిష్టమైంది. కాలక్రమేణా సందర్భానుసార పదాల సృష్టి, సౌకర్యవంతమైన పద ప్రయోగాల వాడుక పెరగటంతో మరింత సరళతరం చేయటం కోసం బైబిల్ పలుమార్లు అనువాదితమైంది. తెలుగు వ్యాకరణాన్ని, నిఘంటువును రచించిన సి.పి.బ్రౌన్ కూడా మద్రాసు సివిల్ సర్వీస్ ఉద్యోగిగా ఉన్నప్పుడు బైబిల్‌ను తెలుగులోకి అనువదించారు.

ముద్రణా నిలయం... శ్రీరాంపురం

భారత దేశ భాషల ముద్రణ విషయంలో శ్రీరాంపురం మిషనరీలు చేసిన సేవ వెలలేనిది. శ్రీరాంపురంలో అచ్చు అక్షరాల తయారీ 19వ శతాబ్దారంభంలో మొదలైంది. కలకత్తా దగ్గర శ్రీరాంపురంలో అడుగుపెట్టిన క్రైస్తవ మిషనరీలు ఆరువేల రూపాయలకు ఒక ఇల్లు, నలభై పౌండ్ల స్టెర్లింగులకు ముద్రణా యంత్రాన్ని కొని ముద్రణ ప్రారంభించారు. మిషనరీలకు తెలుగు అక్షరాల నిర్మాణంలో సహకరించేందుకు పంచానన్ అనే కమ్మరి చార్లెస్ విల్కిన్స్ దగ్గర శిక్షణ పొందాడు. 1807వ సంవత్సరం మధ్యనాటికి శ్రీరాంపురంలో తెలుగు, తమిళం, కన్నడం, మళయాళం భాషల్లో ఫాంట్లు తయారయ్యాయి. ఈ విధంగా ముద్రణ ఊపందుకుని 1811లో తెలుగులో నాలుగు సువార్తలు (మత్తయి, లూకా, మార్కు, యోహాను) అచ్చు వేయటం ప్రారంభమైంది. 1813 నాటికి మత్తయి సువార్త దాదాపు పూర్తి చేశారు. తెలుగు వ్యాకరణం, బైబిలు కొత్త నిబంధన, పెంతెకోస్తు వరుసగా శ్రీరాంపురంలో అచ్చయ్యాయి. మత ప్రచార నిమిత్తం క్రైస్తవ

మిషనరీలు ఎంచుకున్న ముద్రణా ప్రయత్నం తెలుగు భాష మనుగడకు బాటలు వేసింది. ముద్రణా నిలయంగా భాసిల్లిన శ్రీరాంపురం గురించి 1959లో అచ్చయిన తెలుగు విజ్ఞాన సర్వస్వంలో మల్లంపల్లి సోమశేఖర శర్మ 'అచ్చు' అనే శీర్షికన ఇలా రాశారు: 'కర్ణాటక మిషన్‌కు చెందిన క్రైస్తవ మిషనరీలు కొందరు కలకత్తా దగ్గరనున్న శ్రీరాంపురంలో ఒక మిషను స్థాపించి బైబిలును దేశ భాషల్లో ముద్రించి, దేశీయులలో క్రైస్తవ మతవ్యాపన చేయవలెననే ఉద్దేశంతో నాగరి, తెలుగు మొదలైన ఏడెనిమిది లిపుల్లో అష్టకష్టములు పడి, అచ్చు అక్షరములు తయారుచేసి ముద్రాయంత్రములను నెలకొల్పినారు'.

బైబిలు భాష

'బిబ్లియా' అనే గ్రీకు పదం నుంచి బైబుల్ పుట్టింది. బిబ్లియా అంటే పుస్తకాలు అని అర్థం. పరిశుద్ధ గ్రంథం వేర్వేరు రచయితలు వెయ్యి సంవత్సరాలపాటు ప్రయాసకోర్చి రాసిన పుస్తక సంకలనం. పరిశుద్ధ గ్రంథంలో పద్యం, కీర్తనలు, జ్ఞాన సాహిత్యం, సామెతలు, సువార్తలు...ఇలా ఎన్నో విభిన్న సాహిత్య రీతులు, శైలులు కనిపిస్తాయి. మాతృక హిబ్రూ నుంచి తెలుగులోకి అనువదించే క్రమంలో ప్రజలకు తేలికగా అర్థమయ్యేలా సరళతర అనువాదానికే పెద్దపీట వేశారు. ఈ ప్రయత్నంలో ఆంగ్ల పదాల ఉచ్చారణతో దగ్గరి పోలికలున్న పదాల రూపకల్పన అనివార్యమైంది. ఇందుకు ఉదాహరణగా అపొస్తులు (అపొస్టల్), బాప్తిస్మము (బాప్టిసమ్), సాతాను (శాటాన్) పదాలను ఉటంకించవచ్చు. ఈ విధానాన్నే బైబిల్‌లోని పేర్లకూ అన్వయించారనిపించే ఉదాహరణలు కూడా ఉన్నాయి. పేతురు (పీటర్), తోమా (థామస్), లూకా (లూక్), క్రీస్తు (క్రైస్ట్) మొదలైనవి. అలాగే కొన్ని బైబిల్ సంబంధ ఆంగ్ల పదాలు కూడా గ్రీకు పదాల నుంచి పుట్టినవే! కొత్త నిబంధనలోని మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్తలు యేసు జీవితం గురించి ఆయన బోధనల గురించి వివరిస్తాయి. వీటిని సువార్తలు అని పిలుస్తారు. 'ఇవాంజెలియన్' అనే గ్రీకు పదానికి 'గాడ్‌స్పెల్' అనే ప్రాచీన ఆంగ్ల పదం సూటి అనువాదం. గాడ్‌స్పెల్ అనే పదం నుంచే 'గాస్పెల్' అనే పదం వచ్చింది. 'గాస్పెల్' అంటే 'సువార్త' అని తెలుగు అర్థం. అలాగే ప్రార్థన ముగిస్తూ క్రైస్తవులందరూ ఉపయోగించే మరో పదం 'ఆమెన్' అంటే 'తథాస్తు' అని, క్రీస్తుని స్తుతిస్తూ పలికే 'హలేలూయా' అనే హిబ్రూ పదానికి 'దేవునికి స్తుతి కలుగుగాక' అని అర్థం.

ఆధ్యాత్మికపరమైన ఆసక్తిని కలిగింపచేసే కృషి పరిశుద్ధ గ్రంథం రచనాశైలిలో కనిపిస్తుంది. వాక్యనిర్మాణం, పదాల పొందిక వాక్యాలకు నిండుదనాన్నిచ్చి మనసుకు హత్తుకుపోయే మహత్తును వాక్యాలకు ఆపాదించాయి. యేసు పలికిన కొన్ని వాక్యాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అవగతమవుతుంది. ఆ దేవుని కుమారుడే మనతో నేరుగా మాట్లాడుతున్న అనుభూతి కలిగేంతటి దైవత్వం వాక్యాలకు అలవడింది. తాత్విక ధోరణితో పాటు, జ్ఞానవంతమైన ఉపదేశాలు, ఉపమానాలు క్రీస్తుకు మనల్ని మరింత దగ్గరచేయటానికి దోహదపడ్డాయంటే అందుకు సరళానువాద విధానమే కారణం. నైతికత, మానవ జీవితంలోని కఠిన వాస్తవాలు, పాప ఫలం, పరలోక రాజ్యం... ఇలాంటి ఎన్నో ఆధ్యాత్మిక అంశాలు, పామరులు సైతం మనసులకెక్కించుకుని తమ జీవితాల్ని సన్మార్గంలో నడిపించుకునేందుకు దోహదపడిన అమూల్యమైన వాక్యాలు పరిశుద్ధ గ్రంథంలో కోకొల్లలు. వాటిలో క్రీస్తు చెప్పిన అమూల్య వాక్యాలను కొన్నింటిని పరిశీలిద్దాం!

1. ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు: పరలోక రాజ్యము వారిది.
2. దుఃఖపడువారు ధన్యులు: వారు ఓదార్చ బడుదురు.
3. సాత్వికులు ధన్యులు: వారు భూలోకమును స్వతంత్రించుకొందురు.
4. నీతి కొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు: వారు తృప్తిపరచబడుదురు.

బైబిలులోని వివిధ సాహిత్య రీతులు

బైబిల్లో వివిధ సాహిత్య శైలుల్లో రాసిన రచనలు కనిపిస్తాయి. బైబిలులోని కొన్ని గ్రంథాలను పరిశీలిస్తే వాటిలో రచయితల ఉద్దేశాలు ప్రతిఫలిస్తాయి. నాటి కాలమాన పరిస్థితులను కళ్లకు కట్టిస్తూనే, క్రీస్తు మూర్తిమత్వం, వ్యక్తిత్వాలను పాఠకులు గ్రహించేలా రచనలు చేశారా అనిపించే రీతిలో ఉంటాయి. లూకా సువార్తలోని 2వ అధ్యాయంలోని మొదటి 20 వచనాలు చదివినప్పుడు యేసు జనన వృత్తాంతానికి సంబంధించిన సంఘటనలు మన కళ్ల ముందే జరుగుతున్న అనుభూతి చెందుతాం. ఇందుకు భిన్నంగా యోహాను సువార్తలో పరిస్థితులు, సంఘటనలకు బదులుగా యేసు వాక్యము, నిజమైన వెలుగు, ఆయన శరీర ధారి అయ్యాడని సూచించే కావ్య వర్ణన కనిపిస్తుంది. అలాగే సమూయేలు గ్రంథంలోని మొదటి, రెండవ అధ్యాయాలు పరిశీలిస్తే, మొదటి అధ్యాయం గద్య రూపంలో, రెండవ అధ్యాయం పద్య రూపంలో ఉన్న కీర్తన లేక ప్రార్థన కనిపిస్తాయి. గ్రంథ ఉద్దేశాన్ని గ్రహించేందుకు ఇలాంటి మార్పులు పాఠకులకు ఉపకరిస్తాయి. అలాగే బైబిలులో... విధులు, చరిత్ర, పద్యం, కీర్తనలు, జ్ఞాన సాహిత్యం, ప్రార్థన, ఉపమానాలు, ప్రవచనాలు, సామెతలు, సువార్తలలో వివిధ సాహిత్య రీతులు కనిపిస్తాయి.

పద్యం కీర్తనలు: విభిన్న రీతులున్న పెద్ద విభాగమిది. 'యోబు కీర్తనలు పరమ గీతము' గ్రంథంలో పద్య శైలి కనిపిస్తుంది. బైబిలులోని కొన్ని ప్రాచీన స్తుతి గీతాలు పద్య శైలిలో ఉన్నాయి. ప్రవక్తల సందేశాలను కూడా కొన్ని చోట్ల పద్య శైలిలో చూడవచ్చు. హిబ్రూ పద్యాలను అనువదించటం క్లిష్టమైన ప్రక్రియ. మూల భాషలో ఉన్న శక్తివంతమైన అర్థాన్ని అనువాదంలో ప్రతిబింబించటం శ్రమతో కూడుకున్న పని. ఒకే భావాన్ని రెండు సామ్యాలతో వర్ణించటం హిబ్రూ పద్య విశిష్టత. హిబ్రూ అర్థాల సారూప్యంతో పద్య రూపంలో తెలుగును అనువదించి బైబిలు ఘనతను పెంచిన ఘనత రచయితలదే! పాత నిబంధనలోని యోబు, యెషయా, యోనా అధ్యాయాలతోపాటు, కొత్త నిబంధనలోని లూకా, ఫిలిప్పీ, ప్రకటన అధ్యాయాల్లో ఈ రకమైన పద్య శైలి మనకు కనిపిస్తుంది.

జ్ఞాన సూక్తులు, సామెతలు: రాధనా ప్రకరణంలో పద్యం, కీర్తనలు, కథవంటి విభిన్న శైలులు కనిపిస్తాయి. లోకం, దేవుడు, మనుషుల గతి ముఖ్యాంశాలుగా వివేచన కలిగించే సామెతలు, సూక్తులు విశిష్టమైన శైలిలో రచించారు. తాత్విక ధోరణితోపాటు,

జ్ఞానవంతమైన ఉపదేశాలు కూడా కనిపిస్తాయి.

ఉపమాన కథలు: దేవుని గురించి, ఆయన రాజ్యం గురించి ముఖ్యమైన సత్యాలను దైనందిన జీవితంలో అందరికీ బాగా తెలిసిన విషయాలతో పోల్చి చెప్పే చిన్న కల్పనలే ఉపమాన కథలు. వీటిని క్లుప్తంగా లేదా వివిధ పాత్రలతో, సాదృశ్యాలతో వివరించే విధానం బైబిలులో కనిపిస్తుంది.

గద్యం (వచనం): వర్ణన, వివరణ వచనంలో ప్రధాన భాగాలు. వ్యక్తుల గురించి చరిత్ర వర్ణన బైబిలులో వచన రూపంలో చూడవచ్చు. వచనంలో సంభాషణ అనే మరో రచనా శైలి కూడా బైబిలులో పరిశీలించవచ్చు. గద్య రచనలో కథ లేక ఇతివృత్తం ప్రముఖమైంది. కొన్ని ఇతివృత్తాలు (ఆది కాండము: 6-10) క్లుప్తంగా కేవలం కొన్ని అధ్యాయాలకే పరిమితమై ఉంటే, మరికొన్ని గ్రంథాల్లో అంతటా (రూతు, ఎస్తేరు) ఒకే వృత్తాంతం ఉంటుంది.

ప్రార్థనలు: ప్రార్థనలు గద్యంలోనూ, పద్యంలోనూ ఉంటాయి. దేవునితో సంభాషించటమే ప్రార్థన. కృతజ్ఞతాస్తుతులు, సహాయాన్ని అర్థిస్తూ వేడుకోలు, విచారాన్ని వెలిబుచ్చుతూ... ఇలా సందర్భం ఎలాంటిదైనా దేవుడిని ప్రార్థించే విధానం పద్య రూపంలో ఉండటం బైబిలు సాహిత్య విశిష్టత.

తెలుగు సాహిత్యంలో క్రైస్తవత్వం

కవిత్వం ద్వారా క్రీస్తుని కీర్తించిన తెలుగు ప్రముఖుల్లో కవికోకిల గుర్రం జాషువా అగ్రగణ్యులు. పరిశుద్ధ గ్రంథంలోని ప్రధాన ఘట్టాలన్నింటినీ 'క్రీస్తు చరిత్ర' పద్య అధ్యాయాల్లో పరిమళింపజేసి క్రీస్తు ప్రేమను చాటారాయన. 'మత గ్రంథాన్ని ఛందోబద్ధం చేయటం కత్తి మీద సాము, తీగ మీద నడక' అంటూ క్రీస్తు చరిత్ర పుస్తక ప్రారంభంలో చెప్పారాయన. అలాగే బైబిలు భాషను సమర్థిస్తూ 'తెలుగు బైబిలు భాషనీసడించు హైందవ మిత్రులకు, కళాభిరుచిగల ఆధునిక యువ క్రైస్తవ లోకానికీ ఈ కావ్యం రుచిస్తుందనే ధైర్యం నాకున్నది.' అంటూ రాసుకున్నారు జాషువా. అలాగే క్రీస్తు చరిత్రలో ఆయన రచించిన 'ఖండ ప్రశంస' పద్యాలను పరిశీలిస్తే, క్రీస్తు ఆసియా ఖండంలోనే జన్మించారనే ఒక కథనాన్ని కవి సమర్థించిన విషయం స్పష్టమవుతుంది. ఆ వాదనను బలపరిచే పద్యం ఇలా సాగుతుంది:

ఏమి నోములు నోచితో యేసుప్రభువు
డాబు దర్పాలు గల్గు ఖండాంతరములు
జన్మమెత్తక నీ గడ్డ జన్మమెత్తె
ఆసియా ఖండమా! ధన్యవమ్మ నీవు!

జాషువాతో పాటు ఆయన సమకాలీనులైన కొందరు కవులు పరిశుద్ధ గ్రంథంపై పద్య కావ్యాలు రాశారు. వారిలో ఏలూరుకు చెందిన లక్కవరం ఎస్టేటు జమీందారు 'మంత్రిప్రగడ భుజంగరావు' ఒకరు. ఈయన కొత్త నిబంధన గ్రంథంలోని మత్తయి సువార్తపై కావ్యాలను వినూత్న పద్య ప్రయోగంతో రచించారు. ఆ పద్య కావ్యాల్లోని ఒక పద్యంలో 'ఏసుజనుండు' అనే ద్విపదాలను... విడగొట్టినప్పుడు, జోడించినప్పుడు వేర్వేరు అర్థాలు స్ఫురించేలా ప్రయోగించారు. 'ఏ సుజనుండు' అనటం ద్వారా 'ఏ మంచి వ్యక్తి' అనే అర్థం, 'ఏసు జనుండు' అనటం ద్వారా ఏసు క్రీస్తును సంబోధించిన అర్థాన్ని తన కావ్యాల్లో నర్మగర్భంగా ధ్వనింపజేశారు. అలాగే తెలుగు భాషలో ద్వ్యర్థి కావ్యాలకు అంటే రెండర్థాల కావ్యాలకు ప్రాధాన్యం ఉంది. ఆధునిక కాలంలో కృష్ణుడి చరిత్ర, ఏసు క్రీస్తు చరిత్రలు రెండింటిని కలిపి 'ఏసుకృష్ణీయం' అనే పేరుతో కవి, అష్టావధాని గాడేపల్లి కుక్కుటేశ్వరరావు ద్వ్యర్థి కావ్యం రచించారు. ఇవే కాకుండా పరిశీలించగలిగితే ఇలాంటి మరెన్నో పద్య ప్రయోగాలు క్రీస్తు చరిత్ర సంబంధ గ్రంథాల్లో మనకు కనిపిస్తాయి.

బోధనలు సార్వకాలీనమైనవి, సార్వజనీనమైనవి. నిత్యమై, సత్యమై నిఖిల జనరంజకంగా భాసిల్లిన క్రీస్తు బోధనలు జీవన నాణ్యతను మెరుగుచేసే మహిమాన్విత మేలి ముత్యాలు.

గోగుమళ్ల కవిత
పాత్రికేయురాలు,
హైదరాబాద్.
80085 51844

సత్యమార్గం

– పచ్చా పెంచలయ్య,
పొదలకూరు, నెల్లూరు. 99128 22341.

అమెరికా తెలుగువాడి గుండె చప్పుడు తానా

ఎప్పుడో దేశం విడిచిన ఇక్కడి గువ్వలన్నీ తెలుగువాళ్లమన్న గుర్తింపు వీడలేక తానా గూటిని అల్లుకున్నాయి. 'తానా' అంటే ఉత్తర అమెరికా తెలుగు సంఘానికి రెండక్షరాల సంక్షిప్తనామం. అంతర్జాతీయ యవనికపై తెలుగు వెలుగు వికాసానికి సాక్షి సంతకం. స్థానిక సంస్థలకన్నా సమర్థవంతంగా నడుస్తూ ముప్పై అయిదేళ్ల దిగ్విజయ పథాన్ని దాటి వచ్చింది. ఎన్నో సాంస్కృతిక అంశాలను, ఎందరో కళాకారులను ప్రోత్సహించింది. కార్యాచరణ పరిధిని అంతకంతకూ విస్తరించుకుంటూ ఇక్కడి తెలుగుతనానికి బలమైన కుడిభుజంగా ఎదుగుతూ వస్తోంది.

అమెరికాలో తెలుగు వారు తగు సంఖ్యలో స్థిరపడటం మొదలు పెడుతున్న రోజుల్లో, అంటే 1970లలో, చాలా నగరాల్లో తెలుగు సంఘాలను ఏర్పరచుకోవటం మొదలుపెట్టారు. అమెరికా అంతటా చెదురుమదురుగా ఉన్న తెలుగు వారినీ, తెలుగు సంఘాల్నీ ఒక చోట చేర్చడానికి 1977లో న్యూయార్క్ నగరంలో డా. గుత్తికొండ రవీంద్రనాథ్, డా. కాకర్ల సుబ్బారావుల నాయకత్వంలో ఉత్తర అమెరికా తెలుగు మహాసభలు జరిగాయి. ఆ సభలకు వచ్చిన వారంతా అమెరికాలో తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతులను పరిరక్షించుకొని, వ్యాప్తి చేసేందుకు ఉత్తర అమెరికా తెలుగు సంఘాన్ని ఏర్పాటు చేశారు.

అమెరికాలో తెలుగు నేర్చుకోవటానికి వీలు కల్పించడం, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించడం, సాహిత్య వ్యాప్తికి సహకరించడం తానా ముఖ్య ఆశయాలు. సంస్థ ప్రారంభం నుంచి వీటిపై నిరంతరంగా, బహుముఖంగా కృషి చేస్తూనే ఉంది.

గిడుగు రామ్మూర్తి అవార్డు

తెలుగు భాషాధ్యయనం, అభ్యుదయం కోసం నిరంతర కృషి చేస్తున్న వారిని గుర్తించి ప్రోత్సహించేందుకు తానా.. గిడుగు రామ్మూర్తి అవార్డుని నెలకొల్పింది. 2002 నుంచి ప్రతి రెండేళ్ళకూ ఒకరికి ఈ అవార్డును అందజేస్తోంది. గ్రహీతను రూ.50వేల నగదుతో సత్కరిస్తుంది. ఇప్పటివరకూ ఈ అవార్డును ఆచార్య చేకూరి రామారావు, భద్రిరాజు కృష్ణమూర్తి, సి.ధర్మారావు, సం.వెం.రమేష్, తదితరులు అందుకున్నారు.

తెలుగు భాషా బోధన

అమెరికా విశ్వవిద్యాలయ స్థాయిలో తెలుగు నేర్పటానికి, తెలుగు భాషలో పరిశోధనలు జరగటానికి అనువైన వాతావరణం కల్పించేందుకు సంస్థ కృషి చేస్తోంది. విస్కాన్సిన్ (మాడిసన్) విశ్వవిద్యాలయంలో తెలుగు తరగతులు జరుగుతున్న రోజుల్లో, మన భాషను నేర్చుకుందామని ముందుకు వచ్చిన విద్యార్థులకు తానా ఫౌండేషన్ ఉపకారవేతనాలు ఇచ్చేది. తర్వాత మిచిగాన్ (యాన్ ఆర్బర్) విశ్వవిద్యాలయంలో ఐదేళ్ళ పాటు తెలుగు నేర్పే అధ్యాపకులకు వేతనం ఇవ్వడానికి నిధులు సమకూర్చింది. గత ఆరేళ్ళుగా టెక్సాస్ విశ్వవిద్యాలయంలో తెలుగు తరగతుల నిర్వహణ, అధ్యాపకుల వేతనాలకు తానా ధన సహాయం చేస్తోంది. ఇక్కడ భారత సంతతి వారేకాక, విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన విద్యార్థులూ తెలుగు నేర్చుకుంటున్నారు.

ప్రాథమిక స్థాయిలో తెలుగు నేర్చుకునేవారి కోసం బాపు-రమణలు తయారు చేసిన వీడియో పాఠాలను తానా తన సభ్యులకు సరఫరా చేసింది. బొమ్మల అక్షరాల పుస్తకాలను అందజేసింది. పిల్లలు తెలుగు జ్ఞానాన్ని పెంపొందించటం కోసం 2003 నుంచి తెలుగు పద విజ్ఞాన పోటీలను వివిధ నగరాలలోనూ, ద్వైవార్షిక సమావేశాలలోనూ నిర్వహిస్తుంది. ప్రస్తుతం తెలుగు పాఠాలు నేర్చుకోవడానికి వీలయ్యే అభ్యాసన పుస్తకాలు, చిన్నారుల్లో తెలుగుపై ఆసక్తి పెంచటానికి దోహదపడే పుస్తకాలను ప్రచురించటానికి సన్నాహాలు చేస్తోంది.

తానా సమావేశాల్లో సాహిత్య సభలు

తానా సమావేశాల్లో సాహిత్యాభిమానుల కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయటం ఆది నుంచి ఉన్న అలవాటే. 1980లో చికాగోలో జరిగిన మూడవ సమావేశానికి మహాకవి శ్రీశ్రీ, దాశరథి, సి.నారాయణరెడ్డి, మల్లెమాల (ఎం.ఎస్. రెడ్డి), త్రిపురనేని మహారథి వంటి కవులు, రచయితలు ప్రత్యేక అతిథులుగా వచ్చారు. దాంతో సమావేశం కవిసమ్మేళనంలా గోచరించింది. అప్పటినుంచి ఇప్పటి వరకు ఎంతో మంది ప్రసిద్ధ రచయితలు, కవులు, పండితులు, విమర్శకులు, ప్రచురణకర్తలు, సాహితీవేత్తలు, పాత్రికేయులు తానా మహాసభల సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రముఖ రచయిత, పరిశోధకుడు, విమర్శకుడు, అనువాదకుడు, తెలుగు బోధకుడు ఆచార్య వేల్చేరు నారాయణరావును 2007లో తానా జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించింది. 2011లో బహుముఖ ప్రజ్ఞాశాలి గొల్లపూడి మారుతీరావును ప్రత్యేక పురస్కారంతో గౌరవించింది.

అవధాన హేల

1989లో తానా సమావేశాలకు ప్రత్యేక అతిథిగా వచ్చిన మేడసాని మోహన్ అష్టావధానాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను రంజింప చేశారు. అప్పటి నుంచి ప్రతి సమావేశంలోనూ అవధాన కార్యక్రమాల్ని ఏర్పాటు చేస్తున్నారు. మాడుగుల నాగఫణిశర్మ, గరికిపాటి నరసింహారావు, రాళ్ళబండి కవితాప్రసాద్, ఇతర అవధానులూ విడివిడిగాగానీ, కలిసిగానీ తమ విద్యను ప్రదర్శించి ఆహూతులను ఆకట్టుకున్నారు. అవధానాలతో పాటు భువన విజయం, ఆగతానికి స్వాగతం వంటి సాహిత్య రూపకాలు కూడా సమావేశాలలో మంచి ప్రేక్షకాదరణ పొందాయి. 2001 తానా సమావేశాల్లో ప్రదర్శన కోసమే ప్రత్యేకంగా ఇంద్రగంటి శ్రీకాంతశర్మ ఆగతానికి స్వాగతం అనే ప్రత్యేక సాహితీ చారిత్రాత్మక రూపకాన్ని రచించారు. 2009 సమావేశ ఆరంభ నృత్యం కోసం సిరివెన్నెల సీతారామశాస్త్రి రచించిన సాంకేతిక వికాసం, సాంస్కృతిక విన్యాసం గేయరూపకం అపూర్వమైన ప్రశంసలు పొందింది.

తానా సభల్లో ఇలాంటి తెలుగు ప్రముఖుల సాహితీ ప్రసంగాలెన్నో..

తెలుగు పుస్తకాలు

తానా మహాసభల సందర్భంగా ప్రత్యేకంగా తెలుగు పుస్తకాలు ప్రచురించి, ఆవిష్కరించటం ఒక ఆనవాయితీ, 1991 అట్లాంటా సమావేశంలో ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర రెండో ప్రచురణ ఆవిష్కరించారు. 1993 న్యూయార్క్ సభల్లో వెలువరించిన తానా తెలుగు కథ (సంపాదకుడు- ఏ.ఎస్.మూర్తి), మంచుతునకలు (సంపాదకుడు-పెమ్మరాజు వేణుగోపాలరావు) కవితా సంకలనాలు మంచి ప్రశంసలను అందుకున్నాయి. అప్పుడే తానా ప్రత్యేకంగా ప్రచురించిన కాళీపట్నం రామారావు మాస్టారి 'యజ్ఞం'తో సహా తొమ్మిది కథల సంకలనానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు రావడం తానాకు గర్వకారణం.

1995 చికాగో సమావేశంలో తానా బాపు-రమణ స్వర్ణోత్సవం జరిపింది. ఈ సందర్భంలో వీరిద్దరి మొదటి ప్రచురణకు గుర్తుగా బొమ్మా-బొరుసు అనే పుస్తకాన్ని ప్రత్యేకంగా ప్రచురించారు. ఆ సమావేశంలో కీలకోపన్యాసకుడు కొంగర జగయ్య తన గీతాంజలి అనువాదాన్ని ఆవిష్కరిస్తే, ఇంకో గౌరవ అతిథి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తన ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇదే సందర్భంలో బాపు, రమణలకు నూట పదహార్లు అంటూ భమిడిపాటి రామగోపాలం ప్రచురించిన సరదా కథలు, స్మైల్ ఖాళీ సీసాలు కథా సంకలనం, కె.సదాశివరావు క్రాస్ రోడ్స్ కథా సంకలనం ప్రచురితమయ్యాయి.

తెలుగు పలుకు: సమావేశాల సంచికలు

1977 నుంచీ ప్రతి తానా సమావేశానికి, తెలుగు పలుకు అన్న పేరుతో ఒక సంచికను ప్రచురించటం సంప్రదాయం. సమావేశం వివరాలు, అమెరికా ఆంధ్రుల రచనలు, సంచిక కోసం భారతదేశం నుంచి తెప్పించుకున్న ప్రత్యేక రచనలతో సర్వాంగసుందరంగా తయారయ్యే ఈ ప్రత్యేక సంచికలు దాచుకోదగ్గవి. కొన్ని సంచికల్లో ప్రత్యేకాంశాల మీద దృష్టి పెట్టి తగిన వ్యాసాలు రాయించి, సేకరించి, సమీకరిస్తుంటారు. ఉదాహరణకు 1995, 2009 సంచికల్లో ఆంధ్రుల చిత్రకళపై వ్యాసాలు, చిత్రాలు ఇచ్చారు.

తానాపత్రిక

తానా సంస్థాగత విషయాలను సభ్యులకు చేర్చటం కోసం ఏర్పాటు చేసుకున్న పత్రిక ఇది. 1989 వరకు పత్రిక అప్పుడప్పుడూ వచ్చేది. నల్లమోతు సత్యనారాయణ తానా అధ్యక్షులుగా ఉన్నప్పుడు చెరుకుపల్లి నెహ్రూ సంపాదకత్వంలో పత్రికను ప్రతి నెలా ప్రచురించటం మొదలుపెట్టారు. 1993లో యలవర్తి రామారాజభూషణుడు, నేను

సంపాదకులుగా ఉన్నప్పుడు పత్రికలో సాహిత్య సాంస్కృతిక విషయాలను ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభించాం, వంగూరి చిట్టెన్ రాజు, కన్నెగంటి చంద్రశేఖర్ వివిధ దశలలో సంపాదక బాధ్యతలు నిర్వహించారు. గత అయిదేళ్లుగా కిరణ్ ప్రభ సంపాదకులుగా ఉంటున్నారు. ప్రస్తుతం తానా పత్రిక అచ్చు నుంచి ఎలక్ట్రానిక్ పత్రికగా మారుతోంది.

నవలలు, కథల పోటీలు

తెలుగు సాహితీ రంగంలో పెనుమార్పులు వచ్చి, సరైనా ప్రోత్సాహం, ప్రచురణకు అవకాశం లేక నాణ్యమైన నవలలు మరుగున పడిపోతున్న సమయంలో, 1997 లాస్ ఏంజిల్స్ తానా సమావేశం సందర్భంగా మూడువేల డాలర్ల (అప్పట్లో లక్షా ఇరవై వేల రూపాయలు) బహుమతితో నవలల పోటీ నిర్వహించాలని మురళి చందూరి తలపెట్టారు.

భారత్‌లోని ఆహ్వానం పత్రిక సహకారంతో నిర్వహించిన ఈ పోటీలో చంద్రలత నవల 'రేగడివిత్తులు' విజేతగా నిలిచింది. బహుమతిని గెల్చుకుంది. మొదటి నవలల పోటీ విజయవంతమవ్వడంతో 2005 సమావేశాల వరకు తానా ప్రచురణ కమిటీ తరపున నవలలు, కథల పోటీలు నిర్వహించారు. స్వాతి, విపుల పత్రికలు, కథా సాహితి సంస్థ ఈ క్రతువులో సహాయం చేశారు. కాలక్రమేణా భారత్‌లోనూ పెద్ద మొత్తాలతో పోటీలు నిర్వహిస్తుండటం తానా నిర్ణయించుకొన్న ప్రమాణాల స్థాయి రచనలు రాకపోవటం వంటి కారణాల వల్ల ఈ పోటీలను ప్రస్తుతానికి నిలిపివేసింది.

ప్రచురణల కమిటీ

తెలుగులో ప్రతి సంవత్సరం వచ్చే ఉత్తమ కథలను ఎంపిక చేసి వార్షిక సంపుటాలుగా ప్రచురిస్తున్న కథాసాహితీ సంస్థకు గత పదమూడేళ్లుగా తానా ప్రచురణ కమిటీ ఆర్థిక సహకారన్నందిస్తుంది. 1999-2009 సంవత్సరాల మధ్య తెలుగులో వచ్చిన 30 ఉత్తమ కథలను ఎంపిక చేసి ప్రచురించిన రెండు దశాబ్దాల కథాసంకలనానికి కమిటీ సహాయమందించింది. తెలుగు కథకు శాశ్వతత్వాన్ని కలుగచేయాలన్న ఉద్దేశంతో ప్రముఖ రచయిత కాళీపట్నం రామారావు శ్రీకాకుళంలో ఏర్పరచిన కథానిలయానికి ఐదు లక్షల రూపాయల మూలధనం ఏర్పాటు చేసింది.

ప్రచురణలు

వ్యాపార ప్రచురణకర్తలు ప్రచురించలేని ముఖ్యమైన తెలుగు పుస్తకాలు మరుగున పడిపోకుండా ఉండటానికి తానా కృషి చేస్తోంది. వేంకటాధ్వరి రాసిన విశ్వగుణాదర్శం చంపూకావ్యం (ఇంద్రగంటి శ్రీకాంతశర్మ వ్యాఖ్యానం), వేల్చేరు నారాయణరావు సిద్ధాంత గ్రంథం తెలుగులో కవితా విప్లవాల స్వరూపాలను ప్రచురించింది. ప్రతి సంవత్సరమూ, కనీసం ఒక అరుదైన పుస్తకాన్ని ప్రచురించాలన్నది సంస్థ ఆశయం.

అనువాదాలు

తెలుగు సాహిత్యానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు రావాలంటే, నాణ్యత గల అనువాదాలు, వాటిని అందరికీ అందించగల ప్రచురణకర్తలు చాలా ముఖ్యం. ఈ ఉద్దేశంతో విస్కాన్సిన్ విశ్వవిద్యాలయం మొదటిసారిగా Hibiscus on The Lake, An Anthology of Modern Telugu Poetry ప్రచురించింది. ఇందులో తానా ప్రముఖ పాత్ర వహించింది. అలాగే కన్యాశుల్కం నాటకాన్ని Girls for Sale పేర ఇండియానా విశ్వవిద్యాలయం ప్రచురించటానికీ తానా సహాయపడింది. ఈ రెండింటినీ ఆచార్య వేల్చేరు నారాయణరావు అనువదించారు.

తెలుగు ఖతులు

కంప్యూటర్ల వాడకం, అంతర్జాలం విస్తరిస్తున్న తొలి రోజులలో, 1995 చికాగో తానా సమావేశాల సందర్భంగా కంప్యూటర్లలో తెలుగుల వాడకంపై తానా ఒక ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించింది. ఆ రోజుల్లో ఈ అంశంపై కృషి చేస్తున్న తిరుమల దేశికాచారి, ముక్కపల్లి లక్ష్మణరావు, కన్నెగంటి రామారావు తదితరులు ఈ అవగాహన సదస్సుల్లో పాల్గొన్నారు. ఆ సంవత్సరమే,

దేశికాచార్యులు తయారు చేసిన 'పోతన' తెలుగు ఖతిని తానా ఖరీదు చేసి అంతర్జాలంలో ఉచితంగా అందుబాటులో ఉంచింది. ఒక దశాబ్దంపాటు, ఇతర ఖతులు వ్యాప్తిలోకి వచ్చేవరకూ, ఔత్సాహికులు అందరూ ఈ ఖతినే వాడుతుండేవారు.

ఆంధ్రభారతికి చేయూత

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో తెలుగు వారు ప్రముఖపాత్ర పోషిస్తున్నా అంతర్జాలంలో తెలుగు మాత్రం ఉండవలసిన స్థాయికి ఇంకా చేరుకోలేదు. కొన్నాళ్ళ క్రితం వరకూ తెలుగు పదానికి అర్థం కావాలంటే, అంతర్జాలం తెలుగు వేదికల మీద తెలిసినవారిని సంప్రదించవలసిందే

తానా సభలెప్పుడూ ప్రవాసాంధ్రులతో నిండుగా అలరారుతాయి (ఓ అష్టావధాన సభ ఇది)

కాని స్వయంగా వెంటనే వెతుక్కునే అవకాశం ఉండేది కాదు. తెలుగు సంబంధించిన అన్ని నిఘంటువులనూ ఒక చోటకు తీసుకొనివచ్చి ఒక మౌస్‌క్లిక్కుతో అందరికీ అందుబాటులో ఉంచాలనే ప్రయత్నం మొదలుబెట్టిన ఆంధ్రభారతి సంస్థకు 2011 నుంచి తానా ప్రచురణల కమిటీ ఆర్థికంగా చేయూతనిచ్చింది.

ప్రాచీన భాషోద్యమం

కొన్నేళ్ల క్రితం తెలుగుకు ప్రాచీన భాష హోదా తీసుకురావటానికి చేసిన ఉద్యమంలో కూడా తానా ప్రముఖ పాత్ర వహించింది. 2006 డిసెంబరులో వివిధ సంస్థలతో కలిసి ఒక పెద్ద ప్రదర్శనను నిర్వహించింది. తానా ప్రతినిధి బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్రమంత్రులనూ, అధికారులనూ కలుసుకొని తెలుగుకు ప్రాచీన భాష హోదా ఇవ్వటం విషయంపై చర్చలు జరిపి ఆధారపత్రాలను అందజేసింది.

తానా చైతన్య స్రవంతి

తెలుగు జానపద కళారూపాల పరిరక్షణ కోసం ఆంధ్రప్రదేశ్‌లో తానా చైతన్య స్రవంతి పేర రెండేళ్ళకోసారి ప్రదర్శనలు, సదస్సులు, సభలు నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా జానపద కళారూపాలపై పరిచయ, పరిశోధక వ్యాసాలతో చైతన్య స్రవంతి అనే సంచికను కూడా ప్రచురిస్తుంది.

తెలుగు రచయితల మహాసభలు

చైతన్య స్రవంతిలో భాగంగా తానా ఆంధ్రప్రదేశ్‌లో వివిధ నగరాల్లో రచయితల మహాసభలను కూడా నిర్వహిస్తోంది. తెలుగు సాహిత్యంపై రసవత్తరమైన గోష్ఠులూ, చర్చాకార్యక్రమాలూ ఈ సభలలో జరుగుతాయి. రెండేళ్ళ క్రితం విజయవాడలో జరిగిన సభల్లో అప్పటి చర్చలనూ ప్రసంగ వ్యాసాలనూ తానా ఒక సంచికగా ప్రచురించింది.

భవిష్యత్ ప్రణాళికలు

గత పదిహేనేళ్ళలో సాంకేతిక విప్లవంలో పాలుపంచుకుంటూ తెలుగువారు పెద్ద ఎత్తున అమెరికాకు వచ్చి స్థిరపడటంతో ఇక్కడ తెలుగువారి అవసరాలు బాగా మారిపోయాయి. అమెరికాలో ప్రస్తుతం పదేళ్లలోపు వయసు తెలుగు పిల్లలు లక్షకు మించి ఉంటారని ఒక అంచనా. ఈ పిల్లలకు తెలుగుపై మక్కువ కలిగించి ఆసక్తి పెంచటం ఇప్పుడు తానా చేయవలసిన ముఖ్యమైన పనుల్లో ఒకటి. ఈ విషయం గుర్తించిన తానా వచ్చే సంవత్సరం (2013) మే 24, 25, 26 తేదీలలో డల్లాస్ నగరం జరగబోతున్న 19వ తానా మహాసభల మకుటంలో ముందు మాటగా భాషను ఎన్నుకొంది. (భాష, సేవ, సంప్రదాయం, అభ్యుదయం).

ఈ డిసెంబరులో జరగబోయే చైతన్య స్రవంతి కార్యక్రమాలలో ఒక రోజు మొత్తం తెలుగు భాషా సాహిత్యాలకు అంకితం చేస్తూ... సమావేశాలను పదకవితా పితామహుడు అన్నమాచార్యుని జన్మస్థలమైన తాళ్ళపాకలో జరపటానికి తానా నిశ్చయించింది.

ఇప్పటివరకు చేస్తున్న కార్యక్రమాలు కొనసాగిస్తూ ఇక ముందు ప్రత్యేకంగా పిల్లల కోసం బొమ్మల అక్షరాల పుస్తకాల దగ్గర్నుంచి పెద్ద పిల్లలు తేలిగ్గా చదువుకోగల సాహిత్యం వరకు వివిధ స్థాయిలలో బాలసాహిత్యానికి చేయూతనివ్వడం, పిల్లలకు తెలుగు వీడియోలు, కంప్యూటర్లద్వారా ఆటలు, పాటలు, పాఠాలు, ప్రోగ్రాములు పాఠ్యపుస్తకాలు అందుబాటులో వచ్చేలా చేయడం తానా ఎంచుకొన్న కార్యక్రమాలలో ముఖ్యమైనవి.

తెలుగు భాష, సాహిత్యాల సేవలో తానా చేసిన చేస్తున్న అనేక కార్యక్రమాలలో ఇవి కొన్ని మాత్రమే. భాషను కాపాడుకొని పరిపుష్టం చేసి, వ్యాప్తి పొందించటానికి జరిగే అన్ని ప్రయత్నాలలోనూ తానా ఉత్సాహంగా పాలు పంచుకొంటుంది. అవసరమైనప్పుడు తానే ముందడుగు వేసి ఇతర సంస్థలకు, ప్రభుత్వానికి ఉత్ప్రేరకంగానూ, ఉత్తేజకరంగానూ పనిచేస్తుంది.

తెలుగు భాష, సాహిత్యాల కోసం ఈ కార్యక్రమాలకు ఎటువంటి వనరులు అవసరమైనా తానా సభ్యులు వెనుకంజవేయకుండా సహాయం చేయటమే సంస్థ ముఖ్య బలం. తెలుగు మన భాష. దానిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనదేనని తానా సభ్యులందరి భావన.

డా.జంపాల చౌదరి

తానా పాలక మండలి అధ్యక్షులు, సైకియాట్రీ ప్రొఫెసర్, చికాగో

cjampala@gmail.com

తేట తెలుగుకు నారు పోసిన నార్ల

తెలుగు పత్రికా రచనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన వ్యక్తి నార్ల వెంకటేశ్వరరావు. చిన్న వాక్యాలు, చిన్న పేరాలతో తెలుగు జాతీయాలు, నుడికారాలు, పలుకుబడులను ప్రయోగిస్తూ పొంకంగా రాయడంలో సిద్ధహస్తులాయన. తేలికైన పదజాలంతో పదునైన భావాన్ని ప్రజాబాహుళ్యంలోకి చొప్పించారు. ప్రజల దైనందిన జీవితానికి దర్పణం పట్టడమే పాత్రికేయ పరమార్థమని ఉద్బోధించారు. ఆయన మేధ ఎంత నిశితమో మనస్సు అంత మెత్తన. సంపాదకీయ రచనలో నార్లది అందెవేసిన చేయి. ఆయనదో ప్రత్యేకమైన శైలి. రాజకీయ విమర్శనైనా, పుస్తక సమీక్షైనా సమగ్ర విషయపరిజ్ఞానం, సంపూర్ణ అవగాహన, తార్కికత నిండిన విశ్లేషణతో కూడి ఉండేవి. సంస్కృతి, సంస్కృత భాష రెండూ ఒక దానికొకటి సంబంధం లేనివని తార్కికంగా విశ్లేషించి కొంతమంది వితండవాదాన్ని ఖండిస్తూ సంస్కృతి- సంస్కృతంపై ఆయన వెలువరించిన సంపాదకీయ గుచ్ఛం ఆనాటి సమాజాన్ని విశేషంగా ప్రభావితం చేసింది. సరళమైన భాషలో ఉండే ఆయన సంపాదకీయాలు చదవడానికి ఆత్రపడని పాఠకుడు లేరంటే అతిశయోక్తికాదు. ఆంధ్రప్రభే నార్ల- నార్లే ఆంధ్రప్రభగా వెలుగొందిన రోజులున్నాయంటే సంపాదకుడిగా తెలుగు జాతిపై ఆయన వేసిన ముద్ర అవగతమవుతుంది. జనసామాన్యాన్ని ఉర్రూతలూగించే ఆయన సంపాదకీయాల్లో చిక్కనైన తెలుగు జాలువారేది. స్వాతంత్ర్య భానూదయ సమయాన జయజయ భారత జనయిత్రి దివ్యధాత్రి అన్న పెద్ద శీర్షికపెట్టి కింద "చిరదాస్య తిమిరాలను చీల్చుకుంటూ భారత స్వాతంత్ర్య భానూదయం" అని ప్రచురించి ఆ మధుర క్షణాలను ఆంధ్రుల మదిలో చిరస్మరణీయం చేశారు. 1947 ఆగస్ట్ ఆరు నుంచి 15వరకూ ఆయన ఆంధ్రప్రభలో రాసిన సంపాదకీయాలు భారతీయుల గుండెచప్పుళ్లను ప్రతిఫలింపజేశాయి. మహాత్ముడి హత్య నేపథ్యంలో- పతాక శీర్షికగా నాడు ఏసుక్రీస్తు శిలువకు బలి, నేడు మహాత్ముడు తుపాకీకి బలి అంటూ ఆయన రాసిన కథనం పాత్రికేయాన్ని కొత్త పుంతలు తొక్కించింది. గాంధీ నిలువెత్తు చిత్రం కింద 'ఇకలేడు... మరి రాడు' అంటూ శీర్షిక ప్రచురించి నాటి జనసామాన్య దుఃఖాన్ని రెట్టింపు చేశారు. గాంధీ అంత్యక్రియల సందర్భంలో 'గాఢాంధకారంలో భారతావని... స్వర్గధామంలో దివ్యప్రభలు' అని శీర్షిక పెట్టి నాటి ప్రజల మానసిక స్థితికి అద్దం పట్టారు. 1946లో ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా టంగుటూరి ప్రకాశానికి బదులు రాజాజీని ముఖ్యమంత్రిగా మహాత్మాగాంధీ సూచించడంతో నార్ల భగ్గుమన్నారు. సంపాదకీయ శస్త్రాస్త్రాలు సంధించి, గాంధీజీ నిర్ణయాన్ని గట్టిగా వ్యతిరేకించి ప్రకాశం పంతులుకు ఆ పదవి కట్టబెట్టడంలో కీలకపాత్ర పోషించారు. అదే ప్రకాశం పంతులు ప్రభుత్వం ఏడాది తిరిగేసరికల్లా ప్రజా వ్యతిరేక పాలనకు నడుం బిగించడంతో- 'ప్రజా ప్రభుత్వం' పేరిట వరుసగా అయిదు రోజుల పాటు సంపాదకీయ మాలిక వెలువరించి ప్రకాశం పంతులును పదవీచ్యుతుడిని చేసేవరకూ మడమతిప్పని ధీశాలి నార్ల. ప్రకాశం అభిమానులు ఆంధ్రప్రభ ప్రతులను తగులబెట్టినా వెరవక ముందుకుసాగిన పోరాట పటిమ ఆయన సొంతం. నిజాం హయాంలో రజాకార్ల దౌర్జన్యాలపై కథనాలు గుప్పించారు. నిజాం ప్రభువు ఆంధ్రప్రభపై నిషేధాజ్ఞలు విధించినా వెరవక తెలంగాణలో పత్రికను పంపిణీ చేసేందుకు స్వయంగా కార్యరంగంలోకి దూకారాయన. 1942లో బ్రిటిష్ ప్రభుత్వం పత్రికలపై ప్రీసెన్సార్‌షిప్ విధించడాన్ని నిరసిస్తూ కొద్ది రోజుల పాటు ఆంధ్రప్రభ ప్రచురణను నిలిపివేసి- ప్రజాగొంతుకను నులిమే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. 1975లో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అత్యయిక పరిస్థితి విధించిన సమయంలో సంపాదకీయం రాయకుండా పత్రికలో ఖాళీగా ఆ స్థానాన్ని వదిలేసి ప్రభుత్వంపై విలక్షణ పోరాటానికి తెరతీసిన ధీమంతుడాయన.

నవయుగాల బాట నార్ల మాట

'వాస్తవమ్ము నార్లవారి మాట', 'నవయుగాల బాట నార్లమాట' మకుటాలతో రాసిన పద్యాల్లో ఆయనపై వేమన ముద్ర స్పష్టంగా కన్పిస్తుంది. పొడిమాటలతో నిండి ఉండి అనంత భావార్థాన్ని మోసుకొచ్చే పద్యరాజాలవి. ఆధునిక కాలంలో అనుసరించాల్సిన నీతిసూత్రాలను వాటి ద్వారా సున్నితంగా ఉద్బోధించారు. ప్రతి పద్యం అరటి పండు ఒలిచి నోటిలో పెట్టినట్లు ఉంటుంది. అన్ని కాలాల్లోనూ విద్యార్థులకు ఉండాల్సిన లక్షణాన్ని 'ప్రశ్ననుంచి ప్రశ్న ప్రభవింపకున్నచో, నరుని జ్ఞానపరిధి పెరగబోదు, ప్రశ్నలేని బతుకు పసరంబులేని బ్రతుకురా' అన్న పద్యంలో వివ



"పత్రికొక్కటున్న పదివేల సైన్యమ్ము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షలేదు పత్రిక లేకున్న"

సమాజాభ్యున్నతిలో వార్తాపత్రికల ఆవశ్యకతను ఒకే ఒక పద్యంలో ప్రభావశీలంగా తెలియజేసిన ఉత్తమశ్రేణి సంపాదకుడు వీఆర్ నార్ల. పాత్రికేయ ప్రమాణాలకు సంబంధించి తెలుగునేలకే కాక యావద్భారతావనికీ ఆదర్శంగా నిలిచిన నార్ల వెంకటేశ్వరరావు- మన భాషకు కొత్త వెలుగులు ప్రసాదించారు. తెలుగు పత్రికా ప్రపంచానికి సరికొత్త శైలిని పరిచయం చేశారు. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి ప్రధాన సంపాదకులుగా (1942–1977) మూడున్నర దశాబ్దాల సుదీర్ఘకాలం ఆంధ్ర సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక, రాజకీయ రంగాలను విశేషంగా ప్రభావితం చేశారు. ప్రవృత్తినే వృత్తిగా పొందిన మహనీయుడు. పత్రిక ప్రజాజీవితానికి దర్పణంగా ఉండాలనే నార్ల తెలుగు భాష నానుడి, నుడికారం తెలిసినవారిలో అగ్రగణ్యుడు. పత్రికా భాషకు సాహిత్య గౌరవం కల్పించిన ఘనత నార్లదే. సత్యంపట్ల అనురక్తి అన్నింటికన్నా మిన్నగా భావించే ఆయన పత్రికా రచనే జీవితంగా సాగించారు. ఉన్నత శ్రేణి సంపాదకుడిగా విశ్వమానవదృష్టి, ధర్మాభినివేశం, శీల సంపద ఉండాలనే నార్ల తాను చెప్పిందే ఆచరించి అసమాన వ్యక్తిత్వంతో ఉత్తముల్లో ప్రథముడిగా నిలిచారు. స్వతంత్రంగా ఆలోచించి పరుల కోసం బతకడమే నార్ల తన ఇజంగా చాటి అలాగే జీవించారు.

రించారు. 'పరమపూజనీయగురుపాదులార్గురి, చెప్పుమన్న పేరు చెప్పవచ్చు!, ఎందు, కెప్పు, డేమి, ఎచ్చ, టెట్లు, ఎవరు' అని పద్యాల్లో కూర్చి ప్రజల్లో ప్రశ్నించే ధోరణి ప్రోది చేసే ప్రయత్నం చేశారు. 'సుందరాంగియైన సురకాంతయైనను, నెయ్యమెరగకున్న కొయ్యబొమ్మ, అందగత్తె కంటె అనురాగవతిమేలు' అంటూ సమాజజీవనానికి ఉండాల్సిన ప్రాథమిక సూత్రాన్ని గుదిగుచ్చారు. 'నరుడు లేక నారి చరితార్థ కాలేదు, నారిలేక నరుడు క్రూరుడవును, నలువ కలల పంట నారినరుల జంట' అంటూ దాంపత్యంలోని సమగ్రతను తేటతెల్లం చేశారు. 'సందు దొరికెనేని సడియు చప్పుడు లేక, మేత మేయువాడు నేత యగునె?, చేను మేయు కంచె సేమమ్ము నరయునా, నవయుగాల బాట నార్ల మాట' అంటూ రాజకీయ నాయకుల తీరును సునిశితంగా ఎండగట్టారు. 'మదురుగోడపైన కుదురుగా కూర్చుండి, గెల్చుచున్నవైపు గెంతువాడు, తల్లిగొంతునైన తడిగుడ్డ గోయురా' అంటూ ప్రజలను అప్రమత్తం చేశారు. వెయ్యి పద్యాలు పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నా 835 పద్యాలు మాత్రమే పూర్తి చేయగలిగారు.

తెలుగులో ఆలోచిస్తేనే జాతికి చైతన్యం

తెలుగులో ఆలోచించి, తెలుగు నుడికారంలో, తెలుగుదనం ఉట్టిపడేటట్లు రాయగలిగినప్పుడే తెలుగువారిలో మనం కదలిక పుట్టించగలమని భావి పాత్రికేయులకు నార్ల చేసిన దిశానిర్దేశం నేటికీ ఆచరణయోగ్యం. పత్రికారచనలో భాగంగా నార్ల ఎన్నో కొత్త పదాలు సృష్టించి వాడుకలోకి తెచ్చారు. సుదీర్ఘ సమాస భరిత వాక్యాలకు ఆయన దూరంగా ఉండేవారు. పామరులకు కూడా అర్థమయ్యే పదాలు వాడాలని తపించేవారు అవసరమైతే కొత్త పదాలు సృజించేవారు. ఆంగ్ల పదం వాడితేనే జనాలకు అర్థమవుతుందనుకుంటే వాడటానికి వెనకడుగు వేసేవారుకాదు. అన్య భాషా పదాలు చేర్చుకుంటే మాతృభాష మనుగడకు ప్రమాదమేం లేదని తలపోసేవారు. ఆదానప్రదానాలతో తెలుగు భాషా సౌష్టవం విరాజిల్లుతుందనేది ఆయన నమ్మిక. తెలుగు వాడుకలోని రెవెన్యూ పదాల్లో 90శాతం ఉర్దూ నుంచి తెచ్చుకున్న వైనాన్ని ఆ సందర్భంగా గుర్తు చేస్తారాయన. వైజ్ఞానిక పదజాలాన్ని భారతీయ భాషల్లోకి అనువదించడానికి జపనీయులను ఆదర్శంగా తీసుకోవాలని రాజ్యసభలో ఓ చర్చలో పాల్గొంటూ నార్ల చేసిన సూచన ఆచరణలో పెట్టాల్సిన తరుణమిదే.

ఆంగ్లభాషలోని యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్‌కు ఐక్యరాజ్యసమితి అని, యునెస్కోకు ప్రపంచ విజ్ఞాన సమితిగా, రిట్రీట్ అనే పదానికి తిరోగమనం, నాన్‌అలైన్‌మూవ్‌మెంట్‌కు అలీన విధానం, ఎన్‌సర్కిల్‌మెంట్‌కు దిగ్బంధం, రెఫ్యూజీకి కాందిశీకుడని తెలుగు సమానార్థకాలను సృష్టించిన ఆద్యుడు. విశాఖపట్నం ఓడరేవులో తవ్వే ఓడ (డ్రెడ్జర్)ను అక్కడ పనిచేసే కూలీలు 'తవ్వోడ' అని పిలిచి జనం భాష ప్రభావశీలతను చాటారని నార్ల తరచూ గుర్తు చేస్తూ తెలుగును వెలిగించుకోవడానికి మూలాలు ఎక్కడ ఉన్నాయో చెప్పకనే చెబుతారు.

బహుముఖ సృజన

తెలుగు సాహిత్యంలో నార్ల సృజించని ప్రక్రియ లేదంటే అతిశయోక్తి కాదు. భావ ప్రకటన స్వేచ్ఛకు అవరోధంగా పరిణమించిన దేన్నైనా ఎదిరించి పోరాడటమే ఆశయంగా ప్రజల్లో చైతన్యం నింపేందుకు నార్ల రచనా వ్యాసంగం సాగించారు. భారతీయ సంస్థానాలు, సంస్థానాధీశుల దుశ్చర్యలను 'స్వదేశీ సంస్థానాలు' పేరిట నార్ల 1933లో చేసిన తన తొలి రచనలోనే కడిగిపారేశారు. మచిలీపట్నం నోబుల్ కళాశాలలో బీఏ చదివే సమయంలోనే ఆయన దాన్ని పుస్తకరూపంలో వెలువరించారు. పెద్దగా ప్రచారం లేకుండానే నెలరోజుల్లోపే ఆ పుస్తకం వెయ్యి ప్రతులకుపైగా అమ్ముడుపోయిందంటే నార్ల ప్రజ్ఞాపాటవాలు ఏ పాటివో అర్థం చేసుకోవచ్చు. సామ్యవాదంపై ఆసక్తితో విద్యార్థి దశలోనే 'నేటి రష్యా' పేరిట రెండో రచన పూర్తి చేశారు. దాన్ని అప్పటి ప్రభుత్వం నిషేధించడంతో ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చింది. పత్రికా సంపాదకుడిగా నార్ల అందరికీ సుపరిచితులైనా- కవిగా, కథకుడిగా, గేయరచయితగా, వ్యాస రచయితగానూ రాణించారాయన. మా వూరు, నార్ల వారిమాట, జగన్నాటం, నవ యుగాల బాట నార్ల మాట ఆయన కవితా పటిమకు నిదర్శనాలైతే నాటికలకు- కొత్తగడ్డ, సీత జోస్యం, జాబాలి వంటివి ప్రసిద్ధి. వ్యాసాలు, విమర్శలకు మాటా-మంతీ, పిచ్చాపాటీ, మూడు దశాబ్దాలు పేరిట ముద్రితమైన సంపాదకీయాలు చెప్పుకోదగ్గవి. 1976 ఆగస్టులో 1944-77 నడుమ నార్ల రచించిన సంపాదకీయాలను సంకలనం చేసి మూడు దశాబ్దాల పేరిట వెలువరించారు. 'సీతజోస్యం'కు కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం లభించినా కొన్ని కారణాలతో నార్ల దాన్ని తిరస్కరించారు. నార్ల కలం నుంచి జాలువారిన హిరణ్యకశిపుని హత్య, పంచరత్నం అనే నాటకాలు పీఠికలు రాయక పోవడంతో ముద్రితం కాలేదు. మాఊరు, ఆషామాషీ,

సంస్కృతం- సంస్కృతి, సాబాడినేలియన్ కథలు వెలుగుచూడాల్సిన గ్రంథాల జాబితాలో ఉన్నాయి. ప్రసిద్ధ రష్యన్ కథలను తెనిగించి ఒక సంకలనంగా ప్రచురించారు.

తలమానికం కొత్తగడ్డ నాటికలు

నార్ల రచనలన్నింటికీ 'కొత్తగడ్డ' నాటికల సంపుటి తలమానికమని చెప్పవచ్చు. కృష్ణాజిల్లాలోని రైతుల జీవన విధానం, వనరులు, సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులను కళ్లకు కట్టారు. తరాల నడుమ వస్తున్న అంతరాలు, భావసంఘర్షణను నాటకాల్లోని పాత్రల ద్వారా తనదైనశైలిలో చిత్రీకరించారు. జానపదుల జీవనశైలి, మానసిక ప్రవృత్తిని చక్కగా చిత్రించి తెలుగు రంగస్థలాన్ని సుసంపన్నం చేశారు. అవినీతి జడలు విప్పుకొన్న తీరును 'దొంగ-దొర' నాటికలో వివరించారు. 'భావకవి' పేరిట రాసిన నాటికలో కవులపై వ్యంగ్యబాణాలు విసిరారు. తెలుగు భాషలోని తియ్యదనం, సామెతలు, పలుకుబడులను ఆ నాటికల్లో చక్కగా పొదిగి మాతృభాష ఉద్దీపనలుగా తీర్చిదిద్దారు. తన తొలి పౌరాణిక నాటకం జాబాలిలో వాల్మీకి రామాయణం ఆధారంగా నవీన దృక్పథాన్ని ఆవిష్కరించి నార్ల సఫలీకృతమయ్యారని చెప్పవచ్చు. పురాణ, ఇతిహాసాల్లోని కులవ్యవస్థ, భూస్వామ్య విలువలు, అశాస్త్రీయతలు మానవప్రగతికి కంటకంగా మారాయనే భావనతో నరకంలో హరిశ్చంద్రుడు, సీతజోస్యం, పంచరాత్రం వంటి నాటకాల్లో పౌరాణిక పాత్రల ద్వారా కులరహిత సమాజ ఆవశ్యకతను చాటారు నార్ల. సీత జోస్యం నాటకం చదివాక రామాయణ ప్రియులు, భక్తులు నార్ల వద్ద అనేక సందేహాలు లేవనెత్తి ఈ సీత మా దృష్టిలో సీత కాదని వాదించారు. దానికి నార్ల బదులిస్తూ 'ఈ సీత మీ సీత కాకపోవచ్చు, వాల్మీకి దృష్టికోణంలోని సీతనే యథాతథంగా నాటకంలో ప్రవేశపెట్టా' నని బదులిచ్చిన ధీశాలి.

నే మరణిస్తే... సాహసోపేతం నార్ల ఎలిజీలు

జగన్నాటకం అనే గేయ సంపుటిలో తనపై తానే 'నే మరణిస్తే' పేరిట రాసుకున్న 'స్వీయ స్మృతిగేయాలు'లో(ఎలిజీలు) లోకం ఎలా ప్రవర్తిస్తుందో ఊహించుకుని దాని పోకడను విమర్శించేంతటి మహాసాహసం ఒక్క నార్లే చేయగలిగారు. ఆ గేయాలు ఇలా సాగుతాయి 'నే మరణిస్తే, అంటారండీ, అంటారు తెలుగు జాతికి, తీరననష్టం వాటిల్లిందని, నోటి మాటగా....', 'నే మరణిస్తే, చేస్తారండీ, చేస్తారు పెక్కు ఆంధ్ర సభల నా, ఆత్మశాంతికై, తడయక తెగ బా...రెడు తీర్మానం...' 'నే మరణిస్తే, రాను, నిజంగా, రాను సోదెలో, కైనా గ్రిరున అయిదారు నెలలు తిరగక ముందే తెలుగుగడ్డపై...'. కొంత మందైనా మంచి మనుషులు ఉంటారని విలువైన సత్యాన్ని గుర్తిస్తారని నార్ల ఇలా దానికి ముగింపు పలికారు 'నే మరణిస్తే, ఏనా ఫొటో, ఏ యెదలోనో, చక్కని చీకటి, చీల్చగా పెట్టిన, దీపము మాత్రమే, దీటుగా నిలుచును, నే మరణిస్తే...'. కొంత మందైనా తన సందేశాన్ని కాపాడుకుంటారన్న ఆత్మవిశ్వాసం నార్లతో ఇలా రాయించిందని చెప్పవచ్చు.

ఆయన ఇల్లే ఓ పుస్తకా భాండాగారం

పుస్తకాలంటే నార్లకు మహాప్రీతి. పుస్తకాలను ప్రేమించే వారందరూ ఆయనకు అభిమానులే. ఒకటా రెండా; వెయ్యా రెండువేలా మొత్తం ఇరవైవేలకు పైగా పుస్తకాలను సేకరించడమే కాదు వాటన్నింటినీ ఆమూలాగ్రం చదివి విషయాన్ని ఔపోసన పట్టడం బహుశా నార్లకొక్కరికే సాధ్యమేమో! "పుస్తకాలు కొనడమంటే నాకు మహాసరదా. జేబులో డబ్బులు ఉన్నా, లేకపోయినా మంచి పుస్తకం కనబడగానే బేరం చేస్తాను" అని స్వయంగా నార్లే చెప్పారంటే పుస్తక సేకరణ పట్ల ఆయన ఆసక్తి తేటతెల్లమవుతోంది. వంట గది, మేడమెట్ల కిందిభాగం, కారు గ్యారేజీతో సహా ఇంట్లో అన్ని చోట్లూ పుస్తకాల బీరువాలతో బారులు తీరేవంటే అతిశయోక్తికాదు. సొంతంగా చేయించిన అందమైన బీరువాల్లో విషయాలు, అంశాల వారీగా పుస్తకాలు సర్దుకునేవారు. బుద్ధుడిపై అభిమానంతో హైదరాబాద్‌లో వానప్రస్థంలో నిర్మించుకున్న సొంత ఇంటికి లుంబినీ అని నామకరణం చేశారు. బౌద్ధం, జైనం, పాత్రికేయం, సామాజిక శాస్త్రాలు, చరిత్ర, చిత్రకళ, మానవతావాదం (హ్యూమనిజం), తత్వశాస్త్రం ఇలా ఎన్నో అంశాలపై అభిమానం పెంచుకుని పుస్తకాలను మథించారు. నార్ల గ్రంథాలయం యావద్భారతంలోని పుస్తకప్రియులు, పండితులు, పరిశోధకులు, పాత పుస్తక విక్రేతలను ఆకర్షించిందంటే అతిశయోక్తి కాదు. నార్ల సతీమణి సులోచన నలభై ఏళ్ల పాటు పుస్తకాలను భద్రపరచడంలో తన వంతు కృషి చేశారు. 1985లో నార్ల మరణానంతరం సైతం పుస్తకాలను కాపాడిన ఆమె చివరకు కుటుంబసభ్యుల సూచన మేరకు ఆ అపూర్వ గ్రంథ భాండాగారాన్ని హైదరాబాద్‌లోని బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి పరిశోధకుల వినియోగార్థం అప్పగించారు.

తరిమెల నాగిరెడ్డి, నీలం సంజీవరెడ్డి, వెలగపూడి రామకృష్ణలతో నార్ల

నార్ల ప్రస్థానం

వి.ఆర్. నార్లగా సుపరిచితులైన ప్రఖ్యాత తెలుగు పాత్రికేయ దిగ్గజం, సంపాదకుడు, కవి, రచయిత, నాటకకర్త, రాజ్యసభ సభ్యుడు నార్ల వెంకటేశ్వరరావు 1908 డిసెంబరు 1న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కట్నీలో సీతాలక్ష్మమ్మ, లక్ష్మణరావు దంపతులకు మొదటి సంతానంగా జన్మించారు. నార్ల పుట్టిన ఏడేళ్లకే కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో 1914లో కృష్ణాజిల్లాలోని గుడ్లవల్లేరు మండలం మాతామహుల స్వగ్రామం కవుతవరంకు రావాల్సి వచ్చింది. కవుతవరంలోని బోర్డు ప్రాథమిక పాఠశాలలో నార్ల విద్యాభ్యాసం ప్రారంభమైంది. చిన్ననాటనే బాల భటోద్య

మంలో చేరారు. గుడివాడలోని (నేటి ఎస్.పి.ఎస్ ఉన్నత పాఠశాల) జిల్లా బోర్డు హైస్కూలు, గుంటూరు హిందూ కాలేజి ఉన్నత పాఠశాలల్లో చదివి ఎస్.ఎస్.ఎల్.సి వరకూ చదివి 1928లో ఉత్తీర్ణులయ్యారు. కాకినాడ పిఠాపురం రాజా కళాశాలలో ఇంటర్మీడియేట్ చదువుతూ ఉండగా బ్రహ్మసమాజ ప్రభావం ఆయనపై పడి విగ్రహారాధన మాని నాస్తికుడిగా ఎదిగారు. 1931లో ఇంటర్ పూర్తి చేసి మచిలీపట్నం నోబుల్ కళాశాలలో బీఏలో చేరారు. బీఏ చదువుతున్న సమయంలోనే ప్రతిరోజూ కృష్ణాపత్రిక కార్యాలయానికి వెళ్తూ సంపాదకుడు ముట్నూరి కృష్ణారావు దృష్టిలో పడ్డారు. ఆదివారాల్లో డాక్టర్ పట్టాభి సారథ్యంలో నడిచే జన్మభూమి పత్రికకు వ్యాసాలు రాసేవారు. డిగ్రీ చదువుతున్న సమయంలోనే వేసవి సెలవుల్లో కృష్ణాపత్రిక ఉపసంపాదకుడిగా పనిచేశారు. బీఏ సమయంలో రాసిన నార్ల తొలి రచన 'స్వదేశీ సంస్థానాలు' పుస్తకాన్ని మెచ్చుకుంటూ కృష్ణాపత్రికలో ముట్నూరి కృష్ణారావు సంపాదకీయం రాయడమే ప్రోత్సాహకంగా స్వీకరించి - నార్ల ఆ తరవాత ఎన్నో సంచలనాలు సృష్టించారు. విద్యార్థిదశలోనే లాలాలజపతిరాయ్ సారథ్యంలో లాహోరు నుంచి విడుదలయ్యే ది పీపుల్ ఆఫ్ లాహోర్ ఆంగ్ల దినపత్రిక, పూణె నుంచి బాలగంగాధరతిలక్ సారథ్యంలో నడిచే మరాఠా పేరిట విడుదలయ్యే ఆంగ్ల దినపత్రికల్లో నార్ల వ్యాసాలు ప్రచురితయ్యేవి. 1934లో డిగ్రీ పూర్తి చేసిన నార్ల బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఎంఏ చేయాలని సంకల్పించి ఆర్థిక పరిస్థితులు అనుకూలించక మానుకున్నారు. 1935లో ఆంగ్ల జర్నలిజంలో చేరాలన్న కాంక్షతో మద్రాసు చేరుకున్న నార్ల, రామస్వామి మొదలియార్ సంపాదకత్వంలో విడుదలయ్యే జస్టిస్ పత్రికలో కొద్ది నెలలపాటు ఉద్యోగం చేశారు. అనంతరం సమదర్శిని, భారతి, ప్రజామిత్ర వంటి పత్రికల్లో ప్రచురితమైన వ్యాసాలు పత్రికా రచయితగా ఆయన స్థాయిని ఇనుమడింప చేశాయి. స్వరాజ్య అనే ఆంగ్ల పత్రికలో విలేకరిగా, ప్రూఫ్‌రీడర్‌గా, ఉపసంపాదకుడిగా, రాత్రిపూట సంపాదకుడిగా కొన్నాళ్లు పనిచేశారు. తన గురువు ఖాసా సుబ్బారావు చేతే నార్ల పనిరాక్షసుడిగా ప్రశంసలు పొందారు. అక్కడా ఎక్కువ కాలం పనిచేయలేకపోయారు. 1936లో పిఠాపురం మహారాజా ప్రజాపార్టీ ఆధ్వర్యంలో నడిచే జనవాణి పత్రికలో తాపీధర్మారావుకు సహాయ సంపాదకుడిగా నార్ల చేరారు. అభిప్రాయ భేదాలతో కొన్నాళ్లకే ప్రజామిత్ర తెలుగు వారపత్రికలో అసిస్టెంట్ ఎడిటర్‌గా పని కుదుర్చుకున్నారు. 1938 ఆగస్టు 1న ఆంధ్రప్రభలో న్యూస్‌ఎడిటర్‌గా ప్రవేశించిన నార్ల ప్రధాన సంపాదకుడిగా ఎదిగారు. ఆగస్టు 1, 1942 నుంచి 1959వరకూ ఆంధ్రప్రభ ప్రధాన సంపాదకుడిగా, 1959నుంచి 1977వరకూ ఆంధ్రజ్యోతి ప్రధాన సంపాదకుడిగా వ్యవహరించారు.

అప్పటి రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్‌తో షష్ఠిపూర్తి సందర్భంగా కలిసిన నార్ల దంపతులు

పదవులు, పురస్కారాలకే వన్నె

ఆంధ్ర, శ్రీవెంకటేశ్వర, నాగార్జున విశ్వవిద్యాలయాలు నార్లకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశాయి. 1958లో ప్రపంచ విజ్ఞాన సమితి(యునెస్కో) పదో సాధారణ సభకు భారతదేశ ప్రతినిధిగా హాజరై గౌరవం దక్కించుకున్నారు. 1958నుంచి 1972వరకూ రాజ్యసభ సభ్యుడిగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ నుంచి ఎన్నికయ్యారు. కేంద్ర సాహిత్య అకాడమీ, లలిత కళా అకాడమీ, నేషనల్ బుక్ ట్రస్ట్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో సభ్యుడిగా రాణించారు. 1945లో తూర్పు కోస్తానిధి, 1952లో రాయలసీమ క్షామనిధి, 1953లో గోదావరి వరద బాధితులకు నిధుల సమీకరించి రామకృష్ణ మిషన్ సాయంతో పంపిణీ చేయడంలో పత్రిక ద్వారా కీలకపాత్ర పోషించి ప్రజా సంక్షేమాన్ని మరువని మానవతామూర్తి డాక్టర్ నార్ల.

సహకారం: ఫణిప్రసాద్, గుడివాడ

డా॥ ఎర్నేని వెంకటేశ్వరరావు,
పూర్వ ప్రధానాచార్యులు,
ఏఎన్నార్ కళాశాల, గుడివాడ,
92901 86235

ఇంగ్లీషు తల్లికి మల్లెపూదండ



"మమ్మీ! వెజిటబుల్స్ పీసెస్‌గా కట్ చేసి పెట్టాను. ఇంకేం చెయ్యాలి?"

"పాన్ స్టవ్ మీద పెట్టు. కాస్త వేడి కాగానే ఆయిల్ వెయి. తర్వాత వెజిటబుల్ పీసెస్, పాన్‌లో వేసి ఫ్రై చెయ్యి. ఆవాలు, ధనియాలు, జింజర్ మిక్సీలో వేసి గ్రైండ్ చేశావుగా!'

"రెడీగా వుంది మమ్మీ"

తెలుగింటి తల్లీకూతుళ్లిద్దరూ మాట్లాడుకున్న సంభాషణలు విన్నారుగా! ఇదీ వరుస. వాళ్లు మాట్లాడుకున్న ఇంగ్లీషు మాటలన్నింటికీ చక్కని తెలుగు పదాలున్నాయి. 'కూరగాయలు ముక్కలు చేసి ఉంచాను' అని చెప్పడానికేం? 'నూనె' 'వేయించు' 'మూకుడు' లాంటి పదాలు వాడవచ్చుగా. 'మిక్సీ' 'ఓవెన్' లాంటి ఇంగ్లీషు మాటలకి తెలుగు వెతుక్కోనక్కర్లేదు. ఉన్న తెలుగు పదాల్ని ఇంట్లో ఉన్న వాళ్లు ఎందుకు వాడరు? వాడకపోతే పదాలు మరిచిపోరూ?

"మమ్మీ! పక్కింటి ఆంటీ, ఎదురింటి ఆంటీ వచ్చారు" అంటుంది కూతురు 'అమ్మా' అని పిలవడానికి నామోషీ. ఆంటీలంటే ఎవరు? ఆడవాళ్లందరూ ఆంటీలే; మగాళ్లు అంకుళ్లు. ఇంగ్లీషు ఇంట్లోకొచ్చి తిష్ఠ వేసి, నెత్తెక్కి కూచున్న తర్వాత, చక్కటి తెలుగు పదాలన్నీ అటకెక్కాయి. తెలుగు మాటలేని లేదా దొరకని ఇంగ్లీషు మాటయితే ఉపయోగించండి. పెన్సిలు, రోడ్డు, పెన్ను, స్కేలు, రీఫిల్ - పర్వాలేదు. బాట, దారి పోయి 'రోడ్' వచ్చి తెలుగు రోడ్డయిపోయింది. 'లేటు' మాటేమిటి? ఆలస్యం అన్న మాటలేదా? ఇంటికొచ్చిన పనిమనిషి దగ్గర్నుంచి అందరూ 'లేటు' అనే ఇంగ్లీషు మాటనే పలుకుతున్నారు. "ఎందుకే లేటుగా వచ్చావు?" అని ఇంటావిడా అలాగే అడుగుతుంది; పనిపిల్ల కూడా "లేటయిపోయింది ఆంటీ" అనీ అంటుంది. 'అమ్మ, అమ్మగారు' అనడాలు పోయాయి. అందరికీ ఆంటీనే, అందరూ ఆంటీలే, "బండిలేటా?" "ఆఫీసుకు లేటయిపోతుంది" "ఏంరా ఇంత లేటు?" - ఇవన్నీ రోజూ వింటూనే ఉన్నాం. 'ఆలస్యం' అనే మాట ఎందుకు ఉన్నట్టు? ఒక్కొక్క మాటనీ నిఘంటువునుంచి తీసేద్దాం!.

నిత్యం చేసుకునే సంభాషణలో ఎన్ని ఇంగ్లీషు పదాలు దొర్లుతున్నాయో ఆలోచించండి. పొద్దున లేచిన దగ్గర్నుంచి మాట్లాడుకునే మాటల్లో ఎన్ని తెలుగు మాటలు వాడాం? ఎన్ని ఇంగ్లీషు

అచ్చతెలుగు అంటే...

తల నెల వేసవి గుడి మడి
పులి చలి మడుఁగూరు పేరు బూరుగు మగవా
డలుకయని యెల్లవారికి
దెలిసిడి యాపలుకు లచ్చతెనుగున బరసన్

క్రీ.శ.12వ శతాబ్దికి చెందిన కవి కేతన 'అచ్చతెలుగు'కు ఇచ్చిన నిర్వచనమిది. ఆయన రచించిన తెలుగు వ్యాకరణ గ్రంథం 'ఆంధ్ర భాషా భూషణం'లో ఈ పద్యం కనిపిస్తుంది.

'తువ్వాలు' మనది కాదు!

కోస్తా, తువ్వాలు, బొప్పాయి, ఇస్త్రీ, కాజా, బొత్తము, గిడ్డంగి, గోదాము, పీపా, బాతు ... ఆంగ్లానికంటే ముందుగానే మన పలుకులో అంతర్భాగమైన ఓ యూరోపియన్ బాషా పదాలివి. నిజమేనండీ... పోర్చుగీసు భాష నుంచి వచ్చాయివి. ఉదాహరణకు.. 'తోవాల్య' అనే పోర్చుగీసు మాట 'మారి' తువ్వాలుగా మన ఇంటికొచ్చింది. మన దేశంలో మొట్టమొదట కాలుమోపిన యూరోపియన్లు పోర్చుగీసు వారేనన్నది చరిత్ర చెప్పే సత్యం. ఆ క్రమంలోనే వారు మన తెలుగు ప్రాంతాలకూ వచ్చారు. ఇక్కడి వారితో వర్తక, వ్యాపార సంబంధాలనూ పెట్టుకున్నారు. ఆ సమయంలోనే వారి భాషా పదాలు తెలుగులో కలిశాయి.

మాటలు వాడాం? లెక్క వేసుకొని చూసుకోండి. తమిళ దేశంలో గాని, మరొక రాష్ట్రంలో గాని ఈ పరిస్థితి లేదు. తెలుగు వాళ్లకే ఇది సొంత మైపోయింది. ఊరికే తెలుగు వాళ్లం అనీ, తెలుగు భాష గొప్పదనీ వట్టి మాటలు కట్టి పెట్టండి. ఇంగ్లీషుకే ప్రాధాన్యం ఇస్తూ ఉంటే తెలుగు అంతరించిపోతుంది. ఎన్ని ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినా, ఎన్ని తెలుగు సమావేశాలు జరిగినా ఒకటే. తెలుగు సమావే శానికి వెళ్తే ఏ ఒక్కరూ సమావేశం అనరు. మీటింగ్ అనే అంటారు. బయల్దేరుతున్నప్పుడు "మీటింగుకి వెళ్లాలి" అంటూ బయల్దేరుతారు! ఆ 'మీటింగు'ల్లో రెండు వాక్యాలు మాట్లాడితే, వాటిలో సగం ఆంగ్ల పదాలే ఉంటాయి.

తెలుగు విస్తృతమైన భాష. చిన్న చుక్క పెట్టకపోతే అర్థం మారిపోతుంది. అంతటి సున్నితమైన భాష. మా మిత్రుడొకరు, తండ్రి గారికి అరవై ఏళ్ల పూర్తయ్యాయని ఆహ్వానం పంపారు. 'షష్ఠ్యబ్దపూర్తి' అని ఉంటే "ఏం బాబూ! మీ నాన్న గారికి ఆరేళ్లా? ఆరు వెళ్లి ఏడు వస్తోందా?" అని అడిగితే "ఏం" అన్నాడు. " 'షష్ఠి' అని ఒత్తు ఠ రాస్తే ఆరు. ఒత్తు లేకుండా 'షష్టి' అంటేనే అరవై. అదీ, మన భాషకు ఉన్న చిక్కు అను... గొప్ప అను. ఒత్తుంటే ఒక అర్థం; లేకపోతే ఒక అర్థం" అన్నాను, నాకు తెలిసిన పాండిత్యంతో. "అయ్యో! అలాగా! తెలీదే" అన్నాడు నాలిక కరచుకొని. ఈ తప్పులు చేస్తూనే ఉన్నారు అందరూ. సభలు జరుగుతున్నప్పుడు వేదిక మీద కట్టే గుడ్డమీద రాసే రాతల్లోనే తప్పులు. 'యాంకర్' అనబడే ఒక అమ్మాయి "ఆహుతు లందరికీ నమస్కారం" అంది. 'హు'కి దీర్ఘం లాగేసింది. దాంతో అందరూ 'ఆహుతయిపో యారు!' తెలియకపోతే తెలుసుకోరు. తెలుసు కున్నా, తెలిసినా భాష మీద నిర్లక్ష్యం. 'అర్ధం' అంటే సగం. 'అర్థం' అంటే ధనం. ఒత్తులో అంత తేడా. ఎన్ని ప్రభుత్వ ప్రకటనల్లో "శంఖు స్థాపన మహోత్సవం" అని చూస్తున్నాం? 'ఖు' కాదు. 'కు' అని తెలీదా నిర్వాహకులకి!

ఇంకా 'గర్భిణీ స్త్రీలు' అనే రాస్తున్నారు ప్రక టనల్లో "గర్భిణీ స్త్రీ లేమిటండీ? గర్భిణీ పురుషు లుంటారా ఎక్కడైనా" అని ఎన్ని సార్లు అడిగినా, చెప్పినా అదే భాష.

"రేప్పొద్దున రండి" అంటే 'అలాగే' అని ఏ ఒక్కరూ అనరు. 'ఓకే' అంటారు. ఈ ఓకే ఒకటి తెలుగు వాళ్ల నెత్తిన ఎక్కి కూచుని నాట్యం చేస్తోంది. అన్నింటికీ 'ఓకే'. ప్రతివాళ్లూ ఓకే. "రేపు పొద్దున ఆలస్యం చెయ్యకుండారా" అని పనిపిల్లతో అని చూడండి. "ఓకే ఓకే ఓకే ఓకే" అనుకుంటూ వెళ్లిపోతుంది. ఒక్కొక్కరు ఎన్నెన్ని సార్లు అంటారో. ఈ 'ఓకే' 'ఓకే' అని 'అలాగే', 'తప్పకుండా' అన్న మాటలు తట్టవా వీళ్లకి?

'వన్ మినిట్' అన్నదీ అలవాటే. 'చిన్న మాట' అని చెప్పడానికీ, 'ఒక్కక్షణం' అనడానికీ అదేమాట. భర్త రమ్మని పిలిస్తే "వస్తున్నా వెయిట్ చెయ్యండి" అనడమే భార్య సంస్కృతి. "వస్తున్నా ఉండండి" అంటే ఆంగ్లం చిన్నబో తుందా?

తమిళనాడు ప్రభుత్వం తన ఆహ్వాన పత్రాన్ని తమిళంలోనే ముద్రిస్తుంది. అవే అన్ని రాష్ట్రాలకూ వెళతాయి. "అర్థం కాకపోతే తెలిసిన వాళ్లని అడగండి" అన్నది వారి భావం కావచ్చు. ఇంగ్లీషు దినపత్రికల్లోనూ ప్రకటనలు ఇస్తే తమి ళంలోనే ఉంటాయి. వాళ్ల భాష వాళ్లకి ముద్దు. మన సమావేశాల్లో గమనించండి. ఉన్న వాళ్లు, వింటున్న వాళ్లు అందరూ తెలుగువాళ్లే. ఉపన్య సించే ఆయనా తెలుగువాడే. కానీ ప్రసంగం ఆంగ్లం! ఆహ్వానం ఆంగ్లం!.

ఇద్దరు తెలుగు వాళ్లు ఇంగ్లీషులోనే ఎందుకు మాట్లాడుకుంటారు? తెలుగురాదు పాపం!

అసలు, తెలుగు వాడుక ఇంట్లోనే ఆరంభం కావాలి. ఇల్లాలు, భర్త, పిల్లలూ, పనిమనిషీ అందరూ తెలుగు మాటలు పలకాలి తెలుగు మాట కోసం వెతుక్కోవలసివస్తోంది అంటున్నా రంటే ఆంగ్లం అలవాటయిపోయింది! సిగ్గుచేటు! "మమ్మీ మేము స్కూలుకి వెళ్తున్నాం బై..." అనడం పిల్లలు మానేస్తే, "నేను ఆఫీసుకి వెళ్తు న్నాను బై" అనడం భర్త మానేస్తే, భార్య 'ఆల్ ది బెస్ట్' అనీ అనడం మానేస్తుంది. చిన్నా పెద్దా అని లేదు. 'బై' ఒకటి నాగరిక లక్షణం! పలకరిం పుల్లో 'హాయ్', 'వెళ్లొస్తాను'లో బై!..."సుగర్ అయిపోయింది. ఆయిల్స్ కూడా అయిపోవ చ్చాయి. రైస్ తీసుకోవాలి" అని భార్యా భర్తతో అంటుంది. 'పంచదార' అన్నా బియ్యం అన్నా, భర్తకి అర్థం కాదు కాబోలు!

దైనందిన జీవితంలోనూ, ఇంట్లోనూ, మిత్రుల దగ్గరా తెలుగులోనే మాట్లాడుతూ ఉంటే "తెలుగుభాషని కాపాడండి, అది మిమ్మల్ని కాపాడుతుంది" అన్న మాటలు ఎందుకు పుడతాయి? ఉన్న తెలుగు పదాల్ని పలకండి. వాక్యంలో సాధ్యమైనంతవరకూ ఆంగ్ల పదం రాకుండా తెలుగులోనే తెలుగువాళ్లు మాట్లాడగలిగితే చాలు. తెలుగు భాషను ఉద్ధరించినట్టే!

రావి కొండలరావు
సినీనటుడు, నాటక ప్రయోక్త, హైదరాబాద్
9848071175

ఇలా 'నెట్టు' కొద్దాం!

ప్రపంచంలో ప్రతి వంద మందిలో ముప్పై ఆరుగురు అంతర్జాల వినియోగదారులే. వీరిలో 16మందికే ఆంగ్లం తెలుసు. మిగిలిన వారెలా అంతర్జాలాన్ని ఉపయోగించుకుంటున్నారు? జర్మనీ, జపాన్ వాసుల్లో 80 శాతం మంది వారి మాతృభాషలోనే ఆన్‌లైన్ వ్యవహారాలను నిర్వహిస్తున్నారు. చైనాలో అయితే 64 శాతం మందిది ఇదే పద్ధతి. ఐరోపాలో ప్రతి పదిమందిలో తొమ్మిది మంది తమ అమ్మభాషలో ఉన్న వెబ్‌సైట్లనే చూస్తారు. వాటిలో తగిన సమాచారం లేకపోతేనే ఆంగ్ల సైట్లలో అన్వేషిస్తారు. అదే తెలుగు వారి విషయానికి వస్తే... ఆంగ్లానికే అగ్రతాంబూలం.

'యూనికోడ్'లో తెలుగు రాసే అవకాశం ఉంది కదా. లేఖిని (lekhini.org), బరహా(baraha.com) ఈ -పలక (epalaka.com) వెబ్‌సైట్లలోకి వెళితే చక్కగా తెలుగులో రాసుకోవచ్చు. 'యూనికోడ్' అంటే మరేమీ లేదు... మన భాషనే ఆంగ్ల వర్ణమాల సహాయంతో రాయడం. ఎ-ఎం-ఎం-ఎ అని ఆంగ్లంలో టైపు చేస్తే తెరపై 'అమ్మ' అని వస్తుంది. దాన్ని కాపీ చేసుకుని ఎక్కడ కావాలో అక్కడ అతికించుకోవచ్చు కూడా. ఫేస్‌బుక్ లాంటి సామాజిక అనుబంధాల సైట్లకే కాదు జీమెయిల్‌లోనూ తెలుగులో మెయిల్స్ సౌలభ్యం ఉంది. ఇలాంటి వాటి వల్ల అంతర్జాలంలోనూ తెలుగు శోభ తళుకులీనుతుంది.

ఆటలు ఆడి... పాటలు పాడి
బాలల విందు... మహానందు

బాలోత్సవం

నర్తించండి – కలకాలం గుర్తుండేలా
పాడండి – స్వేచ్ఛాగానకోకిలలై
మాట్లాడండి – ఆత్మవిశ్వాసమే ఆయుధంగా
నటించండి – జీవితంలో బాల్యం ఓ గుర్తుగా
విశ్లేషించండి – అనంత జ్ఞానసాగరాన్ని మధిస్తూ
చూడండి – వేల వేల కళ్లని పొదువుకొని
మళ్లీ మళ్లీ రావు – ఆ తీపి జ్ఞాపకాలు
బాల్యాన్ని వెతుక్కుంటూ వచ్చిన అందరూ మీ మిత్రులే!

బాలోత్సవ్ ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే కనిపించిన వాక్యాలివి. 21 ఏళ్ల క్రితం 150 మందితో చిరుదివ్వెలా మొదలైన ఉత్సవం ఏటికేడు పెరిగి వందరెట్లుగా ప్రభవించింది. నవంబరు 8న ఉత్సవం ప్రారంభమైంది మొదలు... వసంతం కాకున్నా కోకిలమ్మలు కుహు కుహు రాగాలు ఆలపించాయి. ఆషాఢ మేఘాలు ఆవరించక పోయినా మయూరాలు నాట్యమాడాయి. రంగు రంగుల సీతాకోక చిలుకలు, స్వేచ్ఛా విహంగాల సవ్వళ్లు, జానపదాల జావళీలు, సినీ గీతాల పూదోట గుబాళింపులు, తెలుగు సంస్కృతీ, సంప్రదాయ సందళ్లతో ఆనందం తాండవించింది. సకల కళా సమాహార వేదికగా ఆవిర్భవించింది కొత్తగూడెం పట్టణంలో బాలోత్సవ వేదిక. 'నల్లబంగారంగా' ప్రసిద్ధి చెందిన చోట 'బాలల ప్రతిభా హరిత వనాన్ని' నెలకొల్పింది.

తొలిరోజు కడప నుంచి వచ్చిన కామిశెట్టి వెంకట్ పతాకావిష్కరణ చేయడంతో బాలోత్సవ్ ప్రారంభమైంది. బాలురకు ప్రాతినిధ్యం వహించిన వెంకట్ ఎవరా అని తరచి చూస్తే పలు ఆశ్చర్యకర విషయాలు తెలిశాయి. వెంకట్ అందరిలాంటి బాలుడు కాడు - ప్రత్యేకం. ఆటిజం, హైపర్ యాక్టివిటీతో బాధపడుతున్నాడు. అయితేనేం! ఎదుటివారి పెదాల కదలికల్ని బట్టి మాటలని, పాటలని గ్రహించేయగలడు. శృతిని బట్టి అప్పటికప్పుడు పాటని అల్లడం, పాట ఇస్తే శృతి చెప్పడం అతని ప్రత్యేకత.

'పతాకావిష్కరణే ఇంత విభిన్నంగా ఉంటే, ఇక ఉత్సవ పతాక స్థాయి ఎంత గొప్పగా ఉంటుందో' అనుకుంటూ ఆరంభ సభకి చేరుకున్నారంతా. సభా ప్రాంగణం పిల్లల కేరింతలతో మారుమోగిపోతోంది. ఆ పిల్లలు అల్లరి మానెయ్యాలంటే, వారిని సంభ్రమాశ్చర్యాలకి గురిచేయాల్సిందే! అలాంటి ప్రదర్శనే ఇచ్చారు కొత్తగూడెంలోని ఇ.కె.బాలభాను విద్యార్థులు. 'మనమంతా ఒక్కటే, మన ధ్యేయం ఒక్కటే - హెచ్చుతగ్గులన్ని తుచ్ఛమైన భావాలు' అంటూ భారతీయ సంప్రదాయ నృత్యాలన్నీ మేళవించిన నృత్య రూపకాన్ని ప్రదర్శించారు.

ప్రదర్శనలన్నీ ముగిసి అతిథులు వేదికపైకి రాగానే ఓ కోలాహలం, 'ఆయనే వాసిరెడ్డి రమేష్' అన్న మాటలు. 21 ఏళ్ల క్రితం కొత్తగూడెం క్లబ్ నూతన కార్యదర్శిగా ఎన్నికైన రమేష్ 'క్లబ్' అనే మాట పట్ల ప్రజల్లో ఉన్న అపోహని పోగొట్టడానికి

నిశ్చయించుకున్నారు. అలాంటి సద్భావనతో మొదలైందే బాలోత్సవ్. ఏటికేడు ఉత్సవంలో పాల్గొనే పిల్లలు పెరుగుతున్నా వెనక్కి తగ్గలేదు. క్లబ్ వ్యవస్థాపక సభ్యులు కోనేరు నాగేశ్వరరావు వంటి వారి సహకారంతో, కేసీపీ, తానా, నోవా అగ్రిటెక్ వంటి సంస్థల ఆర్థికసాయంతో బాలోత్సవ్‌ని నిర్వహిస్తూనే ఉన్నారు. అన్ని సౌకర్యాలూ ఉన్నా ఓ ఉత్సవాన్ని నిర్వహించడం కష్టం. అలాంటిది ఓ చిన్న పట్నంలో ఎటువంటి ప్రభుత్వ సహాయం లేకుండా, వేలాదిమంది పిల్లలను మూడు రోజులపాటు కంటికి రెప్పలా కాపాడుకోవడం మాటలా! అందుకే 'మా కొత్తగూడెం ఇళ్లల్లో గదులు చిన్నవేగానీ, మా వాళ్ల హృదయాలు పెద్దవి' అంటారు రమేష్. ఎందుకంటే చాలామంది పిల్లలకు స్థానికులే ఆశ్రయమిచ్చి ఆత్మీయతలను చాటుకున్నారు.

ప్రారంభ సభకు విచ్చేసిన అతిథులంతా వేల బాలకృష్ణులను చూసి మురిసిపోయారు. 'ఆశల రెక్కలు తొడిగి నన్ను ప్రపంచయాత్రకు పురికొల్పిన బాలోత్సవ్‌కు ఎప్పుడూ రుణపడి ఉంటాను' అని కవి అందెశ్రీ అంటే, 'ఎన్నో మహాసభలకంటే చాలా గొప్పదీ బాలోత్సవ్' అని కితాబిచ్చారు రచయిత జూలూరి గౌరీశంకర్. 'ప్రపంచంలో నెగ్గుకురావడానికి అన్నీ తెల్సుకుంటూనే వాళ్లలోని సున్నితత్వం కాపాడుకోవాలి' అని సూచించారు ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్.

ప్రతి గుండెలో జరగాలి

బాలల్లో ప్రక్షిప్తమైన కళలను ఆవిష్కరింపజేయటానికే ఈ వేదికను ఏర్పాటు చేశాం. 1991లో ప్రారంభించి ఇరవై సంవత్సరాలుగా నిర్వహిస్తున్నాం. బాలల అభ్యున్నతిని కోరి స్వేచ్ఛ, బాలల హక్కులు వారికందిస్తున్నాం. ఇది పోటీలకు వేదిక కాదు. సంస్కృతీ, సంప్రదాయ సంబరాల గుబాళింపు. ప్రశ్నించే తత్వాన్ని నేర్పుతుంది బాలోత్సవ్. తల్లిని, మాతృభాషని, మాతృదేశాన్ని మరవొద్దని చెబుదాం. అవి మరచిననాడు మన ఉనికిని కోల్పోతామని వివరిద్దాం. మధిరలో ఒకరు తన తండ్రి పేరున బాలోత్సవ్ నిర్వహిస్తారు. ఈ బాలోత్సవ్ ప్రతి ఊర్లో, ప్రతి ఇంట్లో, ప్రతి హృదయంలో జరగాలి. పిల్లల్లో సేవా భావం పెరగాలన్నదే మా ఆకాంక్ష. మా ఊపిరి ఉన్నంతకాలం ఈ బాలోత్సవ్‌ని నిర్వహిస్తూనే ఉంటాం.

-డా॥ వాసిరెడ్డి రమేష్, బాలోత్సవ కన్వీనర్, కొత్తగూడెం.

కూచిపూడితో మనోవికాసం

శాస్త్రీయ నృత్యం అభ్యసిస్తున్న వారికి భాషమీద అవగాహన ఉండాలి. అభ్యాసంలో వేగం ఆసక్తి పెరిగింది కానీ, అది అర్థవంతంగా ఉండాలి. త్రివిధ నాయికలు, పంచావస్థలు, ముప్ఫై నాలుగు సంచారీ భావాలు, విలంబితాల్లో నృత్యం సాగుతుంది. వాటిపై అవగాహన పెంచుకోవాలి. నృత్య భంగిమల్లో నవ్వొక భాగం. ఆ నవ్వుల్లో రకాలు తెలియాలి. పదం, భావం, అష్టపది కనబడటంలేదు. కూచిపూడి నేర్చుకోవవడం వల్ల భాష వస్తుంది. మనోవికాసం కలుగుతుంది.

- పి. ఉమామహేశ్వరపాత్రుడు, నటరాజ రామకృష్ణ ఆర్ట్ అకాడమీ, హైదరాబాద్

మాటలు అయిపోయాయి, ఇక ఆటపాటలు మొదలయ్యాయి. కొత్తగూడెం క్లబ్‌లోను, ఆ చుట్టుపక్కలా ఉన్న పది ప్రాంగణాలలో ఇరవై అంశాలలో పోటీలు మొదలయ్యాయి. పిల్లల వయసుల వారీగా వారిని మూడు విభాగాల్లో చేర్చారు. నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు సబ్-జూనియర్స్, ఐదు నుంచి ఏడో తరగతి వరకు జూనియర్స్, ఎనిమిది నుంచి పదో తరగతి వరకు సీనియర్స్‌గా పిల్లలు పోటీల్లో పాల్గొన్నారు. బాలల ప్రతిభా వికాసాన్ని పరికించి చూస్తే 'మీదే మీదే సమస్త విశ్వం! మీరే లోకపు భాగ్య విధాతలు! మీ హాసంలో మెరుగులు తీరును, వచ్చేనాళ్ళ విభాప్రభాతములు' అని శ్రీశ్రీ చెప్పిన మాటలు గుర్తు చేసేట్లున్నాయి.

పోటీలన్నది పేరుకేగానీ, పిల్లల్లో నిక్షిప్తమైన శక్తి సామర్థ్యాలను, సృజనాత్మకతను, మేధస్సును వెలికి తీయాలన్నదే నిర్వాహకుల ఆశయం. సీతాకోకచిలుక ఆటలకీ, కోకిల పాటలకీ పోటీలేముంటాయి. ఈ మూడు రోజులూ పిల్లలు ఆడాలి, పాడాలి, విశ్లేషించాలి, వినోదించాలి - అంతే! ఇక్కడ ప్రతి ఒక్కరూ విజేతలే, చిన్నారులు చిన్నబోగూడదని బహుమతులకు అంతగా ప్రాచుర్యం కల్పించారు.

నాటకాల్నీ, చిత్రాలనీ అందరూ చూస్తారు.



పిల్లలు మరింత ఆసక్తిగా చూస్తారు. చూసిన దాన్ని విశ్లేషించడం అలవాటు చేయడానికి కథ, నాటకం, లఘుచిత్రాలపై పిల్లల విశ్లేషణకు పోటీలు ఉన్నాయి. విశ్లేషణ ఎందుకు చేయాలి, ఎలా చేయాలి అన్న ప్రాథమిక అవగాహన కల్పించేందుకు ఆయా రంగాలలోని నిష్ణాతులు ఎలానూ ఉన్నారు. లఘుచిత్రాల దర్శకుడు వారాల ఆనంద్, నాటకకర్త శాంతారాం, కథా విశ్లేషకులు వాసిరెడ్డి నవీన్ పిల్లలకు సూచనలు అందించారు. వక్తృత్వం, లేఖారచన, క్విజ్ వంటి ఇరవై అంశాలలో నలభైకి పైగా పోటీలు జరిగాయి. పాలుగారే బుగ్గలు, తేనెలూరే తెలుగుని మాట్లాడితే ఎలా ఉంటుంది. అందుకే పిల్లల్లో తెలుగు మాటలని ప్రోత్సహించడానికి 'తెలుగు మాట్లాడదాం' పోటీని నిర్వహించారు. పిల్లలు మాట్లాడితేనే ముచ్చటగా ఉంటే, కథలు చెబితే ఇంకెలా ఉంటుంది! కథ చెబుదామా వద్దా అని బెరుకుబెరుకుగా పిల్లలంతా తొమ్మిదో ప్రాంగణంలో కూర్చుని ఉన్నారు. 'పోటీ మొదలయ్యే లోపల మనం ఓ పాట పాడదామా' అని నాటకకర్త శాంతారాం అడగ్గానే 'ఓ' అన్నారు పిల్లలంతా. 'ఐదు రామచిలుకలు, ఒక్కటెగిరిపోయెను... టోయ్, టోయ్, టోయ్' అని పాడగానే, పాటలోని చిలకతో పాటు పిల్లల్లోని బెరుకు కూడా ఎగిరిపోయింది. వారు చెప్పిన కథలను శ్రోతలు ఇంతకుముందే విని ఉండవచ్చు. కానీ పాత కథలు కొత్త స్వరాలని సంతరించుకున్నాయి. 'పేదరాశి పెద్దమ్మా, పెద్దమ్మ కొడుకా.. నా పేరేంటి?' అని ఈగ కథని ఐదేళ్ల చిత్కళ చెబుతుంటే మాతృహృదయాలు చెమ్మగిల్లాయి.

బాలోత్సవ్‌లో పాల్గొన్న పిల్లల్ని గమనిస్తే, సందడి చేసే ఊహలతో పాటు సామాజిక స్పృహ కూడా వారిలో మెండుగా ఉందని స్పష్టంగా వెల్లడవుతుంది. కొన్ని నాటికలు చదువు ప్రాముఖ్యత ఇతివృత్తంగా సాగాయి. వేషధారణ పోటీలు పర్యావరణ కాలుష్యాన్ని ఎత్తి చూపాయి. పిల్లలేం చేయగలరు అన్న ప్రశ్నకు, ఏమైనా చేయగలరు అన్న రీతిలో వారి ప్రదర్శనలే సమాధానంగా నిలిచాయి. గోపిక విహరించే బృందావనాన్ని నిముషాల వ్యవధిలో రంగంపై నిర్మించారు, మహిషాసుర మర్దనాన్ని కళ్ల ముందు నిలిపారు.

చుట్టూ ఎన్నో పోటీలు జరుగుతున్నా, రెండో ప్రాంగణం దగ్గర జానపద కోలాహలం మటుకు సద్దుమణగలేదు. డా॥ మురళి వంటి న్యాయనిర్ణేతలు, అందెశ్రీ వంటి ప్రేక్షకుల సాక్షిగా మూడు రోజుల పాటు డప్పులు మోగుతూనే ఉన్నాయి, ఒకరి తర్వాత ఒకరు నాట్యమాడుతూనే ఉన్నారు. 'నా అందం చూడు మావయ్యో, సిరిసిల్ల చీర, బోనగిరి బొట్టూ...' అన్న పాట పదే పదే వినిపిస్తూనే ఉంది. నడిస్తేనే పాదాలు కందిపోతాయేమో అనిపించే చిన్నారులు... శబ్దాలు, తరంగాలు, కీర్తనలు, భామాకలాపాలు శృతి, లయ భరితంగా ప్రదర్శిస్తుంటే గురువులే ఆశ్చర్యపోక తప్పలేదు.

ఇక్కడ పిల్లలు కథలూ, కవితలూ రాయలేరన్న అపోహలు తొలగాయి. శాస్త్రీయ నృత్యాలు కనుమరుగైపోతున్నాయన్న భ్రమలు వీడాయి. అన్నింటికీ మించి పిల్లలంటే మన చుట్టూ కనిపించేవారే కాదని, నలుగురు పిల్లలు చేరిన ప్రతిచోటా తేనెపట్టులాంటి ప్రపంచం ఒకటి నిర్మితమవుతుందని తెలిసింది. వేలమంది విద్యార్థులు పది వేదికలపై గజ్జె కట్టి, డోలు వాయించి, గొంతు విప్పి, కవిత్వాన్ని చెప్పి, కలం ఝళిపించి, కుంచె ముంచి రంగులుపంచి, వ్యర్థాలకు అర్థాలను నిరూపించి, నాటకం, వాచకం, సాత్వికం, ఆహార్యాన్ని పండించిన తీరు సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది.

తమ పిల్లలు వివిధ అంశాల్లో ప్రతిభను ప్రదర్శిస్తున్నప్పుడు తల్లిదండ్రుల కళ్లలో మెరిసే సంతృప్తి ఉత్సవం కళ పెంచింది. తాము అక్షరాలు నేర్పే పిల్లల్లో ఇన్ని కళాత్మక, సంప్రదాయ, సాంస్కృతిక విలువలున్నాయని ఉప్పొంగిపోయారు గురువులు. ఒకరితో ఒకరు వివిధ అంశాల్లో పోటీ పడినప్పటికీ జయాపజయాల్ని సాధారణంగా తీసుకున్నారు పిల్లలు. అసూయా ద్వేషాలు ఇసుమంతైనా అంటని నిర్మల హృదయాలతో ఒకరినొకరు ప్రోత్సహించుకున్నారు. పరస్పరం అభినందించుకున్నారు.

తెలుసుకుంటూ, తెలిసింది తలుచుకుంటూ ఉండగానే బాలోత్సవ్ ముగింపునకు వచ్చింది. హృదయాలు భారమయ్యాయి. కానీ, మనసులు అనుభవాలతో పరిపుష్టమయ్యాయి. మూడు రోజులుగా వేల మంది పిల్లలకు భోజన వసతులు ఏర్పాటు చేసి అలసిపోయారు నిర్వాహకులు. అయినా పిల్లలు వెళ్లిపోతుంటే వారి కళ్లు చెమర్చాయి. ప్రేక్షకులు జరుగుతున్న కార్యక్రమాలని కెమెరాలలో బంధించారు. కెమెరాలు లేనివారు ఆ జ్ఞాపకాలని హృదయాలలో నింపుకున్నారు. బాలోత్సవ్ ఒక జీవితకాల జ్ఞాపకం, అటువంటి అనుభవాన్ని మళ్లీ పొందాలంటే 2013 వరకు వేచి ఉండాల్సిందే!

పెద్దలకూ పండుగ

ప్రతి సంవత్సరం మన మనసుల్లోని మాలిన్యాన్ని కడిగేసిన 'కొత్తగూడెం'గా మెరిసిపోతోందీ పట్నం. ఊపిరాడని బతుకులకు ఊరటనిస్తోంది బాలోత్సవ్. డా॥ రమేష్ ప్రిస్క్రిప్షన్‌లో మందులతో పాటు బాలోత్సవ్‌కు రమ్మని ఆహ్వానాన్ని కూడా జతచేయాలి. పిల్లలకే కాదు బాలోత్సవ్. పెద్దలు తమ పసితనాన్ని గుర్తు చేసుకొనే పండగ. ఇది బాలోత్సవ్ కాదు బాల్యోత్సవ్ కూడా. పిల్లల్ని 'అసూర్యంపశ్యలా' పెంచకూడదు. చదువుల పేరిట పిల్లల సృజనకు అందమైన సమాధులు కడుతున్నాం. స్వేచ్ఛనిచ్చి తరగతుల్లో పిల్లల్ని ప్రశ్నించనివ్వకపోతే సమాజాన్ని కూడా ప్రశ్నించలేరు. మూస విద్య ప్రగతి కారకం కాదు. ఆడనివ్వండి, పాడనివ్వండి. ప్రకృతి ఒడిలో సేదతీరనివ్వండి. మీ చిన్నతనంలో ఆడుకున్న ఆటలన్నీ వారికి బహుమతిగానివ్వండి.

- దేశపతి శ్రీనివాసరావు, ప్రజాగాయకుడు, హైదరాబాద్

'కళల వింబుల్డన్'

మన దేశంలో పెద్ద పెద్ద చదువులు చదువుకున్న వారు కూడా మూఢాచారాలను వదులుకోలేకపోతున్నారు. ఆత్మవిశ్వాసంతో జీవించలేకపోతున్నారు. కారణం సామాజిక నైపుణ్యాలు, జీవన నైపుణ్యాలు లేకపోవడమే. బాలోత్సవ్ వంటి కార్యక్రమాల వల్ల ఆ నైపుణ్యాలు అలవడతాయి. అవి జీవితాంతం ఉపయోగపడతాయి. ఏ కళ అయినా మనసుల్ని రంజింపజేస్తుంది. గొప్ప శాస్త్రవేత్తలు చాలా మంది కళల్లోనూ నిష్ణాతులే. బాలోత్సవ్ వంటి కార్యక్రమాల వల్ల భావసంపర్కం జరిగి వినూత్న ఆలోచనలు వస్తాయి. సృజనాత్మక దృష్టి ఏర్పడుతుంది. మనకు చాలామంది గొప్ప రాజులున్నారు. వారి పేర్లు తెలియకపోయినా నన్నయ, వేమన, తిక్కన, గురజాడ, ఇక్బాల్, గాలిబ్, జాషువా వంటి వారు చిరకాలం గుర్తుండిపోతారు. సృజనలో గొప్పతనం అదే. పిల్లలకు మంచి బాల్యాన్ని అందిస్తే దేశభవిష్యత్తు కూడా భద్రంగా ఉంటుంది. విద్య, వికాసం అంటారు. వికాసం కళల ద్వారా మాత్రమే వస్తుంది. సాంస్కృతిక రూపాల ద్వారానే మనకి సమాజం బాగా అర్థమవుతుంది. మనల్ని మనం సమాజంతో అనుసంధానించుకుంటాం. క్రీడల్లో వింబుల్డన్ ఎలానో కళల్లో బాలోత్సవ్ అలా ఉంది. ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన బృందానికి అభినందనలు అనడం చాలా చిన్న మాట అవుతుంది.

- ఎం. నాగేశ్వరరావు, ప్రిన్సిపల్, ఈనాడు పాత్రికేయ పాఠశాల

ప్రారంభ సభలో మాట్లాడుతున్న వాసిరెడ్డి రమేష్‌బాబు

అద్భుత వింతల ఉత్సవం

బాలోత్సవ్ ఇంతింతై వటుడింతై అన్నట్లు రాష్ట్ర బాలల సంబరంగా ప్రభవించింది. కోటి రాగాలు పలికిస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు బాలోత్సవానికి అడ్డురాలేవని నిరూపించింది. పిల్లలు ఆరుద్ర నక్షత్రాల్లాంటి వారు...

తెలుగు వెలుగు బృందం

పుట్టకు పెట్టిన బొట్టోలే, మట్టికి మొక్కిన మనిషోలే,
రాలిన వాన చినుకోలే, రంగుల సింగిడి మొలకోలే
పుట్టుకు వచ్చిన ఆరుద్ర పురుగును చూడమ్మో...
ఎర్రని సెలకల్లా నడిసొచ్చే వేకువ మొగ్గమ్మో
సిలకల ముక్కుల సందం సెలకల సిగ్గులొలికె సింధూరంలా
మైదాకెర్రగ పండిన చేతుల మరులు గొలిపె మందారంలా
నేలతల్లి గుండెల్లో పూసిన నెత్తురు ముద్దమ్మో
కన్నతల్లి కనుబొమ్మల నడుమ పడిసే పొద్దమ్మో
గురువిందా గుత్తులు పగిలీ ఇత్తులు రాలీ పడినట్లూ
పగిలిన నేలా సొరికెల నుంచి పగడాలోసుకున్నట్లూ
గుడ్డాలల్లో గునగున నడకల పెడ్డలపై పసిగుడ్డమ్మో...
చీమల వేటకు చిక్కకుండగా బతుకును... ఎడ్డి బతుకమ్మో
ముని వేళ్లతో నువ్వు ముట్టు కుంటివా అత్తి పత్తివలె ముడుసుక పోతది
స్పర్శను ఉట్టిగ పసిగట్టేసే... గ్రహణ శక్తి గమ్మత్తుగ ఉంటది.
సృష్టివిలాసపు అద్భుత వింతల చూడ కన్నులు చాలవులే...
కవితా శిల్పం, చెక్కిన చేతుల కాలమెపుడు పద చిత్రములే....

- డా అందెశ్రీ

బాలోత్సవంలో కవితా సొబగులు

కవితా హృదయానికి, రస స్పందనకూ వయసుతో నిమిత్తం లేదని నిరూపించాయి బాలోత్సవ్ బాలలు రాసిన ఈ కవితలు. ఇరవై నిమిషాల్లో 'రబ్బరు'ను కవితావస్తువుగా తీసుకుని రాయమంటే ప్రేరణ కోసం ఎదురు చూడకుండా, పంక్తుల కోసం తడుముకోకుండా చక చకా బాలలు రాసిన కవితలివి.

నా చిన్ననాటి నేస్తం

జూనియర్స్ మొదటి బహుమతి కవిత

మెత్తగా, బొద్దుగా ఉంటూ
నేను చేసిన తప్పులను
సరిదిద్దుతూ,
నా నల్ల కాగితాన్ని కూడా
తెల్లగా చేస్తూ
నన్ను ప్రమాదం నుంచి
కాపాడుతుంటావు.

బడిలో ఎప్పుడూ నాతో
ఉంటూ నన్ను కాపాడుతుంటావు
అదే నా జీవితంలో
నువ్వు ఉంటూ...
నేను చేసిన తప్పులను
సరిదిద్దితే ఎంత బావుంటుందో
చెప్పాలంటే నువ్వు ప్రతీ విద్యార్థికి
మంచి నేస్తం
కానీ పెద్దయ్యేకొద్దీ మనమధ్య దూరం పెరుగుతుంది
అయినా, నువ్వే నా ఉత్తమ స్నేహితురాలివి.

– పి.బ్రాహ్మణి, 6వ తరగతి, సెయింట్ పాల్స్, హుజూర్‌నగర్

రబ్బరుముక్క

జూనియర్స్ రెండవ బహుమతి కవిత

అమ్మ తుడుపుతుంది చెడును
పొరపాట్లను తుడుపుతుంది రబ్బరు.
నల్లబూడిదను తుడిపి
తెల్లకాంతిని వెలిగిస్తుంది రబ్బరు.
రబ్బరు, రబ్బరు
తెల్లని రబ్బరు.

హాయిగా ఉన్న తెల్లజీవితం
అందులో నల్లని చెడు -
రబ్బరు చెడుని తుడపగలదా?
రబ్బరు చెడుని తుడపలేదు.
కానీ అది మనం నల్లని బొగ్గుతో రాసే
తప్పులను తుడుపుతుంది.
తప్పులను సరిదిద్దుకోవడానికి
రబ్బరు ఒక మంచి అవకాశం
పెన్సిల్‌తో రబ్బరు జతకడితే
మనకు ఉండవు తప్పులు

మనం చేసే చెడును తుడపడానికి రబ్బరు ఉందా?
ఉంది, మనం చేసే మంచి పనులే
చెడును తుడపడానికి
ఉపయోగపడే రబ్బరు.

– వి.శ్రీజ, 6వ తరగతి, ఇ.కె.విద్యాలయ, కొత్తగూడెం

వెతుకుతున్నాను

సీనియర్స్ మొదటి బహుమతి కవిత

నేను ఒక రబ్బర్ కోసం వెతుకుతున్నాను
నా మనస్సులోని బాధను చెరిపివేయటానికి

నేను ఒక రబ్బర్ కోసం వెతుకుతున్నాను
జీవితం అనే తెల్లకాగితంపై పడిన నల్లమచ్చను చెరిపివేయటానికి

నేను ఒక రబ్బర్ కోసం వెతుకుతున్నాను
జీవితం అనే తివాచిపై పూసిన నల్లరంగును తుడిపేయడానికి

నేను ఒక రబ్బర్ కోసం వెతుకుతున్నాను
మన మువ్వన్నెల జెండాపై
కపట రాజకీయ నాయకులు వేసిన
బురదమరకను చెరిపివేయడానికి

నేను ఒక రబ్బర్ కోసం వెతుకుతున్నాను
మన సమాజం అనే తెల్లకాగితంపై
కులం అనే మహమ్మారి వేసిన మచ్చను
పూర్తిగా చెరిపివేయటానికి

నేను ఒక రబ్బర్ కోసం వెతుకుతున్నాను
యుద్ధాలు మన సమాజంపై వేసిన
రక్తపు మరకలను తుడిపివేయటానికి

నేను ఒక రబ్బర్ కోసం వెతుకుతున్నాను
ఆకలి బాధలు, మండే కడుపులు
మన సమాజంపై చల్లిన బురదను తుడిపేయడానికి.

– శివాని, 8వ తరగతి, హార్వెస్ట్ పబ్లిక్ స్కూలు, ఖమ్మం

నువ్వు లేక నేను లేను

సీనియర్స్ రెండవ బహుమతి కవిత

నా తప్పులను సరిదిద్దేదానివై
నా పొరపాట్లను పోగొట్టేదానివై
నన్ను మంచి మార్గంలో నడిపించేదానివై
నాకు ఎంతో సాయం చేశావు ఓ ఎరేజర్

నాకు నిన్ను ఇచ్చినప్పుడు కష్టంగా తీసుకున్నాను
కాని దాన్ని చాలా ఇష్టంగా వాడుకున్నాను
చాలా భద్రంగా నిన్ను దాచుకున్నాను
నువ్వు అరిగిపోతుంటే బాధపడ్డాను

తప్పులను చెరిపెయ్యగలుగుతావు
దానిని సరిగ్గా చేయగలుగుతావు
నీ బతుకు సార్థకత పొందుతావు
అందరికీ ఉపయోగపడతావు

ఓ ఎరేజర్ నువ్వు చాలా ఉపయోగపడుతున్నావు
తప్పులను తుడపగలుగుతున్నావు
తెల్లకాగితం అందానికి తోడ్పడుతున్నావు
కాని నువ్వు ఎందుకు తొందరగా అరిగిపోతున్నావు

ఓ ఎరేజర్ నువ్వు లేక నేను లేను
నేను చేసిన తప్పులను చెరుపుకోలేను
నేను మార్గంలో నడవగలగలేను
నా నేస్తమా.. నా ప్రాణమా.. ఓ ఎరేజర్..!

– బి.హిమవర్ష, శివశివాని పాఠశాల, కొత్తగూడెం

తెలుగూ! నలుదిక్కులలో వెలుగొందవే!



చుక్కారామయ్య
ప్రముఖ విద్యావేత్త,
శాసనమండలి సభ్యులు.

నిజాం నిరంకుశ పాలనలో తెలుగుభాష అణచివేతకు గురైంది. నాడు తెలుగు కోసం ఎంతో పోరాడాం. దురదృష్టం... ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక కూడా అవే పరిస్థితులు పునరావృతమవుతున్నాయి. నాడు బడిలో తెలుగు మాట్లాడటం మా దేశభక్తిగా తలచాం. ఉర్దూ పాఠశాలల్లో తెలుగు మాట్లాడినందుకు దండనలు ఎదుర్కొన్నాం. ఇవాళ ఇంచుమించు మన విద్యారంగంలో అదే దుస్థితి దాపురించిందని చెప్పడానికి బాధవేస్తోంది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు దశాబ్దాలుగా అణచివేతకు గురైన మన భాషా సంస్కృతులు, ఆలోచనలు, అనుభవాలు, అనుభూతులకు కొత్తరాష్ట్రం ప్రాధాన్యం ఇస్తుందని భావించాం. ఏడో దశకం వరకు అడుగులు అలాగే కనిపించాయి. ఇందుకు ఉదాహరణగా తెలుగు అధికార భాషాసంఘం, తెలుగు అకాడమీ లాంటి సంస్థలు ఏర్పాటు జరిగింది. ఎప్పుడైతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాజకీయ, ఆర్థిక పరిపాలనా రంగాల స్వరూప స్వభావాలు ప్రైవేటు వైపు మళ్లాయో అపుడే చాపకింద నీరులా తెలుగుకు ముప్పు వచ్చిపడింది. అమెరికా అవసరాలు తీర్చడమే భారత విద్యా విధానానికి లక్ష్యమైంది. ఇంగ్లిషు మీడియంలో చదివితేనే ఉపాధి అవకాశాలుంటాయనే ప్రచారాన్ని ఊదరగొట్టారు. ఎప్పుడైతే ఇంగ్లిషుకు డిమాండు పెరిగిందో అప్పటి నుంచి దానిని వ్యాపారం చేసేశారు. చివరకు ఎన్నికల్లో లబ్ధి పొందడానికి, అధికారంలో రావడానికి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియంను ప్రవేశపెడతామని చెప్పి ఓట్లు పొందారు. 'దేశభాషల్లో విద్యాబోధన జరిగినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని' దేశ తొలి ప్రధాని నెహ్రూ అన్నారు. రాష్ట్ర అవతరణ తరువాత వావిలాల, అయ్యదేవర, పి.వి.నరసింహారావు లాంటి పెద్దల చొరవతో అధికార భాషా సంఘం చట్టరూపం దాల్చి, వివిధ ప్రభుత్వ శాఖల్లో తెలుగు అమలుకు శ్రీకారం చుట్టారు. 1971 నుంచి ఇంటర్ స్థాయిలో, తరువాత డిగ్రీలో బోధనకు మార్గం ఏర్పరచారు. ఏపీపీఎస్సీ తెలుగు మీడియం విద్యార్థులకు ఐదు శాతం అదనంగా మార్కులు ఇచ్చేది. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న ఒక్కొక్క జీఓకు తూట్లు పొడుస్తూ చివరకు తెలుగు ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నారు. ఓ వైపు ప్రాచీన హోదా సాధించామని గొప్పలు చెబుతూనే మరోవైపు ప్రాథమిక స్థాయిలో తెలుగు అమలు కాకుండా తెరచాటు యత్నాలు సాగుతున్నాయి. భారత రాజ్యాంగంలోని 345వ అధికరణ పేర్కొన్న 'వివిధ రాష్ట్రాల్లో మాతృభాష' అమలు చట్టం ప్రశ్నార్థకమవుతోంది. కాళోజీ అన్నట్లు ఇంగ్లిషు మీడియం పిల్లలవి చిలుక పలుకులే కానీ పలుకుబళ్లు కావు. అతనికి చదువుకున్న విషయంపై అవగాహన, వివేచన ఉండవు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు 10వ తరగతి వరకు తెలుగు మాధ్యమంలో చదివి, ఆంగ్ల మాధ్యమ జూనియర్ కళాశాలలో చేరడం వల్ల అదనంగా భాషాభారం పడుతోంది. ఇక్కడ మాధ్యమం అన్నది గుదిబండగా మారి, ఓ విధంగా గ్రామీణ విద్యార్థుల్లో ఆత్మన్యూనతాభావం పెంచి, ఒక్కో ఆత్మహత్యకు కారణమవుతోంది. ఇటీవల అమెరికాకు వెళ్లొచ్చాను. అక్కడ మనవాళ్లు చాలా మంది ఉన్నారు. రాష్ట్రానికి దూరంగా ఉన్నా వాళ్ల ఇళ్లల్లో పిల్లలకు తెలుగు భాషాబోధన చేయిస్తున్నారు. తెలుగు పండుగలు, తెలుగు సంప్రదాయాల్ని నేర్పిస్తున్నారు. చివరకు అక్కడ తెలుగు వారు ఎంతో పోరాటం చేసి విశ్వవిద్యాలయాల్లో తెలుగు పీఠాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. దూరమైన కొద్దీ పెరుగునులే అనురాగం అన్నట్లు దూర ప్రాంతాలలో ఉన్న తెలుగు వారికి మన భాషపట్ల అభిమానం పెరుగుతుంటే తెలుగు రాష్ట్రంలో మాత్రం తెలుగు ఉనికి నామమాత్రం కావడం శోచనీయం. కారు చీకట్లో కాంతి కిరణంలాగ 'ఈనాడు' పత్రిక తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు అంకితమై చేస్తున్న కృషిని అభినందిస్తున్నాను. 'తెలుగు-వెలుగు' మరింత తేజంగా నలుదిక్కులా ప్రసరించాలని కోరుకుంటున్నాను.

అదేంటి

చొల్లంగి తీర్థానికి జీడిగింజలంతేసి,
పట్టిసం తీర్థానికి పత్తిగింజలంతేసి,
వాడపల్లి తీర్థానికి వడగళ్లంత,
కోరుకొండ తీర్థానికి కోడిగుడ్డంత.

పొడుపు కథల్లో కేవలం వినోదమే కాదు, విజ్ఞానమూ, సంస్కృతి ఉన్నాయని చెప్పేందుకు ఇదొక ఉదాహరణ. చొల్లంగి, పట్టిసం, వాడపల్లి, కోరుకొండ తీర్థాలు వరుసలో వస్తాయని చెప్పడం ఒక ఉద్దేశం. ఆయా తీర్థాల సమయంలో మామిడి పిందెలు ఎంత ఆకారంలో ఉంటాయో చెప్పడం రెండవ ఉద్దేశం. దీనికి ప్రాస కూడా తోడైతే (వాడపల్లి తీర్థానికి వడగళ్లంత) ఇక మరపు ఉండదు కదా! ఇటువంటిదే మరో పొడుపు కథ - శివరాత్రికి జీడికాయ, ఉగాదికి ఊరగాయ (మామిడికాయ).

ముంగిస కథ

బలివాడ కాంతారావు

వంశధార నది ఒడ్డునే మడపాం గ్రామంలో డాక్టరు అప్పారావుగారి ఇల్లు. నదికి తూర్పున ఎత్తైన ఒడ్డు. ఆ ఒడ్డు మీదనే అతని ఇల్లు. రెండు వాసాల్లో ఒకటి మిద్దెటిల్లు. రెండోది అటక మీద గడ్డినేత ఇల్లు, ప్రతి సంవత్సరం వరదల్లో ఒడ్డు కూలిపోతూందని సర్కారువారు కొండరాళ్లు వాలుగా పేరుపు పేర్చారు. ఇది పేర్చాక రెండు వరదలువచ్చినా ఒడ్డు చెక్కుచెదరలేదు.

ఈ ఏటి ఒడ్డున వేసవిలో, నీలగిరిలా ఉంటుంది. చలికాలంలో చలి ఊళ్లో కంటే హెచ్చే. అంగట నిల్చొని దక్షిణానికి పారే ఏరును చూస్తుంటే ఒళ్లు పులకరించే ప్రకృతి దృశ్యాలు అగుపిస్తాయి. దూరాన చరిత్ర ప్రసిద్ధికెక్కిన సాలిహుండా కొండ, ఎత్తయిన సరుగుడు చెట్లు, అరటి తోటలు, మబ్బులకు మనోహరమైన రంగులను ప్రసాదించే సూర్యాస్తమయం. ఫిబ్రవరి నెలలో చీకటి రాత్రి పడమటి ఆకాశంలో మెరిసిపోతున్న శుక్రగ్రహం పరుగు, మెల్లగా దిగువ జారుతున్న ఏటి గలగలల్లో చూస్తుంటే నాట్యానికి లయ కలిసినంత అందంగా ఉంటుంది.

ఈ ఏటి ఒడ్డున ఈ ఇంట్లో ఉన్న ఇబ్బందులు కూడా ఉన్నాయి. వర్షాకాలంలో బొబ్బలు పెట్టుకుంటూ చెట్లనూ, శవాలనూ తోసుకువచ్చిన వరద వెల్లువ పాములను కూడా జీవంతో తెచ్చేది. ఆ రాళ్ల సందుల్లో దాగున్న పాములు ఒక్కోసారి రాత్రివేళ ఇంట్లోనే ఉండేవి. ఒకనాడైతే ఒకపాము పైనుంచి పడుకునే మంచం మీదనే పడింది. ఆయుర్వేద వైద్యవృత్తితోపాటు వ్యవసాయం కూడా చేస్తున్న అప్పారావు పంటకాలంలో ముఖ్యంగా ఇంకో ఉపద్రవాన్ని కూడా ఎదుర్కోవలసి వచ్చేది. ఎంతో పదిలంగా, భద్రంగా దాచిన ధాన్యాలను ప్రతి సంవత్సరం నూటికి ఒక పదో వంతైనా ఎలుకలకూ, పందికొక్కులకూ ధార పొయ్యవలసిందే! ఈ రాళ్ల సందుల్లో దాగున్న ఎలుకలూ, పందికొక్కులూ రాత్రులు వీరవిహారం చేస్తూండేవి. పగలు కూడా అటకను పాలించి, వాటి మీద ఉంచిన తినుబండారాలు, మిరపకాయల బస్తాలు వగైరా పిప్పి చేసేసేవి.

ఈ ఉపద్రవం నుంచి బయటపడ్డానికి ఆయన బోను పెట్టాడు. పడిన ఎలుకలను చంపడానికి మనసేయలేదు. దూరాన వదిలేస్తే మళ్లీ ఆ మూషికరాజాలు, రాత్రింబవళ్లు పరుగెత్తి తమ గుంపులో చేరేవి. 'ఎలుకల' మందు ఒక్కసారే పెట్టాడు. చచ్చిన ఎలుకలు ముక్కి కంపు కొట్టేవి. ఇంట్లో ఉండలేకపోయేవారు. తరువాత అటక మీద నించి తెల్లని పురుగులు ఎలుకల నించి కింద భోంచేసేటప్పుడు రాలేవి. దానితో అతనికి భయం వేసింది. పెంచిన పిల్లి ఒకటి ఈ పందికొక్కుల సమూహానికి జడిసిపోయినట్లుంది. ఇంటో పడుకోదు. యజమానురాలు పడుకున్న మిద్దె ఇంట్లో పక్కనే పడుకుంటుంది.

డాక్టరుగారికి ఇద్దరు పిల్లలు. కొడుకు వెయ్యి మైళ్ల దూరంలో మిలటరీ ఆఫీసరుగా ఉంటున్నాడు. కూతురు అత్తవారింట్లో ఎనిమిదిమైళ్ల దూరంలో ఉంటుంది. వీళ్లకి ఎప్పుడు మనసు పుట్టినా ఇంటికి తాళం వేసి ఇద్దరూ ఉత్తరానికి కొన్ని వందల గజాలు నడిస్తే మర్రిచెట్టు ఉంది. ఆ నీడలో కూర్చొని కబుర్లు చెప్పుకుంటుంటే ఏ బస్సయినా ఎదురుగా ఉన్న రోడ్డుమీద ఆగితే ఎక్కి కూతురు దగ్గరకు వెళ్లి ఒకరోజు ఉండటం కద్దు.

డాక్టరు ఎందరి బాధలనో కుదర్చగలిగాడు గాని ఈ ఎలుకల, పాముల బాధ నుంచి విముక్తి పొందలేకపోయాడు.

ఒకనాడు ఉదయమే ఒక ఎరకలవాడు వచ్చాడు. పేదవాళ్లను ఒక కంట చూసే డాక్టరుబాబుకు ఒక ముంగిస పిల్లను తెచ్చాడు. వాంతులతో సరిసరైపోయిన పెళ్లాన్ని బాగుచేశాడని ఈ అరణం.

"ఇది నాకెందుకూ?" అన్నాడు డాక్టరు.

"బాబూ! మీకు పాములు, ఎలుకల బాధ. ఇది ఇప్పుడు బల్లిపిల్లలా ఉంది. ఆరు నెలల్లో పెరిగి పెద్దదయిపోతాది. అప్పుడు దీని మేలు మీకు తెలుస్తాది."

"పెంపుడు జంతువా ఉండటానికి?"

"మన తరిఫీదు బట్టి ఉంటాది బాబూ! పదిహేను రోజులు ఒక గూడులో తాడుతో కట్టిపెట్టండి. ఏ పిల్లీ, కుక్కా నొక్కేకుండా సూడండి. పాలన్నం తింటాది. సేపపిల్లలు



కట్టెయ్యండి దొరా!"

"మువ్వలు కడ్తే ఎలుకల్ని, పాముల్ని ఎలా పడుతుంది? పిల్లికి గంటలు కట్టిన చందం కదరా."

"అదికాదు దొరా! మువ్వలు మోగితే ఆ ముంగిస జాతి దీనిని దగ్గిరకు చేరనివ్వవు. వెలేస్తాయి. దానికింకో గతిలేక మనిల్లు వదల్దు."

ముంగిస పిల్లను పట్టుకోడానికి డాక్టరుకు భయం వేసింది. ఆ ఎరకలవాడే మెడకు తాడు కట్టాడు. అది ఉంచడానికి వాడున్నప్పుడే ఒక డొక్కు చూశాడు. పాలన్నం ఇచ్చినా ముంగిస పిల్ల తినలేదు. కర్‌కర్ అని అరుస్తూంది.

"అది అలా అరుస్తూంది- అదెక్కడ బతుకుతుందిరా?" అన్నాడు డాక్టరు.

"తల్లి నొదిలి ఉండటం కదా? రెండు రోజులు తల్లికోసరం ఏడుస్తుంది బాబూ!"

"ఎక్కడ దొరికిందిరా ఇది?"

"అదిగో బాబూ- ఆ రోడ్డు దిగువ మర్రిచెట్టు మీద."

"పదరా," అంటూ డాక్టరు లేచాడు. అక్కడ ఇద్దరూ వెళ్లేసరికి రెండు పెద్ద ముంగిసలు చెట్టు చుట్టూ మీదకున్న తొర్రలోనికి అదేపనిగా అరుస్తూ పరుగెత్తుతున్నాయి.

"పాపం, పిల్లను వెదుక్కుంటున్నాయి. నాకెందుకురా ఆ పాపం? తెచ్చి వదలేద్దాం."

"వద్దు, దొరా! ఆటికి మళ్లీ పిల్లలు పుడతాయి. కోపగించుకోకుంటే ఉన్న మాటంటాను- మీకు మరి పుట్టరు కదా! ఆ పిల్లే పెరిగి మీకెంతో ఉపకారం చేస్తోంది. అది పెంపకానికి ఎల్లింది దొరా! దాని తల్లీ, తండ్రీ మీరే ఇప్పుడు."

డాక్టరు ఒక్కడే తిరిగి వచ్చాడు. అప్పుడే డాక్టరు భార్య అమ్మాయమ్మ దాని గోలను కొంత పంచదార పోసిన రొట్టెముక్క నిచ్చి తగ్గించింది. రెండు మూడు రోజులకొకసారి ఆ ఎరకల ఎండన్న వచ్చి చూసి పెంచడం విషయంలో సలహాలిచ్చి పోయేవాడు.

అమ్మాయమ్మకు వంటా పెంటా అయ్యాక ఈ ముంగిసతోనే కాలం గడిచిపోయేది. అలా చూస్తుండగానే అది కాలిబొటన వేలంత అయిపోయింది. పదిహేను రోజుల్లో దానికి డొక్కులో పెట్టే అవసరం లేకపోయింది. తాడు మెడకు కట్టి అది ఎటు తీసుకువెళ్తే అటు తిప్పేది. చుంచుమూతి, మూతి చివర లేతెరుపు, ఊదారంగు, శరీరం, కొంత చీపురుకట్టలా తోక, చిన్నకళ్లూ, చెవులూ... గెంతుతూ నడుస్తూంటే మువ్వలు గలగలలాడుతున్నాయి. దానికి పేరు కూడా అమ్మాయమ్మ పెట్టింది.

"బయ్యన్న... బయ్యన్న..."

నెలరోజులకల్లా ఏ తాడు అక్కర్లేకుండా పోయింది. పేరు పెట్టి పిలిస్తే పరుగెత్తుకు వస్తూంది. రోజుకు రోజూ తండితో పెరిగిపోతూంది. మూడు నెలలకు చుంచెలకలా ఎదిగిపోయింది. ఇప్పుడు దాని నివాసం ఇల్లు కాదు. పెరట్లో ఉన్న కర్రడొక్కు కాదు. ఏటి ఒడ్డున రాళ్లపేరుపులో ఒక బిలం. ఉదయం కాఫీ వేళకి బిలం నించి బయటకు వచ్చి అటక మీదకెక్కిగోడల మీద నుంచి పాకుతూ ఘల్లుఘల్లుమంటూ మెల్లగా తిగువకు దిగుతుంది. అమ్మాయమ్మ ఆ మువ్వల మోత వినగానే, "బయ్యన్నా రారా..." అని పిలుస్తుంది. దానికోసం ఒక పాత చేట గోడ దగ్గిరే పరిచి ఉంటుంది. దాని మీద కూర్చొని ఒకసారి ముందు కాళ్లు రెండూ ఎత్తుతుంది. ఇడ్లీ పంచదార వెయ్యకుండా ఎదరపెడితే అలుగుతుంది. పంచదార వెయ్యగానే అంత ముక్క అయిదు నిమిషాల్లో మింగేస్తుంది. మళ్లీ తిరుగు ప్రయాణం. అటు ధాన్యపు గాదెలు, ఇటు అటక, ఇంటిచుట్టూ ఒకసారి సాయుధ భటునిలా తిరిగి మళ్లీ బిలంలోనికి వెళ్లిపోతుంది.

ఈ బయ్యన్న ఇప్పుడు ఇంట్లో ఒక ముద్దుపిల్లాడు. కడుపు నిండా పెట్టకపోతే వాడు ఎంతో మారాం చేస్తాడు. అమ్మాయమ్మ కాళ్లావేళ్లా పడతాడు. ఏ పని చెయ్యనివ్వడు. అదేపనిగా అరుస్తాడు. ఆమె మీదికే చెవిలో ఏదో చెబుదామని ఎగబ్రాకిపోతాడు. ఆ చిన్ని కాళ్లతో అడ్డాలలో పిల్లడు తల్లికి మూతితో, కాళ్లు చేతులతో గిలిగింతలు పెట్టినట్టు పెడతాడు.

బయ్యన్న వాళ్ల దృష్టిలో ఇంకా ఆర్నెల్ల పిల్లడే. కాని, వాడు ఇంటి యజమానైపోయాడు. ఇంటి యజమాని సాధించలేక, విసిగి వదిలేసిన పనులన్నీ ఈ ఆరునెలల యువకుడూ సాధించేవాడు. ఇంట్లో ఎలుకలు లేవు. పందికొక్కులింకెటు పారిపోయాయో? ఏ తుప్పలు పట్టేశాయో? పాము పిల్లయినా మచ్చుకు కనబడలేదు. పాము పొరలు వెతుకుదామన్నా ఏటి ఒడ్డున కనబడలేదు.

ఈ సంవత్సరం వాళ్లు ఎక్కడ, ఏది, ఎలా విడిచిపెట్టినా అలానే ఉంటూంది. కూరగాయలు బోనెపెట్టి మీద పడేస్తున్నారు. ధాన్యం ఒకోసారి అలా నేలమీదో, బుట్టల్లోనే ఉంచేస్తున్నారు. ఏటిపై వచ్చే చల్లగాలి హాయిగాపీల్చి వెన్నెలను తెరచాప చేసుకొని, నావలా కదిలే నీటిని చూస్తూ ఏటిఒడ్డున నిల్చుంటున్నారిద్దరూ. ఒకసారి వారి యౌవనపు రోజులు జ్ఞప్తికి తెచ్చుకుంటున్నారు. ఇదివరలా ఏ పామైనా కాళ్లకు చుట్టుకుంటుందన్న భయం లేదు.

అలా అంత రాత్రి మీద నిల్చునే ఇంట్లో

పాపడిని పిలిచినట్టు, "బయ్యన్నా, రారా..." అని పిలిస్తే ఒక్కసారి ఘల్లుఘల్లుమని మువ్వల చప్పుడు వినిపిస్తుంది. దగ్గరకు వచ్చి చుట్టూ ఇద్దరికీ నమస్కరిస్తున్నట్టు ప్రదక్షిణం చేసి తలెత్తి ఒక్కసారి అమ్మాయమ్మ పాదంపై కూర్చుంటాడు. ఆమె బయ్యన్నను చేతిలో తీసుకుని భుజం మీద కూర్చోబెట్టుకుంటే ఆ మూతితో ఆమె బుగ్గ నిమురుతాడు. "వెళ్లిపో బయ్యన్నా, నీ గూటికి," అంటే మళ్లీ ఘల్లుఘల్లుమంటూ వెళ్లిపోతాడు.

ఒకనాటి తెల్లవారుజామునే డాక్టరు ఇంటిముందు గంభీరంగా భైరవయ్య చేతిలో కర్రతో నిల్చున్నాడు. వాడు వీళ్లకు దూరపు చుట్టం. వీళ్లకు వాడికంటే జరుగుబాటు హెచ్చని కన్ను కుట్టుకుంటున్నాడు. ఏదో సాకుతో వీళ్ల మీద విరుచుకుపడ్డానికి ఉరుకతూంటాడు. కోపంతో భయంకరుడైపోతాడు. మాంచి పొంకంతో మెలితిరిగిన నల్లని బొద్దు మీసాలపై నిమ్మకాయలు నిలబెట్టగలనంటాడు. పెరిగిన జుత్తుకు వంకీలు తిప్పి వెనక్కి వదిలాడు.

వాకిట అయిదు చచ్చిన కోడిపిల్లలను విసిరి, "చూడు, మీ బయ్యన్న పని," అని హుంకరించాడు.

"ఏమైంద"న్నాడు డాక్టరు.

"నే చెప్పాలా? రాత్రి బయ్యన్న ఈ కోడిపిల్లల్ని నొక్కేసింది."

"ఎవరు చూశారు?"

"దీనికి సాక్ష్యం కావాలా?"

"నీవు కళ్లెర్రజేస్తే పనికిరాదు. అనవసరంగా మా బయ్యన్న మీద నేరం మోపక. అలాంటి పని చెయ్యదు. ఎవరో పిలిచి వేస్తే తింటాడు అంతే."

"నీకు సాక్ష్యమే కావలసి వస్తే తెస్తాను."

వాడి పొరుగు నుంచే సాక్ష్యం తెచ్చాడు. గడపలోనున్న కోడిపిల్లల్ని హతమార్చింది మీ బయ్యన్నేనని చెప్పగానే ఇది దొంగసాక్ష్యమని కేకలేశాడు డాక్టరు.

"వీటి ఖరీదు పది రూపాయలు. ఇచ్చేయి."

"అనవసరంగా నేనెందుకివ్వాలి? మా బయ్యన్న పీకలు కొరికే వీరుడు కాదు. నేను ఒక్క దమ్మిడీ ఇవ్వనంటే ఇవ్వను."

"సరే, పెద్దింటివాడివి. పసిమితో ఎగురుతున్నావు. నాకు నష్టం వచ్చింది. నీకు కాదుకదా! ఈ కోళ్లు నాకు హక్కుయినవి కావనుకుంటాను." అంటూ ఆ కోడిపిల్లలను ఏట్లోకి విసిరేశాడు. ఇట్టే ఎగురుతున్న గెద్దలు అందుకున్నాయి. వాటిలో అవి వెంట తరుముకున్నాయి.

కోపంతో ఇంట్లోకి వచ్చిన డాక్టరుతో భార్య అంది. "వాడు క్రూరుడండీ! పోనీ, కొంతలో కొంత ఇచ్చి సముదాయించలేకపోయారా?"

డాక్టరు ఖస్సుమన్నాడు. "వెధవ, అనవసరంగా మన బయ్యన్న మీద నిందలేస్తే పడతామా? అదే అక్కడకు వెళ్లుంటే ఘల్లుఘల్లుమని శబ్దం వినపడేది కాదా? ఆ పెట్ట అరిచేది కాదా? వీళ్లు లేచేవాళ్లు కారా?"

భైరవయ్య ఇంటికి పోయి నలుగురూ వింటూండగా, "పోయింది పొల్లు. మనం ఔనంటే ఆ పెద్దోడు కాదంటున్నాడు. వాడికది తిన్నన. మనకి కావలసింది జాగ్రత్త. మిగతా కోడిపిల్లల్ని జాగ్రత్తగా చూడు. ఇంట్లో ముయ్యి. మనం వీధిలో పడుకుందాం!"

పది రోజుల గడిచిపోయాయి. డాక్టరు దగ్గరకు మందుకి వచ్చాడు భైరవయ్య. డాక్టరు పైసా పుచ్చుకోకుండా మందిచ్చాడు. కోడిపిల్లల ఊసే మరిచిపోయారు.

పట్నంలో కూతుర్ని చూడ్డానికి డాక్టరు, భార్య ఉదయమే బయలుదేరారు. ఇల్లుకు తాళాలు వేశారు. పెరటి దొక్కులో పాలన్నం గిన్నెలో పెట్టి, "బయ్యన్నా, మధ్యాహ్నం తినరా! పట్నం వెళ్లి సాయంత్రానికి తిరిగి వచ్చేస్తాం. ఇల్లు జాగ్రత్త." అంటూ అమ్మాయమ్మ చెప్పి మరీ వెళ్లింది.

బయ్యన్న వాళ్ల వెంట వద్దన్నా పడ్డాడు. ఇద్దరూ మర్రిచెట్టు కింద బస్సుకోసం కూర్చుంటూనే ముంగిస అరుపులు విన్నారు. ఆత్రంగా తిరిగి చూసేసరికి ఒక ముంగిస కాదు- బయ్యన్న కాక మరి రెండు ముంగిసలు. ఆ రెండు ఆ చిన్న చెవులు రిక్కించి కోపంతో అరుస్తున్నాయి. బయ్యన్న దారికడ్డమయ్యాయి. బయ్యన్న వాటిని చేరాలని ఆత్రపడుతున్నాడు.

"అవిగో అవే, ఆ రెండు బయ్యన్న అమ్మానాన్నా," అన్నాడు డాక్టరు. ఇద్దరూ వింతగా చూస్తున్నారు. ఆ రెండు బయ్యన్న మీద ఉరకడానికి సిద్ధమౌతున్నాయి. బయ్యన్న కులం నుంచి వెలివేసిన మనిషిలా ఉన్నాడు.

"చంపగలవండి. వాటిని తోలండి." అంది భార్య. వాటిని అదిలించి, "రారా, బయ్యన్నా," అంటే మెల్లగా మూతి వంచుకుని అమ్మాయమ్మ దగ్గరకు వచ్చి పాదం మీద పడుకున్నట్లు వంగిపోయాడు. ఆమె ఎత్తుకోగానే మూతి దగ్గర మూతిపెట్టి మెల్లగా అరుస్తున్నాడు.

"మీ అమ్మానాన్నా నిన్ను రానివ్వలేదని ఏడుస్తున్నావా? మేం ఉన్నాం కదరా... నీ అమ్మను నేను, అరుగో మీ నాన్న... వెళ్లు ఇంటికి - ఇంట్లో నీవు లేకపోతే శత్రుమూకలు దాడి చేసేస్తాయి.. వెళ్లు, నాయనా... వెళ్లరా..." అమ్మాయమ్మ ఒక ముద్దు పెట్టుకొని కొంత దూరం వెనక్కు వచ్చి విడిచిపెట్టింది. రానురాను ఘల్లుఘల్లుమనే శబ్దం దూరమైపోతూంది. ఇంతలో బస్సు వస్తూంది. డాక్టరు పిలుస్తున్నాడు. తిరిగి రోడ్డువైపుకు పరుగెత్తింది. తిరిగివచ్చిన బయ్యన్న ఇంటి చుట్టూ అంతా సరిగ్గా ఉన్నాయో లేవో అని ఒకసారి తిరిగి వెళ్లి బిలంలో కూర్చున్నాడు.

పది గంటలయింది. ఇంకా పాలన్నం తినడానికి సమయం కాలేదు. ఆ సమయం వస్తే గంటలు విన్నట్లు మరీ వెళుతుంది. "బయన్నా, రారా..." అన్న పిలుపు ఒకసారి బిలం నుంచి వచ్చి చూశాడు. మళ్లీ పిలుపు. భైరవయ్య ఒడ్డులో నిల్చున్నాడు. వీధిలో ఎవ్వరూ లేరు.

"రారా, బయ్యన్నా... ఇదిగో చేప... రారా... రారా."

గంటల మోత వినిపించింది. చెంగుచెంగున రాళ్లన్నీ ఎగబ్రాకింది. భైరవయ్య చేతిలో చేప చూశాడు. కొద్దిగా జరిగాడు

బలివాడ కాంతారావు (1927-2000)

మూడువందలకు పైగా కథలతో, ఎనిమిది నవలల్లో విస్తరించిన సాహిత్య జీవితం వీరిది. అనేక పురస్కారాలతో పాటు 1972లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1998లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను అందుకున్నారు. పాత్ర చిత్రణలోనూ, కథానిర్మాణంలోనూ ఎంతో ఒడుపు చూపే రచయిత కాంతారావు గారు మధ్యతరగతి జీవన మందహాసాలను, వైరుధ్యాలను, చీకటికోణాలను, ఆనందానురాగాలను సున్నితంగా విశ్లేషిస్తూ అలవోకగా కథలు రాయగల సత్తా వారిది.



భైరవయ్య. ఒక్కసారి, "నీకోసం చేప తెచ్చానురా బయ్యన్నా. రారా..." అన్నాడు.

కొద్దిగా నక్కుతూ... కాస్త ముందుకు వస్తూ, మళ్లీ మూలదాగుంటూ... మళ్లీ ఒకసారి చూసి... మళ్లీ మందారచెట్టు చాటున దాగుంటూ అతని గొంతుక విని చివరకు వాకిటలో చేపను పసికట్టేశాడు బయ్యన్న.

అందుకోవడానికి ఘల్లుమని శబ్దం చేస్తూ ఉరికాడు. ఎదురుగా మునకాల కర్ర పట్టుకుని మీసం తిముడుతూ నిల్చున్న భైరవయ్య ఒక్కసారి దభీమని బయ్యన్న శరీరం మీద వేశాడు. బయ్యన్న ఒక్కసారి అరిచి, 'వద్దు! వద్దు! నేనేం పాపం ఎరగ'నన్నట్లు ఆ మూతి ఎత్తాడు. 'నీకో నమస్కారం. అనవసరంగా చంపకు,' అన్నట్టు ఆ ముందు కాళ్లు రెండూ లేచున్నాయి. మళ్లీ దభీమని ఇంకో దెబ్బ. బయ్యన్న కిలకిలా తన్నుకుంటున్నాడు. మరి రెండు దెబ్బలతో మూగబోయాడు.

భైరవయ్య తోక పట్టుకుని ఎత్తాడు. నోటి వెంబడి రక్తం కారుతూంది. ఆ చిరుపళ్లు కనిపిస్తున్నాయి. మనుషులను చంపగలిగే విషసర్పాలకు కొరికి కొరికి ముక్కలు చెయ్యగల పళ్లవి. పామును చూడగానే వీరావేశంతో గెంతి దెబ్బలాడగల కాళ్లవి. తెలేసి ఉన్నాయి. అంత చిన్న కళ్లయినా ఎలకల మందలను పందికొక్కుల మూకలను గడగడలాడించేవి. అలాంటి కళ్లు మూతబడినాయి. 'బయ్యన్నా, రారా' అంటే ఈ మానవాళి అరుపంతా సౌహార్దం, ప్రేమతో నిండి ఉంటుందనీ, వాళ్ల కరుణతో తనలాంటి జంతుజాలానికి కడుపు నింపుతారనీ ఆశతో ఆ పిలుపు వింటుండిన చెవులు శాశ్వతంగా చెముడయ్యాయి.

భైరవయ్య వీరావేశంతో ఆ తోక పట్టుకుని బలం అంతా ఉపయోగించి పారుతున్న ఏటిలోనికి బయ్యన్న శవాన్ని విసిరేశాడు. కింద రక్తం పడిన జాగాలో మన్నంతా ఎత్తి ఏటిలో పారేశాడు. ఏమీ తెలియనట్లు ఏటికిపోయి కాళ్లు చేతులు కడుక్కున్నాడు.

బయ్యన్న శవం ఏట్లో కొట్టుకుపోయింది. కుళ్లిపోలేదు. ఒక ఒడ్డుకు చేరింది. ఒక ఆకలిగొన్న గద్దకు ఆహారమైంది.

సాయంత్రం పొద్దు గుంకకుండానే ఉదయం పశువులను తోలుకు వెళ్లిన పసివాడు తిరిగి వచ్చాడు. పట్నం నుంచి డాక్టరూ, అమ్మాయమ్మా తిరిగి వచ్చారు. బయ్యన్నకు తీపి వస్తువులు ఇష్టమని, ఎండు చేపలు మరీ ఇష్టమని అమ్మాయమ్మ అవే కొనుక్కుని వచ్చింది.

ఇంటికి రాగానే ముందు బయ్యన్న తిన్నాడో లేదోనని పెరటిడొక్కులో చూసింది. పాలన్నం అలాగే ఉంది.

"చూడండి, మన బయ్యన్నకు ఎంత దర్జాయో! చెప్పి మరీ వెళ్లినా- తినలేదు."

"నీవు దగ్గిర ఉండి తినిపిస్తేగాని తినడే!"

సంచిలోని ఒక ఎండుచేపను తీసుకుని, అమ్మాయమ్మ ఏటి ఒడ్డుకు వచ్చింది.

"బయ్యన్నా, రారా... నీకిష్టమైనది తెచ్చాను రా... రారా... నాయనా... రారా..." పిలిచింది. మళ్లీమళ్లీ పిలిచింది. చీకటిపడ్డ వరకూ పెరట్లో, అంగట్లో, ఇంట్లో ప్రతిచోటా పిల్చింది.

"ఎక్కడ తప్పిపోయాడో, ఇంటికి తెచ్చి దిగబెట్టకుండా మధ్యను వదిలి వచ్చేశాను. ఆ పాడు బస్సు అంతసేపు రానిది, అప్పుడే వచ్చేయాలా? తోవలో ఏ కుక్క నొక్కేసిందో, ఏ పిల్లి దట్టేసుకుందో, ఆ రెండు ముంగిసలు వచ్చి దాని మీద పడ్డాయేమో?"

అంత చీకట్లో కూడా మొగుడితో కలిసి మర్రిచెట్టు వరకు కేకలు వేసుకుంటూ వెళ్లింది. పిల్చింది. తిరిగివస్తూ ఎన్నో విధాలా పిలిచింది.

ఇంటికి వచ్చినా వంట లేదు. నోట్లో మంచినీరైనా పొయ్యలేదు. రాత్రి అంతా జాగారం చేసింది. మధ్యన లేచివచ్చి ఏటి ఒడ్డున, "నాయనా, బయ్యన్నా నీకు తీపితీపి మిఠాయి తెచ్చానురా! నీకిష్టమైన చేపలు తెచ్చానురా! రారా... నాయనా... రారా..." అని పిలిచింది.

తెల్లవారినా ఆ ఘల్లుఘల్లు శబ్దం వినబడలేదు. ఉదయమే తలకు స్నానం చేసి దేవుని గదిలో గంటసేపు కూర్చొని, 'నా బయ్యన్నను నాకియ్య'మని మొక్కింది. నలుగురిచేత వెతికించింది. వాడు దొరికితే పూజపునస్కారాలు చేస్తానంది.

రెండు రాత్రిళ్లు గడిచిపోయాయి. బయ్యన్న జాడ తెలియలేదు. మూడో రాత్రి అటకపైన చప్పుడయింది. ఆత్రంగా లేచింది. అది ఘల్లుఘల్లుమన్న శబ్దం కాదు. వటుక్కు వటుక్కుమని శబ్దం వినిపిస్తూంది. లైటేసి చూస్తే అదివరలా బాహాటంగా ఒదిలేసిన ధాన్యాన్ని ఎలుకలు పచనం చేస్తున్నాయి. వాటిని తోలాలన్న మనసైనా పుట్టలేదు.

ఇప్పటికీ చేపలు కొంటే ఇది బయ్యన్నకని ఒకటి ఉంచుతుంది. ఒక కాగితంపై ఆ బయ్యన్న బొమ్మ గీసి కత్తిరించి, మెడకు మూడు మువ్వలు కట్టి ఆ డొక్కులో ఉంచుతుంది. గాలికి కదిలితే ఆత్రంగా వెళ్లి చూస్తుంది. పాలు కలిపిన అన్నం ఆ డొక్కులో పెడుతుంది. ఏ పిల్లులో పాలు కలిపిన అన్నం తింటే- అది బయ్యన్నే తిందేమోనని భ్రమపడుతుంది.

బయ్యన్న ఎక్కడో బతికి ఉన్నాడని, ఎవరో ఇనప గొలుసుతో కట్టేశారని, ఆ గొలుసు పటుకుపటుకుమని నమిలి, తెంపుకుని తనను చూడటానికి ఎప్పటికైనా వస్తాడని అమ్మాయమ్మ విశ్వాసం.

ఒకనాడు ఉదయం, పొద్దుకాస్త మీదికి లేచింది. భైరవయ్య ఇంట్లో నుంచి కోడిపిల్లలను వదిలాడు. పెట్టతో పిల్లలు ముందుకు కదిలి ఏటి ఒడ్డుకు వెళ్లాయి. డాక్టరు ఇంటి ఎదర వీధి అది. చింతచెట్టు కింద ఏటి ఒడ్డులో రాలిన గింజలను కోళ్ల పిల్లల సమూహం ఏరుకుంటున్నాయి. బయ్యన్న బాధ తప్పించుకున్నందుకు భైరవయ్య మురిసిపోతూ ఇంక కోళ్లను ఆ రాత్రి నుంచి అరుగుల మీద విడిచిపెట్టినా భయం లేదనుకున్నాడు. అంత శ్రమపడి పిల్లలు వేసిన ఆ కోడిపిల్లల రంగులు వేపు చూసి మురిసిపోతున్నాడు. ఇందులో నిత్యం గుడ్లు పెట్టే పిల్లలు, కోళ్ల పందేనికి పనికివచ్చే పుంజులను బాగా తయారుచెయ్యగలనని ధీమాగా అనుకున్నాడు.

అలా అతను చూస్తుండగానే తన కళ్లనే నమ్మనట్టు ఒక ముంగిస- బయ్యన్న కంటే మరీ పెద్దది, భీకరమైనది, లేత నలుపు రంగుది- కోడిపిల్లలపై ఉరుకుతూ ఒకదాన్ని పట్టుకుంది. భైరవయ్య పరుగెత్తి వెంట తరిమాడు. రాళ్లలో ఏ బిలంలోనికి పోయిందో ఎంత వెదికినా దొరకలేదు. తిరిగి మెల్లమెల్లగా అడుగులు వేసుకుంటూ కోళ్లను ఇంటివైపు తోలుకుని పెళ్లాంతో కోళ్లను ముయ్యమని చెప్పాడు.

భైరవయ్య మంచం ఎక్కాడు. తన కర్రతో కొడుతుండగా, నేరం ఎరుగని అమాయకమైన బయ్యన్న ఎత్తిన మూతి, జోడించిన చేతులు అదో మానవుడుగా, 'నాదేం తప్పులేదు. నన్ను చంపకు... చంపకు...' అని, నిండా ప్రాణంపై ఆశతో గగ్గోలు పడుతున్నట్లు తోచి, ఆ దృశ్యాన్ని మనస్సు నుంచి చెరుపుకోలేక నడుం జార్చేసుకున్నాడు.

సౌజన్యం: ఉషా పట్నాయిక్

మన దేశంలోనే కొన్ని ప్రాంతాల వారు ఎంతో అభిమానంతో తమ భాషే గొప్పదని ఇతోధిక ప్రోత్సాహకాలతో అభివృద్ధి చేసుకుంటున్నారు. మనకు మాత్రం ఎందుకనో అది పట్టడంలేదు. ఉపాధి మీద అపనమ్మకంతో పిల్లలకు తెలుగు నేర్పించటం లేదు. దీని వల్ల కన్న తల్లి వంటి తెలుగుకు ఒక విధంగా ద్రోహమే చేస్తున్నాం. ఎవరిని తప్పుపడదాం? దీనిక్కారణం మన భాషలోని లోపాలే కావచ్చు. శాస్త్రీయ మార్పులను ఓర్చుకోలేని, ఒప్పుకోలేని మన మనస్తత్వం మన పతనానికే మొగ్గుచూపుతోంది. ఏ భాషావాదులైతే తప్పొప్పులను తెలుసుకొని దిద్దుకున్నారో వారి భాషలే మహోన్నత స్థాయిని చేరుకున్నాయి. మనం కూడా మన తెలుగును సమృద్ధి చేసుకొని, అనుసంధానభాషగా మార్చుకుందాం. కలగూరగంపలా తయారవుతున్న తెలుగును కాపాడుకుందాం సాంకేతిక భాషగా సరిదిద్దుకుందాం.

విశ్వజనీనతా గుణాలున్న భాషే ఆదరణీయ భాష. విశ్వామోద యోగ్యత పొందాలంటే ఆ భాషకు అతి తక్కువ అక్షరాలు (ఆల్ఫబెట్స్) ఉండాలి. అలతి అలతి పదాల కూర్పు కావాలి. సాంకేతిక అనుబద్ధత నూతన పదసృష్టి, పొట్టి అక్షర పద పద్ధతులు ముఖ్యమైనవి. 26 అక్షరాలతో ఆంగ్లం ప్రపంచ భాషగా వెలుగొందుతోంది. 28 అక్షరాలతో తమిళులు వారి భాషపై పట్టు సాధించారు. ఎన్నో భాషలకు మాతృకలయిన సంస్కృతం, లాటిన్‌లు దూరమయ్యాయి. కాబట్టి గతాన్ని గమనించి ప్రాకృత భాషకు పట్టిన గతి తెలుగుకు పట్టకుండా న్యాయం చేయాలి. ఒకే అక్షరాన్ని ముస్తాబు చేస్తూ రాసుకుపోయే మన తెలుగును అలంకారప్రాయ భాషగా ముద్రపడటాన్ని తప్పించాలంటే సాంకేతిక లిపి అవసరం. భమిడిపాటివారు అన్నట్లు 'స్త్రీ' అని రాయాలంటే ఆయమ్మకు 'స'కు 'ఇ', 'త', 'ర' అనే అక్షరాలతో అలంకరించాలి. దాన్ని సరళీకరణ చేసి పక్కపక్క రాసే విధానమే సాంకేతిక లిపి. అదే 'కంప్యూటర్ కీ బోర్డు' లిపి. (ఇది కేవలం కంప్యూటర్ అవసరాలకు మాత్రమే. బయట మామూలుగా రాసుకోవచ్చు.)

అరబ్బీ భాషలో లేని 'డ', 'ప', 'గ', 'హ' లాంటి అక్షరాలను ఉర్దూలో సృష్టించుకున్నారు. 30-35 అక్షరాలుంటే ఏ భాషకైనా సంపూర్ణత్వం సిద్ధిస్తుంది. ఎంతో క్లిష్టమైన 'మాండరిన్'ను (చైనా భాష) కూడా సాంకేతికంగా మలచుకున్నారు. ఆంగ్లం పుట్టుకలోని గొప్పతనమో ఏమోగాని ఐదు చిన్న గీతలతో (క్యాలికులేటర్‌లోలా) అన్ని అక్షరాలూ రాయొచ్చు. ఆ విశ్వజనీనతా గుణమే కంప్యూటరుకు ఇట్టే అతికిపోయింది.

ఇంకో విషయమేమిటంటే ఏది ఉచ్చరిస్తామో దాన్నే రాయాలి.

అలానే ఏది రాసినా ఎవరు చదివినా ఒకేలా ఉండాలి. ఆంగ్లానికి, తమిళానికి ఈ సుగుణం లేకపోయినా వాళ్ళ భాషాభిమానం ముందు ఈ లోపాలు పక్కకుపోయాయి. అంతేకాదు పరభాషల్లోలా మన తెలుగులో 'స్పెల్లింగ్'లు నేర్చుకోనక్కర లేదు. మేధను అనవసరంగా భర్తీ చేయాల్సిన పని అంతకన్నాలేదు. ఇది చాలు మన భారతీయ భాషలకున్న ఆధిక్యత.

విజ్ఞానం వినువీధులకెగబాకుతున్న ఈ రోజుల్లో నూతన పదాల కొరత ఎంతైనా ఉంది. ప్రతి రోజూ కొంగొత్త పరిశోధనలు ఆవిష్కృతమవుతున్నాయి. ఆంగ్లభాషకబ్బిన నూతన పదసృష్టి సౌలభ్యతే దాని ఉన్నతికి బాటలు వేసింది. పదాన్ని విరిచి, మలిచి, చేర్పులతో, మార్పులతో కూర్పులతో కొత్తపదాలు సృజించటం సులువయింది. ఆ కొత్త పదాలు ఉచ్చారణకు సులువుగా ఉండటమే దాని గొప్పతనం. ఉదాహరణకి (కాల్షియం+విటమిన్) = కాల్విటా అనో కాల్మిన్ అనో చాలా అనువుగా ఉంటుంది. ఈ సర్దుబాటు నేటి సాంకేతికతకు అవసరం.

తెలుగులో నూతన పదసృష్టి గురించి చర్చించుకుందాం. 'ఫొటో సింథసిస్'కు తెలుగులో కిరణజన్య సంయోగక్రియ అని సర్వార్థసంధాయినిగా ప్రయోగిస్తున్నారు. అంత మక్కీకి మక్కీ తర్జుమా అనవసరం. దాన్ని 'కిరణీకం' అంటే సరిపోదా. అలాగే ఆంగ్లంలో పొట్టిపదాల సృష్టి ఎక్కువగా జరుగుతోంది. ఉదాహరణకు ఎయిడ్స్, లేజర్ లాంటివి. పదాల్లోని మొదటి అక్షరాల కూర్పుతో కొత్తపదం తయారవుతోంది. మనం ఇప్పుడిప్పుడే ఈ పద్ధతికి అలవాటుపడుతున్నాం. పార్టీల పేర్లన్నీ పొట్టి అక్షరాల్లోనే పిలవటం మొదలైంది.

ఇలా మార్పులు చేసుకుంటూపోతే తెలుగులోనే నేరుగా సాఫ్ట్‌వేర్ రాయవచ్చు. ఈ సాంకేతిక భాషాన్వయానికి అక్షరాలు ఇలా రాయాలి.

అచ్చులు	అఇఉఎఐఒఔః (ఎనిమిది)
హల్లులు	కగచజటడతదనపబమయరలవశషసహక్షఱ (ఇరవై రెండు) ఞ ఙ (రెండు)
గుణింతాలు	(ఎనిమిది)
స్థిరహల్లులు	ఖ=క, ఘ=గ1, ఛ=చ1 లాగే రాస్తే పది అక్షరాలను ఒక్క '1'తో సరిచేయవచ్చు.

మొత్తం 40 అక్షరాలతో (సంజ్ఞలు) తెలుగు కీ బోర్డు తయారవుతుంది సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి తెలుగును టైప్ చెయ్యవచ్చు ద్విత్వాలకు సంయుక్తాలకు అక్షరం కింద అక్షరం సంకేతానికి మారుగా అక్షరం పక్కన అక్షరం ఉండేలా కొడితే సందేశం కంప్యూటరుకు చేరిపోతుంది కొన్ని ఉదాహరణలు ఇద్దాం

అమ్మ అమ్ర్మ ఆవు అవ్వ ఇల్లు ఇలల

ఈగ: ఇ ాగ, యంత్రము: యంతం్ర ము, బాణము: బ ా ణ ము

చివరిగా తెలుగు లిపికి ఒక చేర్పును సూచిస్తున్నాను తెలుగులో రాయలేని యాస అ' (యాపిల్‌లోని అ) ఒక చుక్క గుర్తుతో తెలియజేద్దాం లోపాన్ని సరిదిద్దుదాం

Cot = కాట్, CAT = కాట్.

ఇలా తెలుగును సమృద్ధి పరుద్దాం అమృతధారలొలికే నవనవోన్మేష మన తెలుగు భాష

రాటాల వెంకట సుబ్బన్న
ఏజిఎం (బిఎస్ఎన్ఎల్
కంప్యూటర్ శాఖ), హైదరాబాద్.
94400 00837

తెలుగును కాపాడరా!

తెలుగునేల పైన పూలు చల్లరా
- తెలుగుభవిత ప్రగతికై కవితలల్లరా
తెలుగు పాట పాడరా
తెలుగును కాపాడరా
కళలకు ఇది నిధి అయినది
కలిమికి సారధి అయినది
నవరసముల ఖని అయినది
సప్తస్వరధుని అయినది
ఆంధ్రావనినలరినది
విదేశాల కులికినది
జిలేబీల తీపి
అది గులాబీల జీవనది
॥తెలుగు నేల పైన ॥

మానవీయ విలువలతో
మనుషులు జీవించాలని
మంచినెపుడు ప్రేమించే
మనసును సేవించాలని
తెలుగువారిలో వెలుగులు
జిలుగులు నింపాలని
తెలుసుకునే వెసులుబాటు
కలిగించిన కలలనది
॥ తెలుగు నేల పైన ॥

- చిమ్మపూడి శ్రీరామమూర్తి,
హైదరాబాద్.
97041 77270

బుల్లి కవితల్లో పడమటిగాలి



ప్రయోగాలు చేయటం కవికి సహజ లక్షణం. ఎవరూ చెప్పని కొత్త విషయాన్ని, కొత్తగా చెప్పాలనే తపనే కవికి రాణింపునిస్తుంది. భాషకూ సొబగులద్దుతుంది. ఆ కొత్తదనం బుర్రకు తట్టాలంటే, ప్రపంచ పోకడ కూడా రచయిత గమనిస్తూ ఉండాలి. ఒకప్పటికన్నా ఇప్పుడు అంతర్జాల సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. అరచేతిలో ప్రపంచాన్ని అందుకోగలిగే అవకాశం ఏర్పడింది. తమ రచనలను నెట్లో ఉంచాలని చాలామంది కవులు ప్రయత్నిస్తున్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, బ్లాగుల్లాంటి అవకాశాలెన్నో సామాన్యుడి స్థాయికి వచ్చేశాయి. ఎంత ఎక్కువ సాహిత్యం చదివితే అంత రాణింపు వచ్చే అవకాశం ఈ రోజున ఉంది. అందుకే, తెలుగులోకి తెచ్చుకొని మనకు తగ్గ రీతిలో మలచుకొనేందుకు అవకాశం ఉన్న కొన్ని ఆంగ్ల లఘురూపాలను పరిచయమే ఈ వ్యాసం.

కవి హృదయాన్ని అందమైన భాషలో ఆవిష్కరించటమే కవిత్వం. కాళిదాసు నుంచి కాళోజీ వరకూ పడిన పాద ముద్రలే తెలుగు కవితకు అమ్మానాన్న!

ఒకనాటి తీరిక నేటి సమాజానికి లేదు. జీవితం అంటే అనాటి దృక్పథం వేరు. నేటి జీవనం వేరు. పాశ్చాత్య సమాజంలో పవిత్రతావాదులు సృజనాత్మక సాహిత్యం, సంగీతం ఇవన్నీ ఇహలోక భావనను పెంచేవనే అభిప్రాయంతో సృజనాత్మక రచనారీతిని పాపకార్యం అనేవాళ్ళు. ఋషి కాని వాడు కావ్యం రాయలేడని, కవితా రచన మోక్ష హేతువులలో ఒకటనీ భావించుకొన్న సంస్కృతిలోంచి తెలుగు కవిత పుట్టింది. ప్రాచ్య పాశ్చాత్య కవితా రీతులకు మౌలికమైన తేడా ఇక్కడే ఉంది. కవిత్వానికి పునాదులు ఆ జాతి తాత్విక చింతనకు ఆలంబనగా ఏర్పడతాయి.

క్రీ.శ. తొలి శతాబ్దాల నాటి శాతవాహన ప్రభువు హాలుడు సంకలనం చేసిన గాథా సప్తశతి రోజుల్లోనే తెలుగు నేలమీద స్వేచ్ఛాకవిత రాజ్యం ఏలింది. నన్నయ తరవాత పాల్కురికి సోమనాథుడు దేశి కవిత అవసరాన్ని నొక్కి చెప్పాడు.

"అల్పాక్షరముల ననల్పార్థ రచన కల్పించుటయు కాదె కవి వివేకంబు...?" అని వెయ్యేళ్ళ క్రితమే ప్రశ్నించిన వాడాయన. నిడివి ఎక్కువైతే కవిత్వం పలచబడుతుంది, దట్టంగా అల్లుకొన్న భావం సాగి, చీలికలౌతుందని తెలుగు కవిత్వానికి సంబంధించినంత వరకూ

తొలిసారిగా గుర్తించినవాడు పాల్కురికి.

ఒక సామాజిక ఉద్యమం ఏర్పడినప్పుడు వాటి ప్రభావం సాహిత్యాది కళల మీద తప్పకుండా ప్రసరిస్తుంది. సాధారణంగా కవులు త్వరగా ప్రతిస్పందిస్తారు. అమెరికా స్వాతంత్ర్యపోరాటం ప్రభావం అమెరికన్ల కవిత్వతత్వాన్నే మార్చేసింది. ఫ్రెంచి విప్లవం ప్రపంచ సాహిత్య తీరుతెన్నుల్ని కొత్త లోకాలకు మళ్ళించింది. భారత స్వాతంత్ర్య సమరం దేశభక్తిని, భావప్రకటనా స్వేచ్ఛను కవిత్వంలో ప్రతిబింబించేందుకు దోహదపడింది.

ఇక తెలుగులోకి వస్తే, ఆధునిక యుగంలో నిజాన్ని నగ్నంగా ఆవిష్కరించే ధోరణిని దిగంబర కవిత ప్రవేశపెట్టింది. దాని ప్రభావం విప్లవకవిత ఆవిష్కరణకు ఎంతగానో కారణం అయ్యింది. అభ్యుదయ, విప్లవ కవితా ధోరణులు రెండూ ధృవాలై కవితారీతులను శాసించిన కాలంలో, కవిత్వం తిరుగుబాటు ధోరణులకు మాత్రమే పరిమితం అయ్యింది. దైనందిన జీవిత సమస్యలు, మానవ సంబంధాలు అప్రధానం అయ్యాయి. సుదీర్ఘమైన సిద్ధాంత చర్చలు తప్ప కవితాత్మకత అనేది అపురూపం అయినప్పుడు, సంక్షిప్తత, దేశీయత అనే వెయ్యేళ్ళ నాటి పాల్కురికి సోమనాథుని ఆలోచనలకు కార్యరూపం ఇవ్వటం ఒక తప్పనిసరి అంశం అయ్యింది. ఈ నేపథ్యంలోనే 1978లో తెలుగులో మినీకవితా ఉద్యమం ప్రారంభం అయ్యింది.

కొత్త రూపంలో, కొత్త భావాలతో, కొత్త అంశాలతో మినీకవిత ఆనాటి తెలుగు యువతను ఎంతగానో ఆకట్టుకొంది. ఇప్పుడు లబ్ధప్రతిష్ఠులైన కవులు ఎందరో మినీ కవితా ఉద్యమం నేపథ్యంలోంచి వచ్చిన వారే. మినీకవితలంటే శబ్దాలు, మినీ కవితలంటే మెరుపులు, మినీకవితలంటే ప్రభంజనాలు అన్నంతగా ఆనాటి ఉద్యమం నడిచింది.

ఆంగ్ల కవులు కూడా లయాన్విత కవిత్వీకరణకు, సూటిదనానికి చిన్న రూపాలు అనువుగా ఉంటాయని భావించారు. వాళ్ళ భాష వాళ్ళ సామాజిక జీవన పరిస్థితులు కూడా అందుకు దోహదపడేవిగా ఉంటాయి. ఒక కవితలో చెప్పిన భావాలకన్నా, చెప్పకుండా దాచి, పాఠకుని ఆలోచనలకు పదును పెట్టే ధ్వనిగర్భిత కవిత్వం చిన్న రూపంలో ఒదిగినట్లు పెద్దకవితలో కనిపించదని కూడా అనేకమంది విమర్శకులు భావించారు. ఆసు రాజేంద్ర రాసిన 'ఆకాశమంత ఉందికదా అని / వాన చినుకు /సముద్రాన్ని ఆశ్రయిస్తే / దాని బతుకూ ఉప్పన అయిపోయింది.' అనే మినీ కవిత ఇందుకు చక్కని ఉదాహరణ. అనువుకాని వారితో స్నేహం అనర్థదాయకం అని కవి హెచ్చరిక.

ఇంగ్లీషులో ఉన్నదంతా అంతర్జాతీయ కవిత అనే భ్రమలోంచి బయటకు వస్తే, తెలుగు కవితలు ఇప్పుడు వస్తున్న ఇంగ్లీషు కవితలకు ఏ మాత్రం తీసిపోవు. మన తెలుగు కవులు ఏ అంతర్జాతీయ కవులకన్నా తక్కువేమీ కారని మొదట గుర్తించాలి.

మినీ కవిత ప్రారంభం అయిన కాలంలోనే, హైకూ అనే జపానీ లఘురూపం ప్రేరణతో ఇస్మాయిల్ ప్రభృతులు తెలుగులో కొత్త ప్రక్రియకు ప్రారంభం పలకగా, నానీలు, రెక్కలు దాదీలు, తాతీలు, చిట్టీలు, పొట్టీలు ఇలా ఎన్నో ప్రయోగాలు తెలుగులో వచ్చాయి.

ఒకప్పుడు ఆంగ్లంలో సానెట్స్ ఎక్కువ ప్రాచుర్యం పొందాయి. 14-15 పాదాల కవిత ఇది. సానెట్ పేరు చెప్పగానే, ఎమెర్సన్ రాసిన 'ఎ ఫేబుల్' చటుక్కున గుర్తుకొస్తుంది.

'కొండకీ ఒక ఉడుతకూ తగువయ్యింది.

కొండ ఉడుతతో అందికదా...' అనే అర్థంతో మొదలయ్యే ఈ కవితలో ఆఖరున ఉడుత అంటుంది.

'మహారణ్యాన్ని నేను వీపున మోయలేను,

చిన్న పప్పుగింజని నువ్వు కొరకలేవు' అని! ఎవరి గొప్ప వారిది, ఎవరి బలహీనత వారిది. ఏనుగు నుంచి దోమ దాకా దేన్నీ లోకువగా చూడనవసరం లేదని ఈ సానెట్ చెప్తుంది. దీన్ని పీడిత తాడిత వర్గాల అభ్యున్నతికి అన్వయించి ఎంత వ్యాఖ్యానాన్నైనా చేయవచ్చు.

ఇటాలియన్ సానెట్, పెట్రార్చియన్ సానెట్ లాంటి ప్రక్రియల్లో ఆంగ్ల కవితలు ఇప్పుడు బాగా వస్తున్నాయి. స్పెన్సర్, హోరేస్ పేర్లతో కొన్ని కొత్త కవితా రూపాలు కూడా వెలిశాయి. జపానీ హైకూల ప్రభావం తెలుగుకవుల మీద బాగా ఉంది. హైకూలే కాదు, కొత్త లఘు కవితా రూపాలు మరికొన్ని జపాన్లో ఇప్పుడు వ్యాప్తిలో ఉన్నాయి.

[illegible]

సమాజమూ, మానవ సంబంధాలను దృష్టిలో పెట్టుకొని 'సెంర్ర్యూ' (senryu) కవిత రూపొందింది. ఇది 3 పాదాల కవిత. హాస్యం, వ్యంగ్యం ఇందులో ప్రధానంగా ఉంటాయి. దాని నడక ఇలా ఉంటుంది.

'తల దువ్వుకొంటున్నాను
అద్దంలో కనిపించే ముఖం
అది మా అమ్మది'

ఈ కవితలో యతులూ, ప్రాసలూ, గణాలు, పాదాల పదాలు నియమాలేవీ లేవు. తక్కువ మాటలు ఎక్కువ భావం దీని లక్ష్యంగా కనిపిస్తుంది. ఇలాంటిదే ఇంకో 'సెంర్ర్యూ' కవితను పరిశీలించండి.

'రాత్రి ఆకాశం
ఆ పిల్లవాడు
చుక్కల ఒడల్ని చిత్రిస్తున్నాడు'

ఇది చంద్రుణ్ణి భావుకతకు సంకేతంగా చూపిస్తున్న కవిత. చంద్రుణ్ణి మనం మనఃకారకుడిగా భావిస్తాం. జపాన్ వారికి అది కొత్త కావచ్చు అందుకే ఈ కవితను చాలా మంది విమర్శకులు గొప్పగా ఉదహరించారు.

టాంకా

జపాన్ వారి మరో లఘు కవితా ప్రక్రియ టాంకా (Tanka) కవిత. 'దుమ్ములో సూరీడు' అనే ఈ టాంకా కవితను చూడండి.

'సూర్య కిరణాలు ప్రవహిస్తున్నాయి
మొగ్గ తొడుక్కుంటున్న కొమ్మల గుండా
వసంతం అడవిలోకి వచ్చింది
దుమ్ము కణాలు తేలుతూ
నేలను చేరుతున్నాయి'

సూర్యుడు లేకపోతే పత్రహరితం లేదు, ప్రకృతి లేదు. సూర్యుడు ఒక జవం, జీవం, ఒక చైతన్యం. లోకానికి వసంతాన్ని తెచ్చేది సూరీడే! సూరీడుని అభ్యుదయ చైతన్యానికి ప్రతీకగా చిత్రిస్తున్న ఈ టాంకా కవితలో మొదటి మూడు పాదాలు విషయాన్ని ప్రతిపాదిస్తే చివరి రెండు పాదాలు దానికొక గమ్యాన్ని చూపిస్తున్నాయి.

సింక్వాయిన్

సింక్వాయిన్ (Cinquain) కవిత ఒక ఆంగ్ల లఘు కవితా రూపం. ఇది ఐదు పాదాల ప్రక్రియ. మొదటి పాదం కవితా శీర్షిక అవుతుంది. తరువాత రెండు పదాల పాదం, మూడుపదాల పాదం, నాలుగుపదాల పాదం వరుసగా ఉంటాయి.

'డైనోసార్లు
ఒకప్పుడు ఉన్నాయి
ఎన్నో ఏళ్ళప్పుడు, కానీ
కేవలం మట్టి ఇంకొన్ని కలలు
మిగిలున్నాయి'

ఇది సింక్వాయిన్ కవితకు ఒక ఉదాహరణ.

దీన్ని ట్రయాంగిల్ కవిత అని కూడా అంటారు. ప్రతీ పాదాన్నీ మధ్యకు తెచ్చి పేరిస్తే పిరమిడ్ ఆకారంలో ఉంటుంది. అందుకనే పిరమిడ్ కవిత అని కూడా పిలుస్తారు. ఇందులో ప్రతి పాదానికీ ఒక ప్రత్యేకత ఉంటుంది. మొదటి పాదం శీర్షిక రెండో పాదం విషయ విశ్లేషణ, మూడో పాదం దాని పూర్వాపరాలు, నాలుగో పాదం దాని భావావేశం ఉంటాయి. ఐదవ పాదంలో ఒకే పదం ఉంటుంది. అది శీర్షిక కొనసాగింపుగా ఉంటుంది. ఒకటీ ఐదవ పాదాలను కలిపి, 'ఛైనోసార్లు మిగిలున్నాయి' అని అర్థం సాధించటం కవి లక్ష్యం. రాతి యుగాలనాటి ఛాందస భావజాలంలోంచి బయట పడాలనే సందేశం ఇందులో కనిపిస్తుంది.

బ్లాంక్ వెర్స్

ఛందోబందోబస్తులను తెంచుకొని పుట్టిన వచనకవితలో ఒక చిన్నరూపాన్ని బ్లాంక్ వెర్స్ (Blank verse) అంటారు. A poem written in



unrhymed iambic pentameter and is often unobtrusive అని దీనికి నిర్వచనం. అంత్యప్రాసలు, యతి ప్రాసల నియమం లేకుండానే లయబద్ధంగా మాట్లాడే తీరులో ఈ కవిత ఉంటుంది. లయాన్విత కవితాత్మక వచనాన్ని బ్లాంక్ వెర్స్ అని నిర్వచించవచ్చు.

'ఆ కుర్రాడేం చేస్తున్నాడిప్పుడు, బంతి పారేసుకున్నాడే వాడు?

ఏంటి ఏంటి వాడు చెయ్యాలనుకుంటోంది? నేను చూశాను... దాన్ని

గొప్పగా గెంతుకొంటూ, నడివీధిలో, ఆ తర్వాత

గొప్పగా అక్కడ ఆ నీళ్ళలో'!

John Berryman రాసిన The Ball Poem అనే కవితకు ఇది తెలుగు అనువాదం. ఇందులో పైకి కనిపించే భావం ఏమీ లేదు. పైగా చాలా సాధారణమైన విషయం. బంతాట ఆడుకొంటున్న కుర్రాడు విసిరిన బంతి, వీధిలో ఎగురుకొంటూ వెళ్ళి నీళ్ళలో పడింది. దీని ద్వారా రచయిత చెప్పదలచుకొన్నది ఏమయినా ఉన్నదా? బాల భారతంలో ద్రోణుడు బావిలోంచి బాణాలతో బంతిని తీసి ఇచ్చిన కథ లాంటిదీ ఇందులో కనిపించదు. కానీ, భూగోళంతో ఆడుకోవటం ఒక పిల్లచేష్ట. చివరికి అది ఎవరికీ దక్కకుండా పోతుంది... అనే హెచ్చరిక ఇందులో దాగి ఉంది. ఇంకొకరికి మరో అర్థం ఏదయినా ఇలానే స్ఫురించవచ్చు కూడా. ఓ తెల్ల కాగితాన్ని ఇచ్చి ఎవరి ఊహను వారు చిత్రించుకోవాలని కాబోలు ఈ కవితను Blank verse అన్నారు.

ఎపిగ్రామ్

టెలీగ్రాంలలో వాడే భాష, లేదా ఎస్సెమ్మెస్సులు ఇచ్చేందుకు వాడే భాషని ఉపయోగించి తయారు చేసిన హాస్య స్ఫోరక కవిత ఇది. 'ఎపి' అనేది శాసనాలకు సంబంధించిన పదం. అది దీనికి పేరుగా స్థిరపడి, ఎపిగ్రామ్ (Epigram) కవిత అయ్యింది.

'ఎపిగ్రామ్
పొట్టి ఆకారం
సంక్షిప్తత శరీరం
వ్యంగ్యం ప్రాకారం'

ఎపిగ్రామ్ కవితకు నిర్వచనాన్ని ఇలా ఎపిగ్రామ్ పద్ధతిలోనే రాయవచ్చు. దీని రూపం చాలా విలక్షణంగా ఉంటుంది. ఒక ఎపిగ్రామ్ కవితను పరిశీలించండి.

'చక్కెర
దొరికితే లక్కేరా
కానీ, మద్యం
దొరకటం తథ్యం'

ఇందులోని లోతైన భావాన్ని మాటలతో వివరించే ప్రయత్నం చేస్తే, స్వారస్యం చచ్చిపోతుంది. దాన్ని దానిగానే అర్థం చేసుకోగలగాలి. దేశంలోనూ, రాష్ట్రంలోను ఉన్న పరిస్థితికి అద్దం పడుతున్నదీ అంతర్జాతీయ కవిత.

'ఒప్పుకొంటున్నా తమరి రూలు
ప్రతీ కవీ ఒక పూలు
నిలువెత్తు నిదర్శనం మీరే
పూల్సందరూ కవులు కారే'!

అనేది ఎపిగ్రామ్ రచనకు ఇంకో ఉదాహరణ. పొడిమాటలతో ఇది కనిపించినా ఇందులో లయ ఉంది, ప్రాస నియమాలున్నాయి. అతి తక్కువ మాటలతో గొప్ప ఆలోచనాత్మకతను కలిగించటం దీని లక్ష్యం. అల్పాక్షరాలతో అనల్పార్థ రచనకు ఇది మంచి ఉదాహరణ.

ఎపిటాఫ్

విషాదాన్నీ, మరణాన్నీ చిత్రిస్తూ, సంతాప సూచకంగా చెప్పే కవితను ఎపిటాఫ్ (Epitaph) కవిత అంటారు. తక్కువ పాదాలలో కవితాత్మకంగా ఉంటుంది. సమాధుల మీద చెక్కేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. 'పుటక నీది/చావు నీది/బతుకంతా దేశానిదది' అంటూ జేపీ మీద కాళోజీ రాసిన ప్రసిద్ధ కవిత ఈ ఎపిటాఫ్ కవితకు చక్కని ఉదాహరణ!

'అబ్బో! ఆయన గొప్ప వైద్యుడు
ఇంకా గొప్పస్నేహశీలి
అద్భుతమైన మేధావి
చిట్టచివరి రోజున తప్పు!'

ఇలా ఉంటుంది ఎపిటాఫ్ కవితా రూపం. విదేశీ కవితలలో వ్యంగ్యాన్ని పులిహోరలో జీడిపప్పు తాలింపు పెట్టినట్టు జోడిస్తున్నారు. మన కవులు ఈ విషయాన్ని గమనించాలి. వ్యంగ్యం ఎక్కువమంది పాఠకుల్ని తెస్తుంది.

[illegible]

ఇదీ జపానీ లఘుకవితా రూపాలలో ఒకటి.

New life begins to spring to life in spring
Green shoots appear in the april showers
Birds migrate back home and rest tired wings

ఒకటీ మూడూ పాదాలకు అంత్యప్రాసని గమనించవచ్చు. ప్రతీ పాదంలోనూ 8-10 పదాల వరకూ ఉంటాయి.

ఏబీసీ

ఒక భావావేశాన్ని, ఒక చిత్రాన్ని, ఒక అనుభూతిని కళ్ళకు కడుతూ, ఐదు లైన్లలో ఉండే కవితా ప్రక్రియ ఏబీసీ (ABC) కవిత. ఐదు పాదాలలో చక్కని భావావేశం, చిక్కని శబ్ద చిత్రం, అంతులేని అనుభుతిని కలిగించటం దీని పరమావధి. ఇందులో ప్రతీ పాదంలోనూ మొదటి పదాలు అకారాది క్రమంలో ఉంటాయి.

అందుకని ఏబీసీ కవిత అనే పేరు వచ్చింది. ఐదవ పాదం మకుటంగా ఉంటుంది. మచ్చుకొక ఆంగ్ల కవితను పరిశీలిద్దాం.

A lthough things are not perfect
B ecause of trial or pain
C ontinue in thanks giving
D o not begin to blame
E ven when the times are hard
F ierce winds are bound to blow

ఎక్రాస్టిక్

మొదటి అక్షరం లేదా మొదటి పదం భావోద్దీప్తిని కలిగించేదిగా ఉన్నప్పుడు దాన్ని ఎక్రాస్టిక్ (Acrostic) కవిత అంటారు. ఈ ఉదాహరణ పరిశీలించండి.

C reamy or
H ot, it makes my mouth scream
O n and on
C hocolate, chocolate
O h, yum
L uscious chocolate, I can't believe I
A te it all. it
T ickles my throat
E ach time I eat it, mmm oh I love chocolate.

మొదటి అక్షరాలన్నీ కలిపి ఆ కవిత శీర్షికగా నడిపిస్తే, మంచి మినీ కవిత అవుతుంది. ఇలాంటి ప్రయోగాలు లోకోపకారంగా ఉండాలి. మనవాళ్ళు సన్మానపత్రాల రచనల్లోనూ, పెళ్ళిళ్ళప్పుడు పంచరత్నాల రచనల్లోనూ ఎక్కువగా చేస్తుంటారు.

వైవాహిక, సాంసారిక జీవితాన్ని గురించి, లోకం పోకడల గురించి, సమాజం గురించి విశ్లేషణాత్మకమైన మినీకవితలను ఇచ్చే పద్ధతిని తెలుగులో కూడా తీసుకురాగలిగితే అందరూ చదివే అవకాశం ఉంటుంది. కవి అనేవాడు తన భావాన్ని ప్రచారం చేసేందుకు అందివచ్చే ప్రతీ అవకాశాన్నీ సద్వినియోగం చేసుకోవాలి. అది పెళ్ళయినా సరే, చావైనా సరే!

దేశీయతను సాధించగలిగితే, తెలుగు కవిత సంపన్నమే అవుతుంది. తెలుగులో చిన్న కవితలదే రాజ్యం. విదేశాల్లోనూ చిన్న రూపాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. అల్పాక్షరాలు, అనల్పార్థాలు ప్రపంచ కవితను పాలిస్తాయి. లోకం పోకడ తెలుసుకోవటం వలన మరింత శక్తివంతంగా కవితను తీర్చిన వాళ్ళమవుతాం.

డా॥ జి.వి.పూర్ణచందు
ఆయుర్వేద వైద్యులు,
విజయవాడ. 94401 72642

రాజడిగితేమందును

స్త్రీ: చేతిగాజులు పోయెనూ చినవాడ
రాజడిగితేమందునూ?

పు: సెనగపూరోకలనుమీ! చినదాన
చెయిజారిపోయెననుమీ.

స్త్రీ: కాలిమట్టెలు పోయెనూ! చినవాడ
రాజడిగితేమందునూ!

పు: మనగడప పెదఃదనుమీ! చినదాన
గడప తగిలీపోయెననుమీ.

స్త్రీ: ఒళ్లెల్ల రక్కులయెనూ! చినవాడ
రాజడిగితేమందునూ?

పు: మన యిల్లుచీకటనుమీ! చినదాన
మన పిల్లిరక్కులనుమీ!

స్త్రీ: నొష్టబొట్టూ పోయెనూ! చినవాడ
రాజడిగితేమందునూ?

పు: చిరుచెమట లెక్కెననుమీ! చినదాన
చెమటకు కరిగెననుమీ!

స్త్రీ: ముక్కునత్తూ పోయెనూ! చినవాడ
రాజడిగితేమందునూ?

పు: ముత్యాల చెరువులోనా! చినదాన
మునిగితే పోయెననుమీ!

(ఒక జానపద గీతం)

అదిగో... అల్లదిగో
పాత బంగారం

ఫలానా భాషలో సాహిత్యమంతా కంప్యూటరీకరించారని, మరొక భాషలో రచనలన్నీ అంతర్జాలంలో దొరుకుతున్నాయని చెప్పుకుని ఇప్పటి వరకూ అసూయపడే వాళ్లం. 'తెలుగుకు ఆ మహద్భాగ్యం ఎప్పుడో' అని అనుకునే వాళ్లం. ఆ స్థాయిలో కాకపోయినా కాస్త సంతోషించదగ్గ పరిణామం మన రాష్ట్రంలో చోటుచేసుకుంది. భాషాభిమానులు, సామాజిక, సాహిత్య పరిశోధకులకు ప్రయోజనకారిగా నిలిచే కార్యక్రమాన్ని మన ప్రెస్ అకాడమీ చేపట్టింది. దాని వివరాలేమిటో చూడండి...

ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీ అనేక పాత పత్రికల్ని కంప్యూటరీకరించి ఒక వెబ్‌సైటులో పొందుపరిచింది. దాన్ని అంతర్జాలంలో ఉచితంగా అందుబాటులోకి తెచ్చింది. ఇందులో వందేళ్ల క్రితం నుంచి ఎన్నో పత్రికలు ప్రతీ పుటా స్కాన్ చేసి ఉన్నాయి. తేదీ, నెల, సంవత్సరాల వారీగా క్రమ పద్ధతిలో లభ్యమవుతున్నాయి. ఆంధ్రపత్రిక, గోల్కొండ పత్రిక, కృష్ణాపత్రిక ఇలా ఎన్నో పాత దినపత్రికలూ ఈ జాబితాలో ఉన్నాయి. దినపత్రికలే కాకుండా, వార, పక్ష, మాస, ద్వైమాసిక పత్రికలు కూడా ఉన్నాయి. ఈ వెబ్‌సైటు చరిత్ర పరిశోధకులకు, పాత్రికేయులకు ఎంతో ఉపయోగకరం. అనుమతుల ప్రయాస, గంటలతరబడి వెతకాల్సిన అవసరమూ లేదు. దుమ్ములో తుమ్ములు తెచ్చుకోనక్కర్లేదు. ఇంట్లోనే సౌకర్యంగా కంప్యూటర్ ముందు కూర్చుని కావలసిన పత్రికల్ని తిరగేయవచ్చు.

సాహిత్యం పట్ల అనురక్తి గల వారికి కూడా ఈ సైటు చాలా ఉపయోగపడుతుంది. ప్రాచీన ఆధునిక సాహిత్యాలకు వారధిగా 1890లలో న్యాపతి సుబ్బారావు స్థాపించిన 'చింతామణి' మాసపత్రిక మొదలు ఎన్నో పత్రికలు ఇక్కడ ఉన్నాయి. తెలుగులో మళ్లీ అటువంటి సాహిత్య పత్రిక రాలేదంటూ ఎందరో ఈనాటికీ తలుచుకునే 'భారతి' సంచికల్ని ఇక్కడ చూడవచ్చు. చక్రపాణి సంపాదకత్వంలో,ముచ్చట గొలిపే వడ్డాది పాపయ్య ముఖచిత్రాలతో వెలువడిన 'యువ' సంచికల్ని తిరగేయవచ్చు. విశ్వనాథ సత్యనారాయణ, దివాకర్ల వేంకటావధాని, మల్లంపల్లి సోమశేఖర శర్మ వంటి ఉద్దండుల సంపాదకత్వంలో వెలువడి, కొద్ది కాలమే నడిచినా చెరగని ముద్ర వేసిన 'జయంతి' పత్రికను ఇక్కడ చదవొచ్చు. ఇలాంటిదే మరో పత్రిక 'వీణ' కూడా ఇక్కడ ఉంది. దీనికి శ్రీశ్రీ, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి తదితరులు సంపాదకవర్గంలో పనిచేశారు. నవ్యసాహిత్య పరిషత్తు వారైన విశ్వనాథ సత్యనారాయణ, అడవి బాపిరాజు, తల్లావజ్ఝల శివశంకర శాస్త్రి తదితరుల సంపాదకత్వంలో వెలువడిన 'ప్రతిభ' త్రైమాసిక పత్రిక మరో అమూల్యమైన సాహితీ ఖని. అచ్చ తెనుగు వచనానికి చెక్కు చెదరని చిరునామాగా నిలిచిన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి సంపాదకత్వంలో వెలువడిన 'ప్రబుద్ధాంధ్ర' సంచికలు ఇక్కడ లభిస్తున్నాయి. 'తలవంచుకు వెళ్ళిపోయావా నేస్తం, సెలవంటూ లోకాన్ని వొదిలి' అంటూ శ్రీశ్రీ ఎవరి మరణాన్ని గురించి ఆక్రోశించాడో, ఆ కొంపెల్ల జనార్దనరావు సంపాదకత్వంలో వెలువడిన 'ఉదయిని' సంచికలు కూడా ఉన్నాయి. తెలుగులో తొలి హాస్యరస ప్రధాన పత్రికగా చెప్పుకోదగ్గ 'చిత్రగుప్త' సంచికల్ని సరదాకి చదువుకోవచ్చు. ఇవిగాక సాహిత్యంతో పాటు, రాజకీయాలకు సంస్కరణలకూ సమ ప్రాధాన్యం కల్పించిన 'కిన్నెర', 'విజయవాణి', 'తెలుగు స్వతంత్ర' తదితర అమూల్య పత్రికా ప్రతులెన్నో ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.

చరిత్ర పరిశోధకుల్ని, సాహితీ పిపాసుల్ని మాత్రమే కాదు, ఊరికే కుతూహలంతో వచ్చేవారిని కూడా ఈ నెలవు ఎంతో రంజింప జేస్తుంది. మన దేశ చరిత్రలో ప్రముఖ రాజకీయ, సాంస్కృతిక సంఘటనల్ని ఆయా సమకాలీనులు ఏ అక్షరాల్లో తెలుసుకున్నారో మనమూ ఆ అక్షరాల్లోనే వాటి గురించి చదవవచ్చు. మనకు స్వాతంత్ర్యం వచ్చిన రోజున ఏ పత్రికలు ఏయే పతాకశీర్షికలు పెట్టాయో చూడవచ్చు. ఆ సందర్భాన ప్రముఖ నాయకులు ఏమేమన్నారో చదవవచ్చు. స్వతంత్ర భారతంలో హైదరాబాదు సంస్థాన విలీనమూ, ఆంధ్రరాష్ట్ర అవతరణ ప్రస్థా

నమూ ఏ తీరున సాధ్యమయ్యాయో రోజువారీ దశల ప్రకారం తెలుసుకోవచ్చు. డెబ్భైల్లో అత్యవసర పరిస్థితి సాగినపుడు పత్రికాస్వేచ్ఛపై పెట్టిన కట్టడుల్ని అప్పటి పత్రికలు ఎలా ఎదుర్కొన్నాయో పరిశీలించవచ్చు. లక్స్ సబ్బు ప్రకటనపై సావిత్రి ముఖాన్ని, విజయా వారి 'మిస్సమ్మ' త్వరలో విడుదల అని ప్రకటించిన పోస్టర్ని తిలకించవచ్చు. చిన్నప్పుడో, వయసులో ఉన్నప్పుడో ఎంతో ఇష్టంగా చదివిన శీర్షికల్ని మరొక మారు

చదువుకుని, కాలంలో గత స్మృతుల ప్రయాణం జరపవచ్చు.

పదేళ్ల నాటి కల

ఈ బృహత్ ప్రయత్నం దశాబ్ద కాలం పాటు సాగి ఈనాటికి సాకారమైంది. 2000 సంవత్సరంలో డా. పొత్తూరి వెంకటేశ్వరరావు ప్రెస్ అకాడెమీ ఛైర్మన్‌గా ఉన్నపుడు ఈ ప్రతిపాదన తెచ్చారు. ప్రభుత్వామోదం లభించిన తరువాత దీని కోసం ఆర్కైవ్స్ కమిటీ ఏర్పాటయింది. దీని ఆధ్వర్యంలో పత్రికల స్కానింగు మొదలైంది. రాష్ట్రంలో పాత పత్రికలు ఎక్కువగా ఉన్న కొన్ని గ్రంథాలయాల్ని ఎన్నుకుని అక్కడ పని మొదలుపెట్టారు. రాజమండ్రి గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయం, అక్కడే వీరేశలింగం స్వీయ సేకరణ పుస్తక సంచయమున్న టౌన్‌హాల్ గ్రంథాలయం, పశ్చిమగోదావరి జిల్లా కుముదవల్లిలో వీరేశలింగ కవి సమాజ గ్రంథాలయం, నరసరావుపేట గ్రంథాలయం, వేటపాలెం సారస్వతనిలయం, కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషత్తు గ్రంథాలయం, హైదరాబాద్ సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీ, తిలక్‌రోడ్డులోని ఆంధ్ర సారస్వత పరిషత్, తార్నాకలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభిలేఖాగార గ్రంథాలయం వీటిలో ముఖ్యమైనవి. ఈ ప్రయత్నంలో భాగంగా మొత్తం ఐదులక్షల దినపత్రికల పుటలు, పదిహేను లక్షలు ఇతర వార, పక్ష, మాస పత్రికల పుటలు స్కాన్ చేసి వెబ్‌సైటులో పెట్టారు. ఈ వెబ్‌సైటు 2011 ఆగస్టు 17వ తేదీన ముఖ్యమంత్రి ఎన్.కిరణ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమై అందరికీ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటిదాకా ఈ ప్రయత్నానికి అయిన ఖర్చు ముప్పై లక్షలు. అక్కడితో ఆపకుండా మరిన్ని పత్రికలను స్కాన్ చేసే పని కొనసాగిస్తుండటం శుభపరిణామం. ప్రస్తుతం హైదరాబాదు అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్రీయ గ్రంథాలయంలో స్కానింగ్ జరుగుతోంది.

దిద్దుకుంటూ సాగాలి

ఇది బృహత్ కార్యక్రమమే అయినా, ఇంకా అసంపూర్తి ప్రయత్నమే. ఏ విషయమైనా జనానికి చేరువ కావాలంటే దానికి ప్రచారం ముఖ్యం. ఇంత విలువైన సంపద ఇక్కడ ఉన్నా తగిన ప్రచారం లేదు. కొన్ని సాంకేతిక పరిమితులు కూడా దీని ఉపయోగ పరిధిని కుదింపజేస్తున్నాయి. ఇందులోని సంచికల్ని డౌన్‌లోడ్ చేసుకునే సౌలభ్యం ఉంది. కానీ, ఒక్కో పుట గానే తప్ప మొత్తం సంచికల వారీగా డౌన్‌లోడ్ చేసుకునే వీలు లేదు. పుటలను పి.డి.ఎఫ్ నమూనాలో పెట్టడం వల్ల తెరుచుకోవడానికి కాస్త ఆలస్యమవుతుంది. ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్‌లో తప్ప మిగిలిన బ్రౌజర్లలో (క్రోమ్, ఫైర్‌ఫాక్స్) అన్ని పుటలూ తెరుచుకోవటం లేదు.

ప్రస్తుతం సైటులో ఉన్న వస్తు పరిమాణం కూడా ఇంకా పెరగాల్సిన అవసరం ఉంది. ఈ సైటులో లభ్యం కాని పత్రికలు ఇంకా ఎన్నో ఉన్నాయి. అపరిమితమైన చారిత్రాత్మక, సాహితీ సంపద మారుమూల గ్రంథాలయాల్లో మగ్గుతోంది. అదంతా పూర్తిగా పాడయిపోయి భావితరాలకు శాశ్వతంగా దుర్లభమయ్యే పరిస్థితి రాకముందే జాగ్రత్త పడాలి. వెబ్‌ప్రపంచం అక్షర వనరుల పరిరక్షణకు సరికొత్త మార్గం. కాగితమైతే కాలం ప్రభావానికి లోనవుతుంది. వెబ్ కాగితాలకు ఆ ఇబ్బంది లేదు. అంతర్జాతీయంగా పెద్ద పెద్ద పత్రికా సంస్థలన్నీ తమ పాత సంచికల్ని కొద్దిపాటి రుసుముతోనో, ఉచితంగానో అందరికీ అందుబాటులో ఉంచుతున్నాయి. అలా చూస్తే మనకు ఇది తొలి అడుగు మాత్రమే. మరెంతో ప్రయాణం ముందుంది. భాష, సాహిత్యాల్ని కాపాడుకోలేని జాతికి పురోగతి ఉండదు. క్రమేణా స్వతంత్ర అస్తిత్వాన్ని కోల్పోయి నశిస్తుంది. ఆ ప్రమాదం మనకి రాకముందే భాషా సాహిత్యాలకు ఆలవాలమైన మన పత్రికా సంపదను రక్షించుకోవాలి.

ఈ వెబ్‌సైటు చిరునామా:
www.pressacademyarchives.ap.nic.in

- తెలుగు వెలుగు బృందం

అడకత్తెర్లో పోకచెక్క

'పెండ్లి పిలగాడు కండ్ల పడ్తలేడ'ని పచ్చని పెండి పందిట్ల గుప్పున పొగ లేసింది.

పెండ్లి పిల్ల, పిల్ల తల్లి లచ్చుమ్మ, తల్లడితండ్లు, నాయన లచ్చయ్యకు సల్ల సెమ్టలు పుట్టినై, సూసిరమ్మన్న కొడుకు లసుమయ్య అటే పోయిండని ఇసుక్కుంటాండు కాలు ఓతాన నిల్తలేదు... కాలు గాలిన పిల్ల లెక్క.

అట్ల లగ్గం, నాగబెల్లి అయిందో లేదో..... పిల్లగాడు పారి పోయిండు...' యిదేందిరో.. ఎవడన్న ఉంటే పెండ్లికి ముందే లేసి పోతడు గాని పెండ్లైనంక పోతడా?... మల్ల పిల్ల గతేం గావాలె..' అని పెండ్లికచ్చిన సుట్టాలు తలో తీరు మాట్లాడుకో బట్టిండ్లు.

పెండ్లి పిలగాని తల్లి కొంరమ్మ నిరందిగున్నది. పెండ్లికి సదివిచ్చిన తలెముంతలు తన పెద్దపోరికి సూయించుకుంట కాల్లు కడ్గిన ఇత్తడి చెంబు యాడ్నే ఉండాలె లేదేందని గులుక్కుంట దేవులాడ్తాంది. తండ్రి కొరయ్య యింటి ముందు అర్గుమీద కూకొని బీడి కాల్తండు తాత్పరంగ...మొకంల గింత సుత కొడుకు పోయిండన్న రంది గాని రవుసు గాని దుర్బినేసి సూసినా కనిపిత్త లేదు.

లచ్చయ్య అడగాల్నా అద్దా అని అనుమానం పడుకుంటనే మెల్లంగ పిల్లి లెక్క కొంరయ్య ఎన్కకు పోయి నిలబడ్డడు.

"బావా... నీ కొడుకును యాడికన్న తోలిచ్చినావె..." అని బయం, బయంగానే అడ్గిండు. పస్పు బట్టల తోని ఊరి పొలిమేర దాటద్దని తెలుసు గదా బావా... అని అందామని నోటిదాకచ్చినమాటనెన్కకు గుంజుకున్నడు లచ్చయ్య... పిల్లొల్లు ఏమన్నా తప్పులు వడ్తరని.

బీడి నోట్లెకెల్లి తీసి తుపుక్కున ఊంచి ఎన్కకు మొకం తిప్పి కిందికెల్లి మీద్దాక సూసిండు కొంరయ్యను లచ్చయ్య మొకంల నెత్తుటి సుక్కలేదు. కండ్లల్ల నీల్లు తిర్గినై. ఏందో అడ్గుతాండని ఎన్కకెల్లి అచ్చిన లచ్చుమ్మ గల్మల్లనే ఆగి ఏంజెప్తడో అని మెడ సాగిచ్చి యింటాంది.

" నీ అల్లుడు అల్గ వోయిండు" అనుకుంట మల్ల బీడి నోట్లె పెట్టి యింకో దమ్ము లాగిండు... లచ్చయ్య బీర్పోయిండు.

"అదేంది బావా... అల్గ పోవుడెక్కడిది? .... మేమన్న తక్కువ సేసినమా.. అనుకున్న దానికంటె ఎక్కువనే ముట్టజెప్తిమి.." ఎన్కకెల్లి లచ్చుమ్మ, లచ్చయ్య ఎడ్మ చెయ్యి చిట్కనేలు పట్టుకొని ఇగ్గుతాంది 'సైసు' అన్నట్లు.

"సూడు బావా... పెట్టుపోతల కింద ఎన్ని పెట్టినా అల్గ పోవుడన్నది పద్ధ పద్ధతే.. యీ తతంగమైపోతె పిల్లనప్పసెప్పుడుంటది." ఆకరి దమ్ము పీల్చి అయిపోయిన బీడిని నాలకేసి నల్పిండు.

"మనం ముందుగాల అనుకోలె కాదు బావా.. అయినా యీ కాలంల ఎవలల్గ పోతండ్లు... మరి సెప్పన్న పోవద్దా?... మేమో గావర పడ్తాంటిమి"

"అగ్గొ నువ్వు బలే ఉన్నొ... యిచ్చకాయలు, కచ్చకాయలు అన్ని మాట్లాడు కుంటరా... మల్లబోతె అల్గ పోయినోడెవడన్న సెప్పి పోతాడే... యింక గండ్ల ఏం మజా ఉంటది?.."

ఎడం చేత్తోటి నెత్తి గోక్కుంట" మాకో వంతెన లేక పాయె.. యిదేందో కొత్తగ కొండి పెడ్తాంటివి.. మల్ల ఏం సేయాల్నో అది సుత నువ్వే సెప్పు... నాకో తెలవకపాయె.." అన్నడు లచ్చయ్య.

"నాకేం తెలుసే.. అల్గవోయింది ఆడు.నీ యిట్టం.. నీ అల్లునిట్టం.. మీరైతే పిల్లను తీస్కోని, నీ కొడుకును తీస్కోని పోండ్లి. అవతల వాడల నీ తమ్మునింట్లనే ఉన్నడు" అన్కుంట తన కొడుకు అల్గ వోయిన జాడ



సెప్పిండు కొంరయ్య.. లేసి నిలబడి లచ్చయ్య, లచ్చమ్మను సూసుకుంట నన్నేం సేయమంటవ్?... అన్నట్లు మొకం పెట్టిండు.

అంత దూరంల కెల్లి లచ్చయ్య కొడుకు లస్మయ్య" నాయ్నా.. బావ అప్పయ్య యింట్లనే ఉన్నడే..."అనుకుంట ఉర్కచ్చి మొసపోత్తాండు.

లసుమయ్యను లోపల్కిఆ.. అన్నట్లు సైగ సేసుకుంట యింట్లకు పోయిండ్లు లచ్చయ్య, లచ్చమ్మలు.

ముగ్గురు పెండ్లి పిల్లకు ఇనరాకుంట కొంచెం దూరంల నిలబడ్డరు. లచ్చయ్య పూసగుచ్చినట్లు ఇసయమంతా సెప్పిండు లస్మయ్యకు.

"నాయ్నా.. నువ్వేం రంది పడకు. మనమైతే సెల్లెను తీస్కోని పోదాం.. బావ ఏం అడుగుతడో సూత్తాం... ఏమన్నంటే అచ్చే దీల దాక ఆగుమందాం.."

"అల్ల పోయిన కట్నం అట్లుండదిరా... దేనికదే అంటరు.."

"సరే ముందైతే పోదాంపా.. యాల్లైతంది గాదె... పిల్లనిచ్చి సాగనంపాల్నాయె..." అన్కుంట లస్మయ్య పెండ్లి పిల్ల దగ్గరికి పోయిండు.

"సెల్లే.. బావ ఎక్కడ్కి పోలేదే... మన అప్పయ్య యింటికి అల్ల పోయిండు. మనమెల్లి తీసుకత్తాంపా.." పెండ్లి పిల్ల కండ్లు సాటంత్రైనై.

పెండ్లి పిలగానోల్ల ఓపెద్ద మనిషిని సుత తోల్కోని మొత్తం ఐదుగురు దాకా పోయిండ్లు అల్లపోయిన పిలగాని దగ్గరికి. యీబాగోతం సూసె దానికి ఎన్క మోపడ్డెండ్లు. చిన్న పిలగాండ్లైతె చెంగ, చెంగ అందరికంటే ముందటనే ఉర్కుతండ్లు.

లచ్చయ్య తమ్ముని ఇంటెన్కాల అర్రల కూకొని తలుపేసుకున్నడు పెండ్లి పిలగాడు. యవారమంత పిలగాని బామ్మర్ది తోనే జర్గాలని అచ్చిన పెద్ద మనిషి లసుమయ్యకు ఇసారం సేసిండు.

"బావా... నా సెల్లె అచ్చింది. నీ కోసం బెంగటిల్లింది. అల్గకు బావా.. నీకేం గావాల్నో సెప్పు యిత్తం... నా సెల్లె ఏడ్తాంటె సూడ బుద్దైత లేదు.." అంటాంటె లసుమయ్య సరం దగ్గర పడ్డది. వాగుపక్క సెలిమలల్ల ఊటూరినట్లు కనుగుడ్లల్ల నీల్లూరినై.

"లసుంబావా.. నాకు బండి గావాలె.. నాదోస్తులందర్కి లచ్చి, బండి పెట్టిండ్లు. అదీ లెక్కేనాయె.. ఆల్ల ముందట నా పరువేం గావాలె. నాకు బండి పెద్దమని ఒప్పుకోండ్లి. తలుపు తీత్త." పెండ్లి పిలగాడు తన మనస్సులున్న మాట అల్గ కట్నం కింద ఎల్ల గక్కిండు.

లచ్చయ్య బొండిగెల ఎలక్కాయ యిర్కినట్లైంది. ఒక్కపాలె నోరు తెర్సిండు.

"ఏందీ బండి గావాల్నా.. నన్ను కోసిన పెద్ద కొత్తెల్లది. యాడ్చి తన్నినా యాసమెల్లది. యాడ్నుంచి తేను.. ఎంత సేపల్గుతవో అల్గు.." అనుకుంట లేసి నిలబడ బోయిండు లచ్చయ్య. పెద్దమన్ని గుడ్లప్పగిచ్చి సూత్తాండు. లచ్చమ్మ మొకం వాడిపోయింది. పెండ్లిపిల్ల దించిన తల్కాయె ఎత్తకపాయె.. కండ్లపొంటి నీల్లు పట్ట, పట్ట అడుస్తున్నయ్.

లసుమయ్య వాల్ల నాయ్నను లేవనియ్యలే.. 'కూకో' అని సైగ సేసిండు.

"అదేందిరో.. కాల్లు కడ్గిన బటువు వెడ్తిమీ.. గనారం పెడ్తిమీ... దీపాల్కి బ్యాడెత్తు మెడల గొల్సు ఏత్తమంటిమి. మన అల్లు బాగ దొబ్బిండ్లు. ఎద్దు పుండు కాకికి ముద్దార.." కొంచెం గరానికచ్చిండు లచ్చయ్య దీర్గాలు తీసుకుంట.

"సరే బావా.. నువ్వన్నట్లె కొనిత్తం. నా సెల్లె బండి మీద తిర్గాలని మాకు ఉండదా.." అని లసుమయ్య మాటిచ్చిండు.

కయ్యుమని లేసి లచ్చయ్య, లచ్చమ్మ వన్కబట్టింది.

"ఎట్ల కొంటంర కొడుకా.. యిప్పటికే ఆయిమన్న పొలం ఓ అయ్య దగ్గర కుదవెడ్తిమి." అనుకుంట లచ్చమ్మ కండ్ల నిండ నీల్లు కక్కుకొని చీరకొంగుతోటి తుడ్సుకో బట్టింది.

"యింగ మనం సుత బజాట్ల అమ్ముడు బోవాలె.." అన్కుంట లచ్చయ్య లేసి నిలబడి నెత్తికి సుట్టుకున్న తువ్వాల తీసి దులిపిండు.

"జరంత సేపు మీరు నోరు ముసుకోండ్లి. యీయవారమంతా నేను సూసుకుంట." అన్కుంట లసుమయ్య నాయ్నా అవ్వల గదుమలు పట్టుకొని బతిలాడిండు.

"బావా.. నేను మాటిత్తాన. నువ్వు పందిరి సూడచ్చినప్పుడు మా ఆకిట్ల నీకిట్టమైన బండి ఎదిరి సూత్తది. నా మాట నమ్ము. తలుపు తీయ్‌బావా.."

తలుపు తెర్సుకున్నది. పెండ్లి పిలగాని మొకం ట్యూబులైటు లెక్క ఎలుగుతాంది.

లస్మయ్య అర్రలకు పోయి పిలగాన్ని యువతలకు తీసుకచ్చి సెల్లె సేయి పట్టించిండు.

"తుర్తైందా బావా.. యింగ మా సెల్లెను మంచిగ సూసుకోవాలె.." అనుకుంట లసుమయ్య ముందు నడ్తాంటె యీ బాగోతం సుత్తానికచ్చినోల్లంత ఎన్క నడ్తాండ్లు. పెండ్లి పిలగాని కుడిసేతుల అడకత్తెర ఎడం సేత్తోటి పిల్ల కుడి సేసి.. పట్టుకొని అడుగులడుగేత్తండు. అందరి కంటె ఎన్క లచ్చమ్మ, లచ్చయ్యలు

అచ్చుకుంట 'పదారు పండుగకంటె ఓ లెక్క గాని వీడేంది పురాంగ పందిరి సూడచ్చినప్పుడే అనే.. యింక రెండు రోజులేనాయె...' అని మన్సుల మిడ్కుతాండ్లు.

"పొద్దు గూక్తాంది బావా.. జల్దిన పిల్లనప్ప సెప్పుండ్లి.." సౌ సౌర, సౌ కార కడ్పుల పడ్డట్లు ఉసారుగనబెట్ట కొంరయ్య.. కొడుకు అలుక కట్నం కింద బండి దొబ్బు కచ్చినందుకు మస్తు కుసీగున్నడు. కొంరయ్య పెండ్లాం కొంరమ్మకైతె భూమ్మీద కాల్నిల్తలేదు. యింట్లకు బైటకు ఉర్కులాడ్తాంది నడుం తిప్పుకుంట.

లస్మయ్య దబ్బ, దబ్బ పందిట్ల కిరాయకు తెచ్చిన కుర్సీ లేసిండు. ఓ పక్క పిలగానోండ్లు, యింకో పక్క పిల్లోల్లు కూకున్నరు. లసుమయ్య ముందుగాల నెత్తికి తువ్వాల సుట్టుకొని ఆడున్నోల్లందరికి కుంకుమ బొట్టు పెట్టిండు.

పిల్ల అరిసేతుల కుడ్కవెట్టిండ్లు.. కుడ్క నిండ పాలు పోసిండ్లు. లచ్చయ్య, లచ్చమ్మలు పెండ్లి పిల్ల సేతులు పట్టుకొని ముందుగాల పెండ్లి పిలగాని సేతుల పెట్టిండ్లు. కుడ్కలకెల్లి కొన్ని పాల సుక్కలు తీసి పిలగాని కడుపు మీద అద్దిండ్లు. తర్వాత కొంరయ్య, కొంరమ్మ సేతుల్ల పెట్టిండ్లు. లచ్చమ్మ దుక్కమాగకపాయె. ఇయ్యపురాలు మీద పడి ఏడ్చింది. పెండ్లి పిల్ల కండ్లె నీల్లు వట, వట లడ్సుకుంట కుడ్కల వడ్డన్నై... ఎక్కెక్కి ఏడ్వవట్టింది. పందిట్లున్న ఆడోల్లంత ఆల్ల, ఆల్ల సీర కొంగుల్తోటి కండ్లు ఒత్తుకో బట్టిండ్లు. అయినోల్లందరికి అప్పసెప్పుడైనంక పిల్ల, పిలగాని తోని పెద్దోల్ల కాల్ల మొక్కిచ్చి సాగదోలిండ్లు.

పెండ్లికచ్చినొల్లు ఎక్కడోల్లక్కడ ఆల్ల ఎన్కాల్నె పోయిండ్లు. శాన దగ్గరోల్లె కొందరున్నరు.

నాత్రి యిత్తార్లు లేసినంక ఎవ్వల సౌలత్ ఆల్లు సూసుకుంట యింటిముందాకిట్ల టెంటు జంపుకాన పర్సుకొని, ఆడోల్లు ఓ దిక్కు మొగోల్లు ఓ దిక్కు నడుం ఆల్సిర్రు. ఎండ కాలమాయె.. నిలబడ్డ సెట్లు నిలబడ్డట్లె ఉన్నై.. కొమ్మిసుర్త లేదు. ఉడ్కపోయ బట్టింది.

ఇల్లంత బోసి పోయింది. లచ్చమ్మ యింటెన్క ఆకిట్ల రంది పడుకుంట కూసున్నది. లచ్చమ్మ పక్కకే సాప పరిసుంటె నడుం ఆల్సుకున్నడు లచ్చయ్య. సాగదోలుడు అప్పుడే అయిపాయె లస్మయ్య ఇంకా ఇంకా రాలేదేందని లచ్చమ్మ మన్సులనుకుంటాంటె పెద్దర్వాజ సప్పుడైంది. వంగి సూసింది లచ్చమ్మ. 'మాటల్లోనె అచ్చిండు కొడుకు.. నూరేండ్లాయసు' అని దీవెనిచ్చింది.

లస్మయ్య సర్రాసుగ యింటెన్కకచ్చి గోడకానుకొనున్న పీట గుంజుకొని కూకున్నడు.

"మల్ల కూసుంటున్నవేందిరో.. బువ్వ తినవా?... గోలెం కాడికి పోయి కాల్జేతులు కడుక్కోపో..." అనుకుంట లచ్చమ్మ మొకం సూడబట్టిండు లచ్చయ్య. ఆనికి బువ్వ పెట్టుపో అన్నట్లు.

"సైసు.. తింట గాని నీకో మాట సెప్పాలె.. లేసి కూకో.." అన్కుంట లసుమయ్య పక్కకున్న కుండలకెల్లి కొన్ని మంచినీల్లు ముంచుకొని తాగిండు. కుండ సుట్టూరంగ పోసిన ఇస్కల వరి మొల్కలెల్లినై. నీల్లు సాల సల్లగుండె.. లసుమయ్య మొకం ఎల్గి పోబట్టింది. మూతి తుడ్సుకుంట

"బావ శాన మంచోడె నాయినా.." అన్నడు.

"గీమాట సెప్పటానికేనా లేసి కూకో మన్నవ్.." అని యిసుక్కుంట మల్ల సాపల ఒర్గబోయిండు.

"నాయనా.. నేను సెప్పేది పురాంగ ఇను.. ఊకనే ఉర్కులాడ్తవేందె.. బావ నాతోని అన్న మాటలు సెప్తా... ఇను.." అని కొంచెం కసురుకున్నడు. 'పెండ్లి పిలగాడెప్పుడు మాట్లాడె వీనితోని' అని మన్సులనుకుంటాంది లచ్చమ్మ.

"యిప్పుడు నేను సెప్పే మాటలు మన గడ్ప దాటొద్దు. మీ మన్సుల్లనే దాసుకోవాలె... బావ ఏమన్నడంటే.. లస్మా... నేను సెప్పేది శాన రగస్యం.. మావోల్లకసలే తెల్వద్దు. నువ్వింకా అనుబవం లేనోనివి.. పెండ్లనేది అంత సంబర పడేది గాదు. యిటు నాయనా అవ్వలను తుర్తి పర్సాలె.. అటు పెండ్లాం తల్లిగారోల్లకు మాట రాకుండా సుసుకోవాలె.. అప్పుడే ఏపెండ్లామైనా మొగడంటె యిట్టపడ్తది. అడకత్తెర్ల పోక సెక్కోలె నాపానమంత తకుమికైతాంది.. అట్లంటుంటె నాకు బయం సొచ్చింది... ఏంది బావ గిట్ల మాట్లాడుతాండని బీర్పోయిన.. మల్ల సెప్ప వట్టిండు..."

లచ్చయ్య లచ్చమ్మలకు దెబ్బకు బెగడు సొచ్చింది. యింక కొంచెం కొడుకు దగ్గరికి జర్గిండ్లు. లస్మయ్య సిరునవ్వు నవ్వుకుంట పెండ్లి పిలగాడు ఏమన్నడో మల్ల సెప్పవట్టిండు.

"మా నాయనా, అవ్వ మీ దగ్గర్నుండి ఎంత ఈల్లైతె అంత గుంజాలని నన్నెక్కిచ్చెటోల్లు. నేను అడ్డం తిర్గితే.. సూడు గిప్పుడే అత్తగారి సంకల సొచ్చిండు.. అని ఎక్కిరిచ్చటోల్లు మీవోల్లను, మావోల్లను ఎట్ల తుర్తి సేయాలని బగ్గ ఆలోసన సేసిన...

మావోల్లకు తెల్వకుంట పక్కూల్లె నా దోస్తు దగ్గర రెండు సిట్టీలేసింటిని. రెండు లచ్చలచ్చినై. రేపు వాడు మీయింటికత్తడు. మీరు కుదవెట్టిన జాగ కాయితాలు యిడ్పిచ్చికచ్చి యిత్తడు. బండికి సుత పైసలిత్తడు... గందుకే మావోల్లకు తెల్వనియ్యద్దని అంటాన్న. అని నాతోటి ఒట్టేయించుకొన్నడు. బావ అల్ల పోయెటప్పుడే నన్ను పిలిపిచ్చుకొని యిదంత అప్పుయ్యింట్లనే సెప్పిండు. ఎవ్వలకనుమానం రాకుంట అల్లవోయిన కథ నడిపియ్యిమన్నడు.. అందుకే నేను బండి అనంగనే ఒప్పుకున్నా..."

లచ్చమ్మ ముక్కుమీద ఏలేసుకొని నోరు తెర్సింది. లచ్చయ్య గుండె నిండా అల్లుని మన్సు అల్లుకొని కండ్లె నీల్లు తెప్పిచ్చినై. అందరి కడ్పులు నిండినట్లై ఆ పూట ఎవ్వలికి ఆకలి గాలె.

చెన్నూరి సుదర్శన్
విశ్రాంత ప్రధానోపన్యాసకులు,
ములుగు, వరంగల్,
94405 58748

అదేంటి



నడుము సన్నం,
నాగలోకం.
తరిమి కరిసెర,
బింగి దయ్యం.

నాగలోకం నరుల కంటికానదు. అంత సూక్ష్మంగా ఉంటుందట కందిరీగ నడుము. అందుకే కవులు సన్నని నడుముని వర్ణించాలన్నప్పుడు, కందిరీగ నడుముతో పోలుస్తారు. కానీ కందిరీగ కుడితే మాత్రం కందిపోవల్సిందే! వీటిని కదిపిన వారిని తరిమి తరిమి కుడతాయని ప్రతీతి (తరిమి కరిసెర). 'బింగి' అన్నమాటకు వక్ర బుద్ధి అన్న అర్థం ఉంది. ఏ మాత్రం కనికరం లేకుండా కుడతాయి కాబట్టి 'బింగి దయ్యం' అన్న పదాన్ని వాడి ఉండవచ్చు.

తెలుగువాడుక.. తీపి వేడుక

చక్కెర తీపిని పోదువుకున్న చక్కని పలుకులు మనవి. కోయిలమ్మ కుహు కుహు రాగాలతో పోటీపడే మాధుర్యం మన మాటలది. అలాంటి అద్భుతమైన తెలుగులో మాట్లాడటానికి మన చిన్నారులు సిగ్గుపడుతున్నారు. ఆంగ్లంలో సంభాషిస్తేనే గొప్పని భావిస్తున్నారు. అందులో వారి తప్పేం లేదు. అమ్మానాన్నల నుంచి ఉపాధ్యాయుల వరకూ అందరూ ఆంగ్లాన్నే ప్రోత్సహిస్తోంటే పిల్లలెలా తెలుగును అక్కున చేర్చుకుంటారు?

హైదరాబాద్‌లోని రమాదేవి పబ్లిక్ స్కూలు యాజమాన్యానికి ఇదే ఆలోచన వచ్చింది. మన భాషను మనం కాపాడుకోకపోతే ఎలా అన్న భావన మొగ్గతొడిగింది. 2007లో 'మాతృభాషా వైభవోత్సవా'లకు శ్రీకారం చుట్టారు. ప్రధానోపాధ్యాయులు మారుతీ రాంప్రసాద్ ఆలోచనల్లో రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమాలు ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది కృషితో దిగ్విజయంగా సాగుతున్నాయి. పాఠశాలలో ప్రతి ఏటా వారం రోజుల పాటు వీటిని నిర్వహిస్తూ... చిన్నారుల్లో అమ్మభాషపై ఆసక్తి పెంచుతున్నారు. ఈ సంవత్సరపు వేడుకలు నవంబరు ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకూ జరిగాయి. దాదాపు వెయ్యి మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

ఈ సంబరాల్లో భాగంగా వివిధ పోటీలు నిర్వహిస్తారు. తెలుగు వారి తరగని సంపద 'పద్యం'పై పిల్లలకు మమకారం కలిగించడానికి 'పద్యం - హృద్యం', సృజనాత్మకతను పెంచడానికి 'కథ - కవిత', మనదైన సంస్కృతిని మన వారసులకు తెలియజెప్పడానికి 'కట్టు - బొట్టు', తెలుగు సాహిత్యం, కవులు, రచయితల చరిత్రలను అధ్యయనం చేసేందుకు దోహదపడేలా 'చెప్పుకోండి చూద్దాం' తదితర పోటీలను ఏర్పాటు చేస్తారు. వీటితో పాటు చిత్రకళ, వ్యాస రచన, వక్తృత్వ విభాగాల్లోనూ విద్యార్థులు పోటీపడతారు. వీటికి పిల్లలను సంసిద్ధులను చేయడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. పాఠ్యేతర తెలుగు పుస్తకాలను ప్రత్యేకంగా చదివిస్తారు. విద్యార్థుల మధ్య బృంద చర్చలు నిర్వహిస్తూ జ్ఞానవృద్ధికి బాటలు పరుస్తారు. కొన్ని రోజుల ముందు నుంచే సాధన చేయించడమూ రివాజే.

ఈ ఉత్సవాల వల్ల పిల్లల్లో ఆంగ్లంపై మోజు తగ్గుతోంది. తెలుగులో మాట్లాడటానికి ఎవరూ సంకోచించడం లేదు. మేము తెలుగువాళ్లమని గర్వంగా చెప్పుకుంటున్నారు. చదువుల్లో కూడా చురుగ్గా ఉంటున్నారు. ఊహాశక్తి, సంభాషణా చాతుర్యం పెరుగుతున్నాయి. వేదిక భయం (స్టేజ్ ఫియర్) పోతోంది. భవిష్యత్తులో వారు ఎంచుకున్న రంగాల్లో రాణించడానికి ఇవి దోహదపడతాయి కదా.

అంతే కాదు... ఈ ఉత్సవాలు నింపిన ఉత్సాహంతో బయట పాఠశాలల్లో నిర్వహించే పోటీల్లోనూ 'రమాదేవి' విద్యార్థులు విజేతలుగా నిలుస్తున్నారు. 'అభ్యాస' పాఠశాల నిర్వహించే 'సాహిత్యోత్సవం'లో గత సంవత్సరం మొదటి బహుమతి సాధించారు. ఐసీఎస్ఈ పాఠశాలల మధ్య ప్రతి సంవత్సరం నిర్వహించే పోటీల్లోనూ ప్రతిభ చాటుతున్నారు.

- తెలుగు వెలుగు బృందం

ఈ ఏటి పోటీలు

- ఒకటి, రెండు, మూడు తరగతుల విద్యార్థులకు తెలుగు లేఖన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు 'రాత పరీక్ష'.
- పద్యాలను పాడగలడం, నూతన పదజాలాన్ని నేర్చుకోవడానికి అవకాశం కల్పించేలా నాలుగవ తరగతి పిల్లలకు 'పద్య పఠనం'.
- తెలుగులో ధారాళంగా మాట్లాడేందుకు ఉపకరించేలా అయిదవ తరగతి వారికి 'వక్తృత్వం'
- 'తెలుగు భాషంటే ఇష్టమా? ఎందుకు?' అన్న అంశంపై ఆరు, ఏడు, ఎనిమిదవ తరగతుల చిన్నారులకు 'వ్యాస రచన'
- 'తెలుగు భాషాభివృద్ధికి చేయాల్సిన కృషి'పై తొమ్మిది, పదో తరగతి విద్యార్థుల ఆలోచనలు. పిల్లలు తెలుగులో మాట్లాడేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పిల్లలందరూ అభిలాషించారు.

ఆహ్వానం

పిల్లలకు తెలుగుపై మక్కువను పెంచేందుకు మీ పాఠశాలలో కూడా ఏవైనా ప్రత్యేక కార్యక్రమాలను వినూత్నంగా నిర్వహిస్తుంటే వాటి వివరాలను మాకు తెలియజేయండి. ఆ స్ఫూర్తిని తెలుగు వెలుగు వేదికగా తెలుగు వారందరితోనూ పంచుకుందాం.

అంకెలతో కుస్తీ... సాహిత్యంతో దోస్తీ...

రంజని

'చుట్టూరా ఆవరించిన చీకటిని నిందించడం కంటే, దీపం చిన్నదైనా సరే – వెలిగించండి' ... ఏజీ ఆఫీసు సాహితీ సమితి 'రంజని' నినాదమిది. ఆ చిరుదీపం యాభై ఏళ్లలో వేల ప్రమిదలకు వెలుగులు పంచింది. సాహితీ నందదీపమై వెలుగొందుతోంది. జిందాబాద్! ముర్దాబాద్! – అసెంబ్లీ హంగామా దాటుకుని... బావా ఎప్పుడు వచ్చితీవు – రవీంద్రభారతి మైకులోంచి వినిపిస్తున్న కృష్ణరాయబారం పద్యాన్ని ఆస్వాదిస్తూ... ఇడ్లీసాంబార్, బిసిబేళబాత్–కమ్మని కామత్ రుచుల్ని తలుచుకుని నాలుక తడిపేసుకుంటూ...నమో వేంకటేశా– కొండమీదున్న బిర్లేశుడికి గుండెల్లోనే దండం పెట్టుకుని, ఓ నాలుగడుగులు వేస్తే...

ఏజీ ఆఫీసు... అకౌంటెంట్ జనరల్ కార్యాలయం. కూడికలూ తీసివేతలూ హెచ్చింపులూ భాగహారాలూ... కుర్చీటేబుళ్లలా ఫ్యానూ ట్యూబులైట్లలా ఆ ఆవరణలో ఓ భాగం. అక్కడ అంకెలు...రంకెలేస్తాయి. ఆవులిస్తే స్కాములు లెక్కబెడతాయి. తిరకాసు లెక్కల తొక్కలు తీస్తాయి. సిబ్బంది వృత్తి నైపుణ్యాన్నయితే మాటల్లో చెప్పలేం. 'అంకెలలో మర్మమెల్ల అర్థమైనది తండ్రీ!' అని ఢంకా భజాయించి చెప్పగల ఉద్ధండులు. మరి ప్రవృత్తో! ... సాహితీ సేవ, అక్షరోపాసన. ఆ ఆవరణలో చేయి తిరిగిన కవులున్నారు. కత్తుల్లాంటి కథకులున్నారు. క్షీర నీర న్యాయం తెలిసిన సమీక్షకులున్నారు. కంప్యూటర్లు కట్టేశాక, కాలిక్యులేటర్లను బల్ల సొరుగుల్లో భద్రపరిచాక, ఆఫీసు గదికి గొళ్లెం పెట్టేశాక ... అక్షరాల్ని ప్రేమించేవారంతా ఓ చోట కలుసుకుంటారు. నచ్చిన పద్యాలేవో పాడుకుని, మెచ్చిన కవితలేవో నెమరేసుకుని, కథల కసరత్తు చేసుకుని, ప్రోత్సాహాల ప్రొటీన్ డైట్ పుచ్చుకునే - పాకశాల, పానశాల, పారశాల, కళాశాల, కార్యశాల, కవనశాల...ఒకటుందా ఆవరణలో.

పేరు–రంజని... తెలుగు సాహితీ సమితి

1961వ సంవత్సరం, ప్లవనామ ఉగాది రోజున రంజనికి పునాది పడింది. భాషను ప్రేమించే వారూ సాహిత్యాన్ని శ్వాసించేవారూ ఒక సంఘంగా ఏర్పడ్డారు. ఇసుకపల్లి దక్షిణామూర్తి నేతృత్వంలో తొలి కార్యవర్గం ఏర్పాటైంది. పట్టుమని పదకొండు మంది సభ్యులు కూడా లేరప్పుడు. ఆ రంజనే, యాభై ఏళ్లలో అనేకానేక ఆణిముత్యాలను ముద్రించి కవిజన రంజనిగా పేరుతెచ్చుకుంది. ఆ రంజనే, ఎంతోమంది కొత్త రచయితలకు ప్రాణంపోసి అక్షర జనని అనిపించుకుంది. ఆ రంజనే, తెలుగు సాహితీ ప్రపంచంలో ప్రాతఃస్మరణి అయ్యింది. నిరంతరాయంగా, నిర్విఘ్నంగా, నిత్యోత్సాహంతో, నిజభక్తితో, నిష్ఠతో ఓ సాహితీ సమితిని నిర్వహించడమంటే మాటలు కాదు. మూటలకొద్దీ అంకిత భావం ఉండాలి. ఆ విషయంలో రంజని రథసారథులకు సాటీపోటీ లేదు. ఇన్నేళ్లలో... ఎన్ని సాహితీ సభలు! ఎన్ని విద్వత్ గోష్ఠులు! ఎన్ని విలువైన ప్రచురణలు! ఎన్నెన్ని అపురూప కావ్యగానాలు! రాయగలిగితే రంజని స్వర్ణోత్సవ చరిత్రే ఓ ఉద్గ్రంథం అవుతుంది.

ఈ గాలీ ఈ నేలా...

ఏజీ ఆఫీసులో ప్రసరించే గాలిని పరీక్షించాలి. అందులో తేమ శాతమెంతో, ప్రాణవాయువు వాటా ఎంతో లెక్కగట్టడానికి కాదు. పద్యమెంతో గద్యమెంతో తేల్చుకోడానికి. సిబ్బంది తాగే నీటిని ఓ సీసాలో పట్టి, ప్రయోగశాలకు పంపాలి. సూక్ష్మక్రిముల భోగట్టా కోసం కాదు. నవరసాల్లో ఏవేవి ఎంతెంత ఉన్నాయో కచ్చితంగా కొలవడానికి. అన్నిటికంటే ముందు, ఆ మట్టిని ఓ పిడికెడు సీసీఎంబీ వాళ్లకు ఇచ్చిరావాలి. శ్రీరాముడి స్పర్శ రాతిని నాతిగా మార్చినట్టు...ఆ ధూళిసోకితే సామాన్యులూ రచయితలు అయిపోతారేమో కనిపెట్టమని చెప్పాలి. ఏ మహత్తూ లేకపోతే, ఏజీ ఆఫీసు నుంచే అంతమంది రచయితలూ రచయిత్రులూ ఎందుకు పుట్టుకొస్తారు? ఆహ్లాద రచయిత మల్లాది వెంకటకృష్ణమూర్తి ఈ ఆఫీసు ఉద్యోగే. సంభాషణా భూషణుడు పరుచూరి వెంకటేశ్వరరావు ఆ ఆరుబైట వేదికపై నాటకాలు ఆడిన వారే. పాలకోడేటిలోని రచయితకు పాలపళ్లు వచ్చిందీ ఇక్కడే. సహవాసి (జె.ఉమామహేశ్వరరావు) సాహితీ సహవాసం ఈ చెట్ల నీడల్లోనే

ప్రగాఢమైంది. పమ్మి వీరభద్రరావు, శంకరమంచి పార్థసారథి, ఆశారాజు, నందిరాజు పద్మలతా జయరాం, జాస్తి రమాదేవి, నడిమింటి జగ్గారావు, నెగోశ్రీ...ఆ జాబితా చాలా పెద్దది. 'నేనూ నా సోదరుడు పరుచూరి వెంకటేశ్వరరావు ఇదే వేదిక మీద నాటకాలాడాం. ఈ వేదిక మాకు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చింది. రంజనిలో ఇప్పటికీ ఇంతమంది రచయితలు ఉండటం ఆశ్చర్యమే' అంటూ జ్ఞాపకాల్ని నెమరేసుకుంటారు పరుచూరి గోపాలకృష్ణ.

నిత్య బాలింతరాలు...ఏజీ సాహితీ సరస్వతి! ఎప్పటికప్పుడు కొత్త రచయితలు పుట్టుకొస్తూనే ఉంటారు. ఆ గాలికి సాహితీ గంధాన్ని పూసిందీ ఆ నీళ్లలో అక్షరాల అత్తరు కలిపిందీ, ఆ వాతావరణంలో సృజనాత్మకతను పిచికారీ చేసిందీ...రంజనే! పాతవారిని గౌరవించడంలో, కొత్తవారిని ప్రోత్సహించడంలో ఆ సాహితీ సమితి తనవంతు పాత్రను పోషిస్తూనే ఉంది. పోటీలు పెట్టి పురిగొల్పుతోంది. అచ్చు వేయించి రెచ్చగొడుతోంది. ఇంకేముంది, ఓమోస్తరు సాహితీ అభిలాష ఉన్నవారిలో అయినా కవనోత్సాహం పెల్లుబుకుతుంది. కథన కుతూహలం కదం తొక్కుతుంది. 'విశ్వనాథ ప్రభావంలో పడినవాడు ఆయనలాగా రాస్తాడు. ఆయన లాగా మాట్లాడతాడు. ఆయనలాగా ప్రవర్తిస్తాడు. ఆయనలాగా జీవిస్తాడు. ఆయనలాగా పొగరెక్కిపోతాడు...' అంటారు వేటూరి సుందరరామమూర్తి ఓ సందర్భంలో. రంజని ప్రభావమూ అంతకంటే తక్కువేం కాదు. ఇచట పుట్టిన చిగురు కొమ్మయిన చేవ! ఈ ఆఫీసులో ట్రయినీ కుర్రాడు కూడా కూత నేర్చుకుంటున్న కవికోకిలే! అక్షరాభ్యాసం చేయించి, చేయి దులుపుకోదు రంజని. ఆ కథల్నీ కవితల్నీ ముద్రించి వారి కంటూ ఓ ముద్రను ఏర్పరుస్తుంది. కార్యాలయ రచయితలూ రచయిత్రులూ తమ పుస్తకాల్ని అచ్చు వేయించుకోడానికి ఆర్థిక సాయం అందిస్తుంది. రంజని అర్ధవార్షిక సంచిక ఓ చక్కని కలాల కూడలి. 1962లో ప్రారంభమైన ఆ పత్రిక ... పుత్రపౌత్రాభివృద్ధిరస్తు అన్నట్టు...రెండుమూడు తరాల రచయితలకు జన్మనిచ్చింది.

అక్షర యోధులకు స్వాగతం..

ఎంత కసరత్తు అయినా చేసుండవచ్చు. ఎన్ని కండలైనా ఉండి ఉండవచ్చు. బరిలోకి దిగి బాహుబలం ప్రదర్శించినప్పుడే మల్లయోధుడికి గుర్తింపూ గౌరవం. అక్షర వీరులకూ ఈ మాటే వర్తిస్తుంది. పోటీతో ప్రతిభ రాటుదేలుతుంది. ఓటమి రోషాన్నిస్తుంది. గెలుపు ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదిస్తుంది. రంజని నిర్వహించే కథల పోటీలూ కవితల పోటీలూ పద్యరచనా పోటీల ప్రధాన ఉద్దేశమూ అదే. 1984 నుంచి ఏటా రంజని-కుందుర్తి అవార్డుల పేరుతో వచన కవితల్లో పోటీలు పెడుతోంది. 1984 నుంచి 2008 వరకు బహుమతి పొందిన కవితల్ని పుస్తక రూపంలో ప్రచురించింది. ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ సర్వీసు అధికారి ... భీమారావు పేరిట 1989 నుంచి 1993 వరకు కథల పోటీలు జరిపింది. మంచిగంధపు చెక్కల్లాంటి ఆ రచనల్ని 'మంచి కథ'గా ప్రచురించింది. కాస్త విరామం తర్వాత, 2008 నుంచి మళ్లీ రంజని-నందివాడ భీమారావు అవార్డు కథల పోటీలు జరుగుతున్నాయి. బహు ప్రశంసలందుకున్న ఆ కథల్ని 'బహుమతి కథ'గా అచ్చులోకి తెచ్చింది. 2008 నుంచీ పూర్వ మహాగణకులు సత్యవర్ధన సహకారంతో రంజని-విశ్వనాథ పద్య కవితా పోటీలకు పిలుపునిస్తోంది. అలా వచన కవిత్వాన్ని ప్రోత్సహించడమే కాదు...భాషా సరస్వతికి పద్యగద్యాల నైవేద్యమూ పెడుతోంది. రంజని పోటీల్లో బహుమతి పొందిన రచనలంటే సాహితీ ప్రపంచంలో ప్రత్యేకమైన గుర్తింపు. యువకవులూ కొత్త రచయితలూ ఉనికిని చాటుకోడానికీ, పరిధులు విస్తరించుకోడానికీ రంజని రాచవేదిక అవుతోంది. పోటీల్లో పాల్గొనే వారి సంఖ్య ఏటికేడాది పెరుగుతోంది. గెలిచిన వారికి ఓ మెట్టు పైకెళ్లామన్న ఆనందం. గెలవనివారికేమో, తాము ఎక్కాల్సిన మెట్లు ఎంత ఎత్తున ఉన్నాయో తెలుసుకోగలిగామన్న సంతృప్తి. ఆ లెక్కన అందరూ విజేతలే. 'అప్పుడు మేం కలనైనా అనుకోలేదు, ఈ అవార్డులు ఇంతింతై వటుడింతై అన్నట్టు రాష్ట్రం ఎల్లలు దాటి దేశానికి, ఇంటర్నెట్ ద్వారా విశ్వవ్యాప్తమై ఇన్ని సంవత్సరాలు అజేయంగా నిలుస్తాయనీ' అంటారు చీకోలు సుందరయ్య. ఆయన రంజని అధ్యక్షులు. నంద్యాల మురళీకృష్ణ (ఉపాధ్యక్షుడు), మట్టిగుంట వెంకటరమణ (ప్రధాన కార్యదర్శి), నందిరాజు పద్మలతా జయరాం (సంయుక్త కార్యదర్శి), కుంపటి ఆదిశేషు (కోశాధికారి). ఇంకా సహాయ కార్యదర్శులూ కార్యవర్గ సభ్యులూ, అనుబంధ సభ్యులతో కూడిన కార్యవర్గమే రంజని అక్షర అక్షౌహిణి.

ప్రత్యేక గౌరవం..

దారిచూపిన వారికి దండం పెట్టుకోవాలి. వెలుగు పంచినవారికి వంద వందనాలు సమర్పించాలి. అది సంస్కారం. సాహితీ సంస్కారం కూడా. రంజని సంస్థ పానుగంటి లక్ష్మీనరసింహారావు, చలం, కొడవటిగంటి వంటి మహామహులపై ప్రత్యేక సంచికలు తెచ్చింది. శ్రీశ్రీపై సమగ్ర సంకలనాన్ని ప్రచురించింది. 'నివాళి'

రంజని స్వర్ణోత్సవాల సందర్భంగా గతంలో ఎ.జి. కార్యాలయంలో పని చేసిన ప్రముఖ కవులు, రచయితలతో సంస్థ ప్రస్తుత సభ్యులు









పేరుతో వచన కవితా పితామహుడు కుందుర్తి వ్యక్తిత్వం గురించీ సాహిత్యం గురించీ ఓ పుస్తకాన్ని వెలువరించింది. 'శేషేంద్ర శిఖరం' ... కొండంత కవి వ్యక్తిత్వాన్ని అద్దంలా ప్రతిబింబించింది. 'పాటల పూదోట - వేటూరి' ... పద బంధ పరమేశ్వరుడికి ఘన నివాళి. కథా రంజని (ప్రముఖుల కథల సంకలనం), కథాయజ్ఞం (కాళీపట్నం రామారావుగారి 'యజ్ఞం' కథపై హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ సహకారంతో ప్రచురించిన వ్యాస సంకలనం), గొంతులు చిగిర్చాయి (1988 వరకు రంజని-కుందుర్తి అవార్డులు పొందిన కవితా సంకలనం), రజత రంజని (వందేళ్ల తెలుగు సాహిత్యంపై సమగ్ర సమీక్ష), తోరణం (నండివాడ భీమారావు రచనలు), ఒక నులివెచ్చని స్పర్శ (2004-07 సంవత్సరాల్లో రంజని-కుందుర్తి అవార్డులు పొందిన కవితా సంకలనం), సినిమా చూద్దాం రండి (75 సంవత్సరాల తెలుగు సినిమా ప్రభావంపై వ్యాసాల సంకలనం)... ఒకటారెండో ఎన్నో ప్రచురణలు. దేనికదే అమూల్యం. శ్రద్ధగా చదువుకుని, జాగ్రత్తగా దాచుకోవాల్సిన పుస్తకాలే అన్నీ.

సాహిత్యం - సమాజం వేరువేరు కాదు. సాహిత్యం సమాజంలోంచి పుట్టింది. సమాజం సాహిత్యానికి ముడిసరుకు. ఆ సమతౌల్యం రంజని ముద్రణల్లోనూ కనిపిస్తుంది. విస్మృతం అవుతున్న స్మృతి సాహిత్యానికి నీరాజనంగా...' 'అమ్మ'పై కవితల సంకలనాన్ని ప్రచురించింది. మరో సంకలనం 'మా ఊరు'... జ్ఞాపకాల తేరు! ప్రపంచ గవాక్షంలోంచి సాహితీ దర్శనం చేయించే లక్ష్యంతో 'విశ్వ కవిత' పేరుతో జాతీయ అంతర్జాతీయ కవుల రచనల్ని అందించింది. జనం గుండెల్లో పుట్టి, గొంతుకల్లోంచి ప్రవహించిన జానపదానికి రంజని మట్టి వాసనలతో ధూపం పెట్టింది. 'జానపద సాహిత్యం-మానవతా దృక్పథం' పేరుతో సమగ్ర సంకలనాన్ని ప్రచురించింది. రజతోత్సవ ప్రచురణ 'రజత రంజని' ... ఓ వెండికొండ! వందేళ్ల సాహిత్యంపై జరిగిన ఆ సమగ్ర సమీక్ష పరిశోధక విద్యార్థులకు కొండంత అండ. స్వర్ణోత్సవ కానుక 'స్వర్ణ రంజని' అయితే ... మేలిమి బంగారమే. ఇందులోని డెబ్బై కథానికలు .. డెబ్బైవారాల నగలు! రంజని ప్రచురణలు ... బొండుమల్లెల్లా గుబాళిస్తుంటాయి. ముఖచిత్రం మొదలు చివరి అట్టదాకా..ఎనలేని శ్రద్ధ! ముద్రణలో రాజీ ఉండదు. నాణ్యతలో తేడా ఉండదు.

విరబూసిన సాహితీ సుమాలు

నాట్య కళకైనా, నటనా కళకైనా అక్షరమే ఆధారం, సాహిత్యమే ఆలంబన. రజతోత్సవాల సందర్భంగా...సురభి సహకారంతో వేయేళ్ల తెలుగు సాహిత్య రూపకాన్ని ప్రదర్శించింది. అదొక ప్రయోగం. మహాసాహసం. రంజని మాజీ ఉపాధ్యక్షురాలు సుమతి సౌజన్యంతో ఏటా సెప్టెంబరులో 'రంజని-ఊట్ల రాధాకృష్ణ మూర్తి స్మారక ప్రసంగా'లూ జరుగుతున్నాయి. భారత స్వర్ణోత్సవాల సందర్భంగా రంజని పదిహేను రకాల పోటీలు నిర్వహించింది, మంచి సభలు పెట్టింది. నాలుగు రోజుల పెద్ద పండగది! ఐదు దశాబ్దాల సుదీర్ఘకాలంలో .. రంజని అపురూప అతిథులు ఎంతోమంది. అందులో కవులున్నారు, సాహితీవేత్తలున్నారు. నాటక ప్రయోక్తలున్నారు, సినీ దిగ్గజాలున్నారు. నాట్యకారులున్నారు, కార్టూనిస్టులున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేతలున్నారు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలున్నారు. విశ్వనాథ, శ్రీశ్రీ, రావిశాస్త్రి, మధురాంతకం రాజారాం, అన్న దాశరథి, తమ్ముడు దాశరథి... రంజని వేదికనెక్కారు. సచ్చిదానంద రౌత్రాయ్ (ఒరియా), జయకాంతన్ (తమిళం), హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ (బెంగాలీ, ఆంగ్లం), హరిభజన్ సింగ్ (పంజాబీ), దేవవ్రతదాస్ (అస్సామీ) ...రంజని ఆతిథ్యాన్ని స్వీకరించారు. తెలుగు మాతృభాష కాని అకౌంట్స్, ఆడిట్ సర్వీసు ఉన్నతాధికారులతో అక్షరాలు దిద్దించే మహద్భాగ్యమూ రంజనికే దక్కింది. తెలుగు నేలపై పుట్టడం, తెలుగు మాట్లాడగలగడం పూర్వజన్మ సుకృతం అంటారు. ఆంధ్రేతరులతో తెలుగు అక్షరాలు దిద్దించడం...అంతకంటే గొప్ప అదృష్టం!

* * *

శ్రీవాణీ పాదాంబుజ
సేవాంకితమై తరించు చిరకాలముగా
భావాలంకృత 'రంజని'
ఆ వాగ్దేవి కురిపించు ఆశీస్సులతో

...అంటూ సవినయంగా సాహితీ సేవలో పునరంకితం అవుతోంది రంజని. ఆచంద్ర తారార్కం, అక్షరమున్నంత కాలం వర్ధిల్లు రంజనీ, వర్ధిల్లు!

అందరి 'రంజని'

తొలి అడుగు ఎప్పుడూ కష్టమే. తర్వాత ఏ అడుగుకూ అంత కష్టం ఉండదు. తొలి సంవత్సరాల్లో పురస్కార నిర్వహణకూ కావ్యాల ప్రచురణకూ చాలా కష్టపడాల్సి వచ్చింది. ఆదరణ పెరిగే కొద్దీ సమస్యలు తగ్గాయి. పోటీ పెరగడంతో అత్యుత్తమ, ఉత్తమ కవితలతోపాటు మంచి కవితలకీ కూడా అవార్డులు ప్రారంభించాం. పద్యపోటీల్లో, కథల పోటీల్లో కూడా ఆ ప్రమాణాలే పాటిస్తున్నాం. ఇన్నేళ్ల తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే ఇన్ని పుస్తకాలు ఎలా ప్రచురించాం, ఇన్ని కార్యక్రమాలు ఎలా నిర్వహించాం... అనిపిస్తుంది. ఒక్కో క్రతువు వెనకా ఒక్కో మిత్రుడి సహకారం మరువలేనిది. ఈ యాభై ఏళ్ల విజయం అందరిదీ...

- చీకోలు సుందరయ్య, అధ్యక్షులు

కరణం జనార్ధనరావు,
డిప్యూటీ చీఫ్ సబ్ ఎడిటర్,
ఈనాడు, హైదరాబాద్
8008425959

మందార మకరంద మధురభాష

నలువదేవేరికి నైవేద్యమిడురీతి
నన్నయ్య నవసూక్తి నాణెమొలుక
పలుకుల తల్లికి పాద్యమిచ్చిన భాతి
తిక్కన పలుకుల తేనెలూర
వాగ్దేవి పాదాల పారాణి జిగివోలె
ఎఱ్ఱన పదబంధమింపునింప
గీర్వాణి ఫాలాన కీలించు తిలకమై
శ్రీనాథ రసధార శ్రీలుచింద

ఆంధ్రసాహితీ నందనోద్యాన సీమ
పారిజాత పుష్పమ్ములు పరిమళించి
భారతాది కావ్యమ్ములు పరిఢవిల్ల
జిలుగు లొలుకునుగాక మా తెలుగుభాష.

పోతన్న లేకున్న పుట్టింపతరమౌనె
మందార మకరంద మధురధార
పెద్దన్న లేకున్న విహరింప జాలునే
కర్పూర తాంబూల గంధలహరి
తిమ్మన్న లేకున్న తెప్పింప వశమౌనె
పారిజాత లతాంత పరిమళమ్ము
సూరన్న లేకున్న చొప్పింప సాధ్యమే
మురిపాల ముత్యాల పోహళింపు

తెలుగు బిడ్డల సుకృతంపు ఫలము వలన
భావితరములు పఠియించి పరవశింప
పద్యవిద్యకు సరిక్రొత్త వన్నెలిడిన
కవిసుధాకరులకు నమస్కారశతము.

మువ్వగోపాలుని ముంగిట నిలిపిన
క్షేత్రయ్య సాహితీ జీవశక్తి
పద్మావతీ శ్రీనివాసుల మురిపించు
అన్నమాచార్యుల అమృతవాణి
రాముని తనమ్రోల రప్పించి దర్శించు
త్యాగయ్య నాద సౌందర్యదీప్తి
భద్రాద్రిలో రామభద్రుని బంధించు
కంచెర్ల గోపన్న కవనరీతి

భక్తి ఒకవంక - ఒకవంక రక్తి విరియ
కాంతిమంజరి కన్నుల కదలియాడ
శాంతినిర్ఝరి గుండెల జాలువార
పులకరించునుగాక మా తెలుగునేల.

ఒకనాడు నాగంట ముత్తేజమును గూర్చె
కమనీయ కల్పనా కవితల్లి
ఒకనాడు నా కంఠముఱ్ఱూతలూగించె
సప్తస్వరమ్ముల సారమొలికి
ఒకనాడు నా కుంచె ఉల్లాసమున తూగె
రంగుల స్వప్నాలు రాశిపోసి
ఒకనాడు నాటంక మొయ్యారములు తీర్చె
రాలలో మంజీర రవము మ్రోగ

ప్రతిముఖమ్మున చతురత పరిమళింప
ప్రతి గృహమ్మున రసికత పరవశింప
ఐకమత్య రాగమ్ముల నాలపించి
కళలు విరజిమ్ముగాక నా తెలుగుజాతి.

మధుమాసముదయింప మనసెల్ల పులకింప
కోయిల కమ్మగా కూసినట్లు
తొలిప్రొద్దు పొడుపుల తెలుగింట పడుచులు
విరజాజి ముగ్గులు వేసినట్లు
మరకత ద్యుతులీను హరిత శాద్వలమందు
రంగుల చిలుకలు వ్రాలినట్లు
ప్రత్యూష పవనాల స్పర్శకు పులకించి
రమణీయ సుమధూళి రాలినట్లు

మాట మాటలో తేనెల తేటలొలుక
పాట పాటలో వెన్నెల బాటలలర
వింత అనుభూతి గుండెల విచ్చుకొనగ
తళుకు లీనునుగాక! మా తెలుగు కవిత.

సప్తస్వరమ్ముల స్వర్ణ రాగములూగి
నవరసమ్ముల పద్య నాటకములు
శివకేశవాద్వైత సిద్ధాంతమును నిల్పి
శ్రుతి పర్వమై తనర్చు హరికథలు
వీరరసావేశ విక్రాంతి రగిలించి
పులకలు నిగిడించు బుర్రకథలు
చారు చమత్కార సారస్యమొలికించి
తనివి తీర్చెడి అవధాన గతులు

అమృత మధురిమ కెనవచ్చు ఆవకాయ
కువలయమ్మెల్ల మెచ్చు గోంగూరమాయ
తెలుగు జాతికి సొంతమై వెలయుచుండ
వెలిగి పోవునుగాక మా తెలుగుతనము.

నరాల రామారెడ్డి,
అవధాని, ప్రొద్దుటూరు.
08564 254048

నిత్యమై... నిఖిలమై...



సత్యం...
ఆయన వాక్కు. తెలుగు ఖ్యాతి నిలిచి ఉండు నిత్యమై. నిఖిలమై.

శివం...
ఆయన ఆలోచన. అభ్యుదయాన్ని ఆకాంక్షించే వారందరికీ శుభకామన.

సుందరం...
ఆయన తేటగీతి రచన. సాహిత్య సరస్వతికి తేట తెలుగు అక్షరార్చన.

ఆయనే శంకరంబాడి సుందరాచారి...
మన తెలుగుతల్లి కడుపులో బంగారును, కనుచూపులో కరుణను దర్శించి, తెలుగు వారందరికీ ప్రదర్శించిన 'ప్రసన్న కవి'. పురాణేతిహాసాల నుంచి పెత్తందారుల దోపిడి వరకూ సమస్తాంశాలపై సమగ్రావగాహనతో సాహిత్య సృష్టి చేసిన సవ్యసాచి.

గీతాంజలిలోని గేయాలు అసలు సిసలైన తెలుగు గేయాలుగా మధుర భావాల అభ్యుదయ మధువులు కురిపిస్తాయి. మచ్చుకు...

స్వతంత్ర భారతావని తొలిరోజుల్లో చిత్తూరు జిల్లా బోర్డు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా ఉండే వారు శంకరంబాడి సుందరాచారి. ఆ సమయంలో అంటే 1948-51 మధ్యలో ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల విద్యార్థిగా ఆయనకు నేను ప్రత్యక్ష శిష్యుణ్ని. ఒక గురువుగా శంకరంబాడి విద్యార్థుల పాలిట కల్ప తరువు. పాఠాలు బోధిస్తూనే... ఉపాధ్యాయులనే వారు ఎలా ఉండాలో చెప్పేవారు. శిష్యుడి కోసం కన్ను పోగొట్టుకున్న శుక్రునిలా రాక్షసులకు గురువు కావొచ్చు కానీ బోధించకనే ఏకలవ్యుని బొటనవేలిని దక్షిణగా గ్రహించిన ద్రోణుని వంటి రాక్షస గురువు కారాదనీ అనే వారు. విద్యార్థులంటే ఆయనకెంతో మమకారం. దీన్ని వివరించే చిన్న ఉదంతం నా స్వానుభవంలో ఉంది. వెంకటేశ్వరునిపై నేను రచించిన శతకం అముద్రితంగా ఉందని తెలుసుకుని వెంటనే మిత్రుల సహకారంతో దాన్ని ముద్రింపజేశారు. ఆయన మంచి గురువు, కవి మాత్రమే కాక చక్కటి నటులు. సహోపాధ్యాయులతో కలిసి రామదాసు, హరిశ్చంద్ర, ప్రతాపరుద్రీయం వంటి నాటకాలలో నటించే వారు. తర్వాత రోజుల్లో నేనూ ఉపాధ్యాయుణ్నే అయ్యాను. 1961లో పూతలపట్టు వద్ద ఒక ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నప్పుడు అక్కడికి సుందరాచారి వచ్చారు. పాఠశాలల పరీక్షాధికారి హోదాలో మా బడిలోని బాలబాలికల ప్రజ్ఞను పరిశీలించారు. తిరిగి పదేళ్లకు, అంటే 1971లో మరోసారి ఆయన దర్శనమైంది. ఎస్.వి.ఆర్ట్స్ కళాశాలలో తెలుగు ఉపన్యాసకునిగా ఉన్నప్పుడు కొత్తగా అద్దె ఇంటిలోకి వచ్చాము. మా పక్క ఇంట్లోనే శంకరంబాడి కనిపించారు. అప్పటి నుంచి ఆయన కీర్తిశేషులయ్యే వరకూ మా అనుబంధం అవిచ్ఛిన్నంగా కొనసాగింది.

సుందరాచారి వైవాహిక జీవితం కరుణరసాత్మకం. మానసిక వికలాంగురాలైన ఓ పేదింటి అమ్మాయి గురించి ఆయనకు తెలిసింది. ఆ అమ్మాయి వైకల్యాన్ని ఎత్తిపొడుస్తూ ఆమె చెల్లెళ్లను పెళ్లి చేసుకోవడానికి ఎవరూ ముందుకు రావట్లేదు. విషయం తెలిసిన వెంటనే సుందరాచారి... ఆ కుటుంబాన్ని సంప్రదించారు. మానసిక వికలాంగురాలైన పెద్దమ్మాయిని పెళ్లి చేసుకున్నారు. వివాహానంతరం ఆమెకు నిరంతరం చికిత్స చేయిస్తుండే వారు. వారికి ఒక పుత్రిక జన్మించింది. ఆ పాప ఐదేళ్ల వయసులోనే జబ్బు చేసి మరణించింది. మానసిక వ్యథ ముదిరిన ఆ తల్లి మరికొంత కాలానికే ఈ లోకాన్ని వదలి వెళ్లిపోయింది. శంకరంబాడి ఒంటరిగా మిగిలిపోయారు.

'శంకరంబాడి సుందరాచారి' అనే పేరు యతి గణములతో ఒక తేటగీతి పద్యపాద భాగం అవుతుంది. అందుకేనేమో ఆయనకు తేటగీతి అంటే అమితమైన ఇష్టం. సుందర రామాయణం, సుందర భారతం, స్వప్న సుందరుడు, ఏకలవ్యుడు, బుద్ధగీత, అగ్నిపరీక్ష వంటి కావ్యాలన్నింటినీ తేటగీతి పద్యాలతోనే రచించారు. మొత్తమ్మీద 15 వేల తేటగీతి పద్యాలు ఆయన చేతి నుంచి జాలువారాయి. 'గీతాంజలి'ని మాత్రా ఛందస్సులో గేయకావ్యంగా అనువదించారు. 'నా స్వామి' అనే శ్రీనివాస శతకం ఆటవెలది పద్యాలలో; బుద్ధ గాథను, గాంధీ జీవితాన్ని 'శాంతి దూతలు' పేరున బుర్రకథలుగా; బాపూజీ మరణ సన్నివేశాన్ని 'బలిదానం' పేరున గేయకృతిగా; ఫిరదౌసి గాథను 'పేదకవి' అనే కావ్యంగా; శ్రీకృష్ణగాథను 'సుందర నందనందనము' అనే కావ్యంగా రచించారు. చివరి కావ్యంలో అన్ని రకాల వృత్త పద్యాలు, సీసపద్యాలు హృద్యంగా ఉంటాయి.

రామాయణ భారతాది కావ్యాలను శంకరంబాడి కేవలం పండితుల కోసమే కాక... విద్యార్థినీ విద్యార్థుల స్థాయి వారికి సైతం అర్థం కాగల ప్రసన్న శైలిలో రచించారు. 'ప్రసన్న కవి' అన్న బిరుదును సార్థకం చేసుకున్నారు. 'సుందర రామాయణం' బాలకాండలో రామలక్ష్మణులు విశ్వామిత్రుని యజ్ఞ రక్షణార్థం అరణ్యంలోని ఆశ్రమ ప్రాంతాలలో సంచరిస్తున్న సమయంలో వారికి తారసపడిన రక్కసి తాటక భయంకర రూప చిత్రణ ఒక్క తేటగీతి పద్యంలోనే సజీవ చిత్రంలా మన ఎదుట నిలిపారు... ఇలా...

నల్ల కొండల నుగ్గుగా నలగగొట్టి
చిమ్ము చీకటిలో గల చేవపిండి
కాల సర్పాల విషమెల్ల కలిపి, నూరి
కాచి పోసిన రూపుగా కానిపించె

ఇంత చిన్ని పద్యంలో అంత భయంకర రాక్షసిని చిత్రించటంలో వీరి కవితా ప్రతిభ సుస్పష్టం.

బాహ్య రూప చిత్రణ మాత్రమే కాదు.. హృదయాంతర్గత వేదనా చిత్రణలోనూ శంకరంబాడి పద్యకవితా శిల్ప నైపుణ్యం మాన్యమై హృదయంగమంగా ఉంటుంది. బంగరు లేడి వంచనతో.. రామలక్ష్మణులు దగ్గర లేని వేళ.. సీతమ్మను తీసుకొని వెళ్తూ రావణుడు పలుకుతున్న అతిశయాలు విన్న జానకి హృదయ వేదన.. భర్త మీది నమ్మకం గల ధైర్యం.. మన ఎదుట ఇలా సాక్షాత్కరింపజేశారు...

అనిన.. లక్ష్మణు.. నిష్ఠుల్మపాత్మునట్లు
తిట్టిపోసిన పాపము ముట్టినటుల..
చిత్త మల్లాడ.. ధైర్యము చెదర.. మేను
వడక.. పల్కులు తడబడ.. పుడమి బిడ్డ..
పాపి! వదరకు... రాముడు వచ్చు వరకు
పలుక కుండగ నుండి.. ఆపైన నీదు
ఘనత ఎట్టిదొ.. నాకెరుగంగ జూపి
నన్ను కొనిపోవుదువుగాని.. నిన్ను నీవె
ఏల కీర్తించుకుందువు? చాలు నీ ప్ర
తాపములు నిల్పు..

అంటున్న సీతా హృదయం పాఠకుల హృదయాల ఎదుట ప్రత్యక్షమవుతుంది.

ప్రాచీన, నవీన రామాయణ కవులకు తోచని ఒక అరుదైన, హృదయ విదారకమైన చిన్ని సన్నివేశం చిత్రించారు సుందరాచారి. ఈ

**"మంత్ర తంత్రాలేల మణులెంతువేలరా?..
తలుపులన్నిటి చెక్క తన్ని మూసిన గుడిని
మూగ చీకటిలోన మునిగిపోయిన మూల
కూర్చుండి ఎవ్వరిని కొలుచుచున్నావురా?
లేడురా నీ స్వామి చూడరా నీ ముందు..
కటిక నేలను దున్ను కాపులో ఉన్నాడు
రాళ్లురప్పలు గొట్టి రాశి పోయుచునున్న
బాట తీర్చెడు వాని ప్రక్కలో ఉన్నాడు"**

ఖండగతిలో సాగింది ఈ గేయం.. దేవుడు చీకటి గుడిలో కాక సమాజ శ్రేయస్సుకు సహకరించే శ్రామికుల సరసన ఉన్నాడనే అభ్యుదయ భావ సౌందర్యంలో తెలుగు తీపి వ్యక్తమవుతోంది.

సన్నివేశం రాతి గుండెలను సైతం కరిగిస్తుంది. కైక కోరిక, దశరథాజ్ఞల ప్రకారం శ్రీరాముడు వనవాసానికి పయనమవుతున్నాడు. శ్రీరామునితో సీతా సౌమిత్రులు సైతం బయలుదేరుతారు. వనవాసం వెళ్లేవాళ్లు పట్టు బట్టలు ధరించరు. నార చీరలు ధరించాలి. సీతమ్మకు వల్కల ధారణ తెలీదు. మహారాణిగా అలంకరించాల్సిన జానకిని తమ చేతులతో నార చీరలు అలంకరించటానికి చెలికత్తెలు ముందుకు రాలేదు. గత్యంతరం లేక.. వల్కలం ధరించే విధానం తెలీక.. సీత ఇబ్బందులు పడుతుంటే చూసిన శ్రీరాముడు.. భార్య వద్దకు వెళ్లి నారచీర ధరించేందుకు సహకరించే పూనికతో ఉంటాడు. ఈ దృశ్యం చూసినవారు ఉద్విగ్న మనస్కులై కన్నీళ్లు కార్చారు. ఈ దుస్థితికి కారకురాలైన కైక కూడ కన్నీరు ఆపుకోలేక పోయిందంటూ మన రాష్ట్రకవి చిత్రించిన ఈ చిన్ని సన్నివేశం అపురూపం.. అపూర్వం!

వసుధ కన్నట్టి వనిత ఆ వల్కలమును
కట్టి ఎరుగనిదగుట ఇక్కట్టు పడుచు
నార చీరను మేనను తారుమారు
లగుచు ధరియింప యత్నించునవసరమున
జాలిగొని రామచంద్రుడు.. సాయపడగ
నెంచి సతి మేన సుంత యోచింపకుండ
దాని కప్పంగ తలపడె.. దండ నున్న
వారి హృదయాలు తపియింప..పాపినియగు
కైక చలియించి కన్నీరు కార్చుచుండ

అని చిత్రించారు. జీవన వాస్తవాలను అవగాహన చేసికొన్న కవులే ఇలాంటి అపురూప సన్నివేశాన్ని ఊహించగలరు; కావ్యంలో చిత్రించగలరు. ఇలాంటి అపురూప సన్నివేశ చిత్రణలతో సుందరాచారి సుందర రామాయణం చాల సుందర కావ్యం అవుతున్నది.

అభ్యుదయ భావాలను అక్షరాల్లో కూర్చి శంకరంబాడి రచించిన కావ్యం...'అగ్ని పరీక్ష'.

పేదపాడు అనే ఊరిలో హరిహరుడనే బీద బ్రాహ్మణుడు 'ఆర్య సత్సంప్రదాయ బద్ధాత్మకుడు.' అతనికి శాంత అనే అందమైన పుత్రిక. ఆమె సుగుణాల రాశి. ఇటువంటి మంచి పుత్రిక... 'హరిహరునకు అతి భయంకర శత్రువై అగుపడిన'దట. కారణం ఆమె పెళ్లికి తాను శుల్కం ఇచ్చుకోలేని దరిద్రుడు కనుక. తండ్రి బిడ్డల మధ్య సైతం శత్రుత్వం పెంచగల ఆర్థిక స్థితిని హార్దికంగా ప్రదర్శించారు శంకరంబాడి.

కన్యలున్నారు వేలకు; కరము పట్ట
గలుగు యువకులు దొరుకరిక్కాలమందు
కట్నమీయక; కడుపేద కాపురస్తు
కష్టముల చెప్పరాదు దుఃఖముల నెరపు

ఆ గ్రామంలోనే శ్రీధరుడనే శ్రీమంత యువకుడున్నాడు. శ్రీధరుడు 'పాశ్చాత్య భావ నిర్బంధితుడయి' స్త్రీల జీవితాలలో అభ్యుదయాన్ని సాధించాలని ఆశిస్తున్నాడు. శ్రీధరుడు గుర్తించిన ఆనాటి మహిళల దుస్థితిని శంకరంబాడి మన కనుల ముందు ప్రదర్శించారు. పురుషులు అబలలను అస్వతంత్రలుగా చేస్తూ...

బడికి పోనీక, తెలివిని బడయనీక
పలుకనీయక, వలచిన వాని బడయ
వలయు సిరినీక, లోకమ్ము కలయ జూచు
వసతి నీయక, వంటింటి బానిసలుగ
వనితలను బట్టి బంధించు పాడు నీతి...

-నుంచి మహిళలను ఆదుకోవాలని వారిని..

వసుధలో త్రిప్పి, చదివించి, వలచినట్లు
పలుక నేర్పించి, స్వేచ్ఛగ మెలగ వలయు
భంగి వివరించి చెప్పి ఏ పగిదినైన
బాగు పరచగ ఆతడు పట్టు బట్టి ఉన్నాడు.

స్త్రీని ధైర్యవతి అగు 'ఆదర్శ గృహిణిగా నొనర్పగ బద్ధ కంకణుడయి' ప్రవర్తిస్తున్నాడు. ఆదర్శ ఊహాలతలు అల్లుకుంటూ శ్రీధరుడు ఒక సంధ్యా సమయంలో ఊరి పొలిమేరలోని మంచినీటి కొలను గట్టున కూర్చుని ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నాడు. ఆ సమయంలో శాంత మంచి నీటికై బిందెతో కొలనులోనికి దిగి.. నీటిలో శ్రీధరుని ప్రతిబింబం చూసి హడలి నీటిలో జారిపడి మునిగిపోతున్నది. గట్టు మీది శ్రీధరుడు చూసి 'తక్షణమె దూకి కొలనులో ఆమెనెత్తి తటతల ముపై వదలి, రక్షించె తనకది ధర్మమగుట.' ప్రాణరక్షణ చేసిన యువకునిగని, 'ప్రణతులర్పించే' సంస్కారం లేని శాంత తడి బట్టలతో పరుగున ఇల్లు చేరింది. ఆనాటి అబలల పరిస్థితి తెలిసిన శ్రీధరుడు.. ఆమె 'సంస్కరింపగ తగినట్టి దాన' అనుకున్నాడు. ఆమెను అనుసరించి వెళ్లాడు. శాంత తండ్రి చాదస్తంతో ఇద్దరి మీద మండిపడినాడు. సంస్కారి అయిన శ్రీధరుడు కోపించలేదు. జరిగిన విషయం వివరించి.. ఆమెను మన్నించమనీ అతనికిష్టమైతే శుల్కం లేకుండా ఆమెను పెళ్లాడతానన్నాడు. ఆమాటతో హరిహరునిలో మార్పు వచ్చింది. శాంతా శ్రీధరులకు పెళ్లి చేశాడు. ప్రకృతిని అడ్డం పెట్టుకుని స్త్రీలను అణచి ఉంచే నీతిని హరిహరునిచే పలికించి, ఆనాటి కుసంస్కారాన్ని వ్యక్తం చేశారు సుందరాచారి:

కడలి ఎన్నడు చెలియలికట్ట దాటి
కదలి పైబడి పొంగదు.. కలికియునట
కట్టుదిట్టమ్ములకు లొంగి గట్టుదాటి
కదలి పోకుంట యుక్తము.. కలుష హరము

అని తన మూఢనమ్మకాన్ని సమర్థించుకుంటాడు.

నిజమైన అభ్యుదయశీలి అయిన శ్రీధర్

ఇటీవల శంకరంబాడి ప్రసిద్ధ గేయం 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ'కు ఒక అపూర్వ సత్కారం జరిగింది. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా నవంబరు 6వ తేదీన అనంతపురం పోలీస్ మైదానంలో పద్నాలుగువేల మంది విద్యార్థులు తెలుగుతల్లికి లక్షస్వరార్చన చేశారు. నగరంలో 55 పాఠశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులు సామూహికంగా 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గేయాన్ని పదిసార్లు ఆలపించారు.

భార్య శాంతను ప్రోత్సహించిన తీరు శంకరంబాడి కవిత్వ శిల్పంలో సదాశయ తరంగాల హోరు!

పెండ్లియాడిన నాడె నిన్విడిచిపెట్టి
పేదరికమను పెనుబాము వెడలె
...
బ్రతుకవచ్చును స్వేచ్ఛగ వసుధలోన
పతిని ననుగూడి నీవిష్టపడినయట్లు
...
బ్రదుక నొక ఆడుతోడు కావలయునంచు
పడసితిని నిన్ను నేను దైవమును గాను;
పాదములనంటి ప్రణమిల్ల పామరవయి
పలుచ బడకుము పురుషుల తలపు ముందు

ఈ శ్రీధరుని మాటలలో తెలిసిన వారికి కవి హృదయమే వినిపిస్తుంది.

భర్త ఇచ్చిన స్వేచ్ఛను అమాయకత్వం తోనో, అతి తెలివితోనో సరిగా వినియోగించుకొ నలేక పరపురుషుని వంచనకు గురి అయి, తప్పు తెలిసికొని.. కొలనులో దూకుతుంది

దుర్యోధనుని రాజ్యకాంక్ష, శకుని మాయా జూదం, భార్యను కూడ పణంగా పెట్టి జూదమాడే ధర్మ జుని జూద వ్యామోహం, నిండు సభలో ద్రౌపది వలువలూడ్చే ప్రయత్నం చేసిన కౌరవుల దుర్నీతి వంటి వానికి సభాపర్వమే వేదిక!

తనను తానాడి ఓడిన ధర్మజునికి
తనది అన్నదియేలేదు దాని కతన
ధర్మ మొప్పదు నన్నోడ తలలు కలిపి
తలచి చూడుడు నే వీరిదాన కాను!

సుందరాచారి ద్రౌపది తర్కమిది.

ద్రౌపది వస్త్రాపహరణ సన్నివేశంలో నన్నయ భారతంలో సభాసదుల ప్రస్తావన కని

సంక్షిప్తంగా చెప్పి, విజయుని కార్యోన్ముఖుని చేయించారు.

కర్మ బద్ధులు నరులు నిష్కామ కర్మ
ఘనత గాంచెడు సత్కర్మ; కనగ శత్రు
సంహరణ ధర్మ కర్మ సుక్షత్రియులకు
కడగి చేయంగదగు కర్మ విడువ దగదు

తక్కువ మాటలలో తన కర్తవ్యం గ్రహించిన పార్థుడు.."భ్రమలు, మాయ.. బంధువితతి పైని గల పాశముల ద్రుంచి.. పట్టివిల్లు పగతులను త్రుంచ సంసిద్ధ పడెను వలచి!"

ఇంత చక్కగా, చిక్కగా రచించిన భారతం చివర తాను 'నిత్య విద్యార్థి' అని, పండి

పేదల పక్షపాతి

సుందరాచారి ప్రజాకవి కూడా. అణగారిన వర్గాల వెతలను అక్షరీకరించారు. స్వేచ్ఛా భారతావనిలో సామాన్యుల జీవితాలపై ఎన్నో కవితలను వెలువరించారు. వాటిలో ఒకటి...

స్వాతంత్ర్య దినమ్ము నాటి
సంతోషము చల్లబడెను
పసిడి పండునని భ్రమపడి
పస్తుల పడిపోతి మిటుల
కడుపేదల కడుపుగొట్టి
కలమాన్నం బారగించి
కారులెక్కి తిరుగుతున్న
ఖలులను కాపాడెదవా?

అయినవారికి దూరంగా...

ఆగస్టు పది, 1914న తిరుపతిలో ఒక సంప్రదాయ కుటుంబంలో జన్మించారు సుందరాచారి. బాల్యంలోనే అభ్యుదయ భావాలు చూపిన వీరిని కుటుంబం వెలివేసింది. జీవించడానికి ఒక హోటల్లో వడ్డన పని చేస్తూ... ప్రయివేటుగా చదివి సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులయ్యారు. కొన్నాళ్లు ఆంధ్రపత్రికలో పనిచేసి 'కళావని' శీర్షికతో సామాజిక కళా విశేషాలు వివరించారు. తర్వాత చిత్తూరు జిల్లాలోని కొన్ని పట్టణాల్లో జిల్లాబోర్డు ఉపాధ్యాయులుగా చేశారు.

తనకు ఎంతో పేరు తెచ్చిన రాష్ట్రగీతం 'మా తెలుగు తల్లి'ని 40వ దశకంలో రచించారు శంకరంబాడి. 'దీనబంధు' అనే చలనచిత్రానికి (ఇందులో ఆయన నటించారు కూడా) పాటలు రాస్తూ దీనికి అక్షరరూపమిచ్చారు. నిర్మాతకు ఈ గీతం నచ్చకపోవడంతో చిత్రంలో వాడలేదు. తర్వాత దీని గొప్పతనాన్ని గుర్తించిన ప్రముఖ గాయని టంగుటూరి సూర్యకుమారి... గీతానికి బాణీకట్టి, పాడి గ్రామఫోన్ రికార్డులుగా తెచ్చారు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రాచుర్యం వచ్చింది. 'మా తెలుగు తల్లికీమల్లెపూదండ'ను తెలుగు ప్రజలు హృదయాల్లో ధరించారు. నిజానికది తెలుగు జాతీయగీతం. తెలుగునదీ ప్రవాహాలు, తెలుగు కవుల కవితాప్రభావాలు - ఇవి అవి అని కాదు, యావత్తు తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే ఒక స్ఫూర్తి గీతం. అర్థాలేకాదు, అంతరార్థాలూ ఉన్న గీతం. కోట్ల తెలుగు ప్రజల హృదయాల్లో అర్థవంతంగా ప్రతిధ్వనించే ఆ గీతకారుడు, కారణజన్ముడు శంకరంబాడి.

శాంత. అనుకోకుండా భర్త అచటనే ఉండి, కొల నులో దూకి భార్యను పైకి తెస్తాడు. బతికింప చూస్తాడు. బతికే ఆశ నశించిన శాంత పలికిన చివరి మాటలు స్త్రీలకు తెలివి బాటలు!

వంచనకు బూని నమ్మిన పతిని వదలి
పరునిచే బడి చెడితి నే(బ్రతుకనింక..
పరువు మాయగ... కరుణింప వలెనటంచు
ప్రాణములు విడే.. ప్రియమైన పతి ఎదుటనె

సుందరాచారి "సుందర భారతం" తేటగీతి పద్యాలతో తేట తెలుగులో రచించారు. భారతం లోని మంచి చెడులకన్నిటికీ పాది సభా పర్వమే!

పించదు. కాని శంకరంబాడి ఆ దారుణ దృశ్యాన్ని చూడలేని సభాసదులు తమ చేతు లతో తమ కన్నులు మూసికొన్నారని చెప్పి ఆ సన్నివేశంలోని అమానవీయతను ప్రదర్శించారు.

"................ప్రజలు
కర్ణములు మోపి కరముల కనులు మూసి
హర హరీ! అన గుండియలదుర చెదరి" నారట.

కురుక్షేత్రంలో వైరి పక్షంలోని భీష్మ ద్రోణాది ఆత్మీయులతో యుద్ధం చేయలేనని అస్త్రసన్యాసం చేసిన విజయునికి ధర్మ బోధ చేసిన భగవద్గీతా సారాంశాన్ని సుందరాచారి

తుణ్ణిగానని, ఈ గ్రంథం చదివిన ఒక్క ఆంధ్రు డైనా ఎంతో కొంత జ్ఞానం పొందితే తనకు తృప్తి కలుగుతుందన్నారు. ఆయన తెలుగు ప్రీతికి ముగింపులేదు.

డా.మన్నవ భాస్కర నాయుడు
విశ్రాంత అధ్యాపకులు,
తిరుపతి. 98667 27215

బతుకాట

"నువ్వేమీ మారలేదు. ఆరోగ్యంగానే ఉన్నావు, ఒక్క బట్టతల తప్ప!" వెత్రివేలు నాకేసి చూస్తూ అన్నాడు.

నేను నవ్వేసి ఊరుకున్నాను. నిజానికి వెత్రివేలులో చాలా మార్పొచ్చింది. విపరీతమైన ఒళ్లు, పెద్దపొట్టతో చూడ్డానికి కాస్త ఎబ్బెట్టుగానే ఉన్నాడు.

వెత్రివేలూ, నేనూ పాతికేళ్లక్రితం బెంగళూరు విప్రోలో కలిసి పనిచేశాం. ఆ తరువాత నేను అమెరికా వచ్చేశాను. వాడు, నేను ఇద్దరం ఒకే వయసువాళ్లం. వెత్రివేలు చివరికి మద్రాసులో స్థిరపడ్డాడు.

కారు అడయారు వైపుగా వెళుతోంది. చెన్నై నగరం చాలా మారింది. రెండేళ్లకోసారి ఇండియా వచ్చినా, చెన్నై మాత్రం రాలేదు.

జవాబివ్వకపోయేసరికి తనే అన్నాడు.

"వ్యాయామం చేసే తీరిక లేదు నాకు. వ్యాపారాలతోనే సరిపోతోంది," తన పొట్టకేసి చూసుకుంటూ అన్నాడు.

"నిన్ను చూస్తే అలాగే అనిపిస్తుందిలే! ఏంటి మద్రాసులో బిజినెస్‌కింగ్ అని విన్నాను, నిజమేనా?" అడిగాను.

"మద్రాసు కాదు, చెన్నై!" అంటూ నన్ను సవరించాడు. ఈ కొత్తపేర్లు నాకు తెలీవు. మద్రాసుగానే నా మనసులో స్థిరపడిపోయింది. అదే చెప్పా.

విప్రో వదిలేసి సొంతంగా సాఫ్ట్‌వేర్ వ్యాపారం మొదలుపెట్టానని చెప్పాడు.

వెత్రివేలుని కలిసి కూడా చాలా ఏళ్లయ్యింది. అమెరికా వెళ్లాక ఒక్కసారి కలిశానేమో? ఈ మధ్య ఫేస్‌బుక్‌లో మరలా కలిశాం. అనుకోకుండా మా కంపెనీ చెన్నైలో వేరే కంపెనీని కొనడంతో నేను రావాల్సిన పనిపడింది. నేను వస్తున్నానని వెత్రివేలుకి చెప్పడంతో నన్ను కలవడానికి నా హోటల్‌కి వచ్చాడు.

వెత్రివేలు వయసులో ఉన్నప్పుడు టెన్నిస్ బాగా ఆడేవాడు. విప్రోలో ఉండగా మేం శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో పెద్ద ప్రాజెక్ట్ చేశాం. అప్పుడు నేను ఏడాదిపాటు మద్రాసులో ఉన్నాను. వెత్రివేలుకి

అడయారు దాటాక బీసెంట్‌నగర్లో ఇల్లుంది. అప్పుడు నేను వాళ్లింటి దగ్గరే ఒక ఇంట్లో అద్దెకుండేవాణ్ని. వెత్రివేలు నాన్న తమిళుడు. అమ్మది మాత్రం గుంటూరు. అందువల్ల వీడికి తెలుగు బ్రహ్మాండంగా వచ్చు.

అప్పటికి మా ఇద్దర్లో ఎవరికీ పెళ్లికాలేదు. బలాదూరుగా కలిసి తిరిగేవాళ్లం. ప్రతీ శనాదివారాలు టెన్నిస్ ఆడేవాళ్లం. వెత్రివేలు బీసెంట్‌నగర్ టెన్నిస్ క్లబ్బులో మెంబరు. నన్నుకూడా మెంబరుగా చేర్చాడు.

"నువ్వు టెన్నిస్ వదిలేశావేమో కానీ, నేను మాత్రం ఆడుతూనే ఉన్నాను. ఇప్పుడు నా ఆట కాస్త మెరుగుపడింది. అమెరికాలో టెన్నిస్ లీగ్స్ ఆడుతున్నాను కూడా!" నవ్వుతూ చెప్పాను.

"ఆటకేం వచ్చింది? అప్పట్లో బాగానే ఆడేవాడివి కదా? ఈ మధ్య క్లబ్బుకి వెళ్లి చాలా రోజులయింది. ఎప్పుడైనా రాహుల్ ఆడుతుంటే చూడ్డానికి వెళ్లేవాణ్ని. నువ్వు సరైన టైముకొచ్చావు. మావాడు వచ్చేవారం చెన్నై ఓపెన్‌లో ఆడుతున్నాడు. నువ్వు మాతో రావచ్చు," నవ్వుతూ అన్నాడు.

నేనెలాగూ ఇక్కడ పది రోజులుపైగా ఉండాలి. సరేనన్నాను. వెత్రివేలుకి రాహుల్ ఒక్కడే కొడుకు. టెన్నిస్ బాగా ఆడతాడనీ, అంతర్జాతీయ స్థాయిలో ఆడించాలన్నదే తన ధ్యేయమని చెప్పాడు. బ్రిటానియా టెన్నిస్ అకాడమీలో తర్ఫీదు తీసుకుంటున్నాడని, మంచి మంచి కోచ్‌లున్నారనీ చెప్పాడు.

"మీవాణ్ణి ఫ్లోరిడాలో బాలట్టరీ అకాడమీకి పంపు. మంచి కోచ్ కావాలి. యూరోపియన్ కానీ, సౌత్ అమెరికన్ వాళ్లని కానీ ప్రయత్నం చెయ్యి," అని చెప్పాను.

ఇంతలో కారు బీసెంట్ నగర్ టెన్నిస్ క్లబ్ ముందునుంచి వెళ్లింది. ఒక్కసారి పాత రోజులు గుర్తుకొచ్చాయి. చీకటి పడినా ఫ్లడ్‌లైట్ల వెలుగులో ఇంకా ఆడుతూనే ఉన్నారు. అప్రయత్నంగా మునుస్వామి గుర్తుకొచ్చాడు నాకు. ఎందుకో ఒక్కసారి చూడాలనిపించింది.

"రేపు ఉదయం ఒకసారి క్లబ్బుకి వెళదామా? మునుస్వామిని కలుద్దామని," నా ప్రశ్న విని ఆశ్చర్యపడ్డాడు. దేనికని ప్రశ్నించలేదు.

అలాగేనన్నట్లు తలూపాడు. కారు బీసెంట్ నగర్‌లోకి ప్రవేశించింది.

***

జెట్‌లాగ్ వల్ల తెల్లవారుజామునే మెలకువ వచ్చేసింది. ఉదయం ఏడు కావస్తున్నా వెత్రివేలు నిద్ర లేవలేదు. ఆదివారం సాధారణంగా ఆలస్యంగా నిద్ర లేస్తారని వెత్రివేలు భార్య చెప్పింది. ఇహ నేనొక్కణ్నే రాహుల్ టెన్నిస్ రాకెట్ తీసుకొని క్లబ్బుకి బయల్దేరాను. టెన్నిస్ కంటే కూడా మునుస్వామిని చూడ్డం కోసం బయల్దేరాను.

నా కొత్త మొహం చూసి ఎవరా అన్నట్లు అందరూ నాకేసి చూశారా క్లబ్బులో. నేను వెత్రివేలు పేరు చెప్పేసరికి నన్ను లోపలికి పంపించడానికి ఒప్పుకున్నారు.

మునుస్వామి ఈ క్లబ్బులో కోర్టు క్యూరేటర్‌గా పనిచేసేవాడు. ఆ క్లబ్బులో ఉన్న రెండు కోర్టులనీ చదునుచేయడం, నీళ్లు జల్లడం వంటివన్నీ అతనే చూసేవాడు. మేం ఆడుతున్నప్పుడు బంతి అందించడం వంటి పనులు చేసేవాడు. అతను చాలా నెమ్మదస్తుడు. క్లబ్బుకొచ్చిన కొంతమంది విసుక్కునేవారు. ఇంకొంతమంది తిట్టేవారు. ఎప్పుడూ ఏమనేవాడు కాదు. మొదట్లో నాకు టెన్నిస్ అంతగా రాదు. వెత్రివేలు ఎలా ఆడాలో చెప్పాడు కానీ సరిగ్గా చెప్పలేదు. నన్ను చూసి వెత్రివేలు, అతని స్నేహితులూ నవ్వేవారు. దాంతో చాలా డీలా పడిపోయాను. ఒకరోజు.

"సార్! బాధపడకండి. మీకు నేను ఆట నేర్పుతాను. నాకంత బాగా రాదు కానీ, నాకు తెలిసున్నది చెబుతాను. వీలుకుదిరితే సాయంత్రం రండి," అని చేయందించాడు. ఆ తరువాత నేను టెన్నిస్‌లో వెనక్కి తిరిగి చూసింది లేదు. ఆ క్షణంలో మునుస్వామి నాకు రాకెట్ ఎలా పట్టుకోవాలో దగ్గర్నుండి, సర్వ్ ఎలా చేయాలో అన్ని మెలకువలూ చెప్పాడు. ఆ క్లబ్బుకొచ్చిన ధనికులు మునుస్వామిని ఎప్పుడూ ఆడించేవారు కాదు. ఎందుకంటే అతను కొట్టే బంతులకి శరీరం తూట్లు పడాల్సిందే! అంత గట్టిగా కొట్టేవాడు.

ఓరకంగా మునుస్వామి నా టెన్నిస్ గురువు.

క్లబ్బుకి వెళ్లీ వెళ్లగానే నా కళ్లు మునుస్వామి కోసం వెతికాయి. ఎక్కడా కనిపించలేదు.

మునుస్వామి గురించి అడిగాను. అతను ఇక్కడ పనిచేయడం మానేశాడనీ అడయారు క్లబ్బులో చేస్తున్నాడనీ అక్కడున్న ఒకతను చెప్పాడు.

అసలు వెత్రివేలు ఇంటికి రావడానికి కారణమే మునుస్వామి. చాలా నిరుత్సాహ పడ్డాను. నా మొహంలో నిరాశ చూసి అక్కడున్నతను కావాలంటే అతని సెల్‌నంబరుకి ఫోన్ చేస్తానని తమిళంలో చెప్పాడు. చెయ్యమన్నాను.

మునుస్వామి గొంతు విని చాలా ఏళ్లయ్యింది. నా పేరు చెప్పగానే గుర్తుపట్టాడు. ఎక్కడున్నారంటూ, నా వివరాలు అడిగాడు.

నన్ను అక్కడే ఉండమని వెంటనే వస్తున్నాననీ చెప్పాడు. ఓ అరగంట తరువాత మునుస్వామి వచ్చాడు.

నల్లగా, పీలగా ఉండే మునుస్వామిలో అంత పెద్దమార్పు ఏమీ కనిపించలేదు. జుట్టు మాత్రం పల్చబడింది. నన్ను చూసీచూడగానే దూరం నుంచే నమస్కరించాడు. అతని కళ్లల్లో సంతోషపు కాంతి గమనించాను.

కుశల ప్రశ్నల తరువాత నా గురించి చెప్పాను. నేను ఏ హోటల్‌లో బస చేశానో అడిగాడు. అతని గురించీ చెప్పాడు. అతనికి ఇద్దరు పిల్లలనీ, అమ్మాయికి ఈ మధ్యనే పెళ్లి

అదేంటి

చలనశక్తిగలదు జంతువుగాదది,
చేతులెపుడు తిప్పు శిశువుగాదు,
కాళ్లు లేవు సర్వకాలంబు నడుచును,
దీని భావమేమి తిరుమలేశ! (గడియారం)

బూరెల సత్యనారాయణమూర్తి 'తిరుమలేశ శతకం'లోనిది ఈ పొడుపు కథ. వేరొక వస్తువుతో సామ్యము చూపుతూనే, అది కాదు అని ఊరిస్తాయి కొన్ని పొడుపు కథలు. ఒక్కొక్క పంక్తినే విడదీస్తూ పోతే, జవాబు సులువుగా దొరుకుతుంది. చలనశక్తి ఉండి జంతువు కానిది - యంత్రం, చేతులాడిస్తూ సర్వకాలాలు నడిచేది గడియారమే కదా! ఇలా నిత్యజీవితంలో కనిపించే ప్రతి వస్తువు పైనా పొడుపు కథలు ఉన్నాయి.

చేశాననీ, అబ్బాయి కాలేజీలో చదువుతున్నాడనీ చెప్పాడు.

"మునుస్వామీ, నా ఆట చాలా మారింది. నేనిప్పుడు నీతో సమంగా ఆడగలను," అంటూ చెప్పాను. తనేమంత గొప్ప ఆటగాణ్ణి కాదనీ, ఏదో క్లబ్బులో పనిచేసి నేర్చుకున్నదేనని అన్నాడు.

"నీతో కొంత సేపయినా ఆడాలనుంది, ఆడతావా?" అనడిగాను. లేదన్నట్లుగా తలూపాడు. షూస్ లేవేమోననుకొని అతని పాదాలకేసి చూశాను. ఓ పాతబడిన, మాసిన షూ వేసుకున్నాడు. కానీ అది కారణంగా కనిపించలేదు. క్లబ్బులో మానేసినందుకు వాళ్లేమయినా అభ్యంతరం చెబుతారేమోనని అడిగాను. ఈ క్లబ్బుకి ప్రెసిడెంటు వెట్రివేలే!

"ఇంకోసారెప్పుడయినా చూద్దాం సార్! అయినా ఈ మధ్య ఆడడం మానేశాను," అని చెప్పి, కాదన్నాడు.

కొంతసేపు మాట్లాడాక వెళ్లొస్తానని చెప్పి వెళ్లిపోయాడు.

ఎలాగూ వచ్చాను కదాని అక్కడ పనిచేసే ఒక కుర్రాణ్ణి ఆడతావాని అడిగాను. వాడితో ఓ అరగంటసేపు ఆడాను. ఇంతలో వేరేవాళ్లు రావడంతో ఆపేశాను.

నాతో ఆడిన కుర్రాడికి ఏమైనా కొనుక్కోమని వంద రూపాయిలిచ్చాను. వద్దన్నాడు కానీ గట్టిగా చెబితే తీసుకున్నాడు. వెళుతూండగా ఓ విషయం చెప్పాడు.

"సార్! మునుస్వామి ఆడటం మానేయలేదు. అబద్ధం చెప్పాడు," అని.

ఈ క్లబ్బులో పని మానేయడం వల్లనేమోనని అనుకున్నాను. ఎంతైనా ఆత్మాభిమానం ఉంటుంది కదా?

***

ఇంటికొచ్చే సరికి వెట్రివేలు నిద్రలేచే ఉన్నాడు. నేను టెన్నిస్ ఆడటానికి వెళ్లానని చెప్పగానే నవ్వాడు.

"నువ్వు రాహుల్ ఆట చూడాలి. త్వరగా తయారవ్వు. మావాడు ఎస్టాడ్ స్టేడియంలో ఆడుతున్నాడు. స్పెయిన్ నుంచి వెరడాస్కో, సెర్బియా నుంచి టిప్సర్‌విచ్‌లాంటి ఆటగాళ్లతో ఆడతాడు" అంటూ చెప్పాడు.

ఓ రెండు గంటల తర్వాత మమ్మల్నందర్నీ వ్యానులో తీసుకెళ్లాడు వెట్రివేలు.

రాహుల్ ఆట చూశాను. బాగానే ఉంది కానీ, ఇంకా మెరుగుపడాలి. మంచి కోచ్ ఉంటే ఆట మెరుగుపడే అవకాశం ఉంది. రాహుల్‌కి పంతొమ్మిదేళ్లు. అతను టెన్నిస్‌లో నిపుణుడు కావడానికి ఇంకో రెండు మూడేళ్లు పట్టొచ్చు. కనీసం ఒకటిరెండు టోర్నీలయినా నెగ్గాలి.

విదేశీ ఆటగాళ్లతో ఆడిన ప్రాక్టీసు సెట్లలో ఒక్క ఆట కూడా రాహుల్ గెలవలేదు.

ఆట మధ్యలో బాత్రూంకెళ్లినప్పుడు ఎవరివో మాటలు నా చెవిన పడ్డాయి.

"రాహుల్ వాళ్లనాన్నకున్న పలుకుబడితో వైల్డ్‌కార్డ్ తెప్పించుకున్నాడు. నిజానికి వాడికంత లేదు."

రాహుల్ టోర్నమెంట్ వైల్డ్‌కార్డ్ ఆటగాడన్న విషయం నాకు వెట్రివేలు చెప్పలేదు.

ఇంటికి తిరిగి వెళుతుండగా- "ఒరేయ్! వేలూ! మీ అబ్బాయికి నిజంగా టెన్నిస్ మీద అంత మోజు ఉంటే వెంటనే బాలట్రీ టెన్నిస్ అకాడమీలో చేర్చు. ఇక్కడ లాభంలేదు," మొహమాటం లేకుండా చెప్పాను.

"ఇవాళ ఎందుకో వాడు సరిగ్గా ఆడలేదు," అని సర్దిచెప్పాడు. నేనేం మాట్లాడలేదు.

***

ఆ మర్నాడు ఆఫీసులో పని వత్తిడి వల్ల మరలా వెట్రివేలుని కలుసుకోలేదు. వచ్చే ఆదివారం రాహుల్ ఆట చూడ్డానికి వస్తానని చెప్పాను. ఈ శనివారం మాత్రం నాతో అమెరికా నుంచి వచ్చిన వాళ్లతో మహాబలిపురం వెళదామనుకున్నాను. శనివారం ఉదయం భోంచేసి బయల్దేరుదామని నిర్ణయించుకున్నాం.

శనివారం ఉదయం నా కోసం ఎవరో వచ్చారని రిసెప్షన్ నుంచి ఫోనొచ్చింది. పొద్దున్నే ఎవరా అనుకుంటూ అక్కడే ఉండమని చెప్పాను. కారు డ్రైవరయ్యుంటాడని అనుకొని మరలా పడుకున్నాను. కళ్లు లాగుతున్నాయితప్ప నిద్ర మాత్రం రాలేదు. కొంతసేపయ్యాక లేచి స్నానం చేసి కిందకొచ్చాను.

అక్కడ రిసెప్షన్‌లో మునుస్వామిని చూసి ఆశ్చర్యపోయాను.

"నువ్వా వచ్చింది? కారు డ్రైవరు అనుకున్నాను. నీ పేరు చెప్పచ్చు కదా?" అని అంటే మీరు నిద్రపోతున్నాడని చెప్పడంతో పేరు చెప్పొద్దన్నానని అన్నాడు. అతనితోపాటు కొడుకునీ తీసుకొచ్చాడు.

"మా అబ్బాయి. కార్తీక్, ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మీకు చూపిద్దామని..." అంటూ పరిచయం చేశాడు.

"ఏమైనా తింటావా" అని అడిగాను.

ఇంట్లో పొద్దున్నే సాంబారన్నం తినొచ్చానని చెప్పాడు.

"సార్! మీరు నాతో ఆడాలన్నారు కదా? మా క్లబ్బుకి వెళదాం రండి. అందుకనే వచ్చాను," మెల్లగా అన్నాడు.

నాకూ ఆడాలని ఉంది కానీ ఒక గంట ఆడేసి వచ్చేయచ్చనుకొని కారులో బయల్దేరాను.

"సార్! ఆ రోజు మీరు ఆడమంటే కుదర్దని అన్నాను. క్షమించండి, సార్! నేను ఆ క్లబ్బులో ఆడితే వెట్రివేలు సార్ ఒప్పుకోరండీ! తెలిస్తే చంపేస్తాడు. ఆయన పేరున్నాయన. పెద్దమనిషి సార్!" అంటూ దారిలో అన్నాడు. ఫరవాలేదని, ఆ మాత్రం అర్థం చేసుకోగలనని చెప్పాను.

అడయారు క్లబ్బుకెళ్లాక కొంతసేపు మునుస్వామి ఆడాడు. అతని ఆట ఇంకా పెరిగిపోయింది. చెప్పద్దూ నన్ను అవలీలగా ఉతికిపారేశాడు.

చివర్లో మరీ ఒక్క గేమయినా గెలవకపోతే బావుండదని అనుకున్నాడో ఏమిటో నాకు ఓ రెండు గేములిచ్చాడు.

"సార్! మీరు నాతో కాదు సార్! మా

అదేంటి

చెక్కని స్తంభం చేతికందదూ;
చెయ్యని కుండ, పొయ్యని నీళ్లు;
వెయ్యని సున్నం తియ్యంగా.

కొబ్బరి చెట్టు చేతికందడం అరుదు, ప్రకృతి చేసిన చక్కటి కుండ కొబ్బరికాయే. చూపులకు సున్నాన్ని తలపించినా తియ్యగా ఉండేది కొబ్బరి. సృష్టి అద్భుతాలలో ఒకటైన కొబ్బరికాయని చూస్తే మనకెప్పుడూ ఆశ్చర్యమే! తత్వం నుంచి కవిత్వం వరకు, జీవం నుంచి దైవం వరకు భారతీయ జీవనంలో ఇది అవిభాజ్యం. అందుకే దీనిపై ఎన్నో పొడుపుకథలు పుట్టాయి. ఉదాహరణకు - ఉరుములు మెరుపులు లేకుండా/ వానలు వరదలు లేకుండా/ ఉత్తరాది చెరువు ఊరకనే నిండింది.

అబ్బాయితో ఒక్కసారి ఆడండిసార్! ప్లీజ్!" అంటూ ప్రాధేయపడ్డాడు.

సరేనని ఆడటం ప్రారంభించాను. కార్తీక్ అక్షరాలా మునుస్వామి కొడుకు. వాడి ఆట చూసి ముగ్ధుణ్ణయ్యాను. వాడు అంత చిన్నవయసులో చాలా గొప్పగా ఆడుతున్నాడు.

"మీ వాడితో నేను ఆడలేను. మీరిద్దరూ ఆడండి. చూడాలని ఉంది," అనడిగితే మునుస్వామి, కార్తీక్ ఆడటం ప్రారంభించారు.

కార్తీక్ ధాటికి మునుస్వామి ఆగలేకపోయాడు. 6-0 స్కోరుతో చిత్తుగా ఓడిపోయాడు. ఆశ్చర్యం వేసింది నాకు.

"మీవాడు మంచి ఆటగాడవుతాడు. మీవాణ్ని బ్రిటానియానికి పంపమని వెట్రివేలుకి చెబుతాను..."

అంటుండగా మధ్యలో మునుస్వామి అడ్డుపడ్డాడు.

"వద్దు సార్! మావాడు టెన్నిస్ కాలక్షేపం కోసం ఆడతాడు తప్ప చెన్నై ఓపెన్ ఆడటానికి కాదు సార్," అంటూ వద్దన్నట్టుగా తలాడించాడు. అతని మాటల్లోనే కాదు, కళ్లలోనూ భయం కనిపించింది. ఏమన్నట్టుగా చూశాను.

"టెన్నిస్ గొప్పోళ్ల ఆట సార్! మాలాంటోళ్లకి రెక్కాడితేకానీ డొక్కాడదు. ఈ ఆటలు కూడు పెట్టవు సార్! ఈ క్లబ్బులో పనిచేయడం వల్ల ఆడటం వచ్చింది తప్ప సొంతగా నేర్చుకున్నదికాదు. ఏదో సరదాకి ఆడుతాం... అంతే!" మెల్లగా అన్నాడు.

ఏదో జరిగిందన్న అనుమానం వచ్చి, గుచ్చిగుచ్చి అడిగితే మునుస్వామి జరిగింది చెప్పాడు. వెట్రివేలు వాళ్లబ్బాయిని ఎలాగైనా టెన్నిస్ ఆటగాణ్ని చేద్దామని కోచింగులవీ ఇప్పించాడనీ, ఒకసారి చెన్నైలో జరిగిన ఒక టోర్నమెంటులో కార్తీక్ చేతిలో రాహుల్ చిత్తుగా ఓడిపోవడంతో, అది అవమానంగా భావించి వెట్రివేలు తనని క్లబ్బులో ఉద్యోగం నుంచి పీకేశాడనీ చెప్పాడు. వెట్రివేలు తన పలుకుబడితో తనకి ఎక్కడా ఉద్యోగం రాకుండా చేస్తే, చివరికి ఎలాగో ఆయన్ని కాళ్లావేళ్లా బతిమాలితే తనకి అడ్డురాననీ, కార్తీక్‌ని మాత్రం ఏ టోర్నమెంటూ ఆడకూడదని ఆంక్ష పెట్టాడనీ చెప్పాడు.

హతాశుణ్ణయ్యాను. ఆ రోజు మునుస్వామి ఎందుకు ఆడలేదో అర్థమయ్యింది. నేను వెట్రివేలు దగ్గర మునుస్వామి విషయం ఎత్తినా అతను మాట మార్చడం గుర్తొచ్చింది.

ఇదంతా చూసి నాకు చాలా బాధ కలిగింది. వెట్రివేలు మీద కోపం వచ్చింది. ఏం చెప్పాలో తెలీలేదు.

నేను వచ్చే సోమవారం అమెరికా తిరిగి వెళ్లిపోతున్నానని చెప్పి సెలవు తీసుకున్నాను. హోటల్‌కొచ్చాక కార్తీక్కి ఓ రెండు వందల డాలర్లు ఇచ్చాను. వద్దని మునుస్వామి అన్నా నేనూరుకోలేదు. వెళ్లేముందు కార్తీక్ ఈ మెయిల్ తీసుకున్నాను. నా విజిటింగ్‌కార్డు కూడా ఇచ్చాను.

వెళుతూండగా మునుస్వామి చేతులు జోడించి- "సార్! మమ్మల్ని కలిసినట్టుగా మాటమాత్రం కూడా వెట్రివేలు సార్ దగ్గర అనకండి. తెలిస్తే మమ్మల్ని బతకనివ్వరు," కళ్లనీళ్ల పర్యంతమవుతూ అన్నాడు.

"సరే" అని చెప్పి పంపేశాను.

రాహుల్‌కి, కార్తీక్‌కి మధ్య ఉన్న తేడా ఏమిటి? ఇన్నాళ్లు డబ్బు అసమానతలు పెంచదనుకునే ధోరణిలో ఉండేవాణ్ణి. ఇప్పుడది అవకాశాలని కూడా మింగేస్తుందన్న అనుభవం నా ఊహక్కూడా తట్టలేదు.

మనిషికేం కావాలి? కడుపు నిండితే కామం; అది తీరాక కాసులు; అది చిక్కాక కీర్తి. మొదటి రెంటికీ విరక్తి ఉండవచ్చు; చివరి రెంటికీ విశ్రాంతి లేదు. ఒక్కసారి తలుచుకుంటేనే బాధ కలిగింది. వెట్రివేలు అంటే కోపం, అసహ్యం పెరిగిపోయాయి నాకు.

మునుస్వామిని తలచుకుంటే జాలేసింది. జాలి ఇతరులకి మేలు చేస్తుందా; ఏమో తెలీదు.

***

ఆఫీసులో అనుకోకుండా పని పడటంతో నేను రాహుల్ ఆట చూడ్డానికి వెళ్లడం కుదరలేదు. వెట్రివేలుకి రాలేకపోతున్నానని చెప్పాను. రాహుల్ మొదటి ఆట నెగ్గాడనీ, రెండో ఆటలోకి వచ్చాడనీ చెప్పాడు. "బెస్టాఫ్ లక్" చెప్పాను. బాలట్టరీ అకాడమీ వివరాలు కనుక్కొని చెప్పమని అన్నాడు సరేనన్నాను.

ఆ మర్నాడే నేను తిరిగి అమెరికా వెళ్లిపోయాను. ఓ రెండ్రోజుల తరువాత పనిలో ఉండగా శ్రీమతి ఫోన్ చేసింది. "మీకు టెన్నిస్ ఎక్స్‌ప్రెస్‌వాడు ఫోన్ చేశాడు. మీరు ఆర్డరు చేసిన టెన్నిస్ రాకెట్లకి రవాణా ఖర్చులు మూడొందల డాలర్లవుతుందనీ, అందుకోసం ముందు మీతో మాట్లాడాలని అన్నాడు. అయినా తెలీక అడుగుతాను, ఇండియాలో టెన్నిస్ రాకెట్లు ఎవరికి? టెన్నిస్ రాకెట్లకి రెండు వేల డాలర్లా? మీ మిత్రుడు వెట్రివేలు ఆ మాత్రం కొనుక్కోగలడు," శ్రీమతి మాటల్లో అర్థం సూటిగానే తాకింది.

"వెట్రివేలుక్కాదు. ఇంటికొచ్చాక చెబుతాన్లే! మళ్లా టెన్నిస్ ఎక్స్‌ప్రెస్ వాడు కాల్ చేస్తే సరేనని చెప్పు," అని చెప్పి ఫోన్ పెట్టేశాను.

ఇంటికొచ్చి తలుపు తీయగానే శ్రీమతి మొట్టమొదటి ప్రశ్న టెన్నిస్ రాకెట్లు ఎవరికి పంపారని. వివరం చెప్పాను.

"రాకెట్లు పంపించేస్తే పద్ధతి మారిపోతుందా? మనుషులు మారిపోతారా?" శ్రీమతి ఎదురు ప్రశ్నించింది.

'బురదలో వజ్రం దొరికితే బురదని చూసి పారేయం,' పైకి చెబుదామన్న జవాబు గొంతులోనే ఆగిపోయింది.

మౌనంగా లోపలికి నడిచాను.

రాత్రి పడుకోబోయే ముందు చప్పున గుర్తుకొచ్చి చెన్నై బ్రిటానియా అకాడమీకి ఫోన్ చేసి వివరాలు తీసుకున్నాను. అక్కడ కోచింగ్‌కి ఎంతవుతుందో కనుక్కున్నాను. నెలకి వెయ్యి డాలర్లు అవుతుందని చెప్పారు. కట్టడానికి సిద్ధమైపోయాను.

సరిగ్గా అప్పుడే వెట్రివేలు నుంచి ఈ మెయిల్ వచ్చింది. అదేమిటో చూడకుండానే ఈ మెయిల్ చెత్తబుట్టలో పారేశాను.

ఓ నెల్లాళ్ల తరువాత మా ఆఫీసు నుంచి ఒక మెయిల్ వచ్చింది. నా పేరున ఒక పెద్ద పాకేజ్ వచ్చిందని. మర్నాడు చెన్నై కాల్ చేసి అది విప్పి చూడమన్నాను. మునుస్వామికి నేను పంపిన రాకెట్లు. దానితోపాటే ఒక చిన్న నోట్ కూడా ఇంగ్లీషులో ఉంది. మునుస్వామికి ఇంగ్లీషు రాదు. బహుశా కార్తీక్ రాసుంటాడు. చదవమని మా కొలీగ్‌కి చెబితే మొత్తం చదివి వినిపించాడు. అది విని నోటమాట రాలేదు.

ఆకలితో ఉన్నవాడికి కొత్తచొక్కా కడుపు నింపదు. నా అవివేకాన్ని చూసి నన్ను నేనే నిందించుకున్నాను.

మొత్తం లెటర్లో కొన్ని వాక్యాలు మాత్రం నన్ను ఎప్పటికీ వెంటాడుతూనే ఉంటాయి.

"టెన్నిస్ గొప్పోళ్ల ఆటసార్! ఈ ఆటలన్నీ ఉన్నవాళ్ల వినోదానికే సార్! మాకు బతకడమే పెద్ద ఆట. ఒక చిన్న మిస్‌హిట్ చాలు, బతుకంతా ఓటమే!"

ఇప్పటికీ టీవీలో టెన్నిస్ మ్యాచ్ చూసినప్పుడల్లా కార్తీక్ గుర్తుకొస్తూనే ఉంటాడు.

సాయి బ్రహ్మానందం గొర్తి
క్యూపర్టినో, అమెరికా,
సాఫ్ట్‌వేర్ ఇంజనీరు,
gorthib@yahoo.com

ఎందుకోసం? తెలుగు సభలు ఎవరికోసం?

ఎన్నో ఏళ్ల తర్వాత ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్నాయంటే జాతి జనుల్లో ఆనందం వెల్లివిరియాలి. ప్రభుత్వ, ప్రభుత్వేతర వ్యవస్థలన్నీ నూతనోత్తేజంతో ఉరకలు వెయ్యాలి. కానీ, ఇప్పుడీ ఆశలు పెట్టుకోవడానికి ఏ విధంగానూ వీలులేదు. ఎందుకంటే తెలుగు భాషోద్యమ సమాఖ్య, సామాజిక ఉద్యమకారులూ, మేధావి వర్గం, ప్రముఖ రచయితల సంఘాలూ ఈ ప్రభుత్వానికి ప్రపంచ తెలుగు మహాసభల్ని నిర్వహించే నైతిక అర్హత లేదని ప్రకటించాయి. ఏకంగా సభలను బహిష్కరించాలని అనేవారు కొందరైతే, తెలుగు భాష కోసం మీరేం చేశారో ఏం చేస్తారో ముందుగా చెప్పండని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నవారు మరికొందరు. తెలంగాణ ప్రాంతపు రచయితల సంఘాలు, ఉద్యమ సంఘాలు ఈ సభల్ని బహిష్కరిస్తున్నామని ఇప్పటికే ప్రకటించాయి. ప్రముఖ దినపత్రికల సంపాదకీయాల్లో, వ్యాసాల్లో ప్రభుత్వంపై విమర్శలు రావడం గుర్తించాల్సిన మరొక అంశం. ఈ పరిస్థితికి కారణాలేమిటో? తరచిచూద్దాం.

భాష ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రాలలో తొలి రాష్ట్రం మనదేనని గర్వంగా చెప్పుకొంటాం. భాషాప్రయుక్త రాష్ట్రం ఏర్పడినప్పుడు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి భాషా విధానం అంటూ ఒకటి స్పష్టంగా ఉండాలి. దురదృష్టవశాత్తూ ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే ఒక భాషా విధానమంటూ ఏమీ లేదు. ఆ తప్పుని సవరించుకోకముందే 37 ఏళ్ల తర్వాత తెలుగు గడ్డపై ప్రపంచ మహాసభల్ని మళ్లీ జరుపుకోబోతున్నాం!

ప్రజల భాషలో పరిపాలించాలనేది ప్రజా ప్రభుత్వానికి ఉండాల్సిన లక్షణం. దీన్నుంచి దూరంగా తప్పుకోవడానికే మన పాలకులు తొలినుంచీ ప్రయత్నించారు. ఇంకా ఆంధ్రప్రదేశ్ ఏర్పడకముందే- ఆంధ్రరాష్ట్ర శాసనసభలో 1955 సెప్టెంబరు 29న వావిలాల గోపాలకృష్ణయ్య 'ప్రభుత్వ వ్యవహారాలను తెలుగులోనే నిర్వహించాలని ఈ సభవారు ప్రభుత్వానికి సిఫారసు చేస్తున్నారు' అని తీర్మానం పెట్టగా, నాటి సభాపతి అయ్యదేవర కాళేశ్వరరావు 'వీలైనంత త్వరలో' అని సవరణ పెట్టారు. ఆ సవరణతో సహా బిల్లు చట్టం అయింది. 2005లో ఈ 'తప్పు'ను పసిగట్టి దానికి సవరణతో (జి.ఒ.నం.420) లోపరహితమైన జి.ఒ.ను తెప్పించారు. కానీ, దాన్ని ఎన్నడూ ప్రభుత్వం సరిగా అమలు పరచలేకపోయింది.

అమలు పరచేదాన్నిబట్టే చట్టాల వల్ల ప్రజలకు మేలు ఒనగూడుతుంది. పాలనా భాషగా తెలుగును అమలు చెయ్యాలనే చిత్తశుద్ధి ఈ పాలకులకు ఉంటే ఎన్నడో తెలుగునేల అంతా తెలుగే రాజ్యమేలేది. ఇందుకు రెండు ఉదాహరణల్ని మనం చెప్పుకోవచ్చు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా ఆయన పట్టుదలగా తెలుగును అమలు చెయ్యాలని నిర్ణయం తీసుకున్నారు. 1983లో ఆయన అధికారంలోకొచ్చిన వెంటనే చర్యలు ప్రారంభించారు. కొంత పని జరిగినా, పూర్తిగా ఆయన అనుకొన్న ఫలితాలు రాలేదు. దానితో ఆయన 1988 మార్చి 14న స్పష్టమైన నిర్ణయం తీసుకొన్నారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి తనకు అన్ని ఫైళ్లూ తెలుగులోనే రావాలనీ, ఆంగ్ల ఫైళ్లను చూడబోనని, రాష్ట్రంలో గెజిటెడ్ హోదా ఉద్యోగులు తమ పైఅధికారులు ఆంగ్లంలో పంపే ఫైళ్లను తిరస్కరించాలని, పర్యవసానాలకు ఆంగ్లంలో ఫైళ్లను పంపినవారే బాధ్యులనీ ఆయన ఉత్తర్వులు ఇచ్చారు. ఆ దెబ్బతో పరిపాలన మొత్తం తెలుగులోకొచ్చింది. తర్వాత పాలకులు మారడంతో మెల్లమెల్లగా పరిస్థితి మళ్లీ మొదటికొచ్చిందన్నది వేరే సంగతి. ఇలాంటివి మరో రెండు ఉదాహరణల్ని చెప్పవచ్చు. 2005 ప్రాంతంలో నెల్లూరు జిల్లాలో రవిచంద్ర, నిజామాబాద్ జిల్లాలో వెంకటేశ్వర రాయుడు కలెక్టర్లుగా ఉన్నకాలంలో ఇద్దరూ ఇదేవిధమైన నిర్ణయాలు తీసుకోవడంతో జిల్లా స్థాయిలో పరిపాలన అంతా పూర్తిగా తెలుగులోకొచ్చేసింది. తర్వాత క్రమంగా కథ మళ్లీ మామూలే అయింది. ఇదంతా మనకు చెప్పేదేమిటి? సచివాలయ స్థాయిలో - ఇంకా చెప్పాలంటే ముఖ్యమంత్రి స్థాయిలో అమలయితేనే, ఆయనలో రాజకీయ సంకల్పం గట్టిగా ఉంటేనే చట్టం అమలవుతుందని.

అందుకే ఇప్పుడు భాషోద్యమకారులు పూర్తిస్థాయిలో తెలుగులో పరిపాలన ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఎప్పుడు మొదలవుతుందో తేదీని ప్రకటించి మీ చిత్తశుద్ధిని నిరూపించుకోమంటున్నారు.

తెలుగుభాష కోసం మన ప్రభుత్వంలో ఒక పాలనా విభాగం (మంత్రిత్వశాఖ) లేనేలేదు. పార్టీలకు ఒక భాషా విధానమంటూ లేనందువల్ల ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని

చేపట్టిన పార్టీలు తమ ప్రభుత్వాలు అనుసరించే స్పష్టమైన భాషా విధానమేమిటో ప్రకటించే ప్రయత్నమే చేయలేదు.

ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పరచాలనేది కూడా చిరకాలంగా ఉన్న నిక్కచ్చు (డిమాండు). దీన్ని పట్టించుకోవాలనే ఆలోచన ఏ ముఖ్యమంత్రికీ కలగడం లేదు. ఈ అంశాన్ని ప్రధానంగా చేసుకొని తొమ్మిది డిమాండ్ల సాధన కోసం భాషోద్యమకారులు ఐదారేళ్లుగా ఉద్యమం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రతి అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంనాడు నిరసన దీక్షలు జరిపి, అన్ని పార్టీల నేతలనూ ఆహ్వానించి, వారి భాషా విధానం స్పష్టం చేయమని నిలదీస్తూనే ఉన్నారు.

మనతోపాటు ఏర్పాటైన తమిళనాడు, కర్ణాటకలలో వాళ్ల భాషలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖలూ, అభివృద్ధి ప్రాధికార సంస్థలూ ఉన్నాయి. అదేవిధమైన పాలనాపరమైన ఏర్పాటు అవసరమంటూ సమాఖ్య అధ్యక్షుడు ముఖ్యమంత్రిని మూడుసార్లు కలిసి వివరించారు.

భాషోద్యమకారులు చేస్తున్న మరొక నిక్కచ్చు- ఉన్నత విద్యా కోర్సుల్లో తెలుగును ఒక సబ్జెక్టుగా తప్పనిసరి చెయ్యాలని. ఇది లేనందువల్ల పదో తరగతి నుంచీ తెలుగు చదవాల్సిన అవసరమే విద్యార్థికి లేకుండా పోవడంతో - తెలుగును ఆధునిక శాస్త్ర సాంకేతిక అవసరాలకు కూడా తగ్గట్టు ఆధునిక భాషగా చేసే కృషికి అడ్డం కొట్టినట్లవుతోంది.

వివిధ మాండలికాలతో, పద సంపదతో విస్తరించి ఉన్న తెలుగు ప్రజలను భాషాపరంగా సమైక్యంగా ఉంచలేకపోవడం ప్రభుత్వపు మరో వైఫల్యం. మన ప్రభుత్వాలకు ఆయా రంగాల్లో సరైన విధానం లేకపోవడమే ఇప్పటి ఎన్నో సమస్యలకు కారణం. ఇందువల్ల తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీలు ఉన్నా, వాటికి సరైన మార్గం నిర్దేశించే వ్యవస్థగాని, నిర్మాణంగాని లేక అవి నామమాత్రంగా ఉన్నాయి.

ప్రభుత్వ పక్షాన సరైన భాషా విధానం లేకపోవడం, చట్టాలెన్ని ఉన్నా వాటిని అమలు చేసే వ్యవస్థలు లేకపోవడం, పాలకులలో రాజకీయ సంకల్పం లేకపోవడం- ఇవీ తెలుగు దిగులుకు అసలు కారణాలు. అందుకే తెలుగు ప్రజల్లో అసంతృప్తి రగిలి భాషోద్యమం నడుస్తోంది. భాషోద్యమకారులు తొమ్మిది కీలకమైన నిక్కచ్చులను ప్రభుత్వం ముందుకు తెచ్చారు. అవి, ఇవి:

1. తెలుగు భాష రక్షణ, అభివృద్ధికై ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను, దానికింద ఒక తెలుగు అభివృద్ధి సాధికార సంస్థను (డెవలప్‌మెంట్ అథారిటీ) తగినన్ని నిధులతో ఏర్పరచాలి. ఆ విధమైన సాధికార సంస్థ, మంత్రిత్వ శాఖలు కర్ణాటక, తమిళనాడులలో వారి భాషల కోసం ఎప్పటి నుంచో పని చేస్తున్నాయి.

2. రాష్ట్రంలో అన్ని స్థాయిల్లో అధికార భాషగా తెలుగును అమలు చెయ్యాలి. చట్టసభలు, ముఖ్యమంత్రి కార్యాలయం, సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాల్లో ఏ తేదీ నుంచి దీనిని అమలు చేస్తారో ప్రకటించాలి. జిల్లాస్థాయి వరకు న్యాయస్థానాల్లో తెలుగులో వ్యవహారాలు జరిగేందుకు జి.ఒ.నెం. 485 (1974) అమలుపరచాలి.

3. పాఠశాలలన్నిటిలో మాతృభాషలోనే పాఠశాల విద్యను బోధించడాన్ని తప్పనిసరి చెయ్యాలి. ప్రాథమికస్థాయి విద్యలో తెలుగు బోధనను పటిష్ఠం చెయ్యడానికి అర్హులైన తెలుగు పండితులనే పాఠశాలల్లో నియమించాలి. మొదటి తరగతి నుంచి ఒక సబ్జెక్టుగా ఆంగ్లాన్ని బోధించాలి.

4. ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిల్లోనూ మెడికల్, ఇంజినీరింగ్ వంటి సాంకేతిక, వృత్తివిద్యా కోర్సుల్లోనూ రాష్ట్రంలో తెలుగు భాషను ఒక పార్యాంశంగా తప్పనిసరి చెయ్యాలి

5. ఇతర రాష్ట్రాల్లోని తెలుగువారి విద్య, భాషా సంస్కృతుల రక్షణకై శాశ్వత సంయుక్త సభాసంఘాన్ని అన్ని వనరులతో ఏర్పరచాలి.

6. రాష్ట్రంలోని తెలుగు ప్రజలేకాక, రాష్ట్రం బయట ఇతర రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో తొమ్మిది కోట్ల మంది తెలుగు ప్రజలున్నారు. వీరిలో తెలుగు భాషా సంస్కృతుల వ్యాప్తికోసం అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఒకటి మనకు ఉంది. దానిని విశ్వవిద్యాలయం నుంచి వేరుచేసి, స్వతంత్ర ప్రతిపత్తితో కనీసం రూ. 100 కోట్ల నిధితో, మన గౌరవ ప్రతిష్ఠలను నిలబెట్టే విధంగా అభివృద్ధిపరచాలి.

7. ప్రభుత్వ పోటీ పరీక్షల్లో తెలుగు తప్పనిసరి అర్హత పరీక్షగా ఉండాలి. రాష్ట్ర సర్వీసుల నియామకాలలో తెలుగు మాధ్యమ అభ్యర్థులకు ఐదు శాతం అదనపు మార్కులు కలపాలి.

8. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీని, రద్దయిన తక్కిన అకాడమీలను తిరిగి నెలకొల్పాలి.

9. ఆంగ్ల పాఠశాలల్లో తెలుగు మాట్లాడటాన్ని నేరంగా పరిగణించి శిక్షలు వేయడం అలవాటుగా మారింది. తెలుగుభాషను చిన్న చూపు చూడటం, పలు రంగాలలో తెలుగును అవమానించడం సాధారణమైంది. యాసలను హేళన చెయ్యడం, వక్రీకరించడం జరుగుతోంది. ఈ పరిస్థితిని నివారించి, తెలుగు భాషా సంస్కృతుల పట్ల గౌరవాన్ని పెంచేందుకు వెంటనే పటిష్ఠ చట్టాన్ని తీసుకురావాలి.

వీటిలో కొన్నింటినైనా వెంటనే ఆమోదిస్తూ సభలకు ముందుగానే ఉత్తర్వులు ఇవ్వాలని, ప్రభుత్వం స్పందించకపోతే నిరసనలను ఎదుర్కొనక తప్పదని భాషోద్యమకారులు, వారిని సమర్థించే రచయితల సంఘాలు ప్రకటించారు. అయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉంది. అందుకే- ఈసారి ప్రభుత్వం తలపెట్టిన ప్రపంచ సభలు ఒక పెద్ద జాతరగా, సొమ్ముదండగ వ్యవహారంగా మిగిలిపోక తప్పదు.

డా॥ సామల రమేష్ బాబు
తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు, 'నడుస్తున్న చరిత్ర' సంపాదకుడు. విజయవాడ.
98480 16136

చిత్తశుద్ధిలేని తెలుగు పూజ?!

దశాబ్దాల తర్వాత మన పాలకులకు తెలుగుపై అభిమానం పుట్టుకొచ్చింది. శాసనసభ నుంచి సచివాలయం వరకూ ప్రతిచోటా ఆంగ్లానికే అగ్రపూజ చేస్తున్న పెద్దలకు హఠాత్తుగా మన మాతృభాష తెలుగు అన్న సంగతి గుర్తుకు వచ్చినట్లుంది. ఆంగ్లంలో ఉత్తర్వు జారీ చేసి మరీ ప్రపంచ తెలుగు మహాసభలకు కంకణబద్ధులయ్యారు!!!

ఈ నెల 27-29ల మధ్య తలపెట్టిన నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలకు తిరుపతి ఆతిథ్యమివ్వబోతోంది. ఈ సభల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లు, వాటి లోటుపాట్లను సింహావలోకనం చేసుకుంటే..

తిరుపతి రాజీవ్‌నగర్ అవిలాల సమీపంలోని 90 ఎకరాల స్థలంలో సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటి కోసం ప్రభుత్వం రూ.25 కోట్లు కేటాయించింది.. ఇప్పటికి రూ.5 కోట్లు కూడా విడుదల చేసింది. రోజుకు 40 వేల మంది హాజరయ్యేలా సభలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సభల నిర్వహణకు ప్రభుత్వం ఆరు కమిటీలను ఏర్పాటు చేసింది. అతిథులకు వసతి, భోజన, రవాణా, ఆరోగ్య, భద్రత ఏర్పాట్లను పరిశీలించే బాధ్యతలను వీటికి అప్పగించారు.

మహాసభలు జరిగే ప్రదేశానికి 'శ్రీవెంకటేశ్వర ప్రాంగణం'గా నామకరణం చేశారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా ఈ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. తెలుగు పుస్తకాలు, తాళపత్ర గ్రంథాలూ, పురాతన శాసనాలూ వస్తువులూ, చేనేత హస్తకళల ప్రదర్శనలనూ ఏర్పాటు చేస్తున్నారు.. కనుమరుగు అవుతున్న అచ్చ తెలుగు క్రీడలనూ చూపించాలనుకుంటున్నారు.. సురభి నాటకాలతో పాటు, అలనాటి మధుర తెలుగు చలన చిత్రాలను ప్రదర్శింపబోతున్నారు. అగ్రశ్రేణి కవులు, కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నారు.

మహాసభల సందర్భంగా రెండొందల లఘు గ్రంథాలను ప్రచురించాలని నిర్ణయించారు. ఎవరెవరు ఏయే అంశాలపై రచనలు చేయాలో ఖరారైంది. తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 80, తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో 100 గ్రంథాలను ప్రచురించనున్నారు. పుస్తకాలను తొలుత సీడీల రూపంలో విడుదల చేయాలని భావిస్తున్నారు. సమయ లభ్యతను బట్టి వాటికి ముద్రణా రూపమిచ్చే అవకాశం ఉంది. అలాగే, తొలి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక సంచిక 'తెలుగువాణి'ని పునర్ముద్రించనున్నారు.

మహాసభల 'ఇతివృత్త గీతా'న్నీ (థీమ్‌సాంగ్) రూపొందిస్తున్నారు. దీని కోసం ఔత్సాహిక రచయితల సృజనలను ఆహ్వానిస్తున్నారు. ఉత్తమ గేయానికి ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, యోగ్యమైన ఇతర గేయాలకు ప్రోత్సాహక బహుమతులు (రూ.అయిదు వేలు) ఇవ్వాలని నిర్ణయించారు. ఈ గీతాలతో రాష్ట్రవ్యాప్త ప్రచారానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలపై విస్తృత ప్రచారం కల్పించేందుకు అధికార భాషాసంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సైకిల్ ర్యాలీ నిర్వహించబోతున్నారు. ఇది హైదరాబాద్ నుంచి ప్రారంభమై రంగారెడ్డి, మహబూబ్‌నగర్, కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల మీదుగా చిత్తూరు చేరుకుంటుంది. అనంతరం తిరుపతిలో ప్రత్యేక ప్రదర్శన నిర్వహిస్తారు.

మహాసభల ఉద్దేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నవంబరు 19 నుంచి డిసెంబరు 19 మధ్య అన్ని జిల్లాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. వీటి కోసం ప్రతి జిల్లాకూ రూ.20 లక్షలను కేటాయించారు. పాఠశాలల్లోని విద్యార్థులకు భాషా పోటీలు, కవులు, సాంస్కృతిక రంగాల్లో కృషి చేసిన వారికి సన్మానాలు నిర్వహించాలని సూచించారు.

జీవవైవిధ్య సదస్సు సందర్భంగా హైదరాబాద్‌లో ప్రభుత్వం స్తూపాన్ని నిర్మించింది. అలా ప్రపంచ తెలుగు మహాసభలకు గుర్తుగా తిరుపతిలోనూ ఒక శాశ్వత నిర్మాణం చేపట్టాల్సి ఉంది. తెలుగు భాషా సాంస్కృతిక వేదికను నిర్మించాలని భావిస్తున్నారు. ఈ వేదికకు సంబంధించి భూసేకరణ చేయాలంటూ జిల్లా కలెక్టరును సాంస్కృతిక శాఖ కోరింది. మహాసభల సందర్భంగా ఈ క్షేత్రానికి భూమి పూజ చేయాలని భావిస్తున్నారు.

ఆశయాలివే...

ఈ మహాసభల్లో తొమ్మిది అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

1. తెలుగు జాతి భాష, సంస్కృతులపై నేటి బాలలకు, యువతరానికి ఆసక్తిని కల్పించేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి. భావితరాలకు తెలుగు సంస్కృతిని సమగ్రంగా అందించేందుకు కృషిచేయాలి.
2. ప్రపంచీకరణ నేపథ్యంలో విదేశాలలో, మన దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ఉన్న తెలుగువారిలో భావసమైక్యాన్ని కలిగించాలి. వారందరినీ ఒకే వేదికపైకి తీసుకురావాలి. తెలుగు భాషా సంస్కృతులు ఎదుర్కొంటున్న సాధక బాధకాలను సమగ్రంగా చర్చించి వాటికి పరిష్కారాలను అన్వేషించాలి.
3. ప్రముఖ ప్రపంచ భాషలతో సరితూగేలా అంతర్జాలంలో తెలుగు వినియోగానికి చర్యలు చేపట్టాలి..
4. పాలన, బోధన, ప్రసార మాధ్యమ భాషగా

గతమెంతో ఘనం..

తెలుగు భాషా వికాసమే లక్ష్యంగా 1975, ఏప్రిల్ 12 - 18 మధ్య హైదరాబాద్‌లో ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించారు. లాల్‌బహదూర్ మైదానం వీటికి వేదిక అయింది. రాజకీయ నాయకుల నుంచి అధికారుల వరకూ అందరి సమష్టి కృషితో ఈ సభలు విజయవంతమయ్యాయి. వీటికి ఏడాది ముందు హైదరాబాద్‌లోనే రాష్ట్రస్థాయి తెలుగు మహాసభలను నిర్వహించారు. వీటి ద్వారా ప్రజలను ఉత్తేజపరిచి ప్రపంచ మహాసభలకు రంగం సిద్ధం చేశారు. మొదటి ప్రపంచ మహాసభల్లో రోజుకు లక్ష మంది చొప్పున పాల్గొన్నారు. 16 దేశాల నుంచి 92 మంది, ఇతర రాష్ట్రాల నుంచి 981 మంది, మన రాష్ట్రం నుంచి 4489 మంది ప్రతినిధులు ఈ సభలకు హాజరయ్యారు. రోజుకు ఎనిమిది గంటల చొప్పున 28 అంశాలపై చర్చలు జరిపారు. ఈ మహాసభలకు అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ ఆలీ అహమ్మద్ కూడా రావడం విశేషం. వీటి తర్వాత 1981లో మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో, 1990లో మారిషస్‌లో ద్వితీయ, తృతీయ మహాసభలు జరిగాయి.

తెలుగును సమర్ధంగా వాడుకలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేయాలి.

5. తెలుగువారి శతాధిక జానపద, సంప్రదాయ కళారూపాలను, పరిరక్షించి, ప్రదర్శనలకు అవకాశం కల్పించడం, వాటికి తగిన ప్రాచుర్యం కల్పించేందుకు భవిష్యత్ కార్యాచరణను రూపొందించడం.
6. వేల ఏళ్ల చరిత్రగల తెలుగు జాతిపై గతంలో జరిగిన పరిశోధనల్ని ఒక చోట చేర్చి, పరిశీలించి, ఇంకా పరిశోధించాల్సిన అంశాలను గుర్తించి, పరిశోధకులను ప్రోత్సహించడం, జాతి ప్రాచీనతను, ప్రశస్తులను వెలుగులోకి తీసుకురావడం.
7. తెలుగు జాతి సాహిత్య, సాంస్కృతిక, వైజ్ఞానిక చరిత్రపై సమగ్రమైన గ్రంథాలను ప్రచురించడం, తెలుగు భాషా నిఘంటువులను పరిపుష్టం చేయడం, నూతన పారిభాషిక పదాలు తయారు చేయడం.
8. తెలుగు భాషను అభ్యసించే వారికి ఆకర్షణీయమైన పాఠ్యగ్రంథాలు, బోధనోపకరణాలు సరళమైన సులభశైలిలో తయారు చేసి, వినియోగంలోకి తెచ్చేలా వినియోగించేలా చర్యలు తీసుకోవడం.
9. తెలుగు నేలపై ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక స్థలాలకు, పర్యాటక కేంద్రాలకు ప్రాచుర్యం కల్పించడం.

అందరూ ఆహ్వానితులే

మహాసభలకు హాజరయ్యేందుకు ఔత్సాహికులు పేర్లు నమోదు చేయించుకోవచ్చు. దీని కోసం సాంస్కృతిక శాఖ కేంద్రాలు ఏర్పాటు చేసింది. సభలలో పాల్గొనేందుకు సాధారణ ప్రజలకు ఎలాంటి రుసుం లేదు. ప్రతినిధులుగా హాజరు అయ్యే వారు మాత్రం రూ.500 చెల్లించాలి. (విదేశాల్లోని వారైతే 20 అమెరికన్ డాలర్లు) ఈ మొత్తాన్ని ప్రపంచ తెలుగు మహాసభల కార్యాలయం (హైదరాబాద్ రవీంద్రభారతి లోని మహతి ఆడిటోరియంలో) నగదు రూపంలో చెల్లించవచ్చు. విదేశాలు, సుదూర ప్రాంతాల్లోని ప్రతినిధులు.. 'సంచాలకులు, సాంస్కృతిక శాఖ' పేరిట డీడీ తీసి పంపించాలి. ప్రతినిధులుగా హాజరయ్యేవారికి భోజన, బస ఏర్పాటు చేస్తారు.

మనస్సు పెట్టే చేస్తున్నారా?

చిత్తశుద్ధి లేని తెలుగుపూజ చేస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. ప్రపంచ తెలుగు మహాసభల గురించి ఆర్భాటంగా ప్రకటనలు ఇవ్వడం తప్ప ఏర్పాట్లలో వేగం, నాణ్యత చూపించట్లేదు. నవంబరు 15 నాటికి కమిటీల ఏర్పాటు తప్ప ఏ ఒక్క పని కూడా పూర్తి కాలేదు. ఆరు నెలల క్రితమే వేదిక ఖరారైనా, ఇప్పటికీ దాన్ని చదును చేయలేదు. కనీస మౌలిక సదుపాయాల ఏర్పాట్లేవీ కొలిక్కిరాలేదు. మరోవైపు... సభల నిర్వహణలో ఒకరిద్దరు రాష్ట్రస్థాయి అధికారులకు తప్ప ఎవరికీ బాధ్యతలు లేవు.

భారీస్థాయిలో పుస్తకాలను ప్రచురించాలని నిర్ణయించినా... సభల సమయానికి అవి పూర్తి అవుతాయో లేదో అన్న అనుమానంతోనే సీడీల ప్రస్తావన తీసుకొచ్చారు. గడువు నాటికి అవైనా సిద్ధమవుతాయో లేదో తెలియదు. ఒక వేళ ఆదరాబాదరా చేసినా వాటి నాణ్యత గురించి చెప్పేదేముంటుంది?

మహాసభల నిర్వహణలో ముఖ్యంగా రాజకీయ సంకల్పం కొరవడింది. సభలపై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక మంత్రి వర్గ ఉపసంఘం... ఒక్కసారి కూడా పూర్తిస్థాయిలో సమావేశమవ్వలేదు. పనుల్లో వేగం పెంచడానికి దోహదపడే నిర్ణయాలను తీసుకోలేదు. జరుగుతున్న పనుల్లోనూ అక్రమాలకు తావిచ్చేలా ప్రభుత్వం కొన్ని నిర్ణయాలను తీసుకుంది. రూ.అయిదు లక్షలకు మించిన పనులకు టెండర్లు పిలవాలి. కానీ, ఇక్కడ నామినేషన్ పద్ధతికి తెరతీశారు.

అసలే రద్దీ!

కొత్త సంవత్సర ప్రారంభ సమయంలో వెంకన్నను దర్శించుకునేందుకు తిరుపతికి భారీ సంఖ్యలో భక్తులు వస్తారు. గత ఏడాది డిసెంబరు 25వ తేదీ నుంచి జనవరి అయిదవ తేదీ మధ్యలో రోజుకు సరాసరి లక్ష మంది భక్తులు వెంకటేశ్వరుడి దర్శనం చేసుకున్నారు.

తిరుమల కొండపై దాదాపు 60 వేల మందికి బస ఏర్పాట్లు చేసేందుకు అవకాశముంది. తిరుపతి, చిత్తూరులో మరో 30 వేల మందికి మాత్రమే వసతి కల్పించవచ్చు. సాధారణ భక్తులకే ఈ వసతి సౌకర్యాలు సరిపోతాయి. మరి తెలుగు మహాసభలకు వచ్చే ప్రతినిధులకు ఎక్కడ వసతి కల్పిస్తారన్నది అంతుచిక్కని రహస్యం. ప్రభుత్వ అంచనా ప్రకారం 40 వేల మంది రాకున్నా అందులో సగం వచ్చినా తట్టుకునే పరిస్థితి ఉందా అన్నది అనుమానమే.

ఈ వసతి సమస్యపైనే అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. తిరుపతి, చిత్తూరుల్లోని హోటళ్ల యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. స్థానిక కళాశాలలు, కల్యాణమండపాల్లోనూ వసతి ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అవెంత వరకూ ఫలిస్తాయో చూడాలి.

– జనరల్ బ్యూరో, ఈనాడు



సాంకేతిక సదస్సులో తెలుగు 'జాలం'

తియ్యందనాల తెలుగుకు సాంకేతిక సొబగులు
అపురూపమైన అమ్మభాషకు ఆధునిక సొగసులు వెరసి...
విశ్వ భాషా వేదికపై మెరిసిన యాభైఆరు అక్షరాలు
అంతర్జాల యవనికపై మనదైన చేవ్రాలు

తాళపత్రాలపై తెలుగు అక్షరాలు తళుకులద్దుకున్న కాలం నాటి నుంచి అచ్చుకాగితాలపై అందంగా రూపుకట్టిన నాటి వరకూ ఒక చరిత్ర. నేడంతా సాంకేతిక యుగం. ఆలోచనలను పంచుకోవడం దగ్గర నుంచి గుండెలోతుల్లో గూడుకట్టుకున్న భావాల అక్షరీకరణ వరకూ అన్నీ అంతర్జాలంలోనే. సమాచార మార్పిడి, సేకరణ, విశ్లేషణ అంతా అందులోనే. అయితే... ఒక్కటే చిక్కు. అంతర్జాల ప్రపంచంలో తెలుగు ఉనికి తక్కువ. తెలుగు రాయడానికి అక్కడ సంపూర్ణ అవకాశాలు లేవు. ఈ సమస్యను అధిగమించడానికి ప్రస్తుతం కృషి జరుగుతోంది. నవంబరు 2వ తేదీ నుంచి 4 వరకు విశాఖలోని గీతం విశ్వవిద్యాలయం ఆతిథ్యంలో జరిగిన రెండో అంతర్జాతీయ తెలుగు సదస్సు ఇందుకు చక్కటి వేదికగా నిలిచింది. రాష్ట్ర సమాచార, సాంకేతిక శాఖ, సిలికానాంధ్ర, విశ్వ తెలుగు అంతర్జాతీయ వేదిక(జి.ఐ.ఎఫ్.టి.)ల సంయుక్త భాగస్వామ్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు లబ్ధప్రతిష్ఠులైన తెలుగు ఆచార్యులు, పరిశోధకులు, భాషా ప్రేమికులు దూరప్రాంతాల నుంచి కూడా హాజరయ్యారు.

తెలుగు భాషకు సాంకేతిక సొగసులద్దడానికి చేపట్టాల్సిన కార్యక్రమాలను నిర్ణయించుకోవడానికి, స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి రాష్ట్ర సమాచార సాంకేతిక శాఖ, సిలికానాంధ్రలు సంయుక్తంగా కిందటేడాది అమెరికాలోని కాలిఫోర్నియాలో మొట్టమొదటి 'అంతర్జాతీయ తెలుగు అంతర్జాల సదస్సు'ను నిర్వహించారు. తెలుగు భాష విశ్వవ్యాప్తం కావడానికి అడ్డంకిగా నిలిచిన పలు అంశాల్ని విశ్లేషించి పరిష్కారాలపై దృష్టి సారించారు. ఫలితంగా అంతర్జాలంలో తెలుగు వినియోగం ఊపందుకోవడానికి తగిన ప్రాతిపదికను అందుబాటులోకి తీసుకురాగలిగారు.

15 ఖతుల ఆవిష్కరణ....

అంతర్జాలంలో తెలుగు వినియోగం విస్తృత పరిచేందుకు చేయాలనుకున్న ప్రథమ ప్రయత్నం తెలుగు ఖతులను పెంచడం. మొదటి అంతర్జాల సదస్సు నాటికి కేవలం మూడే మూడు ఖతులు అందుబాటులో ఉండేవి. వాటి రూపం కూడా అంత ఆకర్షణీయంగా ఉండేదికాదు. పైపెచ్చు వాటిని వినియోగించుకోవాలంటే 13 వేల వరకు లైసెన్సు రుసుములను చెల్లించుకోవాల్సి వచ్చేది. దీన్ని దృష్టిలో ఉంచుకుని మరో ఎనిమిది ఖతులను అందుబాటులోకి తేవాలని మొదటి సమావేశంలో లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఏకంగా 15 ఖతులను అందుబాటులోకి తెచ్చారు. వీటికి శ్రీకృష్ణదేవరాయలు, పెద్దన, రామరాజ, తెనాలి రామకృష్ణ, తిమ్మన, రామభద్ర, ధూర్జటి, మల్లన, సూరన, మండలి, గిడుగు, గురజాడ, సురవరం, ఎన్.టి. ఆర్., నాట్స్ పేర్లను పెట్టారు. ఆయా ఖతులన్నింటినీ ప్రతి ఒక్కరూ ఉచితంగా ఉపయోగించుకోవడానికి వీలుగా సి.డి.లను పంపిణీ చేశారు. విశ్వసంకేతమాల ప్రమాణాలకు అనుగుణంగా 'ఇన్‌స్క్రిప్ట్'లో ఆయా ఏక సంకేత ఖతులను రూపొందించడం మరో విశేషం. తెలుగు డాక్యుమెంట్లను ప్రపంచవ్యాప్తంగా ఏ కంప్యూటర్లోనైనా చూసుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చినట్లైంది. దీంతో అంతర్జాలంలో తెలుగు వాడకం మరింత సులభం, ఆకర్షణీయం కానుంది.

సాంకేతిక ఉపకరణాలు...

ఏకసంకేత ఖతులతోపాటు తెలుగు భాషకు చెందిన పలు ఉపకరణాలను కూడా రూపొందించి రెండో అంతర్జాతీయ తెలుగు అంతర్జాల సదస్సులో ఆవిష్కరించారు. బహుభాషా నిఘంటువు, బాలవ్యాకరణం, పర్యాయపదకోశం, తెలుగు ఇంగ్లిషు నిఘంటువు, తెలుగుపద పరిష్కరిణి, తెలుగు-రోమను లిపిమార్పిడి, తెలుగు పద విశ్లేషిణి, తెలుగుపద జనకం తదితరాలన్నీ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా సి.డి.లను రూపొందించారు. ఆయా సీడీలను సదస్సు ప్రారంభమైన నవంబరు రెండోతేదీన తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య ఆవిష్కరించారు.

అబ్బురపరిచే పరిశోధనలు...

తెలుగు భాషను విశ్వవ్యాప్తం చేసే క్రమంలో అవసరమైన ఉపకరణాల రూపకల్పనకు ఓ పక్క కృషి జరుగుతుండగా... వివిధ విశ్వవిద్యాలయాల్లోని తెలుగు విభాగాల్లోని ఆచార్యులు, పరిశోధకులు తెలుగు భాషాభివృద్ధికి అవసరమైన పరిశోధనలు సాగిస్తున్నారు.

- హైదరాబాద్ ఐ.ఐ.ఐ.టి.లో దృశ్య, శ్రవణ పరిశోధనశాల సంస్థానాచార్యులుగా ఉన్న ఆచార్య పేరి భాస్కరరావు ఆధ్వర్యంలో ఓ ఆసక్తికరమైన పరిశోధన సాగుతోంది. తెలుగులో రాస్తే ఆయా వాక్యాలు ధ్వని రూపాన్ని సంతరించుకుని వినిపిస్తాయి. తెలుగు విస్తృతికి ఈ పరిజ్ఞానం అత్యంత కీలకం.
- ప్రస్తుతం 18 వరకు చేరిన ఖతులను 50 వరకు పెంచే బాధ్యతలను నిపుణులకు అప్పగించారు. అత్యధిక ఖతులుంటే భాషా వినియోగం కూడా విస్తృతమయ్యే అవకాశాలు మరింతగా మెరుగుపడతాయి.
- హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో

తెలుగు ఖతులు, ఉపకరణాలను విడుదల చేస్తున్న ప్రముఖులు

ప్రారంభ సభలో భాషాభిమానులు, సాంకేతిక నిపుణులు

నిరంతర కృషి

ప్రపంచంలో అత్యధికులు మాట్లాడే భాషల్లో 15వ స్థానంలోనూ.... భారతదేశంలోని భాషల్లో మూడో స్థానంలోనూ ఉంది తెలుగు. దానికి కావాల్సిందల్లా సాంకేతికత జోడింపు. అందుకే అంతర్జాలంలోనూ, సమాచార ప్రసార సాంకేతిక రంగాల్లోనూ తెలుగును విస్తృతంగా వినియోగించుకునేందుకు భూమికను సిద్ధం చేయడంలో సిలికానాంధ్ర కృషి చేస్తోంది. తెలుగు భాషా మేధావులు, ప్రేమికులు, సాంకేతిక నిపుణులు... అందరినీ ఒక వేదికపైకి తెచ్చి భాషాభివృద్ధికి నిరంతరాయ కృషిని కొనసాగిస్తుంది. అంతర్జాలం ద్వారా భావితరాలకు తెలుగు భాషను మరింత చేరువ చేయడానికి పాటుపడుతోంది. తెలుగులో చదువుకున్నవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగేలా చేయగలిగినప్పుడే మా కృషికి సార్థకత.

- కూచిభొట్ల ఆనంద్,
సిలికానాంధ్ర అధ్యక్షుడు

భవిష్యత్తులోనూ...

సమాచార సాంకేతిక రంగంలో ఉన్న ప్రతి ముగ్గురిలో ఒకరు భారతీయుడు. వారిలోనూ ప్రతి ముగ్గురిలో ఒకరు తెలుగు వారు. ఇదీ విశ్వవేదికపై తెలుగు వారి ఘనత. ఇంతటి ముందంజలో ఉన్న మనం భాషోద్యమంలో ఎందుకు వెనుకబడి ఉన్నాం? ఈ ఆలోచన నుంచి ఉద్భవించిందే 'తెలుగు విజయం'. తెలుగు భాషాభివృద్ధికి రాష్ట్ర సమాచార సాంకేతికశాఖ తరఫున పలు కార్యక్రమాలు చేపట్టాం. తెలుగువిజయం వెబ్‌సైట్, పలు ఖతుల రూపకల్పనను విజయవంతంగా పూర్తిచేశాం. భవిష్యత్తులో మరిన్ని ఖతులు అందుబాటులోకి రావడానికి కృషిచేస్తాం.

- పొన్నాల లక్ష్మయ్య,
రాష్ట్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి

అన్నీ తెలుగులోనే...

ప్రభుత్వం జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలు, జి.ఒ.ల రూపకల్పన తదితర వ్యవహారాలన్నీ తెలుగులోనే జరగాలని అధికారభాషా చట్టం నిర్దేశిస్తోంది. తెలుగు భాష ఉపకరణాలు, తగిన సంఖ్యలో ఖతులు లేవంటూ ప్రభుత్వాధికారులు సాకులు చెప్పేవారు. ఇప్పుడు విడుదల చేసిన ఉపకరణాల వల్ల ఆ సమస్యలు తీరిపోయాయి. ఇకపై ప్రభుత్వ పాలనా వ్యవహారాల్లో తెలుగు వినియోగాన్ని విస్తృతం చేసేలా అధికార భాషా సంఘం శక్తివంచన లేకుండా కృషిచేస్తుంది. సాంకేతిక రంగంలో తెలుగు భాష పరంగా కొత్త కొత్త ఆవిష్కరణలు జరగాలి. ఈ ఖతులను అమెరికాలో చేయించాలనుకున్నాం. కానీ, ఇక్కడ చిన్న కుర్రాళ్లు చేశారు. మన మానవ వనరుల్ని సక్రమంగా ఉపయోగించుకోలేని శక్తిహీనమైన రాజకీయ నాయకులుగా మిగిలిపోయాం. ఆచార్య పేరి భాస్కరరావు వంటి వ్యక్తుల కృషిని మనం గుర్తించలేదు. జర్మన్ వెబ్‌సైట్లన్నింటిలో జర్మన్ భాషను నేర్చుకోవడం ఎలా అన్నది ప్రముఖంగా ఉంటుంది. అలా మనమూ తెలుగును సజీవ భాషగా నిలబెట్టుకోవాలి.

- మండలి బుద్ధప్రసాద్, అధికార భాషాసంఘం

తర్వాత విజయవాడలో...

ఎందరో తెలుగు ప్రముఖులు తమ వంతు సాయం చేయడానికి ముందుకు వస్తున్నారు. కాలిఫోర్నియాలో 2011వ సంవత్సరం సెప్టెంబరు 27నుంచి 30 వరకు జరిగిన సమావేశం పూర్తికాక ముందే రెండో సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి గీతం అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.వి.ఎస్.మూర్తి ముందుకువచ్చారు. 2013వ సంవత్సరంలో జరిగే మూడవ సదస్సును నిర్వహించడానికి విజయవాడలోని సిద్ధార్థ కళాశాల యాజమాన్యం ముందుకు వచ్చింది. ఆధునికతను సంతరించుకోకపోతే తెలుగు అభివృద్ధి చెందేదెలా? మన రాష్ట్రంలో కోట్ల సంఖ్యలో సెల్‌ఫోన్లు ఉన్నాయి. వాటిలో ఎన్నింటిలో తెలుగు సాఫ్టువేర్లు ఉన్నాయి. మాకు అవి కావాలని ఏ కంపెనీనైనా అడిగామా? శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తమ మాతృ భాషనే వినియోగిస్తూ ముందుకు దూసుకెళ్తున్న రష్యా, చైనా, జపాన్‌లను ఆదర్శంగా తీసుకోవాలి. **- ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, యు.జి.సి. ఉన్నత భాషాధికార సంఘం అధ్యక్షుడు**

మరింత ప్రోత్సహిస్తాం....

అంతర్జాతీయ తెలుగు అంతర్జాల సదస్సు సందర్భంగా వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన సుమారు వందమంది వరకు పరిశోధకులు తెలుగుకు సంబంధించిన విభిన్న అంశాలపై తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. రాబోయే రోజుల్లో తెలుగుభాషపై పరిశోధనలు చేసేవారి సంఖ్యను పెంచడానికి కృషిచేస్తాం.

- ఆచార్య పేరి భాస్కరరావు

వేగవంతం చేస్తాం...

తెలుగుభాషాభివృద్ధికి చేస్తున్న కార్యక్రమాలను వేగవంతం చేయడానికి... ఆశించిన లక్ష్యాలను సాధించడానికి రాష్ట్రసమాచార సాంకేతికశాఖ తరపున అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. భాషాభివృద్ధికి అడ్డంకిగా నిలిచిన అంశాల్ని తొలగించడానికి కృషిచేసి తెలుగును ప్రపంచభాషగా మార్చడానికి మార్గం సుగమం చేస్తాం.

- తూములూరి శంకర్, తెలుగువిజయం ప్రాజెక్టు ప్రత్యేక అధికారి

మాతృభాషతోనే మనుగడ...

భాష మనుగడ కోల్పోయిందంటే సంస్కృతి సంప్రదాయాలు కూడా ఉనికిని కోల్పోయినట్లే. తెలుగు సంస్కృతి వర్ధిల్లాలంటే భాష మనుగడకు విశేష కృషిచేయాలి. తెలుగు అకాడమీ తన వంతు కృషిగా రానున్న రోజుల్లో పూర్తిస్థాయి తెలుగు వెబ్‌సైట్‌ను రూపొందించడం తోపాటు ఇప్పుడు విడుదలైన తెలుగు ఖతులను ఉపయోగించుకుని మా కార్యకలాపాలన్నీ పూర్తిగా తెలుగులోనే సాగిస్తాం.

-ఆచార్య యాదగిరి, సంచాలకుడు, తెలుగు అకాడమీ

ఆ సమయమిదే

కంప్యూటర్‌లో తెలుగును అభివృద్ధి చేసుకోకపోతే వెనుకబడ్డ భాషగా మిగిలిపోతుంది. ఈ దిశగా ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఖతులను బాగా అభివృద్ధి చేయాలి. ప్రభుత్వ పాలనంతా తెలుగులోనే సాగాలి. తెలుగుకు సంబంధించి జరుగుతున్న కృషిలో మా గీతం సంస్థ భాగస్వామి కావడం చాలా సంతోషంగా ఉంది.

- ఎం.వి.వి.ఎస్.మూర్తి, మాజీ ఎంపీ

ప్రచారం చేయాలి

సులభంగా అర్థమయ్యే సాంకేతిక పదాలను సృష్టించుకోవాలి. సాంకేతిక రంగంలో తెలుగు వినియోగానికి జరుగుతున్న కృషి, ప్రయోజనాలను విస్తృతంగా ప్రచారం చేయాలి.

- చక్రపాణి, శాసనమండలి అధ్యక్షులు

ఏర్పాటైన 'అనువర్తిత భాషాశాస్త్ర, అనువాదాల కేంద్రం' పరిశోధకులు వాక్య విశ్లేషిణి అనే ఉపకరణాన్ని (సాఫ్ట్‌వేర్) రూపొందిస్తున్నారు. ఇతర భాషల్లోని విషయాలను తెలుగులోకి యంత్రానువాదం ద్వారా అనువదించడానికి వాక్యవిశ్లేషిణి అత్యవసరం. ఈ ప్రాజెక్టుకు కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు రాజ్యరమ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. ఈ కేంద్రంలోనే మొత్తం తొమ్మిది భారతీయ భాషలను యంత్రానువాదం చేసే ఉపకరణాల తయారీకి పరిశోధనలు సాగిస్తున్నారు.

సాధించిన విజయాలెన్నో....

'తెలుగును విశ్వభాషగా మార్చాలన్న సంకల్పంతో మొదలుపెట్టిన ప్రస్థానంలో ఒక్క ఏడాది వ్యవధిలోనే గణనీయమైన పురోగతి సాధించామనడంలో అతిశయోక్తిలేదు. తెలుగును బతికించుకోవాలన్న లక్ష్యంతో ఆలస్యంగా నడుంబిగించినా పది సంవత్సరాల్లో సాధించాల్సిన లక్ష్యాలను ఒక్క సంవత్సరం వ్యవధిలోనే సాధించాం' అని అధికార భాషా సంఘం అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ అభిప్రాయపడ్డారు.

- రాష్ట్ర సమాచార సాంకేతికశాఖ తెలుగు విజయం ప్రాజెక్టులో భాగంగా పలు కార్యక్రమాలను చేపట్టడమేకాక ప్రస్తుత సంవత్సరం తెలుగుభాషా దినోత్సవం రోజున మూడు కొత్త ఖతులను, తెలుగు విజయం పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. www.teluguvijayam.org వెబ్‌సైట్లో తెలుగు ఉపకరణాలను, ఖతులను ఉచితంగా దిగుమతి చేసుకోవడానికి అందుబాటులో ఉంచారు.
- యునికోడ్ కన్సార్షియంలో సభ్యత్వం తీసుకున్న భారతదేశంలోని మొట్టమొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది.
- తెలుగు భాష పుట్టినప్పటి నుంచి నేటి వరకు సుమారు రెండున్నర వేల సంవత్సరాల కాలంలో అక్షరాల రూపంలో గణనీయమైన మార్పులు వచ్చాయి. తాళపత్రాల గ్రంథాలలో ఉన్న తెలుగునకు నేటి తెలుగుకు ఏమాత్రం పొంతనలేదు. అయితే ప్రాచీనకాలం నాటి అక్షరాల రూపాల్ని కూడా గుర్తించి యూనికోడ్‌లో స్థానం కల్పించడం ద్వారా పురాతన గ్రంథాల్లోని అంశాలను యంత్రానువాదం ద్వారా అనువదించి నేటి తరాలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా కూడా కృషి జరుగుతోంది.
- కంప్యూటర్లో తెలుగు భాషలో రాసే పదాల్లో అక్షర దోషాలను గుర్తించే మరో ఉపకరణం 'పద పరిష్కరిణి' (స్పెల్‌చెకర్)ని ఆవిష్కరించారు. దీనివల్ల కంప్యూటర్లో తెలుగులో రాసేటప్పుడు తప్పుల్ని నివారించడం సులువవుతుంది.

- బి.ఎస్.రామకృష్ణ, ఈనాడు, విశాఖపట్నం

అభినవ సుగాత్రీ శాలీనులు

అరయనొక్కపూట అభినవ శాలీను
డనగ నొక్క యువకు డవతరించె!
పనికిరావు నేటి ఫ్యాషనులతనికి
పూర్వ పద్ధతులను పొగడుచుండు!!
అతని మేనమామ సుత 'సుగాత్రి' యదేమొ
నేటి ఫ్యాషనులకు నిలయమగును!
కాని, తల్లిమాట కాదనక సుగాత్రి
కంఠమందు తాళి గట్టెనతడు!!
ఉర్వి ఫ్యాషనులన్నియు నొక్కచోట
చేరి స్త్రీరూపు దాల్చిన తీరుగాను
శోభనమునాడు గదిలోకి సుందరముగ
వచ్చెను 'సుగాత్రి' అచ్చర వచ్చినట్లు
కాని, ఆమె నతడు కనినంతనే పెడ
మోము బెట్టె, మూగనోము బట్టె!
అయిన దామె సొగసు అడవిలో వెన్నెల
కాచినట్లు - పూలు పూచినట్లు!!
ఏహ్యాభావ మతని ఎదనిండ వ్యాపించి
వలపు కుసుమములను నలిపివేయ,
తనలొ తానె యిట్లు తలపోయ సాగెను
పైకి చెప్పలేక బాధపడుచు!!
దేవతా వస్త్రముల గుర్తు దెచ్చురీతి
దేహమంతయు గనిపించు తీరుగాను
ఏల నైలాను చీర ధరించినావు
కట్టు కొనరాదొ ఓ నేత గళ్ళచీర?
సంపదను వెల్లడించెడి సాధనములె
గోల్డు నెక్లెసు, అరవంకె, గొలుసు లకట!
తాళి, నల్లబూసల కన్న ధరణిలోన
సుగుణవతియైన స్త్రీ కోరు నగలు కలవె?
ఫేసు పౌడరు, స్నోలను పూసుకొనగ
మొగము బూడిద గుమ్మడి పగిది నుండె!
ముఖమునకు సుంత పసుపును పులిమి, స్నాన
మాచరించిన నిగనిగ గోచరించు!!
తమలపాకులు చక్కగా నములరాదొ
ఏల 'లిప్‌స్టిక్కు' పూతువీ లీల నీవు?
మృదువుగా నుండి అందమౌ పెదవులకట
చర్మ వ్యాధుల పాలౌను సొరుచెడును!!
మూడురేలు గడిచిపోయె నిట్టులెగాని
వదలడాయె మౌనవ్రతమతండు!
అంతటను 'సుగాత్రి' చింతించినన్ తన భావి
జీవితమ్ము చిమ్మ చీకటనుచు!!
ఎంతకాలమిట్లు చింతించినా గాని
వెలుగురేఖ గాంచ గలుగలేక
మనసులోని బాధ మరచిపోవ 'సుగాత్రి'
స్త్రీల సంఘమందు చేరె తుదకు!!
సంఘకార్యక్రమాలకు సంతసమున
హాజరగుచుండెను 'సుగాత్రి' అనవరతము!
లీనమై ఆట పాటలలోన తాను
మరిచిపోయెను ఇసుమంత మదిని బాధ!!
వచ్చుచున్నది స్త్రీ సంఘ 'వార్షికోత్స
వమ్ము' - ఆనాటి కార్యక్రమమ్ములోన
స్త్రీలు ఓనాటకము ప్రదర్శింతు రందు
వేయును 'సుగాత్రి' ఓ పల్లె పిల్ల పాత్ర!!
అచ్చు పల్లెపిల్ల ఆకారమును దాల్చి
బాసలోన కొంత యాస జేర్చి
అద్దమెదుట నిలిచి ఒద్దికలొనరించ
సాగినది 'సుగాత్రి' శ్రద్ధగాను!!
అట్టియెడ అకస్మాత్తుగా నాతడటకు
వచ్చి, ఆమె వేషమునకు ముచ్చటపడి
గాఢముగ కౌగిలించి నిగూఢమైన
ప్రేమనొకసారిగా గ్రుమ్మరించినాడు!!



అలపర్తి వెంకట సుబ్బారావు,
నందివెలుగు, గుంటూరు
08644-241366

నానీలు

దేశమంతా ఘనంగా
హిరణ్యాక్ష జయంతి
అతడేగా
తొలి భూకబ్జాదారు.

అడవులన్నీ
జనస్వార్థానికి బలి
అందుకే! జనావాసాల్లోకి
పులి

రాయలసీమ
తెలంగాణం ఆంధ్రా
అందరికీ
అవే "అఆ"లు

'ముద్దు' రెండు హృదయాల
మధురఘోష
రెండు పెదాల
మౌనభాష

- జె.ఎల్.నరసింహం,
హైదరాబాద్. 94406 52042

తేనెల హరివిల్లు

అక్షరాలతీరు ఆణిముత్యపు పేరు
సొగసు సోయగాల సొంపుమీరు
కావ్యపఠన జేయ కమ్మదనపు రీతి
మధుర తెనుగు భాష మంజులంబు...!

తేనెతీపి కన్న తెలుగుభాష మిన్న
సామవేదగాన సారమిదియె
రమ్యచరిత భవ్య రమణీయ తెన్నునే
పఠన సల్ప ఎదలు పరవశించు...!

తేనెలహరివిల్లు తేటతెనుగుజల్లు
పాటనోటవిన్న పరవశమ్ము
పల్లవించుగాన పద్యరాగ సరణి
తెలుగుపఠిత గుండె తేలియాడు...!

తెలుగుభాషలోని జిలుగులాలిత్యమ్ము
వేరె భాషలందు వెదుకలేదు !
ఎన్నిభాషలున్న వెలుగుభాష తెలుగు
తెలుగుభాష రాక వెలుగులేదు...!

- గన్నోజు శ్రీనివాసాచారి,
మహబూబ్‌నగర్ 94901 45913

'తెలుగు వెలుగు' యజ్ఞంలో భాగంగా జన వ్యవహారంలోని ఆంగ్లశబ్దాలకు మంచి తెలుగు మాటలను సమకూర్చే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాషాభిమానులందరూ భాగస్వాములు కావాలన్నదే మా ఆకాంక్ష, విన్నపం.

సరైన తెలుగు సమానార్థకాలు లేక ఎన్నో ఆంగ్ల శబ్దాలను యథాతథంగా వాడాల్సిన దుస్థితి. దీన్ని సరిదిద్దడంలో మీ అందరి పాత్ర కీలకం. తరచూ ప్రసార సాధనాల్లో వస్తున్న పదాలను ఇక్కడ ఇస్తున్నాం. ఇవే కాదు... మీ దృష్టిలో ఉన్న ఇతర ఆంగ్ల పదాలకూ తెలుగు సమానార్థకాలను పంపవచ్చు.

మీ సౌకర్యం కోసం వాటికి నిఘంటు అర్థాలనూ జోడించాం. చక్కని ప్రత్యామ్నాయ తెలుగు పదాల్ని సూచించండి. పక్కన పద వివరణ కూడా రాస్తే ఎంపికకు తేలిగ్గా ఉంటుంది. ఒకప్పుడు వాడుకలో ఉండి ఇప్పుడు వినిపించని మంచి తెలుగు మాటలైనా కావచ్చు. తెలుగులో స్థిరపడిపోయిన అన్యదేశ్యాలైనా కావచ్చు. మీరు కసరత్తు చేసి సృష్టించిన కొత్త పదాలైనా కావచ్చు. ఏదైనా పదం వీనులవిందుగా ఉండాలి. తేలిగ్గా పలకగలగాలి. మూలశబ్దం స్ఫూర్తి ప్రతిఫలించాలి. మన నుడికారం వినిపించాలి. మక్కికి మక్కి అనువాదం కూడదు. కఠిన సంస్కృత శబ్దాలు సామాన్య జనంలోకి త్వరగా చొచ్చుకుపోలేవు. అందువల్ల తేటతెలుగు మాటలే పంపండి.

ఇతర ద్రావిడ భాషల్లోని సమానార్థకాలకు కొద్దిపాటి మార్పులతో తెలుగుదనాన్ని తేగలిగినా మంచి ప్రయత్నమే అవుతుంది. మీ పదాలను తెలుగు వెలుగు, రామోజీ ఫిల్మ్‌సిటీ, హైదరాబాద్- 501512 చిరునామాకు పంపవచ్చు. లేదా **teluguvelugu@eenadu.net**కు మెయిల్ చేయవచ్చు.

Agent (noun) a person who acts on behalf of another, in particular: a person who manages business, financial, or contractual matters for an actor, performer, writer, etc.. కర్త, ప్రతినిధి, కారకుడు

Alias (adv.) used to indicate that a named person is also known or more familiar under another specified name:., (n.) a false or assumed identity: మారుపేరు, ఉరఫ్, ప్రతినామం

all-rounder (n) a person who has a good variety of skills and abilities సర్వకళా పారంగతుడు, సర్వకళానిష్ణాతుడు

appeal (v.) make a serious, urgent, or heartfelt request:., (appeal to) try to persuade someone to do something by calling on (a particular principle or quality): (n.) a serious, urgent, or heartfelt request: అర్జీ, విజ్ఞప్తి, ప్రార్థన, పై అధికారికి నివేదన,

bid (v.) offer (a certain price) for something, especially at an auction: (n.) an offer of a price, especially at an auction: వేలంపాట, కొనేందుకు ఇవ్వజూపిన మొత్తం

builder (n.) a person who constructs something by putting parts or material together: a person whose job is to construct or repair houses. కట్టుందారు, భవన నిర్మాత, నిర్మించేవాడు

commentator (n.) a person who comments on events or on a text: a person who commentates on a sports match or other event వ్యాఖ్యాత, భాష్యకారుడు

claim (v.) state or assert that something is the case, typically without providing evidence or proof: హక్కుగా కోరు, అర్హత, వ్యాజ్యమాడు

content (adj.) in a state of peaceful happiness: willing to accept something; satisfied: (v.) satisfy (someone): .., accept as adequate despite wanting more or better: (n.) a state of satisfaction: భావం, విషయం, సంతుష్టి, సమ్మతం

committee (n.) a group of people appointed for a specific function by a larger group and typically consisting of members of that group: సమితి, సంఘం

current affairs events of political or social interest and importance happening in the world at the present time: వర్తమాన వ్యవహారాలు, ఇప్పటి విషయాలు,

Customer (n.) a person who buys goods or services from a shop or business:.., a person of a specified kind with whom one has to deal: వినియోగదారు, ఖాతాదారు

distribution (n.) the action of sharing something out among a number of recipients: the action or process of supplying goods to retailers: పంపకం, వ్యాప్తి, వితరణ, పంపిణీ

division (n.) the action of separating something into parts or the process of being separated: the distribution of something separated into parts: an instance of members of a legislative body separating into two groups to vote: విభాగం, శ్రేణి, విభజన, తరగతి, దళం, మండలం, భాగహారం

dress code (n.) a set of rules, specifying the required manner of dress at a school, office, club, restaurant, etc.: the customary style of dress of a specified group: వేషధారణ నియమాలు, ఆహార్య నియమాలు

driving licence (n.) a document permitting a person to drive a motor vehicle: చోదన అనుమతి

dubbing (n.) material used for the bodies of artificial fishing flies, అనుకరణ, ధ్వనుల్ని చేర్చడం

exchange (n.) an act of giving one thing and receiving another వినిమయం, బదులుగా ఇచ్చుట, మార్పు

exhibitor (n.) a person who displays works of art or other items of interest at an exhibition: ప్రదర్శకుడు

federation (n.) a group of states with a central government but independence in internal affairs: an organization or group within which smaller divisions have some degree of internal autonomy: సమాఖ్య, సంయుక్త రాజ్యం

grade (n.) a particular level of rank, quality, proficiency, or value: a level in a salary or employment structure: verb [with object] arrange in or allocate to grades; classify or sort: reduce (a road) to an easy gradient. వర్గీకరణం, శ్రేణీకరణ

gazette (n.) a journal or newspaper, especially the official one of an organization or institution: .., publish the appointment of (someone) to a military or other official post: ప్రభుత్వపత్రిక, ప్రచురించు/ ప్రకటించు

grand total (n.) the final amount after everything is added up; the sum of other totals: సంపూర్ణ మొత్తం

hangover (n.) a severe headache or other after-effects caused by drinking an excess of alcohol..., మగత, అతిగా మత్తులో వేలాడే స్థితి, దిమ్ము

helper (n.) a person who helps someone else: సహాయకుడు, తోడ్పడువాడు.

highway (n.) a main road, especially one connecting major towns or cities: a public road:.., రాజమార్గం, రహదారి, ఉన్నతపథం

infection (n.) the process of infecting or the state of being infected: an infectious disease: Computing the presence of a virus in, or its introduction into, a computer system. అంటువ్యాధి, అంటు రోగం, సంక్రమణ, క్రిమిదోషం

informer (n.) a person who informs on another person to the police or other authority. సమాచార సూచకుడు, ఆచూకీదారు

installation (n.) the action of installing someone or something, or the state of being installed:.., an art exhibit constructed within a gallery: ప్రతిష్ఠాపన, నియామకం, పట్టాభిషేకం, రాజ్యాభిషేకం

integrate adj. (of an institution, body, etc.) desegregated, especially racially: with various parts or aspects linked or coordinated: ఏకీకృత, జోడించు, కలుపు, పూర్ణం చేయు

judicial by, or appropriate to a law court or judge; relating to the administration of justice: న్యాయం

leadership (n.) the action of leading a group of people or an organization, or the ability to do this: the state or position of being a leader: the leaders of an organization, country, etc.: నేతృత్వం, నాయకత్వం

lockout (n.) the exclusion of employees by their employer from their place of work until certain terms are agreed to: మూసివేత

magistrate (n.) a civil officer who administers the law, especially one who conducts a court that deals with minor offences and holds preliminary hearings for more serious ones. న్యాయాధిపతి

notification (n.) the action of notifying someone or something: తెలియజేయుట, ప్రకటన, అధిసూచన

obstructive (adj.) causing a blockage or obstruction: ఆటంక పరచు

penthouse (n.) a flat on the top floor of a tall building, typically one that is luxuriously fitted. archaic an outhouse or shelter with a sloping roof, built on to the side of a building. అపార్ట్‌మెంట్‌పై ఉండే లిఫ్ట్ గది, ఇంటికి చేర్చి కట్టిన శాల

popular (adj.) liked or admired by many people or by a particular person or group: సామాన్య జనుల, సాధారణ ప్రజల చేత ఆదరణ పొందిన.

politburo (n.) the principal policymaking committee of a communist party. the principal policymaking committee in the former Soviet Union, founded in 1917. కమ్యూనిస్టు ప్రభుత్వంలో అతికీలక నిర్ణయాత్మక కమిటీ

procurement (n.) the action of obtaining or procuring something: the action or occupation of acquiring military equipment and supplies: సంపాదన/ సంగ్రహణం / సేకరణ

rank : row శ్రేణి, వరుస

ranking (n.)a position in a scale of achievement or status:., a classification గణన,

ration card / ration book (n.) an official document entitling the holder to a ration of food, clothes, or other goods. చౌకధరల దుకాణంలో సరకు కొనుగోలు చేసేందుకు వ్యక్తులకు అర్హతనిచ్చే పత్రం

seasonal (adj). relating to or characteristic of a particular season of the year: fluctuating or restricted according to the season or time of year: సమయానుగుణ, రుతు సంబంధి, కాలిక

supervisor (n.) a person who supervises a person or an activity.., a person who directs and oversees the work of a postgraduate research student. పై విచారణ చేయువాడు, పాఠశాలలో పర్యవేక్షణ చేస్తూ ఒక ప్రత్యేక విషయాలలో ఉపాధ్యాయులకు సహకరించేవాడు, తనిఖీదారు

surveyor (n.) a person who examines the condition of land and buildings professionally. పై విచారణ చేయువాడు, భూమి కొలతలు వేయువాడు

trailer (n.) a series of selected shots from the film for the purpose of advertising it. సినిమా ప్రచారం కోసం సినిమాలోని వేర్వేరు ముఖ్య సన్నివేశాలను తక్కువ నిడివితో పేర్చి చేసే దృశ్యమాల

union (n.) the action of joining together or the fact of being joined together, especially in a political context:., the operation of forming such a set.., or silk. ఒకటి అగుట, సంయోగం, ఏకీభావం, ఐకమత్యం, సంయోగం, సంగమం, సంఘం

voice-over (n.) a piece of narration in a film or broadcast, not accompanied by an image of the speaker: సినిమా/ టెలివిజన్ కార్యక్రమంలో తెరపై మాట్లాడే వ్యక్తి కనిపించకుండా నేపథ్యం నుంచి వినిపించే వ్యాఖ్యానం

waiting list (n.) a list of people waiting for something, such as housing or admission to a hospital or school. ప్రతీక్షసూచి, ప్రతీక పట్టిక ఆరోహణ కోసం ఉద్యోగ నియామకం కోసం నివాస వసతి కోసం ఒక పాఠశాలలో చేరుట కోసం, అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉండే వ్యక్తులు పట్టిక, సూచీ

warm up prepare for physical exertion or a performance by exercising or practising gently beforehand: .., become livelier or more animated: కసరత్తు చేసేముందు, ఆటలాడే ముందు శరీరాన్ని శ్రమకు అలవాటు పడేట్టుగా చేసే చిరువ్యాయామం

wholesale (n.) the selling of goods in large quantities to be retailed by others: సరకులు పెద్దమొత్తంగా అమ్ము బేరం, టోకు వ్యాపారం.

తులాభారం

కారుణ్య హత్యలపై సమీక్ష 'మరణకాంక్ష'



అల్పమైన కారణాలతో జీవితంపై విరక్తిని పెంచుకుంటారు కొందరు. అకానీ జీవించి ఉండటమే ఒక సమస్య అయితే! మాయదారి రోగం ఏదో మృత్యువుతో దోబూచులాడుతుంటే... అటువంటివారి జీవన్మరణ పోరాటాన్ని చిత్రీకరించారు రచయిత సలీం 'మరణకాంక్ష' నవలలో.

కారుణ్యహత్యల భూమికగా సాగుతుంది ఈ నవల. సిద్దార్థ ఒక వైద్యుడు. వైద్యశాస్త్రంలో ఉపశమనం లభించని రోగులు, అనుక్షణం నరకాన్ని అనుభవిస్తే చూడలేనివాడు. అందుకే చట్టవిరుద్ధమని తెలిసినా వారికి మరణాన్ని ప్రసాదించి, కారుణ్యహత్యలకు పాల్పడుతూ ఉంటాడు. అక్షర ఒక న్యాయవాది, బాల్యంలోనే కండరాల వ్యాధివల్ల (మస్కులార్ డిస్ట్రోఫీ) తన శరీరం చచ్చుబడిపోయినా, జీవితం పట్ల ఆశ చావని మనిషి. చంటిపాపలాంటి ఆమె శారీరక అవసరాలని తీరుస్తూ, ఆమెలో జీవితం పట్ల ఆశని రగిలిస్తారు అక్షర తల్లిదండ్రులు. వారి ప్రోత్సాహంతో గొప్ప న్యాయవాది కావాలన్నది అక్షర ఆకాంక్ష. అక్షరకు ఉన్న వ్యాధి కలిగిన మరికొన్ని పాత్రలతో ఈ నవల సాగుతుంది. ఆ వ్యాధి వల్ల తను కోరుకున్నది ఏదీ సాధించలేక చావు కోసం పరితపించే ప్రసాద్. జీవించి ఉన్న కొద్ది క్షణాలూ పువ్వులా పరిమళించాలని ఆశపడే రాగిణి (జీవితం దేవుడిచ్చిన వరమైతే, నవ్వు దాన్ని పండించుకునే దివ్యమంత్రం - పే.146). వారిద్దరి మధ్యా ప్రణయంతో కథ నడుస్తుంది. 'ఈ ప్రపంచంలో నిరర్థకమైన జీవితాలు ఏవీ ఉండవు' (పే.60) అని ఒక పాత్ర ద్వారా చెప్పించిన రచయిత, అదే జరిగిన రోజున కారుణ్య హత్య సబబా కాదా అన్న వాదనకు తెరతీస్తాడు. చివర్లో నవలలోని పాత్రలన్నీ న్యాయస్థానం సాక్షిగా, ఆ వాదన పట్ల తమ అభిప్రాయాలని వినిపిస్తాయి. ఒక క్లిష్టమైన సమస్యను పాత్రోచితంగా చిత్రీకరిస్తూనే, దానికి లోతైన అధ్యయనాలనీ, అవగాహననీ జోడించారు రచయిత. మనసును కదిలించే కథ, మదిలో నిలిచిపోయే పాత్రలు, అదే - మరణకాంక్ష.

– లీలాశర్మ

రచయిత: [illegible] **రూ.30** **పుటలు: 240** **ప్రతులకు:** [illegible]
408 [illegible]

కొప్పరపు కవుల గొప్పతనానికి నిలువుటద్దం

తెలుగు సాహిత్య చరిత్రలో కొప్పరపు సోదరకవులు సదా గుర్తుంచుకోతగ్గ అవధానులు. వారి ఆశు పద్య కవితాధార గంటకు ఎనిమిది వందల పద్యాల రికార్డుస్థాయి పొందింది. జీవనప్రభ, ప్రతిభాప్రభ, ఆశుకవితాప్రభ, అవధానప్రభ, శాస్త్రప్రభ, కావ్యప్రభ, కీర్తిప్రభ అనే విభాగాలున్న ఈ గ్రంథంలో కొప్పరపు సోదర కవుల విశిష్టతను ప్రముఖ సాహితీవేత్తలు వివిధ కోణాల్లో విశ్లేషించారు. కొప్పరపు వేంకటసుబ్బరాయకవి, కొప్పరపు వేంకటరమణకవి- వీరు సోదరకవులు. వారు కొన్ని సందర్భాలలో పద్యాల్లోనే మాట్లాడుకొనేవారట. సంస్థాన సభావేదికలు వీరి అవధాన సరస్వతికి వేదికలయ్యాయి. 150పైగా సభల్లో పాల్గొన్నారు. మూడు లక్షల వరకు పద్యాలు చెప్పిన వీరి ప్రతిభ ఈ తరం గుర్తుంచుకొని స్మరించడానికి ఈ గ్రంథం ప్రేరణ అవుతుంది.

"అరరేయంచు వహవ్వరేయనుచు వహ్వాయంచునున్‌మెచ్చుచున్
కరతాళధ్వనులన్ ఘటించుచు మహానందంబునున్ జెందుచున్

[illegible]
150 [illegible]
116 [illegible]

సరసత్వంబును జూపు వాయసపురీ సభ్యాళిమెప్పించు కొ
ప్పరపున్ సోదర సత్కవీశ్వరులదే భాగ్యంబు భాగ్యంబనన్!"

వంటి ప్రశంసలు ఆ కవులు పొందారు. అవధానాలు, ఆశుకవిత్వాలు మాత్రమే కాదు, సీతాకల్యాణం, భీష్మజననం వంటి ఆశు కావ్యాలు సైతం రాసిన ఉద్దండులు వారు. 1905-1927 సంవత్సరాల మధ్య వారు ఆంధ్రదేశాన్ని ఒక ఊపు ఊపారు. తిరుపతి వేంకటకవులు వీరిని ఆహ్వానిస్తూ-

'బందరువచ్చి యిచ్చటి సభాసదులన్ దనియించి వారిచే
చందనమో సుమంబొ మఱి శక్తికి మించనిదేనిగాని మీ
రంది కృతార్థులన్ సలుపుడయ్య మమున్ మిము జూచుకోర్కె మా
డెందములందు మిక్కిలి కడిందిగ సందడి చేసెడిన్ జుడీ!'

పద్యం రాస్తే కొప్పరపు కవులు

'ఒరులన్ మెచ్చినచో తన
పరువు చెడునటంచు నెంచు పద్ధతి నీర్ష్యా
కరమగు నీ కలివేళన్
పరమామోద మిదె మీ స్వభావంబు భళీ!'

అని రాశారు.

కొప్పరపు కవుల ప్రతిభకు నిలువుటద్దం వంటిదైంది ఈగ్రంథం. – 'వెన్నెల'

నవరసాల సయ్యాట!



ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న అనేకానేక సామాజిక సమస్యల్ని, ఆధునిక సమాజంలోని వికృత మానసిక పోకడల్ని స్పృశిస్తూ సాగిన హాస్యభరిత నవల ఇది. ఆకట్టుకునే రచనా శైలి, కడుపుబ్బా నవ్వించే సంభాషణ ప్రయోగాలు ఆపకుండా చదివిస్తాయి. నేర ప్రపంచం, మీడియాలో పెడపోకడలు, ఆధ్యాత్మిక ముసుగులో మహిళల్ని లోబరుచుకునే స్వామీజీలు, అనుమానపు భార్యలు, బయటి రుచులకోసం అర్రులు చాచే మగాళ్లు... ఒకరేమిటి, ఒకటేమిటి రచయిత పి.వి.సునీల్‌కుమార్ కలం బారిన పడని వారు కానీ, సామాజిక అంశం కానీ ఈ నవలలో లేదు. సునీల్ కుమార్ వృత్తి రీత్యా పోలీసు అధికారి. అందువల్లేనేమో కొన్ని సంచలన నేర సంఘటనలకు సంబంధించి అతి కొద్ది మందికి మాత్రమే తెలిసిన అంశాలను ఉపయోగించుకుంటూ రక్తి కట్టించారు. ఈ నవల చదివాక కొన్ని సంఘటనలు ఠక్కున పాఠకులకు స్ఫురిస్తాయి. వాటిలోని నిజాలూ బోధపడతాయి. "ప్రపంచంలో గొప్పగొప్పవన్నీ ఎత్తుగానే ఉంటాయి, ఓ మనిషి తను సంతోషంగా ఉండకుండా చెయ్యాలంటే ఆమెను చూసి ఓ డిక్షనరీనే రాయొచ్చు, తోటరాముడు వాడికి పనికొచ్చే వరకే కమ్యూనిస్టు, యువరాణితో పెళ్లయ్యాక వాడు రాజే అవుతాడు కానీ రాజ్యంలో పేదలకి ఆస్తినంతా పంచెయ్యడు"... ఇలా అడుగడుగునా బోలెడన్ని చెణుకులు, చమక్కులు!

[illegible]

కథనశైలి వల్ల పాత్రలన్నీ కళ్లముందే తిరుగుతూ ఉత్కంఠభరిత సినిమా చూస్తున్న భావన కలిగిస్తాయి. సున్నిత ప్రేమభావనలు, కదిలించే కుటుంబ సంబంధాలు, మొత్తంగా నవరసాల్నీ కూర్చిన నవల ఇది. మంచి రచనల్ని, హాస్యాన్ని ఇష్టపడే ప్రతి వారూ తప్పకుండా చదవాల్సిన రచన.

– నిశాంత్

కొత్త అల్లికల 'గిజిగాడు'

గాలికి దొర్లే ఆకులు కవి దృష్టిలో పడితే ఏమయ్యాయి? - "పండి, నేలరాలి, ఉండచుట్టుకుపోయిన ఆకులు/ కృతజ్ఞతాపూర్వకంగా/ భూమికి పొర్లుదండాలు పెడుతూ/ ఊరకనే దొర్లుకుంటూ పోతున్నాయి! (పద్యముఖి). 'చిక్కుబడ్డ దారపు ఉండలాంటి జీవితంలో/ కవిత్వపు కొసను/ వెతికి పట్టుకోవడం 'ఎలా' అనేది తెలిసిన కవిశిఖామణి. ఇప్పటికే ఏడు కవితా సంపుటాలు రాసిన శిఖామణి మరొక కవితా సంపుటం ఈ గిజిగాడు. వచనానికి వచన కవిత్వానికి మధ్య హద్దులు తెలిసిన కవి శిఖామణి- దేశీయత, సామాజిక దృష్టి, సౌందర్యదృష్టి, సమరశీల నేపథ్యాలు వంటి అంశాల అవగాహన కలిగినట్లు ఇందులో కవితలు తెలుపుతాయి. 'తెల్లవార్లూ/ నదిమృదంగాన్ని వానవేళ్లు/ అదే పనిగా వాయించినట్లు' - (వాచవి). 'మనసులో మొలిచిన మొక్కకు/ కుండీతో ఏం పని?' - (కొత్తింట్లో) 'చిన్నపాటి తలనొప్పికే చాంతాడంత చీటీలు రాసే కాలం' - (తాటాకు గదుల

[illegible]

పెట్టె). 'మండే ఎండాకాలం వచ్చిందంటే గుండెలో బోర్లు వేసినంత గుబులు/ బకెట్ నీళ్లకోసం భగీరథ తపస్సు చేయవలసిందే' - (కొత్తింట్లో). ఇటువంటి ఆలోచనా పూరిత వాక్యాలు ఎన్నో.. ఈ కవిత్వపు 'గూడు'లో ఉన్నాయి. కేంద్రీకృతభావాన్ని ఆలోచనా విస్ఫోటనలతో, హృదయాలకు దగ్గరగా, మృదువుగా కొత్తగా అందివ్వడం గిజిగాడులో చూస్తాం.

– 'శతకీర్తి'

ఆస్వాదించదగిన కవితా సంకలనం

నిక్కచ్చిగా చెప్పేస్తే నగ్న సత్యాలు... నిత్యాలవుతాయి. వాటికే భావుకత దుస్తులు తొడిగి సాహిత్య రంగస్థలంపై నిలబెడితే... గొప్ప కవితలవుతాయి. యాంత్రిక జీవితాన్నుంచి వైదొలగి ఒక్కసారి పరిసరాలు పరికిస్తే వ్యథననుభవిస్తున్న ఎన్నో జీవితాలు నిశ్శబ్దంగా గమ్యాలకేసి దొర్లిపోతూ కనిపిస్తాయి. ఆర్ద్రత నిండిన గుండెలో కలం ముంచి విశ్వ మానవ భాషలో కవితలల్లడం కవికి మాత్రమే చేతనైన మేలు మార్గం. ఆ క్రమంలో తన కలం ఒడిసిపట్టిన దృష్టి కోణాన్ని పాఠకులూ అందుకుని అనుభూతి చెందేలా ఎన్నో హృద్యమైన కవితలు రాశారు...కవి టి.హెచ్.నటరాజా రావ్. 40 సంవత్సరాల వ్యవధిలో ఈ కవి కలం నుంచి వెలువడిన భావోద్వేగ కవితల సంకలనమే...'మట్టి వాసన'. నిశిత పరిశీలనాదృష్టితో సామాన్యుల జీవన విధానాల్ని లోతుగా అధ్యయనం చేసిన దాఖలాలు ఈ పుస్తకంలోని ప్రతి కవితలో కనిపిస్తాయి. కవిత్వ భాష ఏ ప్రాంత మాండలికమైనా మనసులోకి సూటిగా చొచ్చుకుపోయేటంత పదునుగా ఉంటే చాలనిపించేలా పాత్రోచిత భాషగా కవి వినియోగించిన వైనం కూడా మట్టి వాసన కవితా సంకలనంలో కనిపిస్తుంది.'సంగటి ముద్దగానో చింత చారుగానో పిల్లల కంచాల్లోకి తనను తాను మొత్తంగా ఒంపేసుకునేది' అంటూ అమ్మను, ఆమె అమూల్యమైన మాతృ ప్రేమను వచనాల్లో ఒలికించారు కవి. మట్టి వాసన కవితలన్నీ తేలికైన పదాలతో

[illegible]

మనసుకు మచ్చికవుతాయి. ఇది రసజ్ఞులందరూ ఆస్వాదించదగిన కవితా సంకలనం.

– వి. రఘు

కొండ అద్దమందు...

ఉన్నిముష్వల కాగడా!



ఏది జరిగినా మంచివాళ్లు మామూలుగా ఉంటారు. పిచ్చివాళ్లు కవిత్వం రాస్తారు. అంటారు కవయిత్రి ఓ చమత్కారాన్ని ఉటంకిస్తూ. ఇదక్షరాలా నిజం. పిచ్చిస్థాయి ఇష్టంలో ఉండటాన్నే 'లీనమవటం' అంటారు. లీనమైతే గానీ ఏరంగంలోనైనా ఉచ్ఛస్థాయికి చేరుకోలేం. 'ఉన్నిముష్వలకాగడా' కూడా అట్లాంటిదే. సాహిత్యం మనిషిని సున్నితంగా మారుస్తుంది. కవిత్వం మరీ సున్నితంగా చేస్తుంది. అట్లాంటి ఓ సున్నిత మనస్కురాలయిన శ్రీరంగనాయకి మనోరాగమాలిక ఈ కవిత్వం. వస్తు వైవిధ్యం చూపడంలో కూడా కొత్తదనం చూపారు. అమ్మప్రేమని, స్త్రీ సమస్యని ఏక కాలంలో

రచయిత యశశ్రీ రంగనాయకి రూ 50 పుటలు 76
ప్రతులకు విశాలాంధ్ర బుక్‌హౌస్ హైదరాబాద్

చూపగలిగిన కవితలు, లాలిత్యాన్ని కన్నీటిని కలిపి కవిత్వంగా మలిచారు. ప్రతి పేజీలోనూ స్త్రీల సమస్యల్లోంచి రాలిన కన్నీటి తడి తగులుతుంది. 'పోరా... నువ్వెప్పుడూ అంతే' వంటి మామూలు వాడుక మాటనీ, సున్నిత భావాలను కవిత్వంగా మలచడంలో కవయిత్రి ఓ ప్రత్యేకత చూపించారు.

– మున్నీ

సంగీత సాహిత్యాల పొందికైన సాంగత్యం

సరస్వతికి సంగీత సాహిత్యాలు హృదయాలంకారాలు అంటూ ఉంటాం. సంగీతం ప్రేరేపించిన సాహిత్యం ఇది. రచయిత సంగీతాభిరుచి ఈ పుస్తకానికి ఆయువుపట్టు. వీటిలో చాలా కవితలు రచయిత అభిమానించే పాటల ప్రేరణతో రాసినవి. అందుకే ఈ సంపుటికి 'అంతర్లయ' అన్న పేరు సార్థకం అయింది. పాటల ప్రేరణతో రాసినవే కాదు, దాదాపు ప్రతి కవిత వెనుక కనపడీ కనపడని సంగీతం ఉంటుంది. పరిమళమేఘం కవితలో 'ఆ గంధర్వ గానామృత లేపనంతో గుండె గాయాలు మాయమై/ పల్లవించదా పారవశ్యం' అంటారు. 'వీణ తీగల మీద విరబూసింది/ స్వరతేజఃపుంజం/ వైణికుని కరస్పర్శకు కంపించి' లాంటి పంక్తులను దాటుకు వచ్చాక ఆయన సంగీతాభిమానం

కవి ఎలనాగ, పుటలు 184 వెల:రూ 90 ప్రతులకు పాలపిట్ట బుక్స్,
403 విజయసాయి రెసిడెన్సీ సలీంనగర్ మలక్‌పేట హైదరాబాద్

మనకూ కాస్తోకూస్తో అంటుతుంది. సంగీత నేపథ్యం లేనవి, మరెన్నో సందేశాత్మక, ప్రయోజనాత్మక కవితలు ఇందులో ఉన్నాయి.

– గణేష్ బెహరా

హృద్య పద్య సుందరకాండ

రామాయణంలో వజ్రమంత్రం లాంటిది సుందరకాండ. వాల్మీకి సంస్కృతంలో సుమారు రెండువేల శ్లోకాలు, అరవై ఎనిమిది సర్గలతో విరచించిన సుందరకాండను తెలుగులో 421 వృత్త పద్యాలతో రాశారు కంభంమెట్టు గోపాలకృష్ణ. ప్రతి పద్యాన్ని హృద్యంగా రచిస్తూ....

రచయిత కంభంమెట్టు గోపాలకృష్ణ పుటలు 127 వెల అమూల్యం
ప్రతులకు కంభంమెట్టు [illegible] శ్రీ 1-9-297/ఎస్ 304 [illegible]
[illegible] అపార్ట్‌మెంట్స్, [illegible] విద్యానగర్ హైదరాబాద్

"పుత్తడి రంగుతో మెరసి పోలుచు రెక్కల పర్వతంబులన్
కుత్తుక కోసి వైరులను కూల్చుచు గాంచెడి వైనతేయుగా
తత్తర లేక నంబుదము తాకుచు నేగెడి మారుతాత్మజున్
నెత్తిన కెత్తు చందమున నింగిని నిల్పిరి వాయు సూర్యులున్"

(10) అని హనుమంతుని సముద్ర లంఘనాన్ని వర్ణించారు.

పదప్రయోగాలు, సామెతలు, ధారాశుద్ధి, భావశుద్ధి, వర్ణనలను, ప్రస్ఫుటింపజేసిన రచన, హనుమంతుని లీలా వైభవాన్ని ఆవిష్కరించే అద్భుత ఆధ్యాత్మిక గ్రంథం. పావని (సీత, హనుమ) భక్తులకు ఆసక్తి కలిగిస్తుంది.

– అక్షరదీక్షిత

మానవతా పరిమళం

సాహిత్యానికి సందేశం తోడైతే బంగారానికి పరిమళం అద్దినట్లవుతుంది. మానవతా పరిమళాన్నద్దుతూ ఇరవైమూడు కథలను 'పరిమళం' సంపుటిగా వెలువరించారు కోపూరి పుష్పాదేవి. కథా రచనలో ఎత్తుగడ, నడక, ముగింపు ఆకర్షించేలా మలిచారు. పుష్పాదేవి ప్రకృతిలో మమేకమై 'అప్పటిదాకా అవనికి అదురు పుట్టించిన ఆదిత్య కిరణాలను తరిమికొడుతూ మేఘమాలికలు పరుగు పరుగున వచ్చాయి. చల్లని గాలిని తోడు తెచ్చుకొని జగతికి ఆహ్లాదాన్ని పంచాయి. ఆ తాత్కాలిక విజయానికి మురిసిపోతూ అవి ఆనంద భాష్పాలు జాలువార్చాయి (సాలోచన కథ), జోరున వాన కురిసి వెలిసింది. అభ్యంగన స్నానమాడి వచ్చిన అతివలా అందంగా ఉంది ప్రకృతి (ఇప్పటి న్యాయం కథ), అప్పుడే తెల్లవారబోతోంది. తల్లి కొంగుచాటు నుంచీ దోబూచులాడే అల్లరి పిల్లవాడిలాగా సూర్యుడు మబ్బుల వెనుక నుంచీ తొంగిచూస్తున్నాడు' (కావలసిన వారు కథ) లాంటి వర్ణనలతో పాఠకుణ్ని అక్షర ముగ్ధుణ్ణి చేస్తారు.

– జోగేశ్వర్

రచయిత్రి కోపూరి పుష్పాదేవి పుటలు 152 వెల రూ 80, ప్రతులకు
[illegible] విజయవాడ

భద్రయ్య పంపకం



భద్రయ్యకు ముగ్గురు కొడుకులు, వారిలో విభేదాలు రాకుండా, తన ఆస్తిని ఎలా పంచాడు అన్న కథాంశమే 'భద్రయ్య పంపకం'. ఇటువంటివే ఇరవై కథలు ఉన్న సంపుటి ఇది. పిసినారికి ఇచ్చిన అప్పు వసూలు చేసుకోవడంలో యుక్తినీ (అప్పు వసూలు), విద్యకి పరమార్థం ఉద్యోగం కాదు, విచక్షణ అన్న సూక్తినీ (ఏది గొప్ప?) తెలియజేసిన కథలూ ఉన్నాయి. నిజమైన వైద్యునికి ఉండాల్సిన లక్షణాలు (వైద్యుడు), వ్యాపారంలో సమయస్ఫూర్తి చూపించాల్సిన అవసరం (వ్యాపార లక్షణం) ఇందులో తెలియజేశారు. స్నేహం, విరోధం, తెలివి, ఉపాయం.. వంటి లక్షణాలతో సాగినా, ప్రతి కథా ఒక నీతితో ముగిసింది. రచయిత పని చేస్తున్న తపాలా శాఖ గురించిన కథలు కూడా ఇందులో ఉన్నాయి.. **– లీలా శర్మ**

రచయిత : నారంశెట్టి ఉమామహేశ్వరరావు,
వెల: రూ. 30, పుటలు : 40, ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్

అవును నిజమే

మనుషుల్లో, మానవ అనుబంధాల్లో మంచి కోణాల్ని కథలుగా మలిచి 'మనుషులంతా ఇలా ఉంటే ఎంత బాగుండు? అనిపించే కథల సంకలనమే...'అవును నిజమే!' రచయిత కలం కవ్వంతో మనస్తత్వాల్ని, వివిధ సందర్భాల్లో మనుషుల స్పందనల్ని చిలికి తీసిన

రచయిత: డి. రామచంద్ర రాజు, వెల: రూ. 100 పుటలు: 112, ప్రతులకు: డి. సుజాత, డోర్ నెంబరు - 4/379-2, వివేకానంద నగర్, కడప.

విశ్లేషణాత్మక కథల వెన్నముద్దల్లా ఈ సంపుటిలోని కథలన్నీ మనసుల్లోకి ఇంకి ఆలోచనా బలాన్నిస్తాయి. రచయిత సామాజిక దృష్టి, సమస్యలపై స్పందనకు నిదర్శనంగా నిలిచే కథల నేపథ్యాలు, పాత్రల్లో ఉట్టిపడే వాస్తవికత, ఆసక్తికరమైన భాష, చదివించే శైలి పాఠకులచేత...'అవును నిజమే!' అనిపిస్తాయి. ఈ నవలలో ఇచ్చిన కథల్లోని వైవిధ్యమూ చదువరుల్ని ఆకట్టుకునేలా ఉంది.

– ప్రవల్లిక

కొత్త పొత్తాలు

విభిన్న భూమికలు
(పాంటమ్ కవిత్వం)
రచయిత: బొల్లిముంత వెంకటరమణరావు
వెల: రూ. 65, పుటలు: 72,
ప్రతులకు: అన్నీ ప్రముఖ పుస్తకశాలల్లో



అడుగు జాడలు
రచయిత: డి. శ్రీనివాస దీక్షితులు
వెల: రూ. 25, పుటలు: 52,
విశాలాంధ్ర ప్రచురణ సంస్థ
విజ్ఞాన భవన్, 4-1-435,
బ్యాంకు వీధి, హైదరాబాద్.



పూల రేకులపై ప్రేమ లేఖలు
రచయిత పేరు: యక్కలూరి వై శ్రీరాములు
వెల: 100, పుటలు: 128,
కౌండిన్య ప్రచురణ సంస్థ
15/140, పీ అండ్ టీ కాలనీ,
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్.



రామాయణం (సంక్షిప్త వాల్మీకం)
రచయిత: వెన్నెలకంటి ప్రకాశం, రాజ్యలక్ష్మి
వెల: 70, పుటలు: 144,
సాహితి ప్రచురణలు
29-13-53, కాళేశ్వరరావు రోడ్డు,
సూర్యారావుపేట, విజయవాడ-2

స్త్రీ అక్షరాలు శిలాక్షరాలు
రచయిత: డా॥ దేవరాజు మహారాజు
వెల: 150, పుటలు: 150,
ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో



మూకపంచశతీ (తాత్పర్య సహిత)
రచయిత: వారణాసి వెంకటేశ్వర్లు,
వెల: రూ. 90, పుటలు:216
ప్రతులకు: టాగూరు పబ్లిషింగ్ హౌస్, షాప్-20,
వైశ్యా హాస్టల్ బిల్డింగ్, కాచిగూడ చౌరస్తా,
హైదరాబాద్-27

కళ్లుకావాలా? కళ్లజోడు కావాలా?

> ఇంగ్లిషు నేర్చుకోవద్దని, మాట్లాడవద్దని ఎవ్వరూ అనరు. కాని, భార్య మోజులో పడి, కన్న తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయతగునా? పరభాషా వ్యామోహంలో స్వభాషను అలక్ష్యం చేయడం ఆత్మద్రోహం కాదా? అందువల్లనే మహాత్మాగాంధీ 'మాతృదేశాన్ని, మాతృమూర్తిని, మాతృభాషను నిర్లక్ష్యం చేయడం ఆత్మద్రోహ'మని వాక్రుచ్చారు.

పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు
గ్రంథాలయపరిషత్తు అధ్యక్షులు

ఎవరి భాష, ఎవరి సంస్కృతి వారికి గొప్పవే. అలాగే తెలుగు భాష ప్రాచ్య ఖండపు భాషల్లో 'లెస్స' అని చాలా మంది దేశవిదేశీయులన్నారు. అసలు దేశ భాషలందు తెలుగు లెస్స అని మొట్టమొదట అన్నదెవరు? శ్రీకృష్ణదేవరాయలా? కాదు. శ్రీనాథుడా? కాదు. మరి, ఎవరు? వినుకొండ దుర్గాధీశుడు వల్లభరాయుడు. ఆయన తన 'క్రీడాభిరామం'లో ...

జనని సంస్కృతంబు సకల భాషలకును
దేశ భాషలందు తెలుగులెస్స
జగతి తల్లికంటే సౌభాగ్యసంపద
మెచ్చుటాడు బిడ్డమేలుగాదె!

అన్నాడు. అన్నట్టు 'క్రీడాభిరామం' తెలుగులో తొలి నాటకమని ఒక వాదం ఉంది.

అయితే, తెలుగుకు సంస్కృతం తల్లి వంటి భాషే కాని, తల్లిభాష కాదని భాషాపరిశోధకులైన బిషప్ కాల్డ్‌వెల్, రాస్మస్‌రాస్క్, విలియం ఫ్రాన్సిస్ తేల్చి చెప్పారు. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం భాషలు 'ప్రోటో ద్రవిడియన్' భాషలని వారు తేల్చి చెప్పారు.

అది అలా ఉంచితే 1429లో భారతదేశాన్ని సందర్శించిన నికోలో-డి-కోంటి అనే ఇటాలియన్ యాత్రికుడు దేశంలోని ప్రధాన భాషలైన హిందీ, బెంగాలీ, మరాఠీ, తమిళం మొదలైన భాషలన్నీ పరిశీలించి, పరిశోధించాడు. నాటి విజయనగర సామ్రాజ్యాన్ని దర్శించాడు. అక్కడ తెలుగు భాషను గురించి అధ్యయనం చేశాడు.

తెలుగుకు పదాల ఉచ్చారణ సౌలభ్యం, శబ్ద మాధుర్యం, భావ విస్తృతి సౌకర్యం ఉన్నాయి. మా ఇటాలియన్ భాషవలెనే తెలుగు కూడా అజంతమైన భాష. అందువల్ల, తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అనవచ్చు అని కోంటి పేర్కొన్నాడు.

ఆయనే కాదు తమిళ మహాకవి సుబ్రహ్మణ్యభారతి తెలుగును 'సుందర తెలుంగు' అని కీర్తించాడు. సరే! వినుకొండ దుర్గాధీశుడు, శ్రీనాథుడు, శ్రీకృష్ణదేవరాయలు తెలుగువారే కాబట్టి, వారు తమ మాతృభాషను కీర్తించవచ్చు. నికోలో-డి-కోంటి ఎప్పుడో 15వ శతాబ్దివాడు అయినా తెలుగు తీయదనాన్ని చవిచూసి ఆ మాటలు అన్నాడు.

ప్రొఫెసర్ జె.బి.ఎస్. హాల్డేన్ బ్రిటిష్ జీవ శాస్త్రవేత్త. ఆయన ఇంగ్లండ్ నుంచి వచ్చి భారతదేశంలో స్థిరపడ్డాడు. దేశంలోని భాషల మూలాలను అధ్యయనం చేశాడు. 'భారతదేశంలోని భాషలన్నింటిలో దేశానికి అధికార భాష కాదగిన అర్హత, పదాల పొందిక, ఉచ్చారణ సౌలభ్యం, భావ విస్తృతి సౌకర్యం గల తెలుగు భాషకే ఉన్నది. అందువల్ల, తెలుగును భారతదేశానికి అధికార భాష చేయాలి' అని 20వ శతాబ్ది ప్రథమభాగంలోనే అన్నాడు హాల్డేన్.

కాగా, 2003 మే నెలలో తమిళభాషకు చెందిన ప్రముఖులు తమ తమిళభాషను దేశ స్థాయిలో అధికార భాష చేయాలని ఉద్యమం ప్రారంభించగా... నేను కూడా వెంటనే తెలుగుకు దేశానికి అధికార భాషకాదగిన అర్హత లేదా? అన్న శీర్షికతో ఒక చిన్న పుస్తకం రాసి, దేశంలోని తెలుగు ప్రముఖులందరికీ పంపించాను. ఆ పుస్తకంలోని సారాంశంతో అప్పటి ప్రధానమంత్రి వాజ్‌పేయికి లేఖలు రాశాను.

ఇంతటి ఘనచరిత్ర గల తెలుగు భాషను కాదని, పరభాషల వెంట మన తెలుగు యువత, విద్యార్థి లోకం పడడం విచారకరం, అందువల్లనే మహాకవి కాళోజీ...

ఏ భాష నీది, ఏ వేషమురా నీది
ఈ భాష ఈ వేషమెవ్వరి కోసమురా
అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్మురాదంచు
సకిలించు ఆంధ్రుడా! చావవెందుకురా!

అని ఆగ్రహంతో ఆక్రోశించారు.

పిల్లల తల్లిదండ్రులు కూడా ఈ దుస్థితికి కారణమని చెప్పాలి. తమ పిల్లలు ఇంగ్లిషు నేర్చుకుని, విదేశాలకు వెళ్లి, డాలర్లు సంపాదించాలని వారి ఆశ. ఇంగ్లిషు నేర్చుకోవద్దని, మాట్లాడవద్దని ఎవ్వరూ అనరు. కాని, భార్య మోజులో పడి, కన్న తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయతగునా? పరభాషా వ్యామోహంలో స్వభాషను అలక్ష్యం చేయడం ఆత్మద్రోహం కాదా?

అందువల్లనే మహాత్మాగాంధీ 'మాతృదేశాన్ని, మాతృమూర్తిని, మాతృభాషను నిర్లక్ష్యం చేయడం ఆత్మద్రోహమని' వాక్రుచ్చారు. ద్రవిడ కజగం నాయకుడు, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై మాతృభాష కళ్లవంటిది, పరభాష కళ్లజోడువంటిదన్నారు.

తెలుగు భాషాభ్యుదయం విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రత్యేక బాధ్యతే ఉంది. తెలుగును ఉన్నత పాఠశాల స్థాయి వరకూ నిర్బంధ పఠనీయం చేయాలి.

అలాగే తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాల్లో ఆయా భాషల అభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వశాఖలున్నాయి. మన ప్రభుత్వంలో కూడా తెలుగు భాషాభివృద్ధికి ప్రత్యేక మంత్రి ఉండాలని ప్రభుత్వానికి ఎప్పటి నుంచో లేఖలు రాస్తూ ఉన్నా. కాని, క్రియా శూన్యం. వచ్చే డిసెంబరు మాసాంతంలో తిరుపతిలో ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్నాయి కాబట్టి ఇప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వంలో తెలుగుకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయగలరని ఆశించవచ్చునా?

మేఘసందేశం

పరిణయ మహోత్సవ శుభాకాంక్షలు

ఇరుకైన ఒంటరి జీవితానికి విరమణ
ఇంపైన జంట ప్రయాణ రమణీయత
ఎన్నో ఆశల కలబోత
ఎన్నెన్నో ఆకాంక్షల ఆలంబన
ప్రణయ జీవన మధురిమలక్కై పరిణయం
ప్రణవాకారుని ప్రథమ దీవెన
బంధు మిత్రుల బహుదీవెనలు
పరివారపు శుభ ఆకాంక్షలు
దీవెనల వీవెనలు
మీ భావి జీవితానికి రక్షణకవచాలు

– శిష్లా మాధవి, నల్లకుంట, హైదరాబాద్.

ఒక రాత్రి నువ్వు నిద్ర లేచేసరికి ఓ లావాటి తెల్లగడ్డం పెద్దాయన నిన్ను తన సంచిలో కూరుతూంటే, కంగారు పడకు మిత్రమా, ఈ క్రిస్‌మస్‌కి నాక్కావాల్సిన బహుమతి నువ్వేనని శాంటాని కోరానులే!

- పోలె కిరణ్‌కుమార్, మాచర్ల

అన్నింటినీ సఫలం చేసేది నమ్మకం
అన్నింటిలోనూ జీవం నింపేది ఆశ
అన్నింటికీ అందం అద్దేది ప్రేమ
రానున్న క్రిస్‌మస్
ఈ మూడింటినీ నీకందియ్యాలని కోరుకుంటూ...
క్రిస్‌మస్ శుభాకాంక్షలు

- కరుణాకర్, రామచంద్రపురం

అమూల్యమైన క్రిస్‌మస్ బహుమతులేవీ
అంగడిలో దొరికేవి కావు:
నీ శత్రువుకి క్షమనివ్వు
నీ ప్రత్యర్థికి సహనమివ్వు
నీ మిత్రునికి హృదయాన్నివ్వు
ప్రతీ పిల్లాడికీ ఒక ఆదర్శాన్నివ్వు
అందరికీ దయనివ్వు
నీకు నువ్వు మర్యాదనిచ్చుకో!

- వినోద్ కుమార్, అడ్డతీగల

నూతన సంవత్సర శుభాకాంక్షలు

గత ఏడాది మాటలన్నీ గత ఏడాది భాషలోనే ఉంటాయి
కొత్త ఏడాది మాటలకు కొత్త భాష కావాలి
ప్రతి ముగియడమూ ఒక మొదలవటానికి నాంది
నూతన సంవత్సర శుభాకాంక్షలు.

- నేతేటి గణేశ్వరరావు, తెలుగుపండిట్, రాజాం.

చిరు నగవుల ఆభరణం నీ మోమున మెరవాలి
ఆనంద తోరణమై నీ రోజులు గడవాలి
కొత్త ఏడాది నీకంతా మంచే జరగాలి

- త్రినాథ్, కరీంనగర్

పక్షుల్లా మనమూ
మోయలేని బరువుల్ని వెనకే వదిలేద్దాం.
కష్టాలూ, కన్నీళ్లూ, బాధలూ, భయాలూ విడిచి
కొత్త సంవత్సరాన్ని కొత్త మనసుల్తో స్వాగతిద్దాం.

-ఓలేటి సుప్రభాత్, హైదరాబాద్

ఇంతవరకూ ఎవరూ చూడని కొత్త ఏడాదొస్తుంది
ఊహకందని క్షణాల మూటల్ని తెస్తుంది
చేతులు బారలు చాచి కౌగిలించుకుందాం
తెచ్చిన క్షణాల్ని ఆరారగా ఆస్వాదిద్దాం
నూతన సంవత్సర శుభాకాంక్షలు

- మల్లా వెంకట సోమేశ్వరరావు, బెంగుళూరు

ఇలా మీరు రాసినవో... మీరు మెచ్చినవో ఉంటే... మాతో పంచుకోండి. బాగున్నవి ప్రచురిస్తాం! పాఠకులకూ నచ్చితే అవి ప్రపంచవ్యాప్తంగా విహరిస్తాయి. మీ సందేశాన్ని 800 800 1656కు పంపండి. లేదా teluguvelugu@eenadu.netకి మెయిల్ చేయండి.

USHA
CELEBRATING 75 YEARS
కాఫీ మేకర్
ఇంట్లోనే సులభంగా సరైన, సువాసనభరితమైన కాఫీ
పాప్ అప్ టోస్టర్
బ్రెడ్‌ని సమానంగా టోస్ట్ చేసే 7 రకాల బ్రౌనింగ్ పనులు
జ్యూసర్ మిక్సర్ గ్రైండర్
బ్లెండింగ్‌తో పూర్తి ఫ్రూట్ జ్యూసర్. మిక్సింగ్ మరియు గ్రైండింగ్ సదుపాయం
హాలోజెన్ ఓవెన్
ముందుగా సెట్ చేసిన మెనూ ఐచ్ఛికాలతో తక్కువ ఫ్యాట్ శుద్ధతతో కుకింగ్
ఉషా గృహోపకరణాల కొత్త శ్రేణిని సమర్పిస్తున్నాం.
ఒక కొత్త జీవితానికి మారండి
ఎలక్ట్రిక్ ప్రెషర్ కుక్కర్
ముందుగా సెట్ చేసిన మెనూ ఐచ్ఛికాలతో ఆందోళన లేని కుకింగ్
హ్యాండ్ మిక్సర్
టర్బో స్పీడ్ సామర్థ్యంతో బహుళ ప్రయోజనాలు హ్యాండ్ మిక్సర్
డీప్ ఫ్రైయ్యర్
నాన్ స్టిక్ పాన్ మరియు ఫ్రైయింగ్ బాస్కెట్‌తో సమస్యలు లేని డీప్ ఫ్రైయ్యర్
ఇండక్షన్ కుక్కర్
స్కాట్ సెరాన్ (R) (జర్మన్ టెక్నాలజీ)తో ఆరోగ్యవంతమైన మరియు చురుకైన కుకింగ్
బ్లెండింగ్, మిక్సింగ్, గ్రైండింగ్, వేడి చేయటం, డీప్ ఫ్రైయింగ్, బేకింగ్, టోస్టింగ్ లేదా మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచటం కోసం. మా హోం అప్లైయెన్స్ వీటన్నింటిని చేస్తాయి. తక్కువ నూనెని ఉపయోగించే ఫ్రైయ్యర్‌ని కనుగొనండి. గాలిని ఉపయోగించి వండే హాలోజెన్ ఓవెన్ మీరు క్యాలరీలు తగ్గించుకోవటంలో సహాయపడుతుంది. సూపర్ ఫాస్ట్‌గా ఉండే ఇండక్షన్ కుక్కర్. పర్యవేక్షించాల్సిన అవసరం లేని ముందుగా సెట్ చేసిన 7 కుకింగ్ ఐచ్ఛికాలతో ఒక ఎలక్ట్రిక్ ప్రెషర్ కుక్కర్. మరెన్నో విలక్షణమైన ఉత్పత్తులు. వెళ్ళండి, ఆనందకరమైన కొత్త జీవితానికి మారండి.
Switch on to a new life
To know more about our products
www.ushainternational.com
usha_care@ushainternational.com
facebook.com/UshaInternational
USHA care
Toll free
1800-1033-111
SELECTED Superbrand
USHA home appliances available in select leading stores in your city :
more. MEGASTORE
STAR Bazaar
Auchan HYPERMARKET
ezone
vijay sales
easyday
HomeTown
BIG BAZAAR